భారతి సాక్షాత్కారము - పోతన ప్రతిజ్ఞ



కాటుకకంటి నీరు చనుకట్టుపయిం బడ నేల యేడ్చెదో, కైటభదైత్యమర్దనుని గాదిలికోడల! యోమదంబ! యో
హాటకగర్భురాణి! నిను నాకటికిం గొనిపోయి యల్ల క,ర్ణాట కిరాట కీచకుల కమ్మఁ ద్రిశుద్ధిగ నమ్ము భారతీ!

చిత్రకారుడు : శ్రీయుత యస్. కే. వేణుగోపాల్ గారు.

చెన్నపట్టణము, సెప్టెంబరు ౧౯౨౪

సంపుటము ౧. రక్తాక్షి సంవత్సరము భాద్రపదమాసము సంఖ్య ౯.

ఆంధ్రకవిత్వచరిత్రము

భోగరాజు నారాయణమూర్తి గారు

V

ఆంధ్రలాక్షణికులు-కవిత్వతత్త్వము

కవిత్వచరిత్రమును వ్రాయుచోఁ గవుల కవిత్వతత్త్వములతోఁ బాటు లాక్షణికుల కావ్యసిద్ధాంతములం గూర్చియుఁ బ్రసంగించుట యత్యావశ్యకము. మన కవితాప్రపంచమున నీలాక్షణికులు పెక్కుశతాబ్దముల నుండియు నాంధ్రరాజులతోడను నాంధ్రకవిరాజులతోడను గవితోద్ధరణభారము వహించి, స్వేచ్ఛావిహారమును గావించుచుండిన కవులను దమశాసనములకు లోఁబరచుకొనిన వారు. లాక్షణికులశాసనములనే మనము లక్షణగ్రంథము లనుచున్నాము. ఈలక్షణగ్రంథములలోఁ గొన్ని కేవలము వ్యాకరణములు. కొన్ని ఛందోగ్రంథములు. కొన్ని యలంకారగ్రంథములు. మఱికొన్ని మిశ్రగ్రంథములు. మొత్తముపై లక్షణగ్రంథములన్నియు ఛందోవ్యాకరణాలంకార బోధక

ములు. కవులకావ్యములలో నుత్తమమధ్యమాధమనిరూపణమున కీలక్షణగ్రంథములే యాధారములై యున్నవి.

కవులపై గౌరవభావములు

కావ్యశాస్త్రనిర్ణయమేకాక, కవులంగూర్చియుఁ, గవులకుఁగల మహత్త్వములను గూర్చియుఁ గవులలోఁ గలతరగతులనుగూర్చి యుఁగూడ లాక్షణికులు తమతమ గ్రంథముల యందు ముచ్చటించుచు వచ్చిరి. విన్నకోట పెద్దన్న కవులపైఁ దనకుఁగల గౌరవభావమును దన కావ్యాలంకారచూడామణియందు నిట్లు వెల్లడించెను:

"చ. వినుతయశంబునం గలుగు విశ్రుతనాకనివాస మయ్య
శో, జననము శ్రవ్యకావ్యములసంగతి నొప్పగు శ్రవ్య
కావ్యముల్, దనరుఁగవిప్రభావమునఁ దత్కవిసన్నుతి
లేనిరాజులే, ఘన విహరింప రవ్విభులు పోయిన
జాడ తెలుంగఁబోలునే?"

సుకవి మాహాత్మ్యమునుగూర్చి యింతకన్నను విపులముగ నప్పకవి తనలక్షణగ్రంథమునందు వివరించుచున్నాఁడు.

"గీ. వాకుజాతునిచే రఘునాయకుండు,
వ్యాసుచేఁ బాండవులుఁ గాళిదాసుచేత
భోజుఁడుఁ బ్రసిద్ధి నొందిరి భువిని దమదు
వడికలెల్లను కథలుగా నుడువుకతన.

క. ఇమ్మహిని మునులచే వెల
సె మ్మనుగావ్యములు "నాన్యృషిః కురుతే కా
వ్య"మ్మను వచనార్థంబుల్
సమ్మతిఁ గవివేశ సుకవిజనులే మాన్యుల్."

మ. జననాథాగ్రణి యాత్మరాజ్యమున నిచ్చల్ పూజ్యుఁ
డౌనీమఁ జా, నిజఁ దాగవ్వదయుఁ జేయఁ దన్నికడ
లన్ శ్రేష్ఠుండు విద్వాంసుఁ డౌ, తనికన్నం గవి
మేటియౌ 'సుకవితా యద్యస్తి రాజ్యేన కిం', మ్మను
వాక్యంబు నిజంబు దీనిఁ గని కావ్యంబుల్ రచింపం
దగున్.

ఆంధ్రలాక్షణికులలోఁ దానే ప్రథమలాక్షణికుఁడనని చెప్పుకొనినవాఁడును మహాకవియు నగు కేతన గుణదోషనిర్ణయభారమును గవులయందే యుంచుచు సుకవుల కారుణ్యమునే యిట్లభిలషించుచున్నాఁడు.

"క. పేరములు కాళిదాస మ
యూరాదులకైనఁ గలుగ నోరులకు లేవే
సారమతులైన సుకవుల
కారుణ్యము కలిమి చేర్పు కవిజనములకున్."

కాని యహోబలుఁడుమాత్ర మిట్లు చెప్పలేదు. "దోషోఽపిగుణతాం యాతి పండితానా మనుగ్రహాత్" అని యొకచోటను,

"ఉ. తప్పనిచోటఁ దప్పనుచుఁ దప్పనియారస వెుండ
జోకుఁడీ, లప్పినఁ దప్పుగల్గినను దప్పని సత్కృప
మీఱ దిద్దుఁడీ, యొప్పు లోకింతగల్గ వదిసుబ్బుఁడు!
పండితులార! మీకు నేఁ, దప్పనిశిష్యుఁడన్ గురులఁ
దప్పెశిష్యు నకీర్తి కీర్తియున్."

అని మఱియొకచోటను జెప్పి పండితానుగ్రహమునే యెక్కుడుగా నభిలషించుచున్నాఁడు. లక్షణగ్రంథసందోహమున మహాలక్షణలక్షితమగు కావ్యాలంకారసంగ్రహమును రచించిన సుప్రసిద్ధ లాక్షణికుఁడగు మూర్తికవి తాను లక్షణగ్రంథమును వ్రాయఁబూనినపుడు

"గీ. ....అఖిలముని వ
చోనుపమశక్తి భృతపురాణార్థవితతు
లనుఁగొఁ దెమఁ గనుభవ్యదివ్యాంజనమునఁ
గముఁగొనఁగఁ జేయు నంధ్రసత్కవులఁ దలఁచి."

అని కవులను స్మరించుచు, వారిమహిమాతిశయములమెసఁ దనకుఁగల గౌరవభావ

మును బ్రకటించెను. ఇట్లే మనయాంధ్రలాక్షణికులెల్లరును గవులపైఁ దమకుఁగల గౌరవాదరణములను దమతమలక్షణగ్రంథములయందుఁ బ్రకటించుచుండుటయేకాక, కొం

సత్కవిలక్షణనిరూపణము

దఱు 'సత్కవి' యనం దగినవాని కవశ్యముగ నుండఁదగిన లక్షణము లిట్టివని విధించుచున్నారు.

చిన్నకోటి-పెద్దన్న :

"క. సమయజ్ఞుఁడు సమచిత్తుఁడు
సమశబ్దార్థప్రయోగచతురుఁడు భావ
క్రమరసపోషణరచనా
కమనీయప్రతిభుఁ డిల సుకవియనఁ బరగున్."

అప్పకవి :

"క. ధరణీసురుఁడు ప్రశాంతుఁడు
గురుభక్తుఁడు శుచియుఁ గల్పకుఁడు పూర్వకవీ
శ్వరవాక్ప్రయోగదక్షుఁడు
కరుణామతి యెవ్వఁ డతఁడు కవియనఁ బరగున్."

అహోబలపండితుఁడు :

"వ్యా. కవయతే వర్ణయతీతి కవిః సచ,
శ్లో. సత్కులీన శ్శుచి ర్దక్ష శ్ఛందోవ్యాకరణాదివిత్,
ప్రశాంత స్పృథగాకారో దైవజ్ఞశ్చ కవి ర్భవేత్.
ఇత్యాదివచనోక్తగుణసంపన్నః"

సత్కవిలక్షణ నిరూపణమును పైమువ్వురు లాక్షణికులును మూఁడువిధములుగాఁ జెప్పుచున్నారు. సమయజ్ఞతయు, సమచిత్తతయు, సమశబ్దార్థ ప్రయోగచతురతయు, భావక్రమరసపోషణరచనాకమనీయ ప్రతిభయు ననుపెద్దనార్యోక్తలక్షణములన్నియు సుకవుల కత్యావశ్యకము లనుటలో నధిక్షేప ముండదు. అంతియేకాక యీలక్షణములలో నెయ్యది లేకున్నను సుకవిపదార్హుఁడు కానేరఁడనియుఁ జెప్పవచ్చును. ఇంక నప్పకవి విధించిన లక్షణములలో ధరణీసురత్వము ప్రధానమైయున్నది. అనఁగా సుకవియగువాఁడు బ్రాహ్మణుఁడే యైయుండవలయునని యప్పకవి నిర్ణయము. ఒకానొక మహాకవియందు మహాకవిలక్షణము లెంతవిపులముగఁ బ్రకాశించుచుండినను బ్రాహ్మణేతరుఁ డైనచో వానిని గవియనుట యప్పకవి యొప్పుకొనఁడు. ఒప్పుకొనఁడని మనమూహించుటయే కాదు. అతఁడే వేఱొకసందర్భమునఁ దన యభిప్రాయము నిట్లు స్పష్టపఱచుచున్నాఁడు.

"గీ. ఉపమ గల్గిన శయ్యల నొప్పియున్న
సంకీర్ణునికావ్యంబు గ్రాహ్యంబుగాదు
పాయసంబైన సంస్కారపక్వమైనఁ
గాక మృష్టంబు హవ్యంబుగానియట్లు"

ఇది హర్షింపఁదగినవాదము గాదు. కావ్యరచన యీశ్వరారాధనమున కొకసాధనమగుచో, పూజ్యులైన విదురాదుల సత్కృతుల మన్నించిన పరమేశ్వరున కిట్టి సంకల్ప మెన్నఁడు నుండదు. ఎలకూచిబాల సరస్వతి మొదలగు కొందఱు లాక్షణికులు వ్రాసిన 'ఆంధ్రశబ్దచింతామణి' వ్యాఖ్యానములలోఁ గానవచ్చుచుండిన 'న శూద్రస్య వచో గ్రాహ్యం శునోచ్ఛిష్టం హవి ర్యథా' అనువాక్యము పైపద్యమునకు మాతృకమై యుండవలయును. అహోబలుఁడు వాడిన 'సత్కులీన శ్శుచిర్దక్ష' యను శ్లోకములో సత్కులీనశబ్దమునకు నేజాతియైనను గౌరవార్హమగు నుత్తమవంశమునఁ బుట్టినవాఁ

డనియే యర్థముగాని కేవలము బ్రాహ్మణుఁడే యనుహాస్యార్థము లేదుకదా! కాని యందలి సుభగాకారత్వము మాత్రము అప్పకవిచెప్పిన ధరణీసురత్వము వంటిదే. కవియగువాఁడు సుందరాకారుఁడై యుండవలయునని విధించుటకంటె నన్యాయము సాహసము నుండదు. అవయవములయందుఁగాని యవయవ సౌందర్యమునందుఁగాని విధివశమున నించుకలోపమున్నవాఁ డెట్టికవిత్వప్రతిభావంతుఁడైనను మనలాక్షణికులు వానిని గవిగాఁ బరిగణింపరుకాఁబోలు! ఇట్టి సందర్భమున నాంగ్ల కవితా ప్రపంచమున సుప్రసిద్ధపురుషుండగు 'అలగ్జాండరుపో' యను మహాకవి యెంతటి యదృష్టవంతుఁడు! ఆంగ్లలాక్షణికులు సైతము సుభగాకారత్వము సుకవిలక్షణములలో నొకటిగా విధించియుండినయెడలఁ బాపము వికారాకారుఁడగు నాతఁ డెంతటి హీనస్థానమునఁ జేర్పఁబడియుండునో యెవరు చెప్పఁగలరు?

ధరణీసురత్వ సుభగాకారత్వము లప్రయోజనము లిట్లుండ నప్పకవ్యహోబలులు చేర్కొనిన తక్కిన లక్షణములు సర్వజన సామాన్యలక్షణములే కాని, కేవలము కవులకే యుండవలసిన లక్షణములని నిర్ణయించుట కవకాశము లేదు. ప్రశాంతత, గురుభక్తి శుచిత్వము కరుణామతి మొదలగు సీగుణములు యోగ్యులగువారి కందఱకు నావశ్యకములే. కవులుకానివారి కివ్వి యనవసరములని చెప్పఁజాలము. ఈలక్షణములుఁ గూడ నున్నయెడలఁ గవికిని వానికావ్యమునకును మఱింత వన్నెకలుగునని చెప్పుటలో నభ్యంతర ముండదు. కాని పెద్దనార్యుఁడు వివరించిన లక్షణములుమాత్రము కవులుకాని వారి కనవసరములు సుకవులగువారి కత్యావశ్యకములు. సమయజ్ఞతగాని సమశబ్దార్థ ప్రయోగచతురతగాని, భావక్రమరసపోషణరచనాప్రతిభగాని యప్పకవ్యహోబల పండితప్రోక్త లక్షణములవలె సామాన్యలక్షణములు గావు. యోగ్యులగు సామాన్యపురుషులయం దివియుండ నవసరములేనివి. సుకవులగువారియం దుండక తప్పనివి.

కవులు-పాండిత్యములు

ఇంతియకాక కవుల కుండవలసిన పాండిత్యప్రతిభాతిశయములనుగూర్చి పెద్దన తన పద్యమునందు నప్పకవ్యహోబలులవలె విపులముగను స్పష్టముగను జేర్కొనియుండ లేదు.

"క. శ్రుతిశాస్త్రాంగ పురాణ
ప్రతతియు నితిహాసకావ్యభరతాగమముల్
స్మృతిసంగీతరతికళా
గతుల నలంకృతుల దెలుఁగఁ గాఁ దగుఁ గవికిన్."

అని యప్పకవియును, కవి ఛందోవ్యాకరణాది విదుఁడును దైవజ్ఞుఁడు నై యుండవలయునని యహోబలుడును నీవిషయములోఁ దమ యభిప్రాయములను స్పష్టముగావించిరి. పెద్దన యీ ప్రసంగమును దలపెట్టకపోవుట యేకాక, యీశ్రుతిశాస్త్రాంగపురాణేతిహాస భరతాగమాదులన్నియుఁ గేవలము కావ్యోక్తిమాత్రమే సాధనములుగాని ప్రధానశక్తికిఁ గారణములు గానేరవనియు, నట్టిశక్తియే

వెలిదైనచో నీపాండిత్యాతిశయము లన్నియు నిరుపయోగము లనియు నభిప్రాయపడినట్లుగ నీక్రిందిపద్యములవలనఁ దేటపడుచున్నది:

"క. ఛందోలంకారాదుల
పొం దెఱిఁగిన నెద్దిలేక పొసఁగదు కవితా
సుందరత, శక్తి యది, యా
కందువ దగ దెలియఁగువాఁడె కవివరుఁ డెందున్."

"గీ. శక్తి నేర్పైనఁ గావ్యోక్తిసాధనంబు
లెల్లఁ జీకటియింటిలో నిడినసరకు
లెన్ని ఋతువులు గల్గిన నెట్లు పూచు
మహి వసంతాగమము లేక మావిమోక."

సప్తవిధకవులు

ఇంక నీసుకవిలక్షణనిరూపణ మిట్లుండ మనయాంధ్రలాక్షణికులు కవులనుగూర్చి వ్రాయున దర్భమున సంస్కృతలాక్షణికులు గావించినకవి విభాగములను దామును గైకొని తమతమలక్షణగ్రంథములయందుఁ జేర్చుకొనియున్నారు. సంప్రదాయసంజీవనియందు విద్యాచక్రవర్తి,

"శ్లో. గుణదోషవిభాగజ్ఞో వివేకీ పరికీర్తితః,
అనుప్రాసనమాబద్ధపదబంధస్తు వాచికః
ప్రసాదమధురాయత్తవచనో రాచికో భవేత్,
అర్థసంగ్రహచాతుర్య యుక్తస్స్యా ద్దార్థికః కవిః
శిల్పికస్తు భవే ద్దక్షః కవనే యమకాన్వితే
సాలంకృతిర్భూషణార్థీ మార్దవీ రసకల్పకః."

అని వారివారి రచనావిశేషములనుబట్టి కవులలోని పలుతెఱఁగులవారిని యుక్తనామకరణములతో వేఱుపరచినవిభాగమును బెద్దనయు నప్పకవియు మొదలగువా రిట్టు లనుకరించుచున్నారు.

పెద్దన—

"గీ. వాచికార్థులు శిల్పకరాచికులను
భూషణార్థియు మార్దవస్ఫురణకరుఁడు
నల వివేకియు ననఁగ సప్తాహ్వయములఁ
గవులు నెగడుదు రీహితకావ్యములను."

అప్పకవి—

"ఆ వె. వినుతిగాంతు రిల వివేకి వాచికరాచి
కార్థశిల్పభూషణార్థు లనఁగ
మార్దవానుగతసమాహ్వయుఁ డనఁ జాలఁ
గవులు సప్తనామకములతోడ."

సప్తవిధకవుల లక్షణములు

ఇంతియేకాక పైశ్లోకమునందువలెనే తత్సప్తవిధకవుల రచనావిశేషములను సైతము పెద్దనాదులు విస్పష్టముగ వివరించియున్నారు. వారిలో నప్పకవి వివరణ మిట్లున్నది:

సీ. గుణవర్ణశబ్దార్థగుణదోషనికరంబుఁ
బరికించి కూర్చుఁ గబ్బము వివేకి
బహుతరానుప్రాసపదబంధనియమంబు
వదలక కృతిసేయు వాచికుండు
మృదుమధురోక్తులు వెనకి కావ్యంబెల్ల
రచియించుఁ బసపడి రాచికుఁడు
మితశబ్దములలోన నతివిపులార్థంబు
నిమిడించు నర్థాఖ్య నెసఁగు వరుఁడు
చెప్పు యమకంబు లెప్పట్ల శిల్పకుండు
పొందుపఱచు నలంకృతుల్ భూషణార్థి
సరళపదవిరళార్ద్రవిస్ఫురణముగను,
జూపు రస మెందు మార్దవస్ఫుటకరుండు.

మూలశ్లోకములో నీసప్తవిధకవులకును గలవరుసను నట్లే యుంచక పెద్దన యెందుచేతనో తనయాంధ్రీకరణమునందుఁ దప్పించెను. అప్పకవి యట్లు తప్పింపక కేవలమును మూలక్రమమునే యనుకరించెను. ఛందోనిర్బంధముచే మూలక్రమము పెద్దనకుఁ బద్యములో

నియమము లేదని చెప్పఁజాలముగదా? అందులో నీ ఛందోనిర్బంధ మొక తేటగీతియందా? అట్టినిర్బంధము లేనిపట్టున నప్పకవివలెఁ జెప్పక తగినంత కారణము లేకయే పెద్దనమూలక్రమమును దప్పించునా యని మన మూహింప వలసివచ్చుచున్నది. మఱియు మూలక్రమమును భేదించి తన పద్యములోఁ జేర్చిన క్రమ మేదే నొకనియమము ననుసరించినదా లేక కేవలము ఛందస్సు ననుసరించియే కూర్పఁబడినదా యనువిషయముపై తమును విచారణీయము. మూలశ్లోకములో విద్యాచక్రవర్తి యాసప్తవిధకవులకు నొసంగిన క్రమము నియమసహితమా నియమరహితమా యని పరిశీలించినఁగాని యీవిషయము తేలదు. అట్లు పరిశీలించినప్పుడు మూలశ్లోకములోని మొదటికవి వివేకి. ఏడవకవి మార్దవి. ఈక్రమ మారోహణ క్రమనియమము(ascending order) ననుసరించినదే యైనచో వివేకి యత్యధముఁ డగుచున్నాఁడు. మార్దవి యత్యుత్తముఁ డగుచున్నాఁడు. అట్లుగాక యవరోహణక్రమముఁ (descending order) ననుసరించినదే యైనచో వివేకి యత్యుత్తముఁ డగుచున్నాడు. మార్దవి యత్యధముఁ డగుచున్నాడు. ఇట్టి లేనియమముచే నైనను గుణదోషవిభాగజ్ఞుఁడైన వివేకినిగాని రసతత్పరుఁడైన మార్దవానుగతునిఁగాని లాక్షణికు లధమతరగతిలోఁ జేర్పరు. అందులో మూలశ్లోకకారుఁడు విద్యాచక్రవర్తి! కవులలోని తరగతులను విభాగించి యామూలక్షణములతో నాయా కవులను వివరించుటయే వాని ముఖ్యోద్దేశము గాని, యాకవులకుఁ గ్రమస్థాన మేర్పరచు తలం పున్నట్లు కానరాదు. ఇట్లు మూలశ్లోకములోనివరుస నియమరహితమని గ్రహింపక, తత్క్రమభంగము గావించినయెడల నేమి యుపద్రవము వచ్చునోయని భయపడి యప్పకవి, శ్లోకమునందలి వరుసయే యథాక్రమముగాఁ దనపద్యమునందుఁ గసుభద్రముతోఁ జేర్చుకొనియెను. ఇదిస్వాతంత్ర్య రహిత మైన రచనావస్థ!

సప్తవిధకవుల స్థానములు

పెద్దన యిట్టియవస్థయందుఁ బడలేదు. మూలశ్లోకమునుగూర్చి పైని వివరింపఁబడిన విషయములన్నియు నతఁడు గ్రహించెను. అందులో నీ సప్తవిధకవులును స్థానక్రమముగాఁ జేర్పఁబడలేదని గుర్తెఱింగెను. మఱియు నీ సప్తవిధకవులను వారిలక్షణముల తోఁగూడ నిమ్ముక్కుబడికొలఁది యొకటిరెండు పద్యములలో ముగింపక, విద్యాచక్రవర్తి నిరూపించిన లక్షణములన్నియు విపులముగా వివరించుచు నొక్కొకకవి నొక్కొకపద్యమునందు వర్ణించుచువచ్చెను మూలశ్లోకములోనివరుస ననుసరింపకపోవుటయు, నొక్కొక కవిలక్షణ మొక్కొకపద్యమునందు విపులముగ వర్ణించిచెప్పుటయుఁ బట్టిచూడ, నీ సప్తవిధకవులకును బెద్దనార్యుఁ డొకవిధమైన నియమముతో స్థానము లేర్పరచుటకుఁ బ్రయత్నించినట్లు కనఁబడుచున్నది. చూడుఁడు :

౧. వాచికుఁడు

క. శబలవర్ణగుచ్ఛపిచ్ఛిల
లలితపదాడంబరావలంబనకవితా
సులభవిరచనాచతురుం
డలవడు వాచికుఁడు నా నుదగ్రప్రౌఢిన్.

౨. ఆర్థుఁడు

క. మితశబ్దమయ్యు నర్థము
ప్రతతవ్యాఖ్యానలాలసత్వమవిపుల
స్థితి నొప్పఁ గవిత చెప్పెడు
నతఁ డార్థుఁ డనంగ వెలయు నార్యులసభలన్.

3. శిల్పకుఁడు

క. మహితసుశబ్దార్థంబులు
బహువిధయమకార్థబంధబంధురరచనా
నిహితవిచిత్రములై చన
విహరించున్ శిల్పకుండు విశ్రుతకృతులన్.

౪. రౌచికుఁడు

క. ఒనరెడుకృతిపైఁ గల సొబ
గదలక యొండొరుల నిష్టమగు నందాకన్
మృదుమధురరచనసుకళా
కరుఁడై సాగించు నతఁడు రౌచికుఁ డెందున్.

౫. భూషణార్థి

క. తివుటపడి నొడువునప్పుడు
వివిధాలంకారసరణి విడువక చవిగా
నవహితుఁడై కృతి చెప్పెడు
కవి యెందును భూషణార్థి కడుఁ బొగడొందున్.

౬. మార్దవానుగతుఁడు

క. సరళములగుశబ్దములను
విరళములగు నర్థములను వీనులకింపం
దరళిత శేకరసౌభము
లరుదుగఁ గృతిచెప్పు మార్దవానుగుఁ డెప్పుడున్.

౭. వివేకి

క. శ్రుతిశాస్త్రాలంకార
ప్రతిభుఁడు శబ్దాది దోషపటుగుణఘటనా
చతురుఁడు వివేకి నాఁజను
నతఁడు మహాకవితతంబులందుఁ జరింపన్.

వాచికుఁడు

ఇట్లు విపులమైనలక్షణ వర్ణనములతో నీ సప్తవిధకవులలోఁ బెద్దనచే మొదటఁ జేర్పఁబడినవాఁడు వాచికుఁడు. 'అనుప్రాసమార్గపదబంధస్తు వాచికః' అని విద్యాచక్రవర్తిలక్షణము.

" బహుతరానుప్రాసపదబంధనియమంబు
వదలక కృతిసేయు వాచికుండు "

అని యప్పకవి యాంధ్రీకరణము. వాచికునకుఁ బ్రియమైన యీ యనుప్రాసాలంకారము శబ్దాలంకారములలోఁ జేరినది. దీనిని ౧ ఛేకానుప్రాసము, ౨ వృత్త్యనుప్రాసము, 3 లాటానుప్రాసము నని మూఁడువిధములుగా నాలంకారికులు విభాగించినారు. ఈ మూఁడువిధములలో నొకయనుప్రాసమునకుఁ గావ్యాలంకారచూడామణియందు లక్ష్యముగా నీ క్రిందిపద్య మొసంగఁబడినది. చిత్తగింపుఁడు:

"ఉ. చొక్కపుటుక్కు గ్రిక్కిఱిసి క్రుక్కక పెక్కువ
నక్కజంపుట, నెక్కొక్క చొక్కమై బ్రతుకు నిక్క
నెతెంగితిరేని శాత్రవుల్, మొక్కలమేది క్రుక్క
యని క్రొక్కెడు క్రొక్కక నిక్కుచున్న యీ,
చొక్కల చొక్కఁ బెట్టు విఘటించి చళుక్య నరేంద్రుఁ
డెక్కుడన్."

ఇట్టి శబ్దాలంకారపూరితములైన కావ్యములను నాలంకారికు లధమకావ్యములుగాఁ బరిగణించుచున్నారు. చిత్రమీమాంసయను గ్రంథమున "శబ్దచిత్రస్య ప్రాయో నీరసత్వాన్నాత్యంతం తదాద్రియంతే కవయః" అని యప్పయదీక్షితులు చెప్పుచుండెను. అందుచే

నిట్టిపదాడంబరావలంబనకవితాప్రియుండైన వాచికుని మొదటఁ జేర్పఁబడుటవలన నీ సప్తవిధకవులకును బెద్దనార్యుఁ డారోహణక్రమమున స్థానము లేర్పరచినాఁడని యూహించుట కవకాశము కలుగుచున్నది.

ఆర్థికుఁడు

పెద్దనక్రమములోఁ జేర్పఁబడినతరువాతికవి యార్థికుఁడు. పదాడంబరమందు వాచికునివలెనే యర్థసంగ్రహమునం దీయార్థికుఁడును మిక్కిలి యాసక్తుఁడు. అందుచేతనే యార్థికునికవిత్వము 'సతతవ్యాఖ్యానలాలసత్వమవిపులస్థితి' నొందుచుండునని పెద్దన వర్ణించెను. కొలఁదిశబ్దములలో నత్యంతవిపులార్థమును గ్రుక్కి వ్యాఖ్యాన సాహాయ్యమునఁగాని తనభావము తేటపడకుండ రచించుకవిని దత్కావ్యమునుగూడఁ గవులుగాని లక్షణకర్తలుగాని యెందును గణించినట్లు కానరాదు. కావ్యార్థము క్లిష్టముగను గూఢముగను నున్నయెడ రసభంగమునకుఁగూడఁ గారణమగునని యెంచి, యర్థదోషములలో "క్లిష్టగూఢార్థ"మను నొకదోషమును లాక్షణికులు దోషప్రకరణములోఁ జేర్చియున్నారు. కవులు సైతమును గావ్యమునందు శబ్దార్థములు రెండింటికిని సమానగౌరవమునే యారోపించుచున్నారు. క్లిష్టగూఢార్థమును దూషించుచున్నారు. ప్రసన్నకథార్థయుక్తిని పఠించుచున్నారు.

౧ "ఉ. ఏరొడనర్థగౌరవసమృద్ధియుశబ్దవిశుద్ధియుం దిరంబై యనవద్యతం బరగ........." పింగళిసూరన

౨ చ. "ఘనతరఘూర్జరీకుచయుగక్రియగూఢము గాక ..." వెదరాజు-వేంకటపతి.

౩ "దివి వెలుంగు మెఱుంగుఁదీగ యట్లర్థంబు
తేటతెల్లంబుగాఁ దెలియవలయు"
అడిదము-సూరకవి.

౪ ఆ. వె. "తేనె సోక నోరు తీయనయగు రీతిఁ
దోఁడ నర్థమెల్లఁ దోఁపకుండ"......వెల్ల.

ఇట్లు 'కవులును లాక్షణికులును' గూడ వ్యాఖ్యానలాలసంబగు కావ్యార్థమును బరిగణింపకపోవుటచేత; మితిమీఱినపదాడంబరాసక్తిగల వాచికునిమీఁదనే, మితిమీఱిన యర్థసంగ్రహాసక్తిగల యార్థికుని (The two extremists) సైతమును బెద్దన చేర్చినాఁడు.

శిల్పకుఁడు

ఈయార్థికునిపైఁ జేర్పఁబడినవాఁడు శిల్పకుఁడు. తనకావ్యమునందలి శబ్దములను నర్థములనుగూడ, బహువిధ యమకార్థబంధబంధురరచనానిహిత విచిత్రములుగాఁ గావించుచుండుట యీశిల్పకుని లక్షణము. ఈశిల్పకుని శిల్పమునందుఁ గవులకును లక్షణకర్తలకును గూడ గౌరవభావము గలదు. మహాకవిశేఖరుండైన సోమయాజి తా నీకావ్యశిల్పమునందుఁ బారగుఁడనని చెప్పుచున్నాఁడు. మఱియు మంచనమహాకవిసైతమును:

"కేయూరబాహుచరితము
సేయుము నీ వాంధ్రభాష శిల్పము మెఱయన్"

అని తనకృతిపతిచేఁ గోరఁబడినాఁడట. కవితాప్రపంచమున నీశిల్పమున కిట్టిగౌరవము గలుగుటచేఁ బెద్దన వాచికార్థులకన్నను శిల్పకున కున్నతస్థాన మొసఁగుచున్నాఁడు.

రాచికుఁడు

ఈ శిల్పకునిపైఁ జేర్పఁబడినవాఁడు రాచికుఁడు. "ప్రసాదమధురాయుక్తవచనో

రాచికో భవేత్" అని రాచికునకు విద్యాచక్రవర్తి చెప్పిన లక్షణము. రాచికునకు లక్షణములైన యీ ప్రసాద మాధుర్యములు కావ్యమున కావశ్యకములైన దశవిధగుణములలోఁ జేరినవి. ఈదశవిధగుణములే కావ్యమునకుఁ బ్రాణములని లక్షణకర్తలు నిర్ణయించిరి. ప్రాణములైన ప్రసాదమాధుర్యాదులు లేనికావ్యము శుష్కకళేబరమువంటిది. మహాకవులుసైతము నీప్రసాదమాధుర్యముల నెంతయావశ్యకముగాఁ బరిగణించిరో కవుల కవితాతత్త్వనిరూపణ ప్రకరణములో మనము పరిశీలించియే యున్నాము. ఇట్లు కావ్యమునకుఁ బ్రాణదాతయగుటచేతనే పెద్దన యీ రాచికునకు శిల్పకునికన్న నగ్రస్థాన మొసఁగుచున్నాఁడు.

భూషణార్థి

ఈరాచికునిపైఁ జేర్కొనఁబడినవాఁడు భూషణార్థి. ఈతనికావ్యము బహువిధాలంకారవిరాజితమై యొప్పుచుండును. రచనయందలి సొబగే యలంకారము. ఈయలంకారములే కావ్యేందిరకు భూషణములని లాక్షణికులనుచున్నారు. మఱియు లక్షణకర్తలలంకారప్రియులగుటచే నలంకారరహితమైన రచన నిషేధించుటకు 'నిరలంకృతి' యనుపేర నొకదోషమును దోషప్రకరణములోఁ జేర్చిరి. ఈదోషమునే యప్పకవి 'అలంకారవర్జిత' మనుపేరున వాడెను. ఈభూషణార్థి కావ్యరచనంగూర్చి పెద్దన 'వివిధాలంకారసరణి విమలకవిగా నవహితుఁడై కృతిసెప్పెడు' అని చెప్పుటచేత రాచికునివలె మాధుర్యముసైతమును గాపాడుచు బహువిధాలంకారఘటనాచతురత్వమును జూపఁగలవాఁడని యూహించి తద్రాచికునికంటె భూషణార్థి కున్నతస్థానము నొసంగినట్లు కానంబడుచున్నది.

మార్దవానుగతుఁడు

ఈభూషణార్థి పై జేర్కొనఁబడినవాఁడు మార్దవానుగతుఁడు. 'మార్దవీ రసతత్పరః' అనుటచే నితఁడు కేవలము రసమునందే దృష్టికలవాఁడని తెలియుచున్నది. అందుచే మార్దవానుగతునికావ్యము సరళములగు శబ్దములును విరళములగు నర్థములును గలిగి రసముల కాలవాలమై యొప్పుచుండును. రసమే కావ్యమునకు జీవమని మహాకవులును లక్షణకర్తలునుగూడ నేకగ్రీవముగఁ జాటుచున్నారు. కవితాసాగరము నెన్నెన్ని భాషలలో నెందరెందరెన్నివిధముల మథించుచుండినను దేలుచుండిన సారాంశము రసమే. శయ్యలు, పాకములు, కైశిక్యారభటి ప్రముఖకావ్యవృత్తులు, వైదర్భీగౌడీపాంచాలాదికావ్యరీతులు, ప్రసాదమాధుర్యాది కావ్యగుణములు, విభావానుభావ సాత్త్వికవ్యభిచారిభావములు, మొదలగునవియన్నియు శృంగారాది నవరసములను సృష్టించుటకును బెంచుటకునుగూడ నుపకరణము లగుచున్నవి. అట్టి రసతత్పరుఁడైన మార్దవానుగతుని నందరికంటె నున్నతస్థానమునఁ బెద్దన చేర్చుట తద్దయుఁ బ్రశంసింపఁదగినది.

వివేకి

ఈ మార్దవానుగతునిపైఁ జేర్కొనఁబడినవాఁడు వివేకి. రసతత్పరుఁడైన మార్దవి

కన్నను వీనికున్నతస్థాన మొసంగఁబడినది. ఈవివేకి "శ్రుతశాస్త్రాలంకార ప్రతిభుఁడు; శబ్దాదిదోష పటుగుణఘటనాచతురుఁడు." అందుచే నార్థికుని యర్థసంగ్రహము, శిల్పకుని శిల్పము, రాచికుని మృదుమధురరచనయు, భూషణార్థియలంకారసరణియు, నీవివేకి రచనలయందుఁ బ్రాయికముగా నలరారుచుండును. రసైకలోలుఁడగు మార్దవానుగతుఁడు కావ్యరసార్ణవమున మునిఁగి నవరస తరంగములయందు నిరంతరము నూగులాడుచుండువాఁడగుటచేఁ గవితాప్రపంచమందలి బాహ్యవిషయములయందు వానికి దృష్టి యుండకపోవచ్చును. రసదేవత నారాధించు కవికి రసేతరములైన కావ్య నిబంధనములన్నియు మహాయోగికి సంసారవిషయముల వంటివి. లాక్షణికులుమాత్రము కావ్యలక్షణములలో రసమున కెంతటియగ్రస్థానము నొసంగినను, రసపోషణముతోఁ బాటుగ నితర కావ్యలక్షణములు సైతము సలక్షణముగ లక్షింపఁబడినఁగాని, తత్కావ్యమున కుత్తమ కావ్యత్వమును గటాక్షింపరు. భక్తిరస స్రవంతితరంగోపలంభముగా స్రవించు భద్రాద్రి రామదాసు చరిత్రమునకీ నిబంధనముచేతనే మనవాఙ్మయమునఁ జోటు లేకపోయినది. ఇట్లు మార్దవానుగతునివలె నెంతటి రసతత్పరుఁడైనను, రసముతోఁ బాటుగ రసేతరములైన కావ్యలక్షణములనుగూడఁ బాటించు సామర్థ్యమును గుణదోషవిచారమును గలవాఁడగుటచే, నీత్రివిధకవులలో వివేకియే యగ్రస్థానము నలంకరించుచున్నాడు. ఆంధ్ర మహాకవులైన నన్నయతిక్కనాదు లిట్టివివేకులుగనే కొనియాడఁబడఁదగినవారు.

కనక కనక జానకి నన్ను గాంచినపుడు

అధికార్ల సూర్యనారాయణరావు గారు బి ఏ, బి.యల్.

చిరవియోగానలంబున జిత్తమెరియ
గనక కనక జానకి నన్ను గాంచినపుడు,
నాటుకొనినదుఃఖముపైని నవ్యహర్ష
వీచికామాలికలు దండు వెడలుచుండ;

నెండ వానయు జతగూడి యుండునట్లు,
చీకటియు వెన్నెలయు చెల్మిసేయునట్లు,
కనుగొనల బాష్పకణములు గారుచుండ
తొగరుపెదవుల జిరునవ్వు తోచె సతికి!

సంస్కృతభాషలోని రామనాటకములు

మేదేపల్లి వేంకటరమణాచార్యులు గారు

దేవో నః శుభమాతనోతు దశధా నిర్వర్తయన్ భూమికాం
రంగే ధామని లబ్ధనిర్భరరసై రధ్యక్షితో భావుకైః;
యద్భావేషు పృథగ్విధే ష్వనుగుణా న్భావా న్స్వయం బిభ్రతీ
యద్ధర్మై రిహ ధర్మిణీ విహరతే నానాకృతి ర్నాయికా.

పారావార పయోవిశోషణకళాపారీణ కాలానల
జ్వాలాజాలవిహార హారివిశిఖ వ్యాపారఘోరక్రమః;
సర్వావస్థ సకృత్ప్రపన్న జనతా సంరక్షణైకవ్రతీ
ధర్మో విగ్రహవా నధర్మవిరతిం ధన్వీ స తన్వీత నః.

నమ స్తస్మై కస్మై చన భవతు నిష్కించన జన
స్స్వయం రక్షాదీక్షానమధిక సమింధానయశసే;
సురాధీశస్వైరక్షణకుపిత శాపాయుధవధూ
దృషత్త్వాదుర్జాత ప్రశమన పదాంభోజరజసే.

ఈశ్వరసృష్టమగు నీసంసారచక్రమందుఁ బరివర్తమానములగు సకలచేతనులకు ధర్మార్థకామమోక్షములను నాలుగు పురుషార్థము లత్యంతాదరణీయములు. మహాభారతమందు:—"ధర్మంచార్థంచకామంచ యథావద్వదతాం వర! విభజ్య కాలే కాలజ్ఞస్సర్వా న్సేవేత పండితః; మోక్షో హి పరమశ్రేయః పురుషార్థచతుష్టయే;" (వక్తలలో శ్రేష్ఠుడా! కాలోపయోగమును దెలిసిన విచక్షణుఁడు కాలమును విభజించి ధర్మార్థకామములను సేవింపవలయును. ఈ నాల్గు పురుషార్థములలో మోక్ష మనునది యుత్కృష్టశ్రేయస్సు నిచ్చునది) యని యుధిష్ఠిరునితో భీమసేనుడు చెప్పియున్నాఁడు కావున మోక్ష మితరపురుషార్థములకంటె నధికతరశ్రేయోదాయకము, ముఖ్యతమము. ధర్మాదులు కూడ మోక్షమునకు సాధనము లగుటవలననే పురుషార్థము లని వ్యవహరింపబడుచున్నవి. వీనిలో ధర్మము ప్రవృత్తిరూపధర్మ మనియు నివృత్తిరూపధర్మ మనియు ద్వివిధము. వీనిలో మొదటిది యిష్టాపూర్తాదికర్మరూపము. అనఁగా యాగము లొనరించుట చెఱువులు త్రవ్వించుట మున్నగునవి యిష్టాపూర్తములు. ఇది స్వర్గాదిలోకప్రాప్తికి సాధనము. రెండవది యనఁగా నివృత్తిరూపధర్మము. ఐహికాముష్మికాల్పాస్థిర సుఖసంధాయకము లగు కర్మల బరిత్యజించి కేవల పరమాత్మానుసంధానపరుఁడై యుండుట. ఇందుకు ప్రమాణము: "ప్రవృత్తిసంజ్ఞకే ధర్మే ఫల మభ్యుదయో మతః; నివృత్తిసంజ్ఞకే ధర్మే ఫలం నిశ్శ్రేయస మ్మతమ్" (ప్రవృత్తిరూపధర్మమువలన స్వర్గాదిపారలౌకికసుఖమును పశుపుత్రవృష్ట్యన్నాదిలాభమును నివృత్తిరూపధర్మమువలన మోక్షమును లభించును.) ఇట్లు ధర్మ మఖిలలోకశ్రేయస్సాధనము. ఇది అతీంద్రియము (చక్షురాదీంద్రియములకు గోచరింపనిది

కాదు). ఇట్టి ధర్మమును బోధించునది వేదము. "ప్రత్యక్షేణానుమిత్యా వా యస్తూపాయో న బుధ్యతే; ఏతం విదంతి వేదేన తస్మా ద్వేదస్య వేదతా" (ప్రత్యక్షానుమానప్రమాణములచే బోధింపబడని యుపాయము దేనిచే దెలియబడునో దానికి వేదమని పేరు.) ఇట్టి మూలప్రమాణ మగు వేదము కాళిదాసాదికవికృతకావ్యములవలె భ్రమవిప్రలంభాదిదోషసంభావనాగంధరహితమయి యపౌరుషేయమై, సర్వజ్ఞానఖనియై, స్వతఃప్రమాణమై, అనాదినిధనావిచ్ఛిన్నసంప్రదాయప్రవర్తనమై ప్రకాశించుచున్నది. "యథా కల్ప స్సోఽల్ప పూర్వః" అను న్యాయము ననుసరించి యీసంసారమనాది గావున సర్వజ్ఞుడగు నీశ్వరుడు గతకల్పమందలి వేదము నీకల్పాదియందు స్మరించి "యో బ్రహ్మాణం విదధాతి పూర్వం యో వై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై" అన్నట్లు వేదమును బ్రథమజుండగు చతుర్ముఖుని కుపదేశింప నతడు మరీచ్యాదులకును వారు తమశిష్యసంఘములకు నుపదేశింప నీరీతి నుపదేశపరంపరాప్రాప్త మయ్యెనని పూర్వమీమాంసకుల సిద్ధాంతము. మఱికొందఱు శాస్త్రజ్ఞులు (నైయాయికులు) వేదము లీశ్వరప్రణీతము లందురు. ఈయంశము నే బాదరాయణుడు "శాస్త్రయోనిత్వాత్" అనుసూత్రమందు ప్రతిపాదించెను.

ఇట్టివేదము కర్మభాగ మనియు బ్రహ్మభాగ మనియు భాగద్వయాత్మకము. ఇందు కర్మభాగము భగవదారాధనక్రమమును బ్రహ్మభాగము భగవత్స్వరూపరూపగుణవిభూతులను దెలుపుచున్నది. ఇట్లు భగవత్ప్రతిపాదకమగు నీవేదము సంసారిచేతనులకు దత్త్వజ్ఞానము నొసగించుటయందు ముఖ్యసాధన మగుచున్నది. తత్త్వజ్ఞాన మనగా సర్వస్వామియైన శ్రీమన్నారాయణునికి సర్వప్రకారముల బరతంత్రములగు నీయాత్మలకు స్వరూపానురూపపురుషార్థ మగు భగవత్ప్రాప్తిని నిరోధించు ననాదికర్మబంధమును నివర్తింపజేయు నుపాయము. ఇది యర్థపంచకజ్ఞానమూలము. అర్థపంచకజ్ఞాన మనగా స్వస్వరూప పరస్వరూప పురుషార్థస్వరూపోపాయస్వరూప విరోధిస్వరూపముల యథార్థముగ నెఱుంగుట. వీనిలో స్వస్వరూపమనగా నాత్మస్వరూపమిది, దాని లక్షణ మిది యని యెఱుంగుట; పరస్వరూప మీశ్వరస్వరూపము; పురుషార్థస్వరూపము మోక్షలక్షణము; ఉపాయస్వరూపము కర్మజ్ఞానభక్తిప్రపత్తిలక్షణము; విరోధిస్వరూపము భగవత్ప్రాప్తిప్రతిబంధకీభూతానాదికర్మబంధము. ఇట్లర్థపంచకజ్ఞానపూర్వకముగ బరతత్త్వ మగు శ్రీమన్నారాయణుని పాదారవిందములయందు స్వస్వాతంత్ర్యరక్షణభరుండై యతని కత్యర్థప్రియుడై మెలంగుటయే మోక్షసాధనములలో ముఖ్యభూత మని సకల వేదాంతతాత్పర్యము.

అనంతశాఖాంచితమై చతుర్దశ విద్యాస్థానోపబృంహితమై దుర్జ్ఞేయార్థప్రతిపాదక మగు వేదమును గూలంకషముగ జదివినగాని పరబ్రహ్మతత్త్వనిర్ణయసామర్థ్యము దత్త్వజ్ఞానము గలుగదనియు, రాబోవు కలియుగమునందలి జనులు అల్పాయువులు మందభాగ్యులు మందబుద్ధులు నగుటచే నిట్టి దుర్ఘటజ్ఞానమును సంపాదింప నసమర్థులనియు నూహించి సకలభూతానుకంపాసంపన్నచిత్తులు, పరాపరతత్త్వయాథార్థ్యవిదులు, దేవతాపారమ్యవిదులు నగు పరాశర వ్యాస వాల్మీకాది మహర్షులు "ఇతిహాసపురాణాభ్యాం వేదం సముపబృంహయేత్." (ఇతిహాసము భారత రామాయణాది పూర్వరాజవృత్తము. సర్గప్రతిసర్గాది పంచలక్షణ సమన్వితము పురాణము) వీనిచే వేదార్థమును వివరింపవలయును. అను న్యాయమును బట్టి దురవగాహ మగు వేదార్థమును దాము చక్కగ బరిశీలించి సూర్యకిరణములచే నిపీత మయి పునర్విసృష్టమగు సముద్రజలము సర్వజనోపజీవ్య మయినట్లు పండితపామరసామాన్యముగ నెల్లరకు సులభముగ దెలియురీతి బరతత్త్వనిర్ణయమును మోక్షోపాయనిష్కర్షమును జేసి బద్ధచేతనులకు సంసారసుఖసంతరణోపాయమును దెలిపిరి.

"ఇతిహాసపురాణాభ్యామ్" అనుచోట "అల్పాచ్తరం పూర్వమ్" అనుసూత్రమును బట్టి అల్పాచ్కమయిన పురాణశబ్దము మొదట నుండవలసియుండగా ఇతిహాసశబ్దము మొదట నుండుట "అభ్యర్హితం పూర్వమ్" అనుశాస్త్రమును బట్టి; కావున బురాణముకంటె నితిహాస మభ్యర్హిత మయినదని యిందుచే దెలియనగును.

వాల్మీకి - శ్రీరామాయణము.

సంసారార్ణవనిమగ్నచేతనోద్ధరణార్థ మయి పరమకారుణికత్వము వహించి వేదార్థోపబృంహ ...కరిం

చివవారిలో వాల్మీకి ప్రథమగణ్యుడు. "వేదవేద్యే పరే పుంసి జాతే దశరథాత్మజే; వేదః ప్రాచేతసా దాసీ త్సాక్షా ద్రామాయణాత్మనా." (వేదముచే తెలియఁబడు పరమపురుషుడు దాశరథి యై జనింప దత్ప్రతిపాదక మగు వేదము కూడ రామాయణరూపముగ బరిణమించెను) అనుచు శ్రీవాల్మీకి సాక్షాద్వేదసమ్మతమగు రామాయణమును రచించి "ఇతిహాసపురాణాభ్యాం వేదాంతార్థః ప్రకాశ్యతే, ప్రాయేణ పూర్వభాగార్థో ధర్మశాస్త్రైః ప్రకాశ్యతే." (వేదముయొక్క ఉత్తరభాగార్థము) (ఉపనిషదర్థము ఇతిహాసపురాణములచేతను పూర్వభాగార్థము ధర్మశాస్త్రముచేతను ప్రకాశింపఁజేయఁబడుచున్నది) అనురీతిగా నీరామాయణమందు వాల్మీకి సకలముముక్షుజనోపజీవ్యము లయిన వేదాంతార్థములను సంపూర్ణముగాఁ బ్రతిపాదించియున్నాడు. సంస్కృతవాఙ్మయచరిత్రమును బట్టి విమర్శింపగా నీవాల్మీకి యాదికవి యనియు, నితఁడు రచించిన రామాయణ మాదికావ్య మనియు నిర్ణయింపఁబడుచున్నది. "వాల్మీకి నాదశ్చ ససర్జ పద్యమ్" అని అశ్వఘోషుఁడు. "ప్రాచేతసోపజ్ఞం రామాయణమ్" అని కాళిదాసు, "ఆద్యః కవి రసిత ద్భ్రిహి రామచరితమ్" అని భవభూతియును, "బభూవ వల్మీకభవః కవిః పురా" అని రాజశేఖరుఁడును, "భాస్వద్వంశవతంసకీర్తిరమణీరంగప్రసంగస్వనద్వ్యాదిత్రిప్రథమస్వని ర్వ్యాజయతే వల్మీకజన్మా మునిః" అని జయదేవుఁడును. "శుభ మతిసుత కావ్యం స్వాదు రామాయణాఖ్యం మధుమయభణితీనాం మార్గదర్శీ మహర్షిః" అని భోజరాజును ఇంక దక్కు సంస్కృతకవులును తమతమ గ్రంథములలో కృత్యాదిని వాల్మీకి నాదికవియని శ్లాఘించియున్నారు. ప్రతిపాదక వైలక్షణ్యమును బట్టియు, ప్రతిపాద్య వైలక్షణ్యమును బట్టియు శ్లాఘ్యతమమగు నిట్టి గ్రంథము మఱియే వాఙ్మయమందుగూడ గానరాదు. ఇది సర్వాలంకారశాస్త్రలక్షణోపేతమయి సకలభారతవర్షీయ ప్రత్ననూత్నవాఙ్మయగ్రంథసమితి కాదర్శకమై, సకలపురుషార్థప్రదంబై రాజిల్లుచున్నది. ఇట్టి యుత్తమకావ్యమునకు గథానాయకుడు ఉత్తమశ్లోకుఁడగు శ్రీరామచంద్రుడు. "పుణ్యశ్లోకస్య చరిత ముదాహరణ మర్హతి," "క ఉత్తమశ్లోకగుణానువాదా త్పుమా న్విరజ్యేత వినా పశుఘ్నాత్" అన్నట్లు లోకోత్తరుఁ డగు నాయకుని గుణవర్ణనము గ్రంథమునకు దత్ప్రణేతయగుకవికి గూడ ప్రతిష్ఠాహేతువగును. ఈ మహాపురుషుని చరిత్రమును జదువువారికి వినువారికి గూడ మాతాపితృభక్తి, సోదరప్రీతి, లోకమర్యాదానువర్తనము, స్వప్రతిజ్ఞానిర్వహణతత్పరత్వము, ఆశ్రితవాత్సల్యము, స్వార్థనివృత్తి, పరనిందాసహిష్ణుత, శబ్దాదివిషయవిరక్తి మొదలగు సద్గుణము లలవడునట్లు చేయును.

రామకృష్ణావతార చరిత్రముల తరతమభావము నాలోచింపగా రామావతారచరిత్రమే అధికతరముగా నాసేతుహిమాచలము వ్యాపించి యాబాలగోపాలముగా సకలజనహృదయపీఠికోట్టంకితమయి విలసిల్లుచున్నయది. ఈపరమపావనచరిత్రము పురాణ కావ్య నాటకాఖ్యానాఖ్యాయికాదిరూపముగా నార్యభాషానిబద్ధంబై శ్రవణపఠనలోభాకృష్టమానసు లగు విద్వజ్జనులచే బాఠ్యమానంబై యుండుటయేకాక యార్యభాషానభిజ్ఞులగువారుకూడ నీచరిత్రము జదివి యానందించుటకు దగినట్లు సులభశైలిని దత్తద్దేశభాషాకోవిదులగువారిచే ప్రబంధములుగాను వచనకావ్యములుగాను నాటకములుగాను ద్విపదలుగాను పాటలుగాను రచింపఁబడి సకలదేశములందు బ్రచురింపఁజేయఁబడినది. ఐరోపా అమెరికా మొదలగు విదేశములయందు నివసించువారైన నల్పముగానో అధికముగానో రామకథ నెఱుంగనివా రుండ రని నా యభిప్రాయము. ఇంత చర్వితచర్వణమయిన యీచరిత్ర మెంద రెన్నిభాషలలో నెవిధముగా వర్ణించిన నతృప్తావహమేకదా! ఈవిషయమును ప్రాచీనసంస్కృతకవులగు మురారి జయదేవు లిట్లు తమ రామనాటకములయందు వ్రాసియున్నారు:

మురారి అనర్ఘరాఘవములో—

"యదిక్షుణ్ణం పూర్వై రితి జహాతి రామస్య చరితం
గుణై రేతావద్భి ర్జగతి పున రన్యో జయతి కః;
స్వమాత్మానం తత్తద్గుణగరిమ గంభీరమధుర
స్ఫురద్వాగ్బ్రహ్మాణః కథ ముపకరిష్యంతి కవయః"

ఉ. తొంటిబుధాళి రామవిభుఁ
దోరముగా వినుతించె నంచుఁ దా

మంటకమానివనే జగతిఁ
నట్టిగుణోజ్జ్వలుండైన నాయకుం
డుంట ఘటిల్లునే కవుల
కొప్పుగువాగ్విభవంబు తెల్ప నే
డెంటఁబఠించు ధన్యులను
మీరు కృతార్థతఁ గాంచు టెట్లొకో.

జయదేవుఁడు ప్రసన్నరాఘవములో—

"స్వసూక్తీనాం పాత్రం రఘుతిలక మేకం కలయతాం
కవీనాం కో దోషః స తు గుణగణానా మవగుణః;
యదేతై ర్నిశ్శేషై రపరగుణలుబ్ధై రివ జగ
త్యసావేక శ్చక్రే సకలసుఖసంవాస వసతిః"

చ. తమతమసూక్తిపాత్రముగ
దాశరథి న్నుతియించిరంచు నా
విమలమనస్కులైన కవి
వీరులు నింద్యులె యారఘూద్వహా
త్తముగుణబృందదోషమని
తద్దయుఁబల్కఁగఁ బోలు గాని ని
స్సముడని రాముఁజేరి
గుణసంతతులెల్ల వసించె నొక్కచోన్.

ఇట్టి శ్రీరామచంద్రుని చరిత్రమును మనసంస్కృతకవులలో గొందఱు నాటకరూపముగా రచించియున్నారు. భవభూతి మహావీరచరిత్రము నుత్తరరామచరిత్రమును, మురారి యనర్ఘరాఘవమును, రాజశేఖరుడు బాలరామాయణమును, జయదేవుడు ప్రసన్నరాఘవమును, భాసకవి ప్రతిమానాటకము నభిషేకనాటకమును, రామభద్రకవి జానకీపరిణయమును వ్రాసియున్నారు.

ఈకవిపుంగవులీచరిత్రమును నాటకరూపముగా వ్రాయుటలో నొకవిశేషము గలదు. కావ్యములు శ్రవ్యములనియు దృశ్యములనియు రెండువిధములు. వానిలో శ్రవ్యకావ్యములు శ్రవణమాత్రముచే నానందజనకము లగుచున్నవి. దృశ్యకావ్యము లన్ననో అట్లు కాదు. వీనిలో ప్రతిపాద్యకథ ఇతిహాసము పురాణము మొదలగు మూలగ్రంథములనుండి సంగ్రహింపబడినను నటులచే నభినయింపబడుట కౌచిత్యానుసారముగా నచ్చటచ్చట గ్రంథకర్తచే మార్పు లొందింపబడి మనకన్నులయెదుట నాకథ జరుగుచున్నట్లు రామాదివేషముల ధరించి వారి సుఖదుఃఖాద్యనుభవముల ననుకరించెడునటులచే ప్రయోగింపబడినవి యయి సామాజికుల కానందదాయకము లగుచున్నవి. అందువలననే దశరూపకములో ధనంజయుడు

"ఆనందనిష్యందిషు రూపకేషు
వ్యుత్పత్తిమాత్రం ఫల మల్పబుద్ధిః;
యోఽపీతిహాసాదివ దాహ సాధు
స్తస్మై నమ స్స్వాదుపరాఙ్ముఖాయ"

అని చెప్పియున్నాడు. నాటకము లితిహాసాదులవలె కేవల త్రివర్గాది వ్యుత్పత్తిమాత్రఫలకములు గాక విగళితవేద్యాంతరము పరమానందరూపము నగు రసాస్వాదమును గలిగించును. "అవస్థానుకృతి ర్నాట్యం రూపం దృశ్యతయోచ్యతే, రూపకం తత్సమారోపాత్" అని దశరూపకము. ఆంగిక వాచి కాహార్య సాత్త్వికాదిభేదభిన్నమగు చతుర్విధాభినయముచే నటులు కావ్యోపనిబద్ధు లగు ధీరోదాత్తాదినాయకులసుఖదుఃఖాద్యవస్థల ననుకరించుట నాట్యమనంబడును. నీలాదిరూపములవలె నిది కంటిచే జూడబడునది యగుటచే రూపమని చెప్పఁబడుచున్నది. నటునియందు రామాదులయవస్థల నారోపించుటచే రూపకమనంబడుచున్నది. ఇట్లు నాట్యరూపరూపకశబ్దములు మూడు నొక్కయర్థమందు ప్రయోగింపబడుచున్నను ఇంద్ర పురందర శక్ర శబ్దములవలె ప్రవృత్తినివృత్తిభేదము గలవి యగుచున్నవి. ఈరూపకములు, నాటకము, ప్రకరణము, భాణము, ప్రహసనము, డిమము, వ్యాయోగము, సమవకారము, వీథి, అంకము, ఈహామృగ మని పదివిధములు. వస్తునేతృరసములను బట్టి యీరూపకము లిట్లు భేదించినవి. వస్తు వనగా ప్రతిపాద్యకథ. ఇది ముఖ్యమయినది యాధికారికమనియు, నంగభూతమయినది ప్రాసంగికమనియు ద్వివిధము. శ్రీరామాయణమంతయు సీతారాములవృత్తాంత మాధికారికము. విభీషణ సుగ్రీవాదివృత్తాంతము ప్రాసంగికము. ఇది పరప్రయోజనాంగ మయియుండి యందువలన స్వప్రయోజనసిద్ధిఁ బడయును.

ఇది మరల పతాకయనియు ప్రకరియనియు రెండువిధములు. వీనిలో పతాకయనునది సుగ్రీవాది

వృత్తాంతమువలె నాటకముగానవలెను ననువర్తించునది. అల్పమయి శ్రమణాదివృత్తాంతమువలె ప్రాదేశమాత్రమై యుండునది ప్రకరి.

నేత యనగా నాయకుడు. "మహాకులీనత్వ ముదారతా చ తథా మహాభాగ్యవిదగ్ధభావౌ; తేజస్వితా ధార్మిక తోజ్జ్వలత్వ మిమే గుణా జాగ్రతి నాయకస్య" అని నాయకసామాన్యలక్షణము. ధీరోదాత్త ధీరోద్ధత ధీరలలిత ధీరశాంతు లని నాయకులు నలుగురు.

రసములు : శృంగార హాస్య కరుణా రౌద్ర వీర భయానకాః; బీభత్సాద్భుత శాన్తాశ్చ రసాః పూర్వై రుదాహృతాః" అని నవరసములు.

రసనిరూపణము : లోకములో నాలంబనకారణములయిన నాయికానాయకులచే బుట్టింపబడునదియు, నుద్దీపనకారణములయిన వెన్నెల, పుష్పమాల్యములు, చందనము మొదలగువానిచే వృద్ధినొందింపబడునదియు, కార్యములగు కటాక్షభుజాక్షేపాదులచే బ్రతీయమానమగునదియు సహకారులగు చింతాగ్లానినిర్వేదాదులచే బరమావధిని బొందింపబడునదియు నయి, తత్కారణము లుండుటచే నీపురుషు డీస్త్రీయం దాసక్తిగలవాడు, ఎవ్వ డెవ్వ డెల్లయెడలనో వాడు వాడీరీతిగానే యుండు నని అభ్యాసపాటవముగల శ్రోత్రియబ్రహ్మచారి వ్యతిరిక్తుల కనుమానమందును, గుణాలంకారమహిమచే గావ్యమందు, ఆంగిక వాచి కాహార్య కావ్యాభినయమహిమచే నాట్యమందు నభివ్యక్తమగుచు, రత్యాదిస్థాయిరూపముగా సామాజికహృదయములయందు చిరకాలమునుండి వాసనారూపముగా నున్నదియు నాసమయమందు విగళితవేద్యాంతరుడైన ప్రమాతతో స్వాకారమువలె నభిన్నమయినను అనుభూయమానమగుచు పునఃపునరుపభుజ్యమానత్వమే ప్రాణముగా గలది యయి, విభావాదు లున్నంతవరకు నుండునది యయి విభావాద్యనేక పదార్థములతో మిళితమై యున్నను పానకరసన్యాయముగా నేకరీతిగా ననుభూయమాన మగునది యయి ఎదుట స్ఫురించుచున్నదానివలె నుండునదియు, సర్వావయవముల నాలింగనము చేసికొనుచున్నదానివలె నుండునదియు, నితరము నంతయును గప్పివేయుచు బ్రహ్మానందాస్వాదనమును గలుగజేయుదానివలె నలౌకిక చమత్కారకారియగునది రసమని చెప్పబడును. నాటకప్రయోగదర్శనసమయమందు సామాజికుల కిట్టిలోకోత్తరరస మావిర్భవించును.

రామాయణకథను నాటకముగా వ్రాసినవారిలో మహాకవియగు భవభూతి మొదటివాడు. ఇతడు తనవృత్తాంతమును సంగ్రహముగా మాలతీమాధవప్రస్తావనయం దిట్లు చెప్పియున్నాడు. "అస్తి దక్షిణాపథే పద్మపురం నామనగరం తత్ర బ్రాహ్మణాః కేచి త్తైత్తిరీయాః పంక్తిపావనాః కాశ్యపాః పంచాగ్నయ స్సోమపీథినో ధృతవ్రతా ఉదుంబరనామానో బ్రహ్మవాదినః ప్రతివసంతి తదాముష్యాయణస్య తత్రభవతో భట్టగోపాలస్య పౌత్రః పవిత్రకీర్తే ర్నీలకంఠస్య పుత్రః శ్రీకంఠపదలాంఛనః" ఇతనిపూర్వులు బేరారుదేశమందున్న పద్మపురమను గ్రామమందు నివసించెడువారు. కాశ్యపగోత్రోత్పన్నులు. తైత్తిరీయశాఖాధ్యేతలు, అగ్న్యాహితులు, గృహస్థాశ్రమకర్మముల జక్కగా నెరవేర్చువారు. వారింటిపేరు ఉదుంబరంవారు. ఈవంశమందు జనించిన భట్టగోపాలుడను వాతని కీమహాకవి పౌత్రుడు. నీలకంఠుని పుత్రుడు. ఇతనితల్లి పేరు జాతుకర్ణి. ఇతనిపేరు శ్రీకంఠుడు. "యథార్థనామా భగవాన్ యస్య జ్ఞాననిధి ర్గురుః" అని యితడు చెప్పిన ట్లతనిగురువుపేరు జ్ఞాననిధి. ఇతడు వేదశాస్త్రపారంగతు డని యితడు వ్రాసిన గ్రంథములవలననే తెలియవచ్చును. ఈ మహాకవి కాన్యకుబ్జేశ్వరుడగు యశోవర్మనృపాలుని యాస్థానమందు బ్రవేశించినపుడు "సాంబా పునాతు భవభూతిపవిత్రమూర్తిః" అను మకుటముతో చండీశతకమను నొకశతకమును జెప్పగా నీతనిపోషకుడగు నాయశోవర్మ భవభూతి యని పేరిడెను. నాటనుండియు నీమహాకవి భవభూతి యని వ్యవహరింపబడుచుండెను. క్రీస్తుశకము 693-729వరకు గాశ్మీరదేశము నేలిన లలితాదిత్యు డీయశోవర్మను జయించె నని రాజతరంగిణిలో గల్హణుడు చెప్పియున్నాడు. కావున భవభూతి అష్టమశతకమం దుండెనని మనము నిశ్చయముగా జెప్పవచ్చును. సప్తమశతకమందున్న బాణుడు తాను వ్రాసినహర్షచరిత్ర పీఠికలో గాళిదాస ప్రవరసేన సుబంధ్వాదుల జెప్పినను భవభూతి నెచ్చటను పేర్కొ-
నకపోవుటచే నీతడు [illegible]

మనుమన్నది. కావున భవభూతి అష్టమశతాబ్దమం దుండెనని మనము నిశ్చయముగా జెప్పవచ్చును.

ఈమహాకవి "ప్రాచేతసో మునివృషా ప్రథమః కవీనాం యత్పావనం రఘుపతేః ప్రణినాయ వృత్తమ్; భక్తస్య తత్ర సమరం సతమేపి వాచః" అని మహావీరచరిత్రప్రస్తావనలో జెప్పినట్లు రామభక్తుండు గావున మహావీరచరిత్రము, ఉత్తరరామచరిత్రము నను రెండు రామనాటకములను వ్రాసెను. వానిలో మొదటి మహావీరచరిత్రమును విమర్శింతము. నాటకసంవిధానమునకు దగినట్లు కవి రామాయణకథను మార్చియున్నాడు. మురారి కూడ దన యనర్ఘరాఘవమందు భవభూతి యేర్పరచిన కథాసంవిధానమునే కొంతమట్టు కనుసరించెను. ఎట్లనగా, రావణుడు సీత నభిలషించుచున్నవాడై జనక విశ్వామిత్ర శతానందు లున్నచోటికి తనదూతను పంపుట - మాల్యవచ్ఛూర్పణఖాసంవాదము- వారిరువు రాలోచించు నీతిప్రయోగము. రామపరశురామసంవాద మీరెండునాటకములలో నించుమించుగా సరిగా నున్నవి. మహావీరచరిత్ర ద్వితీయాంకములో చతుర్థాంకప్రారంభములోను అనర్ఘరాఘవములో జతుర్థాంకప్రారంభమందును మాల్యవచ్ఛూర్పణఖాసంవాదము చెప్పబడినది.

మహావీరచరిత్ర ద్వితీయాంకము మాల్యవచ్ఛూర్పణఖాసంవాదము. విశ్వామిత్రయాగవిఘ్నంసకులగు సుబాహు మారీచులను వారి పరివారమును రాముడు సంహరించె నని విని మాల్యవంతుడు రామప్రతాపమును సహింపలేక సచింతుడై యుండగా నింతలో శూర్పణఖ వచ్చి దశరథపుత్రులపాణిగ్రహణ మంగళము నిర్విఘ్నముగా జరిగె ననియు, నగస్త్యమహర్షి రామునికి మహేంద్రసంబంధమగు ధనుస్సు నొసగె ననియు జెప్పెను. అది విని మాల్యవంతుడు రాముని నిరుత్తరప్రతాపమును, ఋషులకు దేవతలకు వానియం దుండు భక్తివిశ్వాసములును, అతని ధర్మగోప్తృత్వమును బ్రశంసించి తనవారి ధర్మాభిద్రోహ మనుస్మరించి విచారించుచు మనుష్యుడైనను సర్వవిధముల బలవత్తరుడగు రామునితో విరోధము సంభవించె నని దుఃఖించుచుండగా మహేంద్రపర్వతమందున్న

పరశురాము డొకవార్తాహరునిద్వారా మాల్యవంతుని కొకపత్రిక నంపెను. దానిలో నిట్లు వ్రాయబడి యుండెను. "దండకారణ్యతీర్థోపాసకులకు నే నభయ మిచ్చియుండుట మీ రెఱుగ జెలంగినదిరే. ఇపుడు విరాధదనుకబంధప్రభృతులు వారిని బాధించుచున్నారని వింటిని. కావున వా రట్లు చేయకుండ వారించి మాకు నీయం దున్న మాహేశ్వరప్రీతిని రక్షించుకొన వలయును. అట్లు కానిచో మీ మిత్రుడగు పరశురామునికి వైమనస్యము గలుగును.

శూర్పణఖ:—ఎంతగర్వావష్టంభముతో వ్రాసినాడు.

మాల్య. ఇత డభిజనతపోవిద్యావీర్యాదులచే మత్తుడై యీభూమినంతయును గశ్యపునికి దానమిచ్చినవాడగుటచే నిరీహుడు. అన్యులను శరణుగొనని వాడు. తాను మనము మాహేశ్వరుల మని మన యందు గొంచము ప్రీతి గనపఱుచుచుండును గాని పనివచ్చినపుడు మనవారల మిగుల గినుకుడై యుండును.

శూర్ప. అతనివిషయమయి మీ రేమి యాలోచించుచున్నారు?

మాల్య. రామునిహరధనుర్భంగ మితనికి దెలిసిన రోషమును సహింపడు. ఈయుభయులకు యుద్ధము సంభవించును. ఆయుద్ధములో సుందోపసుందులవలె నొకరి నొకరు చంపుకొన్నచో మనకు మిక్కిలి ప్రియము. ఇట్లు కాక పరశురాముడు రాముని జయించిన పక్షమున, మనకోర్కె సిద్ధించును. రాముడు పరశురాముని జయించినను బ్రాహ్మణుడని పరశురాముని జంపక విడిచిపెట్టును. ముముక్షువగు నీపరశురాముడు విడిచిపెట్టిన శస్త్రమును మరల బట్టడు. అందువలన మన కనిష్టము వాటిల్లదు.

శూర్ప. రామునివలన భార్గవునికి బరాజయము సంభవించినచో నేమి విశేషము?

మాల్య. పరశురాము డారణ్యకవ్రతి. అతడు రాముని జంపినను మరల నారణ్యకుడే యగును. పక్షాంతరమం దా రాజపుత్రుడు జామదగ్న్యుని జయించిన యెడ ప్రభుమంత్రోత్సాహశక్తిసంపన్నుడై జేతా

బృందమునకు నాయకుడగును. శత్రుపక్షాశ్రితులగు దేవతలను మన మవమానింపగా బ్రకృతికోపము సంభవించును. రావణవిజేత యగు కార్తవీర్యుని వధించిన పరశురాముని రాముడు పరాభవింపగా లోకమున కంతకు రాముడే ప్రభువగును.

శూర్ప. అయితే మనమిపు డేమి చేయవలయును?

మాల్య. రామపరశురాముల కుభయులకు బరస్పరవైరము బుట్టింపవలయును.

శూర్ప. రాముడే పరశురాముని జయించినయెడ మన రాక్షసజాతికి గొప్పకీడు మూడును.

మాల్య. ఆవిషయమయినకూడ శక్తికొలది ప్రతివిధానము చేయబడును. పరశురామోత్తేజనము జేయుటకు మహేంద్రద్వీపమునకు బోదము రమ్మని యుభయులు నిష్క్రమించిరి.

మహావీరచరిత్రము

చతుర్థాంకప్రారంభములో మరల మాల్యవచ్ఛూర్పణఖాసంవాదము (మిశ్రవిష్కంభకము) సంభ్రాంతులై శూర్పణఖామాల్యవంతులు విమానముచే బ్రవేశించుచున్నారు.

మాల్య. దేవతల ఐకమత్యము చూచితివా? ఇంద్రాదులు రామునికి బంధువులయినారు.

శూర్ప. తాతగారూ! మీ రాలోచించినది యెప్పుడైన మరియొకరీతిగా జరుగునా!

మాల్య. దశరథుడు తొల్లి కైకేయికి రెండువరముల నొసగెద నని ప్రతిజ్ఞజేసి యున్నాడు. ఆసంగతి జ్ఞాపకముచేయుటకొరకు కైకేయి యిపుడు మంథర యను తనపరిచారికను అయోధ్యనుండి దశరథుని యొద్దకు మిథిలానగరమునకు బంపుచున్నది. అది యిపుడు మిథిలానగరప్రాంతమం దున్న దని చారులు నాతో జెప్పిరి. దానిశరీరమందు బ్రవేశించి నీ వీరీతిగా చేయవలయునని మెల్లగా చెవిలో జెప్పుచున్నాడు.

శూర్ప. రాముడు మరియొకరీతిగా జేయునా?

మాల్య. ఇక్ష్వాకుకుటుంబమందు సద్వృత్త మెప్పుడును భేదింపదు. విశేషించి రామునివంటి విజిగీషుని యందు.

శూర్ప. అందువలన నేమి?

మాల్య. రాముడు పితృవచనపరిపాలకుడై యరణ్యమునకు బయలుదేరగా సామదానభేదదండోపాయములచే నతనిని దూరముగా రాక్షసాంతికమునకు దీసికొని వచ్చి వింధ్యారణ్యమందు బ్రవేశించునట్లు జేసినచో నతడు సులభముగా దొరకును. తీక్ష్ణులయిన విరాధ దను కబంధ ప్రభృతులు దండకారణ్యమందు సంచరించుచున్నారు. లుప్తప్రభుశక్తియగు రాముని వంచించుటకు వాండ్రు సమర్థులు. అందువలన సీతాస్వీకారాగ్రహమువలన రావణుని నివర్తింపజేయ నవసరములేదు.

శూర్ప. రామునికి లక్ష్మణుడు సహాయుడై యుండుటలో నేమి ప్రయోజనము?

మాల్య. రామునివలె లక్ష్మణుండును వీరుడు, సర్వాస్త్రపారగుడు. ధన్వదండప్రయోగమువీరిద్దఱికిదుల్యమే.

శూర్ప. దూరముగానున్న దాశరథిని సమీపమునకు దీసికొని వచ్చుట; అతనితో స్త్రీవైరము దెచ్చికొనుట; యీ రెండును యుక్తముగా నున్నట్లు కానరాదు.

మాల్య. రాముడు మనకు భూమ్యంతరుడగుటచే ప్రత్యాసన్నుడేకాని దూరస్థుడు కాదు. పరివారముతో గూడిన సుబాహుమారీచులను తాటకను బరిమార్చుటచే రాముడు మొదటినుండి మనతో బద్ధవైరుడే. మఱియొకరీతిగాగూడ రామరావణవైర మప్రతివిధేయము. ఎట్లనగా, నతడు జగమును రక్షించువాడు. మనము జగమును బీడించువారము. మన కెల్లప్పు డప్రియమునొనరించురామునితో సామ మెట్లు కుదురును? దేవతలచేగూడ బ్రభువుగా వరింపబడినవాడేమి యర్థ మపేక్షించును? అందుచే దానము పనికిరాదు. భేదము పనికిరాదు. బలవత్తరుడగు శత్రువును వెల్లడిగా దండింపగూడదు. రహస్యముగా శిక్షింపవలెను. అందుచే సీతాపహరణముకంటె వేఱుగా రామునికి రహస్యశిక్ష యేమున్నది? శత్రువులు భార్యనపహరింపగా సిగ్గుపడి ప్రాణముల బరిత్యజించును. లేక సంధికైన వచ్చును. పరిభవోత్థకోపముచే మనలను వధించుటకు బూనుకొన్నయెడల నతనిని వారిధి యడ్డును. కాని రావణునితో తొలి

నుండి సఖ్యముజేసికొన్నవాలి యతనిని వధింప గలడు. ఈ సందర్భములలో చాల సంగతులాలోచింపవలసియున్నది.

శూర్ప. అవి యేవి?

మాల్య. నీవు రావణుని కిష్టురాలవు. కార్యజ్ఞురాలవు. కావున నాహృదయభేదము నంతయును నీకు దెలిపెద. భూమ్యంతరుడగుటచేతను క్షత్రియుడగుటచేతను రాముడు మనకు రెండువిధముల శత్రువు. మా మూడవమనుమడగు విభీషణుడు మనకు సహజశత్రువు. సర్పమువలె భయంకరుడు. కుంభకర్ణుడు నిద్రావ్యసని యగుటవలన నున్నను లేనివానితో సమానుడు. విభీషణు డాభిగామికాత్మగుణసంపన్నుడు గావున ప్రకృతులతనియం దనురక్తులు. సంపూర్ణత్తులప ఖరదూషణాదులు రావణు నాశ్రయించియున్నారు. అంతర్భేదజర్ఝరమైయున్న రాజకులము రామునిచేనభియుక్తమై భేదింపబడును. విభీషణుని విషయమై ప్రతివిధాన మాలోచింపవలెను. అతనివిషయమయి తూష్ణీందండముగాని ప్రకాశదండముగాని సంశోధనముగాని అపసారణముగాని ప్రయోగింపబడవలెను. అతనిని ప్రకాశముగా శిక్షించినయెడల రాక్షసులు సహింపరు. తూష్ణీందండమయినను ప్రాజ్ఞులచే నూహింపబడినది యయి ప్రకృతిప్రకోపకారణ మగును. సంశోధనము ప్రయోగించినయెడల నైకమత్యముగల ఖరాదులు వికృతి నొందుదురు. అతడు వెడలగొట్టబడ్డవాడైనను ఖరాదు లతనిని చుట్టుకొందురు. కావున మొదట ఖరాదులసంగతి నాలోచింపవలెను.

శూర్ప. అను జీవిత్వ మెంతకుత్సితము. రావణునికి ఖరాదులకు నన్యోన్యసంబంధము తుల్యమయి యున్నను మాతామహు డిట్లాలోచించుచున్నాడు.

మాల్య. స్వామి కార్యైకతత్పరులప్రవృత్తి యిట్లనే యుండును.

శూర్ప. ఖరాదులు లేనియెడ విభీషణు డేమి చేయవలయును?

మాల్య. విభీషణుడు ప్రాజ్ఞుడు. అన్నవికారమును జూచి స్వయముగా దొలగిపోవును. పౌరజనులవలన భయము గలుగునని తలంపుగూడదు. చిన్ననాటనుండి సఖ్యముగల సుగ్రీవు నతడాశ్రయించును. అక్కడనుండగా వారిచే జంపబడును. వాలి వీని నుపేక్షింపడు.

శూర్ప. రాముడు పరశురాముని జయించినట్లు వానిని గూడ జయించినయెడల రామవిభీషణసమ్మేళనము మనకు మిగుల ననర్థావహ మని యూహించెదను.

మాల్య. రాముడెప్పుడు వాలిని జంపునో అప్పుడే మన వంశము రామునిచే జంపబడినవారమని తలంపుము. విభీషణుడొక్కడే కులతంతువయి శేషించును. ధర్మసుతుడగు రాముడు వానికి సిరినిచ్చును గాక. ఎచటికిబంపంబడితివో అచటికి బొమ్ము. జనకదశరథులయొద్ద వసిష్ఠవిశ్వామిత్రులు లేనిసమయమున నీపని సులభముగా సిద్ధించును. నేనుకూడ లంకకు బోయెదను.

శూర్ప. (కైకసి నుద్దేశించి) అమ్మా! నీవుకూడ దుఃఖము ననుభవింపవలసియున్నావు.

మాల్య. ఖరదూషణ ప్రభృతులార! పాపాత్ముడనైన నాకు మీరు వధ్యులగుచున్నారు. విభీషణా! కార్యవశమున నిన్ను విడువవలసివచ్చినది. ఓయి రావణుడా! నీకు గొప్ప ఆపదను చూచుచున్నాను. వత్సా కైకసి! ఇక నీ వెంతోకాలము నీముగ్గురు పుత్రులను జూడవు. అని నిష్క్రమించిరి.

ఈమిశ్రకవిష్కంభముచే రామవివాసనము, సీతాహరణము, ఖరదూషణాదివధ, రామసుగ్రీవసఖ్యము, వాలివధ, విభీషణుని రామాశ్రయణము మొదలగునవి సూచింపబడెను.

అనర్ఘరాఘవములో చతుర్థాంకమందు మాల్యవచ్ఛూర్పణఖా సంవాదము.

మాల్య. సీతను వరించుటకు బంపబడిన పురోహితునిచే జెప్పబడిన కకుత్స్థకులకుమారుని మానుష్యకాతిశయమును విన్నది మొదలుకొని కష్టదశ ననుభవించుచున్నాను. అట్టి యద్భుతతేజస్సు మనుష్యలోకమందు నిరభిసంధిగా నెట్లుదయించును? దశాననుని

చరిత్రముకూడ దానికిదగినదే యున్నది. ఈచింతచే నాకు రాత్రులయందు నిద్రలేదు. అయ్యో! దైవము నాకింక చిరజీవిత్వ మేలయొసగెను? విమర్శించి మైథిలరాజుకూడ నకార్యజ్ఞుడు. తనపుత్రికను రావణునివంటివానిని కియ్యక మనుష్యుని కిచ్చెను. మిథిలావృత్తాంతము నరయుటకు బంపబడిన శూర్పణఖ యేమి యింత ఆలస్యము చేయుచున్నది. (ఇంతలో శూర్పణఖ ప్రవేశించి) వివాహనేపథ్యలక్ష్మీ శోభమానములగు రఘుకులకుమారుల ముఖపుండరీకముల నాలోకించి మాయామానుషభావముచే కృతార్థురాలనైతిని. ఏమి ఆశ్చర్యము? గుణస్వభావ మిట్టిది. శత్రుగతమైన నానందింపజేయును.

మాల్య. (స్నేహముతో జూచి) ఓహో శూర్పణఖ! ఇట రమ్ము. నే నిచటనున్నాను.

శూర్ప. కనిష్ఠమాతామహుం డీయట్టాలకశిఖర మందే యున్నాడు. దుష్టకార్యము లన్నియు నొక్కసారి వచ్చి యితనిని జుట్టుకొన్నవి. ఏలయనగా నిపుడు ప్రజాగరక్లాంతలోచనుడై మాతామహుండు మఱియొకనివలె గానవచ్చుచున్నాడు. సామాన్య మయి నను మంత్రిత్వము మిక్కిలి కష్టము. అందులో విశేషించి సాహసైకవ్యవసాయి యగు రావణుని మంత్రిత్వము మఱింతకష్టము. ఇతడు నాకొఱకే నిరీక్షించుచున్నాడనికలంచెదనని సమీపించి, ఆర్యా! నమస్కారము.

మాల్య. వత్సా! కళ్యాణభాజనురాలవు కమ్ము. ఇచట గూర్చుండుము. దశరథుడు భరతశత్రుఘ్నులతో జనకునికడకు వచ్చినాడా?

శూర్ప. అయ్యా! దశరథుడు రాగా కుమారులకు వివాహము లయినవి. ఆసమయమందే నేను మిథిలానగరమును బ్రవేశించితిని.

మాల్య. (నిట్టూర్పువిడిచి) సీతావివాహము మిక్కిలి జెల్లడిగా జరిగినది. (విమర్శించి) ఇది దురాత్ముడగు విశ్వామిత్రుని దుర్నాటకము. స్వయజ్ఞరక్షణార్థమై దశరథునొద్దనుండి రామలక్ష్మణులను దీసికొనివచ్చి వారికి దివ్యాస్త్రముల నుపదేశించి సుబాహుమారీచాదిరాక్షసుల జంపించెను. హరధనుర్భంగమును జేయించి రామునికి సీత నిప్పించి వివాహము జేయించెను. ఇకముం దేమి చేయునో నాకు దెలియదు. కానిమ్ము. అతీతవర్ణనచే నేమి ఫలము? సీతాబలాత్కారగ్రహణమందు బ్రయత్నించుచుండెడి రాక్షసపతి విషయమయి యేమి ప్రతివిధానము?

శూర్ప. ఆర్యా! సీతాగ్రహణమందు బలాత్కారము తప్ప మఱియొక ఉపాయము గానరాదు.

మాల్య. వత్సా! అట్లనబోకు. అట్టిమహానుభావునిచే బరిగ్రహింపబడిన సీతను బలాత్కారముగా హరించుట మహాప్రమాదము. అతితొందర యగు మననిశాచరనాథు డీపని జేయగా మన మెట్లామోదింపగలము?

శూర్ప. తమరాలోచించినట్లు కాల మెంతకుటిలముగా నున్నది. ఏల యన; త్రిభువనలక్ష్మీలీలాబందీకారుడగు మహారాజరావణునివిషయమయికూడ నిట్లాలోచింపబడుచున్నది!

మాల్య. విశ్వామిత్రుడు దివ్యాస్త్రముల నొసంగెను. హరధనుర్భంగముచే దేవతల కందరికి గొప్పయుత్సవ మాయెను. ఈజగత్త్రయమంతయు రఘుపతిసుక్రీతమని యెఱుంగుము.

శూర్ప. ఇందుకు సందేహమేమి? ఆవివాహమహోత్సవమందే నేనంతయు గన్నులార జూచితిని.

మాల్య. రావణునిదుర్దశ - పదిమంది కూడి ఱొల్లుసల్పి యొకనిని జంపినట్లగును. మిథిలానగరమును బ్రవేశించి రావణుడు బలాత్కారముగా కళత్రము నపహరింపగా రాము డెట్లు సహించును? రావణుని జంపుటకు బ్రయత్నించు రామునికి పౌరజానపదులందఱు సహాయము గావించెదరు. అరణ్యకాగ్నివలె నాతని తేజస్సు దుష్ప్రసహ మగును.

శూర్ప. (వేడినిట్టూర్పు విడుచుచు) అయ్యో! ఇపు డేమి చేయుట యుక్తము. [సశేషము]

ఓమ్

కూనూరు

(ముగ్గురు)

మహారాజశ్రీ మామయ్యగారికి. కోయంబత్తూర్, 2-7-23.

నమస్కారములు.

మేమందఱము నేఁడు కోయంబత్తూరు కుశలముగఁ బ్రవేశించినాము. నేఁడే చెన్నపురి వెళ్లెదము. నేనును శ్రీగురువుగారును కూనూరును బ్రశంసించుచుఁ దొందరగ రచించిన పద్యముల నిందులోఁ బంపితిని. వీనిపై మీ యభిప్రాయమును దెలుపఁగలందులకు శ్రీగురువుగారు కోరుచున్నారు. ఈపద్యములకు వేఱుప్రతి లేనందున వీనిని జూచి వెంటనే చెన్నపురికిఁ బంపుఁడు. క్షేమము వ్రాయుఁడు.

చిత్తగింపుఁడు.

చిం. సీ. రా.

ఓమ్

వీడుకోలుప

సీ. అభ్రంకషంబు లైనట్టి శృంగములపై, విహరించితిమి నిండువేడ్కతోడఁ
జరియించితిమి భయంకరగుల్మతరులతా, గహనభూములఁ గనుఁగొనకుండ
వడవడవడకించు చలితెమ్మెరల పెంపు, భరియించితిమి వినిర్బాధకముగఁ
దనివొందితిమి సుధాధారామధురచిత్ర, ఖగగానములు వీనుఁగవలఁ గ్రోలి
సర్వరక్షకుఁ డైనయీశ్వరునికరుణ, నింతకాలంబు మేము నీచెంత నిలిచి
యింక నేఁగుచున్నార మింగ్లకడకు, ననుమతింపఁగదయ్య! నీలాచలేంద్ర!

చం. తరుప్రతతీరు, నూతనలతానివహంబులసౌరు, నీరదో
త్కరముల పెంపు, సంతతవికాససుమప్రచయంబుసొంపు, ని
ర్ఝరనిచయంబుచొప్పు, విలసద్వనవీథులయొప్పుఁ, గల్గి మే
టి రహిం వహించు నిన్నుఁ బురుడింపఁగఁజాలెడుకొండ లున్నవే?

మ. ఒకచోఁ జూచినతీర నుల్లమున కత్యుత్సాహముం గూర్ప, వే
ఱొకచోఁ బండినభూరుహావళులు నోరూరింప, నింకొక్కచో
నకలంకామృతపూర్ణనిర్ఝరము లుద్యత్ప్రీతి రెట్టింప, నె
న్నికకున్ మీఱిన నీ మనోహరత వర్ణింపం దరంబా నాకో?

గీ. వక్రపథగాములై వచ్చివచ్చి నీదు, నెత్తి నెక్కినఁ గాని మన్నింతు వనిన
నెంచఁగారాదె నీదైన మంచితనము, నీలభూధరరాజ! నిర్నిద్రతేజ!

మ. సకలామోదకరత్వదీయ వనసంచారంబ దేవారి కూ
రక లభ్యంబగుఁ బూర్వపుణ్యఫలసారప్రాప్తిచేఁగాక? దా
నికి దూరంబయి పోవుచుంటి మన నెంతే చింత వాటిల్ల దే
యకటా! నీయెడఁబాటు మాకు గిరిరాజా! దుస్సహంబౌఁగదా.

సీ. ఒకనాఁడు బహుసాహసోద్రేకమున భవ,ద్దుర్గమారణ్యముల్ దాఁటి చనుచు
నొకనాఁడు సంతోష ముప్పొంగ నీదుకూ,టాగ్రంబులం దెక్కి యాడుకొనుచు
నొకనాఁడు కోర్కెలీరికలెత్త భవదీయ, జలపాతములఁ గాంచి సంతసిలుచు
నొకనాఁడు పరమకౌతుకముతోఁ గ్రొత్త త్రో,వలువట్టి విహరణంబులు సలుపుచు
మామహారాజు ముద్దుకుమారకులును, మేము నానందమయులమై మేటిసుఖము
చూఱలాడినయట్టి యాసుదివసములు, మఱలవచ్చునె జన్మజన్మములకైన?

క. గురుగౌరవమున నన్మ,ద్ధరణీనాయకు ననుంగు తనుజన్ములు మ
మ్మరసి దయఁ జూచుచుండఁగ, మరల భవన్నికటమందు మసలుట యెపుడో?

క. తృణకాష్ఠజలసమృద్ధిన్, గణనీయంబగుచు నీశిఖరమునకు విభూ
షణమైతగు కూనూర్ప,ట్టణమున వసియించు టక్కటా! యిఁక నెపుడో?

మ. జలపాతంబులయొద్ద కేగి పరమోత్సాహంబుతోఁ దచ్ఛిలా
స్థలులన్ శీతలనీరబిందు నివహస్యందంబులం దోఁగు భూ
తలనాథాత్మజు లేమునుంగలసి పంతాలాడుచున్ వేడ్క విం
దులు గావించెడు పుణ్యవాసరము లెందో మాకుఁ జేకూరుటల్.

సీ. చిటపట వర్షించు చిన్కులం దేనాఁడు, విహరించినారమో వేడ్క మిగుల
నేనాఁడు పొగమంచులోన డాఁగుడుమూఁత,లాడుకొంటిమొ ముదం బావహిల్లఁ
జలిగాలిలోన వెచ్చనిదుస్తులం దాల్చి, యేనాఁడు శిఖరంబు లెక్కినామొ
గ్రుడ్డిమెండలలోనఁ గులుకుచు నేనాఁడు, వచ్చినారమొ యసివాఱుపోయి
అట్టి సుదినంబు లవి యెల్ల నరిగిపోయె, నంతయును మాకు స్వప్నవృత్తాంత మాయె
నేమనఁగవచ్చు? నింక మే మింట్ల కేగి, కథలుగాఁ జెప్పుకొనియెడు గతియె కలిగె.

సీ. తలలతో నాకాశతలము రాసెడు నీదు, భూరుహంబుల కిదే బుజ్జగింపు
తెలిముత్తియపుసరంబులయొప్పుఁ జూపు నీ, జలపాతముల కిదే సాంత్వనంబు

కలగానమధురసంబులు విందువెట్టు నీ, విహగంబులకు నిదే పీఁకుకొల్పు
చిత్రవర్ణప్రశస్తి వహించి నవ్వు నీ, కుసుమంబులకు నిదే కూర్మిముద్దు
అతిథిసత్కారసంతతాయత్తచిత్త, వృత్తి వగు నీ కిదే నమస్కృతిశతంబు
సెలవొసంగుము పోయి వచ్చెదము మమ్ము, మఱచిపోవకుమయ్య! భూధరవరేణ్య!

సీ. ఎల్లి నిన్విడిచిపోయెద మనుగ్రహ ముంపు, మాపై మహారాజమందిరంబ!
యిట కింక రాము రేపటినుండి మాపాఁదు, మఱచిపోవకు మమ్ము మధురవాపి!
యీనాఁటికేకదా యిట దంతశోధ సల్పుట మమ్ముఁ దలఁతువో తటతలంబ!
నీ కెవ్వ రిఁక రేపు నీళ్లు వోయుదురమ్మ! దూర మయ్యెదు మాకుఁ దుమ్మిమొక్క
మెచటివారము మేము! మీ రెచటివారు? కలసికొంటిమి దైవసంకల్పవశతఁ
దాదృశంబు ఋణానుబంధంబు తెగియెఁ, బాయుచున్నార, మేమి సెప్పఁదగు నింక?

హైల్యాండ్సు
కూనూరు, నీలగిరి
2-7-1923

ఓలేటి వేంకటరామశాస్త్రి.

ఓమ్.

కూనూరు

1. ఆతిథ్యము:

సీ. జలజల జాల్వాఱు స్వాదునిర్మలనిర్ఝ, రాంబువు లర్ఘ్యపాద్యములు గాఁగ
నెడనెడ 'టీ' మొల్క లడరి గోముగ మించు, శాద్వలస్థలము లాసనముగాఁగ
నటునిటు నూఁగాడు నవనీజశాఖాళి, కమనీయతాలవృంతములు గాఁగ
వేర్వేఱు చవుల నివ్వెఱఁగొల్పు ఫలరాజి, షడ్రసోపేతభోజనము గాఁగ
విహగతతి విన్పు నవ్యక్తవిమలరుతము, మధురగానంబు గాఁగ సమ్మానగరిమ
మాకు నాతిథ్య మిడితివి మఱవఁగలమె? చారువైభవభరమ! కూనూరుపురమ!

అద్రులు:

సీ. ఆరోహణావరోహణకాలములఁ' ద్రిభు,వనవిహారము తలంపునకు వచ్చె
సంజవేళల దృష్టిసారింపఁ గైలాస, మేరువుల్ హృద్వీథి మెలఁగఁజొచ్చెఁ
గనుచూపుమేరకుఁ గలయఁ జూచినవేళ, ధాన్యంపురాసులు దలఁపువచ్చెఁ
బైనుండి క్రిందికిఁ బ్రవహించుసెలయేళ్లు, త్రిపథగాలక్ష్మి జ్ఞప్తికి మరల్చె
నద్రివరులార! మీపయి నరిగినపుడు; గన్నులారంగ మిమ్ములఁ గాంచినపుడు;
పోవుచున్నార మింక మిమ్ములను వీడి; అకట! క్రమ్మఱఁ గాంచుభాగ్యంబు కలదె?

అద్రిమార్గములు:

సీ. పాతాళమునుండి స్వర్గంబు తుదిదాఁకఁ, జెలువార నిడిననిశ్రేణు లనఁగ
నచలస్థితి దలిర్చ నాపాదమస్తంబు, రచియించినట్టి పెన్త్రాళ్లనఁగ
నగముపఘ్నముగాఁగ నెగఁబ్రాఁకి వలిపంపు, తీయఁగాఁ గాచెడి తీవలనఁగ
నానందసౌధాగ్ర మంటి యందుఁ జరింప, విలసిల్లుసోపానవీథు లనఁగ
నద్రిమార్గంబు లొప్పు విహారయోగ్య, సమ్యగానందదాయకస్థలము లగుచు
సతతమానవసంచారసంభవంబు, లయ్యు నీశ్వరరచితంబు లనఁగఁ దనరి.

మొల్కలు:

ఉ. కొండల నెక్క మాకుఁ దమకోమలపావనహస్తరాజముల్
సింపిన వేడ్క నూఁతయిడి, 'నిర్భయచిత్తులరై చనుండు రా
రండ'ని మాకు సాయము కరం బొసరించిన మొల్కలార! మా
న్నెం డయినన్ మిము న్మనమునన్ స్మరియింపక యుండ నేర్తుమే?

విహారము:

ఉ. చల్లనినీడలందు ఘనసానువులందు వియత్స్థలంబుతో
నుల్లసమాడుశృంగముల హాయని పాడుకొండ కాల్వలన్
బల్లపులోయలన్ బహువనంబులలోఁ జరియించినార మే
ముల్లము లుల్లసిల్ల సరసోక్తులతో నగరీమతల్లి కా!

సీ. సెలయేళ్లపరిసరంబుల ఫలాహారముల్, మనమార మెసవుచు మసలినాము
బంగారుటీరెండఁ బైఁ బూసికొని దినంబుల షికార్లను బెక్కు సలిపినాము
దడదడఁబడుచుండు జడివానసోనల, సంగడీలతో మెలంగినాము
మిన్నుమన్నును నొక్కటెన్నఁ జేసిన పొగ, మంచులోపల సంచరించినాము
రివ్వు మని వీచుగాలిలో రేణులందుఁ, జీఁకటులలోనఁ జిటపొటచినుకులందు
మించువేడుకతో విహరించినాము, భోగనికరంబ! కూనూరుపురవరంబ!

శుభ్రాభ్రములు:

సీ. సురతరంగిణినుండి ధర రాలు తరఁగల, నురుగులఁ దలఁపించి హరుస మొసఁగు
పగలింటిదొర తేజవదనంబు వెల్వడు, ఫేనంబుఁ దలఁపించి ప్రియము గొలుపు
తెల్లనిదొరమేనఁ దీర్చెడు సితభస్మ, పుంజంబుఁ దలఁపించి ముదము వెట్టు
సుర లార్చుకొను ధౌతపరిధానసముదాయ, మును దలఁపించి ప్రమోద మిచ్చు

నంతరాళంబులోఁ దేలియాడుచుండి, యక్షిపర్వంబుగాఁగ శుభ్రాభ్రసమితి
భళిరె! కూనూర! నీవెంత భాగ్యవతివో! తరమె యేరికి నీపుణ్యగరిమ పొగడ!

వనాంతరసీమలు:

చ. చిగురులసోరు పత్రములచెల్వము మొగ్గలతీరు పుష్పముల్
సొగసును బూవుఁబిందియలసొంపును పిందెలకావి పచ్చికా
యగవిబెడంగు పండులకమొయారము కొమ్మలనీటు చెట్లసో
యగము సుఖింపఁగాఁ దగు వనాంతరసీమలయొప్పు లెంతయున్.

సూర్యదేవుఁడు:

సీ. ఖరకరుండని తీవ్రకరుఁడని తిగ్మాంశుఁ, డని వేఁడివెల్గని యఖిలజనులు
నిన్నుఁ దపనుఁ గాఁగ నెన్నుచుందురు రూఢి,పదముల సూర్యదేవా! కనంగ
ఖరకరత్వము గానఁగారాదు కానఁగా, రాదు వేఁడిమియుఁ జిత్రంబు తండ్రి!
యింతచల్లనిచూపు నీగిరివ్రజమందు, సారించినాఁడ వేకారణమున?
దృష్టి నీమీఁద నిడి నీవె దిక్కుగాఁగ, నిన్ను సేవింపవచ్చెడి నియతమతుల
నెల్లె చూచెదుకాఁబోలు నయ్య! దేవ! అచలసన్మార్గు లెంతధన్యాత్ములొక్కొ!

ప్రకృతి:

సీ. ఱేరాజు దినరాజు రేపవల్ మేఘాళి, కావల దూఁబూచు లాడుచుండ
జీమూతతతి రోదసీగహ్వరమునందు, స్వేచ్ఛావిహారముల్ సేయుచుండఁ
దరిఁమీఁటఁ బవనుండు తరుగుల్మలతలలోఁ, నొయ్యొయ్య నుయ్యాల లూఁగుచుండఁ
గలకలధ్వని విహంగంబు లుప్పరవీథి, యందు నుప్పనఁబట్టె లాడుచుండ
నలరు లామోద మందందఁ జిలుకుచుండఁ, గమ్మవిూ రెండ లింతింత గాయుచుండఁ
బ్రకృతిసౌందర్యజలధిలోఁ బల నయారె! డోలలాడ్చితె మమ్ము! కూనూరుపురమ!

సింహావలోకనము:

చ. కరువలి యెండ వాన హిమకంధరముల్ వలపింపఁగా వసీ
గిరులను మెట్టుచున్ నదులు గిల్లుచుఁ బండులు కోసికొంచు ని
ర్ఝరమధువున్ విహంగకలరావముఁ గ్రోలుచుఁ జెట్లనీడలన్
జరుగుచు నస్మదీయనృపసంతతి మేముఁ జరింప నయ్యెడిన్.

వియోగము:

సీ. చల్లచూపుల నించు చంద్రభాస్కరులార! తమిమీఁటఁ దిరుగు నభ్రంబులార!
తరువుల గిలిగించి మరియు తెమ్మెరలార! వెండిసీరాను నీరెండలార!

అభ్రంబుతో మేలమాడు వృక్షములార! చల్లఁగా మలఁగు నిర్ఝరములార!
కలరవంబునఁ బాడుఖగవితానములార! మఱుమాయగావచ్చు మంచులార!
వలపునవ్వుల నవ్వు పుష్పంబులార! రాగమును జూపు పల్లవరాజులార!
రసము లొలికించు ఫలనికరంబులార! చిత్రచిత్రంబులార! మాచిన్నలార!

మ. అకటా! మి మ్మొడఁబాయునట్టి సమయంబయ్యెన్ వియోగంబు మే
మిఁక నెట్లో భరియింప? మీతలఁపుతోనే హృద్విపర్యాస మొం
ది కడున్ దోఁచకయుండు; నిన్నిదినముల్ నెయ్యంబు తియ్యంబు పొం
దుకొనంగా విహరించినార! మిఁక నెందో యిట్టి యానందముల్

మేలు:

క మారాజకుటుంబము మే, మారోగ్యము గలిగి తిరుగునట్టిశుభము కూ
నూరుపురీ! దయ నొసఁగితి; వారయ నీమేలు మఱవనగునే మాకున్?

'హైల్యాండ్స్' కూనూర్
2.7.1923

చింతలపూడి సీతారామయ్య.

శ్రీ దేవాయనమః

పీఠాపురము, 8.7.23

క. 'కోయంబత్తూర్' నగరముఁ, బాయుచు మీ రనిచియున్న పద్యాన్వితలే
ఖాయుగళము కరగత మై, యాయతసమ్మోదపరవశాత్ము నొనర్చెన్.

చ. కవివరులార! మీరలు వికాసవిశుద్ధమనోబ్జ తాచు నా
శువున రచించి పంచిన వచోమణిగుంఫితపద్యమాల గ
న్గవ చరితార్థ మానటు లొనర్చె వినీలధరాధరేంద్రముం
బ్రవిమలనిర్ఝరాంబువుల భవ్యవనంబులఁ గానిపించుచున్.

సీ. సాంద్రనీహారసంఛన్ననీలమహీధ్ర, సానుసంచారంబు సలిపినట్లు
తరులతాగుల్మసంతతశోభిరమ్యాట, వీవిహారంబు గావించినట్లు
సహజశీతలతా ప్రసన్నాంబుధరభిన్న, వర్షధారలఁబర్వ వాఱినట్లు
అత్యున్నతావనీధ్రాధిత్యకారోహ, ణావరోహణముల నలరినట్లు
రేయి కలగంటి! వెలలేనిహాయి గంటిఁ! బిదప మేల్కాంటి! గనుఁగొంటిఁ బెంకుటింటి
తెల్లవాఱినదాఁకఁ జింకిల్లుచుంటి! మీయదృష్టంబునకుఁ జాల మెచ్చుకొంటి!

ఆ. గీ. గురుప్రగాఢకవిత సరసధారాశుద్ధి, లలితభావఫణితి వెలయుచుండె
వారిశక్తి యెన్న వశమౌనె? యుభయభా, షాకవిత్వకరణచణులు వారు.

ఆ. గీ. మాయనుంగుభాగినేయుని క్రొంగ్రొత్త, కవిత స్వాత్మభావకలిత మగుచుఁ
దత్పురోభివృద్ధిఁ దలఁచించుచుఁ బ్రమోద, వారిరాశిఁ దేల్చివైచుచుండె.

మ. తనివోవం బరికింప మీఁదగు కవిత్వప్రాప్తి; యీరీతిఁ దోఁ
చెను నాకుం "బృథుకాంకురంబులు గురుశ్రీవర్ణతుల్యంబులే"
యని; మైనం గడు నారికేళనకలంబై యున్న దొక్కండు, నూ
తనమార్గంబున నున్న దొక్కఁ, డిట భేదం బెన్నఁగా రాఁదగున్.

తే. గీ. ఇంతకును సంతసింపంగ నెలయు నొకటి, మనమహారాజుఁ దత్కుటుంబమును మీరు
సేనకాళియుఁ జిట్టని చీఁదకుండ, వెడలివచ్చితి రదె పదివేలు మాకు.

తే. గీ. ఎపుడు నగరంబునకు మీర లేఁగుదెంతు, రెపుడు మిముఁ గనిసౌహార్ద మెసఁగ మెసఁగ
స్వాగతం బని యచ్చటివార్త లెల్ల, నడిగి విని యుబ్బఁ గల్గునో యనుచు నుంటి.

ఉ. భోజధరాతలేంద్రుముఖగముం గనువాని కనల్పకల్పనా
భ్రాజితకావ్యసంసృజనపాటవ మబ్బెడి దండ్రు పెద్ద; లా
యోజ భవత్కవిత్వ మిపు డుత్సుకతం బఠియించు నా కయా
రే! జనియించె నిక్కవిత, యీశ్వరతత్త్వ మెఱుంగ శక్యమే?

నడకుదుటి వీరరాజు.

ఓమ్.

'S'
'Dunmore'
Madras.
10-7-23.

మామయ్యగారూ!

నమస్కారములు.

క. మానితమృదుభాషితములు, నానారసభావకల్పనా మిళితంబుల్
మీనవరత్నము లందె న, నూనానందాద్భుతాబ్ధి నోలార్చె మమున్.

ఉ. ఎప్పుడు వచ్చు నల్లుఁ, డిఁక నెప్పుడు వచ్చును మిత్రవర్యుఁ, డిం
కెప్పుడు నేను వారి కెదు రేఁగి కొనంగుదు స్వాగతంబు? నా
కెప్పుడు వీనులం బడునొ యింపగు నచ్చటివార్తలెల్ల? నే
నెప్పుడొ యుబ్బఁగల్గు? టను నిట్టి త్వదుక్తులు మాకు దీవనల్.

క. మీయాశీర్వచనఫలం, బా యనఁగా నుంత వెనుకఁ బట్టెఁ బ్రయాణం;
బాయూరియుదంతము లా,ప్యాయముగా నాలకింప నగు సముఖమునన్.

చ. ఇది యటులుండె, ఔ!—కవన మిట్టి జనించెను మీకు నిప్పుడే!
యది యనుగాక భోజవసుధాధిపుఁ డయ్యెను మాదుకైత! మీ
పదమలనూత్నభావరసంపుఁగవిత్వము కాళిదాసుఁగా
నిదె మిము మార్చివైచె! భళి! 'యీశ్వరతత్త్వ మెఱుంగ శక్యమే'?

గీ. 'అక్షరము' లంచు 'వర్ణంబు' లంచు, నవ్వి 'తుల్యములె' యంచు నర్థంబు దోపకుండ
పొగడు తెగడులమధ్య మమ్ములను దూర్చి, యేము వ్రాసితి రొకపద్య మేర్చి కూర్చి.

సీ. 'కలగంటి' నని వ్రాసి కడుపుబ్బ నవ్వింపఁ, 'బెంకుటింటిని' గానుపింపఁ బ్రియమొ?
అద్వితీయకవిత్వ మది మీకు నుగ్గుపా, లయ్య 'సద్యఃకవి' ననుట ప్రియమె?
'కవివరుల్' మీ రని కలముబల్మి వెలార్చి, యంతగా మము మేలమాడఁ బ్రియమె?

చిం. సీ. రా.

అఱపొరల్లేని మాయన్నదమ్ములలోన, భేదభావంబు గల్పింపఁ బ్రియమొ;
తెలిసె మీపక్షపాతబుద్ధి యది యింక, నెఱుఁగలే మనుకొంటిరో యేము; మీరు
పెద్ద; లేమేమి యాడినఁ బ్రియమె; కాని, యింత నొడికారితనము మే మెందుఁ గనము.

చ. సుహృదయరత్నమా! పటునచోరచనాపరిపాటిమై గుణ
గ్రహణపరాయణత్వ మధికంబుగఁ దోఁపఁగ మిత్రబంధ్వను
గ్రహమున మాకవిత్వము పొగడ్త యొనర్చిన మిమ్ముఁ గూర్చి, యా
గ్రహపడఁబోలునో ముదముఁ గాంచఁగఁబోలునొ యానతీఁదగుఁ.

ఓ. వేం. రామశాస్త్రి.

శ్రీదేవాయ నమః.

పీఠికాపురము, 13-7-23

ఓకవీంద్రులార! యుభయులు నేకమై, నన్ను నెంటఁ జేసి నవ్వటాల
తోడ నాశుకవిత జోడించి వ్రాసిన, పద్యసప్తకంబు ప్రమద మొసగె.

మ. పదిరెండేఁడులు దాఁటిపోయెఁ గవితాబంధంబు నన్వీడి; నేఁ
డుదితం బయ్యె భవత్కృపాత్వపరనోద్యోగంబునం జేసి; దో
హదముంగూర్చిన మీకవిత్వ మలభోజాధీశుఁ డాటబ్రమే?
యిదిసత్యేతరమే? కవీంద్రులకు మీ కెట్లాడినం జెల్లదే?

క. పొగడో తెగడో యరసిన, నగపడియెడి; యేల యిట్టు లరమర సెందన్ ?
బిగిపీడరు, పెఱవారల, నగచాటులఁ బెట్టుచుందు రార! కవీంద్రుల్ !

క. కలగనుట కల్ల యగునొకొ! కలము బలిమియొక్కొ— మిమ్ముఁ గవివరు లనుటల్!
కలుగునొకో యఱపార లిఁక, తెలిసెను నాపత్సుపాతకమణ! బలారే!

చ. అఱపార లేల గల్గు హృదయంబు లభిన్నము లైనచోట? ని
ద్దఱకును గల్గువాసి విదితం బయినంత లిఖించినాఁడ; ని
త్తఱి నను వేలుసేత గురుధర్మమొ? పద్యము ద్వ్యక్తిఁ జేసి మీ
నెఱతనము న్వెలార్చితిరి! నేరమి చూపుట యిట్టిదే కదా!

చ. సుహృదయులార! బంధుకవచోమృదుభావవిచిత్రకల్పనా
వహ మగుమీకవిత్వమును వర్ణనచేసితి లోకధర్మసం
గ్రహమతిఁ దోఁచినంత; యధికంబుగ వర్ణనసేయుదాఁక నా
గ్రహవడఁ జెల్లునో ముదముఁ గాంచఁగఁ జెల్లునొ ముందు వ్రాసెదగున్.

క. ఇంతకు సంతకు మీ రరు, దెంతుసుగా కనుచు నెదురుతెన్నులు గనునా
కెంతయుఁ జింతవొడమె మీ "సుంత నెను కఁబట్టె" ననెడిసుద్ది గనంగన్.

న. వీ ర రా జు.

ఓమ్.

'Dunmore'
Madras.
15-7-23.

మామయ్యగారూ! మిత్రమా! కవీంద్రా!

నమస్కారములు:—

ఉ. 'ఇంద్ర'పదంబు మాకుఁ దగునే యటు లీయఁగ మీకుఁ బాడియే
సాంద్రవచః పటిష్ఠగుణసాగరు లౌటను మీరు మమ్ము ని
స్తంద్రత నట్లువల్కితిరి చాలు మము న్విమతించుపల్కు లా
'యింద్ర'త మీదె మీకవితయే ఘనదుందుభి యట్లు చాటగన్.

చిం. సీతారామయ్య.

ఓ. వేం. రామశాస్త్రి.

శ్రీశివాయనమః.

పీఠికానగరము 16-7-23

క్షేమము—కవిశేఖరద్వయమా!

చ. పదములు తోట్రుపాటుఁ గను, భావము తెక్కలు దాల్చు, నర్థసం
పద పరదేశ మేఁగు, సుకుమారత బేలతనంబుఁ గాంచు, బ
ట్టడవడ నొందు, ధార వెనుకాడు, నుదారత డిందుఁ, బాకమో
ముదురును గానఁ బ్రస్తుతము మూయుద మాశుకవిత్వలేఖినిన్. [ఫౌంటెన్ కలము]

నడకుదుటి వీరరాజు.

ఓమ్.

'Dunmore'
Madras.
18-7-23.

కవీంద్ర చంద్రమా!

నమస్కారములు.—

చ. పదములు తోట్రునుం గనవు; భావము తెక్కలుఁ దాల్పు; దర్థసం
పద మఱియెందుఁ బోదు; సుకుమారత బేలతనంబు రాదు; ప
ట్టడవడ గాదు; ధార వెనుకాడ; దుదారత పోదు; పాకమా
ముదురదు; కాని ప్రస్తుతము మూసితి మాశుకవిత్వ లేఖినిన్.

ఓ. వేం. రామశాస్త్రి.
చిం. సీతారామయ్య.

మూన్నాళ్లముచ్చట

(ఒక విమర్శనము)

ఆంధ్ర శేషగిరిరావుగారు

ఉ. 'కూర్చిన కూర్పులా? స్వరసగుంభనముల్; తేర్చిన తేనె.'......కవితాప్రసారమా?

ఇది యొక చిన్నిరసవత్ప్రబంధము. ఆంధ్రలోకమునకుఁ జిరపరిచితులగు శ్రీయుత వేటూరి ప్రభాకరశాస్త్రికృతము. 'ఈనాటివి యీనాఁటివియుఁగాఁ గథలఁ గల్పించి చినచిన్నకృతులు రచింపఁ' దలఁపుఁ గొని వీరు కూర్చి ప్రచురించినకూర్పులలో ఈ 'మూన్నాళ్లముచ్చట' తొలిమొగ్గ. ఈ కృతి మృదుమధురరచనాశోభితంబై, నీతిబోధకంబై రసవంతంబై, యలరారుచున్నది. ఇయ్యది చదువం జదువ రసజ్ఞులకు నోరూరక మానదు. ఇందలి కవిత్వము.— చవిగల ఆంధ్రప్రబంధరాజముల చక్కఁ జదివిచదివి యందలి అందచందముల రుచిపాం దెఱింగిన యభిజ్ఞుని రసోదంచితమును రామణీయకమును అగురచనముగాని 'కట్టెలమోపుకవిత్వపుకూఁత' గాదు. 'నేటి అంగడికవుల'పద్యముల వలె నెక్కుడు కుంటుపోక శ్రీశాస్త్రిగారి పద్యములు నిరర్గళధారాప్రవాహోపేతములై శబ్దసౌష్ఠవము గలిగి, మేలైనశయ్యతోఁగూడి యుచితరీతుల నొప్పారి, విందుఁగొల్పుచుండు తేనియతేటలు.

'నీతినింపారంగల్గిన ఈకథాసార మారసి 'ఆరంగూరినకూరిమిం జెలఁగు' తరుణదంపతులు మేలుగాంతురను ఉత్సాహముతో ఉన్నతాదర్శముతోఁ గవి దీనిని రచియించెను. 'చిక్కనైన' మేనిచెలువు గల్గిన ఎల్లియను 'క్రొవ్వుంజవ్వనముబ్బు' దాసి గుబ్బెత 'టక్కుంజెక్కులంజిక్కి' లేఁబ్రాయంపుఁ బెంజీఁకటిని మునిఁగి, 'పువ్విల్కానికిఁ గీర్తివిత్తమును గొల్లో'వుచున్న ఇల్లుఱేని నిల్లాలు తిలకించి మందలించుట ఇందలి యితివృత్తము. దీనిని గవి ముద్దులుమూట గట్టుపదరచనతో శ్రవణాభిరామముగా రచించి ధన్యుఁడాయెను.

"అనుకూలవతి; నాదుమనసులో వర్తింపు
కులకాంతె మది కెంత కుందునో కొక్కొ?"

అను ఏకపత్నీవ్రతుఁడగు ప్రవరాఖ్యుని మాటలకును, ధర్మపత్నియెడల ధర్మభ్రంశము గావించిన ఈయిల్లుఱేని దిగువవాక్యములకును గలతారతమ్యము చదువరులు కనుఁగొందురు గాక!

"శా. కంపింపక మన పిత్రు పెండ్లితొలి సంకల్పంబు "ధర్మ
ప్రజా, సంపత్త్యర్థ" మటంచుఁ జెప్పితిని దుశ్చిం
త్యైన కామేచ్ఛకై, దంపత్యమ్ము నిరాకరించు ఋషి
తాత్పర్యంబు గుర్తించియున్, దాంపత్యంపుఁ బవి
త్రతన్ జెఱచితిన్ ధర్మేతరప్రక్రియన్.

చ. తలఁచిన సిగ్గుగూరు శపథంబుగ 'నాతిచరామి' యం
చు నేఁ, బఱికితిఁ బెండ్లినాఁడు హితబంధుగురుద్విజ

వహ్నిసన్నిధిన్, దేవీయు నర్థముల్ దెలుపదీన్
దుక కీర్తు లనర్థ మయ్యెనో, యలఘుత రార్థముల్
గద మహర్షికృతంబులు గృహ్యధర్మముల్."

భర్త్రుపజ్ఞ కనులారఁ గనుఁగొని ఈయు ల్లాలు వెళ్లఁబోసికొనిన తలపోతలు వారివారి భర్తలకుఁ బరిచర్యలు సలుపఁబ్రాలుమాలు పెద్దయింటి ఆఁడపడుచుల కెల్లఁ జిరస్మరణీయ ములు.—

"శా. కా కేమున్నది నేనె వండవలెనా కావించితిం దప్పి
దం, జేకాలమ్మును భర్తృదాస్యమును నేనే యేల
చేయంగరా, దాసుల్ పోఁకలుసైత మీయవలెనే
యాదాసి యెల్లప్పుడున్, వ్వాకై చూడుమఁ గామశో
సలయుఁ గాదా భర్తృవాల్లభ్యమున్.

చ. ఎటేఁగి రొటెంగి యింటిపను లేయెడఁ జేయఁగఁ బ్రా
లుమాలి యుక్కఱ నిరుపూఁట వండుటయె కష్టము
గాఁ బసిబిడ్డ లేడ్చుచోఁ, దటి పరిదిద్దుకొంటక
పెతం బడుదుల్ బతి నెమ్మినమ్మి రే, మటి మటి
చూఁచి విడ్చితిని మానము ప్రాణము దాసియుండకన్."

అని చింతించుచుఁ జిఱుతసంతానంబుపై వ్రాలి తద్భావోద్రేకము మాన్ప నంతఁబతు కాంతను కాంతుఁడు చేరఁజీరి పిల్లల ముద్దా డునెపము వెట్టి చల్లఁగ సల్లాప ముపక్రమించి నాఁడు. అంత నాసాధ్వీమణి.—

"సీ. తల్లిఁ దండ్రి నక్క చెల్లెండ్ర నన్నద
మ్ములను విడిచి పుట్టినిలు త్యజించి
తమ్మె దైవ మనుచు నమ్మి వచ్చినదాని
నాఁడుదానిఁ దగునె గోడు కుడుప!

గీ. అత్త చేసినపనులకు నాఁడిదియును
మగఁడు చేసినపనులకు మాఱుఁ గలదె?
ఇతరులకుఁ జెప్పఁదగు గృహపతులె యిట్లు
మెలఁగఁజొచ్చిన ధర్మంబు నిలుచు టెట్లు?

క. సతు లెల్లప్పుడును బతి
వ్రతలుగ నుండవలె ననునిబంధము కలుగన్
బతు లెల్లప్పుడుఁ బత్నీ
వ్రతులుగ నుండవలె ననునిబంధము లేదో!"

అని సఁగని. గనరినది ఆపై నిల్లుఁడేఁడు ప్రేమ కొసర నారంభించినాఁడు. అత్తటి ముద్దుబిడ్డలు చేసిన చెద్దములను గవి యెంత మనోహరముగ, మంజులముగ, మార్దవముగ, నభివర్ణించెనో తిలకింపుఁడు.—

ఉ. "ఏడువకమ్మ! యేడువక యెత్తుకొనంగదె" యం
చుఁ దల్లితెం, టాకుమఁ జీరకొంచ గొని యత్రులం
తుడ్చుచు "నేడిపించుచు, న్నాఁడవు నేఁడు మాయ
మను నాయన! పోపొద" యంచు దూఱుచున్, వీడని
సిగ్గుఁ గూర్చెఁ దొలిబిడ్డఁడు చంద్రికిఁ దల్లి చెంగటన్.

వ. రెండవ నిసుంగును.

క. "ఆఁకలె యమ్మా! యాఁకలె
నాకన్నము పెట్టరావె"! "నాన్నా రా!" యం
చేకీభావముఁ గూర్చెను
గోఁకచెలం గిడ్డు చమ్మకును నాయనకున్.

ఉ. ఆరయ నాల్కగళ్లహృదయంబు లనంబను రెండు
రజ్జువుల్, కూరిమియన్ పురిం బెనఁగి కూడి యభేద
మునన్ రహింపఁగాఁ, జేరిన పెంపు దేన నిఁక వేర్ప
డకుండఁగ నేర్పడున్ సుతా, కారపుముళ్లఁ
ముళ్లకై యఖండసుఖోదయమూలకందమున్."

ఆషాఢమాసపు భారతియందు శ్రీ శాస్త్రిగారే రచించిన 'ముద్దుబిడ్డ'అను పద్య మును ఈసందర్భములో స్మరింపఁ జేరుకొను చున్న కుతూహలమును పెడఁద్రోయఁజాలక రసగుళికయనఁదగిన ఆపద్యరత్నమును తిరుగఁ దోడుచున్నాను.

"శా. దూరావం దిలకించి చిన్నగవులోఁ దోతెంచి
పాదమ్ములం దారోహించి మెంగమ్ము గాంచి
కయికో యల్లార్చి తాటించు చి, రోన్నరం గోరిక
లూర 'వె తికొను' వంచుం దొక్కుపల్కుడు న.

ల్లాసింబెల్లముఁ బుత్రుఁ జేకొననివాఁ డానంద మేమందునో?!"

'పుత్రగాత్ర పరిష్వంగ సుఖము' అల నాఁడు నన్నయకవియే దివ్యగాన మొనర్చి నాఁడు. నాఁటికి నేఁడు మరల శ్రీశాస్త్రిగా రత్తి అల్లారుముద్దుగా శ్రుతిహితముగాఁ బాడుచున్నారు.

'కుశేశయ కుట్మల కోమలము' లగు శ్రీశాస్త్రిగారి కవితాభూషలు ఆంధ్రభాషాయోష ఆదరణాతిశయములతోఁ దాల్చి మిన్నంది వన్నెకెక్కఁగలదు. పూర్వాధునిక కవితా పద్ధతులలోఁ తును బాఁతును బాగుగ నారసి రెండుపద్ధతులను సమ్మేళన మొనర్చి నూతనకావ్యరచనకు నవ్యసారస్వతమునందు మార్గదర్శకులైన ఆధునికాంధ్రకవిగ్రామణులలో శ్రీశాస్త్రిగారొకరు. వీరి 'మూనాళ్ళ ముచ్చటలో'—'అవ్వాఉట్టు, అరంగూరినకూరిమి, అల్లారుంబెల్లము, ఏలినవేర్మి, చిఱుబుస్సులు, అల్లిక బెల్లిక, అచ్చిక బుచ్చిక, మెతకమాటలు, అంజవేయుంచు,' మొదలగు నుడికారముగల తెలుఁగుపలుకుబళ్ళ మేళ్లరసి వాడియున్నారు. సజీవభాషకు ముఖ్యపరికరము లనఁదగిన సామెతలను—'వండనియన్నము వడుకనిబట్ట; గుడిసెకట్టఁడు జడివానఁ దడిసిగాని; ఏకువలెఁ జేరి మేకగుట;' మొదలగువానిని సందందుఁ బొందికగా నుపయోగించి సహజమధురమగు కవితకు సింగారము చిలికించినారు.

ఉన్నతకవితాచిహ్నము లగు ప్రసాదమాధుర్యములకు, ధారాశుద్ధికి, పరిపక్వశైలికి, నీచిన్నికృతి నిధానమై యున్నను, ఆవేశము, కథాసంవిధానము, పాత్రపోషణము, ఇందొకరవ్వ మఱుఁగుపడియున్నవని నాయభిప్రాయము. ముందుముందు వీరు రచింపఁబోవు కృతులలో వీనికిఁగూడఁ దగినంత ప్రాతినిధ్య మిచ్చి సారస్వతసుందరికిఁ గ్రొత్తావి హత్తింపదరుగాపుత మని వేఁడికోలు.

కాకతీయాంధ్రలక్ష్మి

శ్రీ శేషాద్రిరమణ కవులు

శ్రీ ప్రోలదేవ ధాత్రీనాథ విక్రమా,డంబరంబున జననంబునొంది
శ్రీ రుద్రదేవదోర్వీర్యవహ్నిజ్వాల,లల్లుకొన్నపుడు ప్రాయముగడించి
గణపతిదేవ విఖ్యాతవిక్రాంతిచే, సమధికైశ్వర్యముల్ సంతరించి
రుద్రమాదేవి నిర్నిద్రతేజంబుచే, నాంధ్రదేశంబెల్ల నాక్రమించి
అవల శ్రీమత్ప్రతాపరుద్రావనీశ, రాజ్యకాల శుభోదయారంభమందు
అ స్తమింపఁగవిధినీముఖాంతరమున, వ్రాసెనే! కాకతీయాంధ్రరాజ్యలక్ష్మి!

బ్రహ్మగీతము

చేపూరు సింహాచలం గారు

[గతసంచిక తరువాయి]

వేదశాస్త్రసిద్ధాంతమే లేదనియెడి
నాస్తికుండు లోకమున దుర్ణయములెల్లఁ
జేసి దుర్మార్గుఁడంచు ప్రసిద్ధినొందు
నిట్టి నాస్తికాభిప్రాయ మెడముసేసి
బ్రహ్మమున్నదని యెవఁడు భావమందు
నిశ్చయజ్ఞాన మొందునో నియతితోడ
వాఁడు ముక్తి నెందుకొఱకు వలయు సాధ
నంబులైనట్టి వర్ణాశ్రమంబులెల్ల
పాలనముసేయుకొఱకు సద్భక్తితోఁడ
మంచిమార్గమునే పోవ నెంచుచుండుఁ
గాన సన్మార్గుఁడను కీర్తిఁ గాంచు నతఁడు
శిష్యుఁడాచార్యుఁ జూచి ప్రశ్నించె నిట్లు
"పొందునా బ్రహ్మమున్ లేక పొందకుండు
నా యవిద్వాంసుఁ డంతంబు నందగానె?"
"బ్రహ్మను బడయునా లేక పడయలేఁడ
మరణమొంది విద్వాంసుఁడు?" మరియునొకటి
గలదు "బ్రహ్మసమత్వము గలది కాన
నెట్టివిద్వాంసుఁడై మరణించి తాను
బ్రహ్మమును బొందలేఁడొ విద్వాంసుఁడట్లు
బ్రహ్మమును బడయునా లేక పడయలేఁడ?"
అంతగురువనె నాకాశ మాదిగాఁగ
నఖిలమౌ జగద్రూపకార్యంబునకును
బ్రహ్మ కారణంబౌనని భగవతీయగు
శ్రుతివచించె సకలభూతతతికిఁ గార
ణంబయిన బ్రహ్మ వివిధరూపంబుగాఁగఁ
బుట్టవలెనంచుఁ దలఁచి తా నిట్టి సృష్టిఁ
జేయువిషయముఁ జక్కఁగాఁ జింతసేసి
ప్రాణికోటి కర్మానుసారముగ నామ
రూపములతో సృజించి యారూపమందుఁ
దాఁ బ్రవేశించియు వినెడిదానివలెను
దెలసికొనుదానివిధమున, దలఁచునటుల
చూచుదాని కరణిగాను దోచుచుండు
చేతనంబు బ్రహ్మయగు నచేతనంబు
బ్రహ్మమే యౌను, నిలయంబు బ్రహ్మ మనిల
యంబు బ్రహ్మ సుమ్ము, నిరుక్త మగును బ్రహ్మ
బ్రహ్మ మనిరుక్తమే యౌను, బ్రహ్మసత్య
మౌ నసత్యంబు బ్రహ్మమే యౌను గాన
పారమార్థిక సత్యమౌ బ్రహ్మమిటుల
భిన్నధర్మంబులను గల్గి పెక్కురూప
నామములతో జగతిఁ గానఁబడుఁ గాన
బ్రహ్మమే సత్యమౌనని బ్రహ్మవేత్త
తెలిసి నిశ్చింతతోఁ దాను మెలఁగుచుండు
బ్రహ్మయే కారణంబౌఁ బ్రపంచమెల్ల
సృష్టికిన్ ముందు రూపవిశేషరహిత
మైన యవ్యాకృతముగ నడఁగియుండి
సృష్ట్యనంతరంబునఁ దా విశేషనామ
రూపములతోఁడ సత్యస్వరూపముఁగల
దాయె, బ్రహ్మ యద్విధకారణాంతరంబుఁ

గాని సాధనాంతరమైనగాని కోర
కయె జగంబును గల్పించెఁ గాన నదియె
స్వప్రకాశంబు, నదియె రసస్వరూప
మిట్టి రసము ననుభవించియే కదయ్య
జీవి సుఖవంతుఁడగుచుండె శిష్య! నీకు
నీహృదంతరాళంబున నిర్వికార
మైన యానందరూపుఁడే లేనియెడల
ప్రాణనాది క్రియలఁ జేయ వలనుగాదు
సాధకుండగువాఁడు నాశరహితుఁడును
గతులచేఁజూచుట కలవిఁ గానివాఁడు
చెప్పుటకు వీలు లేనట్టి స్థిరయగుండు
నైన పరమాత్మయందు భయంబులేని
స్థితిని నెవ్వండు పొందునో స్థిరముగాఁగ
నప్పుడే వాఁడు భయములేనట్టిస్థితిని
బొంది యానందసాగరమందుఁ జేరు
ఆత్మయం దెవ్వఁడు ప్రతిష్ఠనందఁగలఁడొ
యట్టి విద్వాంసుఁడే బ్రహ్మమందుఁ జేరు
జననమరణ రూపమగు సంసారమునకు
బీజమైన "నీ, నా" యను భేదబుద్ధి
బడయు నాయవిద్వాంసుఁడు బ్రహ్మనొందఁ
జాలఁడని వేదశాస్త్రముల్ చాటుచుండె
పండితమ్మన్యుఁడైన విద్వాంసుఁడైన
వ్యావహారిక భేదంబు నాత్మయందుఁ
గాంచెనేని యాస్వల్ప మేకత్వబుద్ధి
నంతయును నాశనముచేసి సంతతభయ
హేతువైన జన్మాదులకెల్ల హేతు
వౌను జ్ఞానమున్ గల్గు దేవాదులకును
సంతతంబుగ నాత్మనిష్ఠానుభవము
దృఢతరంబుగఁ గల్గకుండెడి కతమున
భయముచేఁ బ్రవర్తింతురు నియతముగను
బ్రహ్మవల్లను గలిగిన భయముచేత
వాయుదేవుండును దివిజపతియు రవియు
జాతవేదుఁడాదిగసుర సంఘమెల్ల
తమకు నియతమైనట్టి కార్యములఁ జేయు
చుండిరి, తమను శాసించుచుండువాని
యాజ్ఞకును బద్ధులైయుంట యర్థమగును
అట్టిస్వప్రకాశానందమైన బ్రహ్మ
వివరమును దెల్పెదను నీకు వీను లలర
లౌకికానందమును బోలె లోకమందు
విషయసంబంధమైనట్టి వివిధభోగ
ములవలన జనియించెనా మున్ను చెప్పి
నట్టి స్వప్రకాశానందమైన బ్రహ్మ?
మటులకాక స్వాభావికంబానె? యనెడి
విషయమే చర్చగాఁదోఁచు వివిధగతుల
నిపుడు స్వప్రకాశానంద మిద్దియనుచు
నూహసేయుకొఱకు లౌకికోద్భవమగు
నట్టి యానందమును దెలియవలె మొదట
బాహ్యవిషయంబులెల్ల యౌవనముతోడ
మేలవంబౌటచేతనే భిన్నయగును
లౌకికానందమంతయు లోకమందు
జగతియంతయుఁ దనదు రాజ్యంబుగాఁగ
వజ్రసారసుదేహ సంపదను బొంది
దేహమానసపీడలన్ దెలియకుండ
యౌవనాది లావణ్యభాగ్యంబు గలిగి
సకలశాస్త్రపాండిత్య సరణిఁ దెలిసి
వినయవితరణంబులు స్వభావికముగాఁగ
సకలసంపదలింట నక్షయముఁ బొంద
మనసుఁగని కార్యముల్ సేయు మనుజు లుండ
త్యాగభోగంబులందు నుత్సాహముండ
సరససద్గుణంబుల నెఱజాణయగుచు

నుండు మనుజుని యానంద మొక్కటైన
మానుషానందమని యంద్రు మహాసివరులు
మానుషానందమే నూఱు మడుఁగులైన
నది మనుష్యగంధర్వ యానందమగును?
మనుజ గంధర్వులన్నఁ దా మాచరించు
పుణ్యకర్మలవలనఁ దపోబలమున
మనుజులై యుండి గంధర్వమహిమలెల్లఁ
బడయుదురు వారు మనుజులవలెఁ బరిమిత
శక్తులున్ గాక యణిమాదిశక్తులెల్ల
కరగతంబు లొనర్చి సుఖంబు లొందు
సాధనల్ గల్గియుందురు సకలవిధుల
మనుజ గంధర్వసమ్మోద మహితశతము
దేవగంధర్వమోదమై తేజరిల్లు
దేవగంధర్వుఁడనఁగ నా దేవలోక
మందు గంధర్వుఁడై జన్మమొందువాఁడు
దేవగంధర్వసమ్మోద భావశతము
గూడి యొకచిరలోక లోకుఁడగునట్టి
పైతృకానందరూపమై పరిఢవిల్లు
చాలకాలముండెడి లోకసరణిఁగాంచు
నతఁడె చిరలోక లోకుఁడౌనని వచింత్రు
అట్టి చిరలోకలోకుఁడై నట్టివాని
దైనయానందగరిమ నూరంతలైన
నదియె యాజాన దేవతా నందమగును
ఏది పితృలోకమునకును మీఁద నుండు
నట్టిలోకమే యాజాన మనఁగఁ జెల్లు
స్మార్తకర్మలం దెక్కు డాచరణఁ గలుఁగు
నతఁడె యాజానలోకమునందుఁ బుట్టు
నతని యానందశత మొక్కటైన నొక్క
కర్మదేవుని యానందగరిమయగును
అగ్నిహోత్రాది కర్మల నాచరించు
వార లాజానజులగు దేవతలకన్న
భోగభాగ్యంబు లెక్కువ పొందుచుంద్రు
కర్మదేవుని యానందగరిమ నూఱు
మడుఁగు లోకదేవతానంద మహిమయగు న
విశ్వజులు దేవతలపేర వెలయువారు
దేవతానందశత మొక్కటి దివిజపతికిఁ
గల్గుమోదంబునకు సరిగాఁగనుండు
శతశతముఖుల యానంద సంపదయది
దేవగురుఁడైన వాచస్పతి యొకఁడొందు
దివిజగురుని యానంద సందీప్తశతము
మూడులోకంబులే తనమూర్తియగు ప్ర
జాపతికి నొక్కయానంద సంపదయగు
శతగుణాధికంబౌచు ప్రజాపతికిని
గల్గునానందము హిరణ్యగర్భున కొక
శర్మమనుచు మన శాస్త్రంబె చాటు
చుండు, వ్యష్టి సమిష్టిరూపుండనియు హి
రణ్యగర్భుండనియును సూత్రాత్మ యనియుఁ
బ్రహ్మనే చెప్పుచుండిరి బ్రహ్మవిదులు
శ్రోత్రియుఁడు సదాచార సుశ్లోకుఁడగుచు
కోరికలులేనివాఁడైన కోవిదుండు
మున్ను చెప్పినవారి ప్రమోదమెల్లఁ
బొందఁగలఁడు ముహూర్తకికిఁ బొందఁగలఁడు
ఇంద్రియాతీతుఁడైన సర్వేశ్వరునెవఁ
డెఱుఁగునో వానికిన్ భయ మేలకలుగు
పుణ్యకర్మలఁ జేయకపోతి ననియు
నఘములేటికిఁ జేసితి ననెడిచింత
వానికుండునె? వాఁడెపో బ్రహ్మ, వాఁడు
బ్రహ్మవిషయికానందానుభవము నొంది
బ్రహ్మగీతంబు హాయిగాఁ బాడుకొనుచు
సకలలోకముల్ దానైన సరణిఁ దెలిసి
నిర్మలానందసందోహ నిలయుఁడగును.

ప్లీడరు పట్టు

పానుగంటి లక్ష్మీనరసింహారావు గారు

"అబ్బే! చెప్పినప్పుడు రవంతవినవలయును. ఒక్కటే యేడుపా? ఎల్లకాలము తల్లిదండ్రు లుట్టికట్టుకొని యూఁగులాడుదురా? ఆయన కేమి? మహాఅదృష్టవంతుఁడు అనాయాసముగా వెళ్లిపోయినాఁడు" అని సుందరరామయ్య, గదిలో నేడ్చుచున్న భార్యను గదిగుమ్మమునొద్దఁ గూరుచుండి యోదార్చుచున్నాఁడు. ఇంతలో సుందరరామయ్య కొడుకు కటకువచ్చి 'నాన్నా! ఎవరో ప్లీడరుగారఁట! నిన్నుఁ జూడవచ్చి వీథిగుమ్మములో నున్నా"రని చెప్పెను "ప్లీడరు నాయింటి కెందులకురా? ప్లీడ రొకఁడు పోలీసువాఁ డొకఁడు నాగుమ్మములో నడుగుపెట్టవలసినపని యేమున్నది? ఏతగవునకైనఁ బోయినవాఁడనా? ఏనేరమునైనఁ జేసినవాఁడనా? మామగారు చచ్చిపోవుటచే మతిపోయియున్న నన్నుఁ జూచుటకుఁ బ్లీడ రెందుకురా?" యని లోలోన సుందరరామయ్య గుండెలదఱ గొణఁగుకొనుచుండనింతలో "సుందరరామయ్యఅన్నగారూ! నమోనమః" యనుచు న్యాయవాది యేలోనికి వచ్చెను. సుందరరామయ్య లేచి జగ్గన్నశాస్త్రిని జాపపైఁ గూరుచుండఁబెట్టెను. వారిద్దఱు మాటలాడుకొనుచుండిరి.

జగ్గ:—మీమామగారు స్వర్గస్థులగుటచే మిమ్మును మావదినెగారిని బరామర్శించుటకు వచ్చితిని.

సుంద:—మీ రెన్నఁడు మాయింటికి దయచేయలేదే! నేఁ డెంత శ్రమ తీసికొంటిరి? మీకుమాయందింతదయయని నేనెఱుఁగను.

జగ్గ:—అన్నా! ఎవరిదారిని వారు సుఖముగా నున్నప్పు డొకరినొకరు చూడకపోయినను బాధలేదు. ఏదో రవంతచిక్కు తటస్థించినప్పుడే యొకరినొకరు పలుకరించుకొనవలయును. దినములు వెడలిపోవువఱకు మీరు మావదినయు చేబ్రోలులోనుండి మొన్ననో నిన్ననో యిక్కడకు వచ్చితిరి కాఁబోలు.

సుంద:—నిన్ననే వచ్చితిమి.

జగ్గ:— మీ రక్కడనుండఁగా మామగారి మరణశాసనముఁ గూర్చియు దత్తస్వీకారమునుగూర్చియు దత్తునితల్లిదండ్రులతో మీ కేమైన మాటలు జరిగినవా?

సుంద:—ఏమియు జరుగలేదు అత్తగా రిదివఱకే లేదయ్యెను. మామగా రిప్పుడు లేకపోయిరి. ఆయనకు సోదరులెవ్వరు

లేరయ్యెను. మాతో మాటలాడువా
రెవ్వరు?

జగ్గ—దత్తునితండ్రి పట్టిమారీచుఁడు. వాఁడే
యీతంత్రమంతయుఁ జేసినాఁడు. వానిని
జిట్టినారకమ్మువలెఁ జీల్చిననైనఁ బాపము
లేదు.

సుంద:—ఎవరిపాపమున వారు పోవుదురు.
మాకాగొడవయేమియు నక్కఱ లేదు.
మాకుఁ దినుటకు సమృద్ధిగా నున్నది.
మాకీకుఱ్ఱవాఁ డొక్కఁడే. ఏది యేమై
పోయినను మాకుఁ జింత లేదు.

జగ్గ:—అన్నా! పరమ వేదాంతిలాగున నున్నావు.
నీకొడుకాతని దౌహిత్రుఁడు. అతనిమూఁడు
లక్షలరూపాయలసొత్తు నీతనికి న్యాయ
ముగా రావలసియున్నది. నీకొడుకుభాగ్య
వంతుఁడగుట నీ కిష్టములేదా యేమి?
సత్యకాలపుమాటచెప్పుచున్నావు! నీకొ
డుకుహక్కును జెడఁగొట్టుటకు నీ కేమి
యధికారమున్నది? నీవూరకుండినను నింక
రెండేండ్లలోఁ బెద్దవాఁడై నీకొడుకే
వ్యాజ్యమువేసి తాతగారియాస్తిని సంపా
దించుకొనును.

సుంద:—వాఁడు పెద్దవాఁడైనప్పుడే యట్లు
జరుగునుగాక. నేనీగొడవలోదిగను

జగ్గ:—ఆలస్యమైనకొలఁది వారికి బలము
హెచ్చును; మనకుఁ దగ్గును; ఉన్నదంతయుఁ
జరాస్తి; దాఁటిపోవునెడల రాఁబట్టు
కొనుట కష్టము. బ్యాంకులోనున్నసొమ్ము
దత్తునిపక్షపువారి కీయఁగూడదని దాని
యేజెంటుకు కోర్టువారియాజ్ఞ పంపవలసి
యున్నది. రిసీవరునునియమించి యింటిలో
నున్న వెండిబంగారువస్తువులయొక్కయుఁ
బత్రములయొక్కయు జాబితా వ్రాయించి
యాసొత్తును గాపాడవలసియున్నది. దత్త
స్వీకరణకృత్యమును జేయించిన పురో
హితుని మనపక్షమున కాకర్షింపవలయును.
ఆకాలమందు మరణశాసకునికి స్మృతి
లేదని యప్పటివైద్యునిచే మనపక్షమున
సాక్ష్యమిప్పింపవలయును. ఇంక నెన్నియో
జరుగవలసియున్నవి.

సుంద:—ఆయన యథార్థముగాఁ బెంపుచేసి
కొన్నాఁడేమో! నిజానిజములు భగవంతు
నికిఁ దెలియవలయును. నాభార్య కీయవల
సినదేమో ఆయన యిదివఱకే యిచ్చి
నాఁడు. ఆదత్తతనిజమేమైయుండవచ్చును.
కాక, యసత్యమే కానిండు. వ్యాజ్యము
లోనికి దిగి నే నీబాధలన్నియుఁ బడఁ
జాలను. మా కాసొమ్ము ప్రాప్తి లేకపోవు
టచే నట్లు జరిగినది. ఏదో వ్యవసాయము
చేసికొని పదిగరిసెలు పండించుకొని నే
నొకనిఁ జూడకుండ నన్నొకరు చూడ
కుండఁ గాలక్షేపమును జేయుచున్నాను.
నేను బుట్టినతరువాతఁ దగవనునది యెఱు
గను. నాదినము లిట్లు వెడలిపోనిండు.

జగ్గ:—అన్నా! నీకేమియు శ్రమమక్కఱ
లేదు. అన్నిటికి నేనున్నాను. చేవ్రాలు
చేయుమని నీకుఁబంపిన కాగితములమీఁదఁ
జేవ్రాళ్లుచేసి నాకుఁబంపుము. మూఁడు
నిముషములలో నీపెంపు కొట్టివేయించి
నీకొడుకును గుబేరుని జేయకుండు నెడల
నన్ను జగ్గన్నశాస్త్రి యనిపిలువవలదు.
చూచుకో నాతమాషా. జగ్గన్నశాస్త్రి.

పట్టిన వ్యాజ్యెమున కెన్నడైన నపజయముండెనా? పెట్టుబడిపెట్టుటకు నీయొద్ద సొమ్మున్నదా సంతోషమే. లేదా నేనే పెట్టుబడి పెట్టవలెను కాని, అన్నా! నీమొగముమీఁదఁ గొంతసందేహము పొడకట్టుచున్నది. నే నింత పెట్టుబడిపెట్టి నీపక్షమున నింతయభిమానముతో నేల పనిచేయుటకుఁ బూనుకొనవలయునా యని నీమనస్సునఁ గలిగిన సందేహము నీనుదుటిపైఁ గనఁబడుచున్నది. నీ కట్టి సందేహముకలుగుట న్యాయమే. నాయభిమానమునకుఁ గారణ మేదో చెప్పెదను వినుము. నా కొక మేనగోడ లున్నది. అది తండ్రిలేనిపిల్ల. నేనే దానిని పెంచినాను. దానిని నీకుమారుని కీయవలయునని సంకల్పించుకొంటిని. తండ్రి లేదన్న లోపము తక్క దానికేమియు లోపము లేదు. దానితల్లియొద్ద నలుబదివేలరూపాయలు గుల్లలున్నవి. దానికిఁ బదివేల రూపాయలు బాలతొడుగున్నది. తండ్రి సంపాదించినది కొంతవిరివిగా నేనే వడ్డికిఁ ద్రిప్పుచున్నాను. తగిన యింటిలో దానిని బడవైవవలయునని చూచుచున్నాను. ఇందుచే నే నింతగాఁ బ్రాకులాడవలసి వచ్చినది. ఈయపేక్షయే నాకు లేనియెడల నీవు నాకెంత అవంటివాఁడవే. జమీందారులు నాయింటియరుగులమీఁదఁ లఁ బడి నా దర్శనమునకై వేచియుందురు. అట్టినేను నీ యింటికిఁ దండ్రిలేనిపిల్లక్షేమము నపేక్షించి వచ్చితిని.

ఈమాటలతో సుందరరామయ్య మోము తెల్లబడెను. అతనికొడుకు సుబ్బరామయ్యమోమెఱ్ఱబడెను. తలుపు చాటున నుండి లటుకున నీవలకుఁ బొటకరించిన సూరమ్మమోము సరవెల్లివలె నేరంగు గలదో చెప్పుటకు వీలు లేకుండెను. ఈ సన్నివేశమును జూచిన జగన్నశాస్త్రి "మెత్తబడు చున్నాఁడు. నా మేనగోడల నీ ముండకొడుకున కిచ్చెద నని యాసపెట్టుకొని యున్నాఁడు. వీనికన్న ముప్పదిపుట్ల మాగాణి నెటులైన హరించుటకే నాప్రయత్న" మని



తనలోఁ దనుకొనియెను. అంత సూరమ్మ తన మొగమును దిరిగి తలుపుచాటున నుంచుకొని "వారు భాగ్యవంతులు. మావంటి వారికిఁ బిల్ల నిచ్చెదరా ?" యని సన్న సన్నగఁ బలికెను. "సూరమ్మవదినా? మీ భాగ్యమున కిప్పుడు లోపమేమి? నీకొడు కెంత లక్షాధికారి కావలసియున్నాఁడో! అదిగాక యింకొకపరమార్థమైనమాట; నాకుమాత్రము కొడుకా కొమ్మా? పదిమంది కాపురమున్న యింటిలోఁ రుచుండి చెప్పుచున్నాను. నా మేనగోడలు మగఁడే నాకుఁ గొడుకుకాఁ గూడదా? ఏమో! ముందు జరుగఁబోవు నీమాట లిప్పుడెందులకు? ఏమియునలదు. అన్నా! నేనుబోయెదను. వదినా! సెలవు. అబ్బాయీ! మనయింటికిఁ బెండ్లికూఁతును జూతువుగాని రావోయి" యని పలుకుచుఁ బిల్లవానిని గుఱ్ఱపుబండిలోఁ గూరుచుండఁ బెట్టి తనయింటికి దీసికొనిపోయెను.

౨

సుందరరామయ్య కింట నిలువసొమ్ము లేకుంటచే నారంభము మొదలుకొని చివరవఱకు వ్యాజ్యమునకు న్యాయవాదియే పెట్టుబడి పెట్టవలయుననియు నాసొమ్మంతయు నూటికి రూపాయ యెనిమిదణాలవడ్డితోఁ దానిచ్చెదననియు భార్యప్రోత్సాహమున, ఖరారునామా వ్రాసి రిజిస్టరిచేయించి యాతఁడు ప్లీడరుచేతఁ బెట్టినాఁడు. ఇంక నెన్నియో పట్టికాగిదములకుఁ గ్రిందఁ జేవ్రాళ్లుచేసి ప్లీడరుచేతి కిచ్చినాఁడు. న్యాయవాది నిరంకుశముగా వ్యాజ్యమునకుఁ బూర్వరంగప్రయత్నములను జేయుచున్నాఁడు. సంవత్సరమైనది. రెండుసంవత్సరములైనది. మూఁడుసంవత్సరములైనది. ఎంతసొమ్మిదివఱకు వ్యయమయ్యెనని సుందరరామయ్య యొకప్పుడడుగ "సుందరరామయ్య అన్నా! ఎంతసొమ్మయిన నేమి లెక్కయయ్యా గ్రంథముజరుగనీయవయ్యా!" యని న్యాయవాది పిసుగుదలతోఁ బలికినాఁడు. తనతండ్రిసొత్తు మూఁడులక్షలరూపాయలు తనకు వచ్చునని సూరమ్మ సంతసించుచున్నది. చిలుకవంటిపిల్ల ప్రక్కలోనికి వచ్చునని సుబ్బరామయ్య సంతసించుచున్నాఁడు. చేతికి ముష్టిచెంబు వచ్చునేమోయని సుందరరామయ్య యేడ్చుచున్నాఁడు. పక్షి మాత్రమేమిచేయఁగలఁడు? ఇట్లు కొన్నిదినములు గడచినపిమ్మట జగ్గన్నశాస్త్రి సుందరరామయ్య యింటికి వచ్చి సబుజడ్జిగారికిఁ బ్రతివాదు లిరువదివేలు లంచమిచ్చుటకు మాటలాడుచున్నారు. నేను ముప్పదివేలిచ్చి న్యాయమూర్తిని మన ప్రక్కకు లాగి ప్రతివాదినోట బెడ్డకొట్టినానని చెప్పెను. ఆమాట విని సుందరరామయ్య నెత్తినోరుకొట్టుకొని యేడ్చెను. "ఇదివఱ కెంతవ్యయమైనదో చెప్పవయ్యా!" యని న్యాయవాదిని బట్టుదలతో నడిగెను. "అన్నా! నీవేమియు మాటలాడ కూరకుండుము. అన్నిటికి నేనున్నాను. చచ్చుసొమ్ము. ఎంతవ్యయమైన నేమి? మనము పట్టినపట్టు నెగ్గవలయునని చూడఁదగినదా మఱియొకటియా?" యని న్యాయవాది సుందరరామయ్యను జీవాట్లుపెట్టి గిరుక్కున నింటికిఁ బోయెను.

3

ఒకనాఁటి రాత్రి సుందరరామయ్యను జూచుటకు గంజాముజిల్లానుండి యొకమిత్రుఁడు వచ్చెను. ఆయనతోఁ సుందరరామయ్య తన సోదెయంతయు వెడలఁబోసికొనెను "అయ్యయ్యో! ఈప్లీడరు నీకెక్కడఁ దాపురించినాఁడయ్యా! ఇతఁడు కొంతకాలము మాజిల్లాలోఁ బ్లీడరీ వెలుఁగఁబెట్టినాఁడు. అక్కడ నీతఁడెందఱు మొఖాసాదారులకు ముష్టిచిప్పచేతికిచ్చినాఁడు! ఎందఱుసంసారిణులను ధనమానములుహరించి పూటకూటింటివారిఁగఁ జేసినాఁడు! ఎందఱు సంసారులను దిబ్బమీఁదఁ గూరుచుండఁబెట్టినాఁడు! ఈతఁ డక్కడఁ ద్రవ్వినగోఁతు లింకఁ బూడినవా? వేసినముళ్లింక విడినవా? అంటించిన కొంప లింక నాఱినవా? కోసిన కోఁత లింక మానినవా? అక్కడ నింక నున్నయెడల నొడ్డమోటుప్రజలు చంపుదురేమో యనుభయముచే నిక్కడకు వచ్చినాఁడు. ఈతనిని నీవు వదల్చుకొనిన యెడలఁ గాని దక్కవు. సామాన్యసంసారివి నీలెక్కయేమి? పాదుషానైనఁ బదిరోజులలోఁ బకీరును జేయఁగల పండితుఁ"డని చెప్పెను ఆమాటలు విని సుందరరామయ్య తలపై రెండు చేతులతోఁ గొట్టుకొని. "నాయనా! ఏనేటిశని పట్టుకొన్నయెడల దానధర్మములుచేసి వదల్చుకొందును రోగమేదైనఁ బట్టుకొన్నయెడల మందుమాకులచే వదల్చుకొందును. పిశాచము పట్టుకొన్నయెడల మంత్రములచే వదల్చుకొందును. కాని జగ్గన్నశాస్త్రిపట్టెట్లు వదల్చుకొనవలయునో నాకుఁ దెలియకుండ నున్నది. ఏదైన యుపాయము నీవే చెప్పు"మని యాతని బతిమాలుకొనెను. "నేను దత్తుని తల్లిదండ్రులతోఁ మాటలాడి వచ్చెద"నని చెప్పి వారితోఁ మాటలాడి మఱునాఁడు వచ్చి "సుందరరామయ్యగారూ! మీప్రతివాదులు మీభార్యకుఁ బదివేలరూపాయ లిచ్చెదమనుచున్నారు. ఇఱువది వేలిమ్మని బేరమాడితిని. తుదకుఁ బదునైదువేలకు వారి నొప్పించితిని ఇది మీ కిష్టమా?" యనిచెప్పెను. "ఇంతకంటెఁ గావలసిన దేమి.? పదివేలైనను మాకుసంతోషమే. ఏలాగైన నీన్యాయవాది మమ్ము వదలుట మాకుఁ గావలసినది. ఇతఁడు మాకు మృత్యువువలె దాఁపురించినాఁడు నీవుపోయి "ఉభయకక్షులవారు సఖ్యపడినారు. కావున నావ్యాజ్యము నేనింక నడపఁదలఁచుకొనలేద"ని యాతనితోఁ నామాటలుగాఁ జెప్పి నన్ను బ్రదికించి పుణ్యముకట్టుకొనుమని మిత్రుని యాచించెను. అటులేయని యాతఁడు ప్లీడరు నొద్దకుఁ బోయెను.

౪

మఱునాఁడు సుందరరామయ్యయు జగ్గన్నశాస్త్రియు నిట్లుమాటలాడుకొనుచుండిరి.

జగ్గ:—అన్నా! నీకేమి మతిలేదా? చచ్చు పదునైదువేలా? రావలసినమూఁడులక్షలలోఁ బదునైదువే లెన్నవవంతో యెఱుఁగుదువా? ఛీ! పదునైదువేలా? ఈవ్యాజ్యములోఁ నొక్కపురోహితపుబాపనయ్యకుఁ బదునాఱువేలు గిఱగిఱద్రిప్పి యెడమచేతితోఁ బాఱవైచి వానిని మనవైపునకుఁ ద్రిప్పితిని. దత్తస్వీకరణకాలమందు

మీ మామగారికి స్మృతిలేదని మనపక్షమునఁ బలుకుటకు వైద్యునికిఇరువదివేలానపెట్టి పండ్రెండువేలిచ్చితిని. రేపు సాక్ష్యముచెప్పుటకు బోనెక్కు సమయమందు మిగిలిన యెనిమిదివేలు వానిమొగానఁ గొట్టెదను. ఇంక నెందఱెందఱి కెంతెంత యిచ్చితినో నీవెఱుఁగుదువా? ఈయవాంతరపుగోడవయంతయు నీకుఁ దెలియవలసినపని యేమున్నది? నే నెన్నిపాట్లుపడుచున్నానో నీవెఱుఁగుదువా? నారక్తమింతకొఱకు ధారపోయుచున్నానని నమ్ముము.

సుంద:— ధారపోయుచున్నది నీరక్తముకాదయ్యా నాది. నన్నింతటితోనైన వదలిపెట్టుము. ఇక మీరెవ్వరికిని నావ్యాజ్యముకొఱకు సొమ్మీయవలదు. ఇంక నారంభమేలేదు. అప్పుడే డెబ్బదివేలు దాఁటినట్లగపడుచున్నదే. అయ్యో! అయ్యో! నాకొంప మునిఁగిపోయినదోయి భగవంతుఁడా! (చింతించును)

జగ్గ:— అన్నా! అన్నా! అధైర్యపడవేల? ఛీ! తప్పుకాదా! నీకేమియు భయములేదు. దిగ్విజయమొనర్చుటకు నే నున్నాను. డెబ్బదివే లొకలెక్కయా? ప్రతివాదులను లొంగఁదీయుటకు నే నెట్లు పనిచేయుచున్నానో నీకు వ్యవహారజ్ఞానమున్నయెడలఁ దెలిసికోఁగలవు? మీమామగారు వ్రాసినది దొంగమరణశాసనమని నిర్ధారణపఱచుటకు నే నొకలోకోత్తరమైన చమత్కార మొనర్చినాను. యిప్పుడు అదే పూర్తిచేసి యిక్కడకు వచ్చితిని. మీ మామగారియొద్దనున్న యొకలేఖరిని మనపక్షమునకు లాగి వానివ్రాఁతతో దరిమిలా తేదీగల యొక మరణశాసనము సృష్టింపించినాను. ఆమరణశాసనములో యావదాస్తియు నీభార్య కిచ్చినట్లు వ్రాయించినాను. దానిలోఁ బూర్వమరణశాసనమును గూర్చియు దత్తతను గూర్చియు నేమియు నుదాహరి పలేదు. అందుచేఁ బూర్వమరణశాసనమున్నదే అది కేవల కల్పితమని కోర్టువారికిఁ దోఁచకతప్పదు. తెలిసినదా? ఇంతటితోనైనదా? మరణశాసనమును సృష్టించినందులకు దత్తుని తల్లిదండ్రుల నండమానుదీవులకుఁ బంపింపకుండ నే నూరకుందునా?

సుంద:— (గుండెలు కొట్టుకొని) అయ్యో! అయ్యో! నాభార్యపేర మరణశాసనమును సృష్టిచేయించితివా? మమ్ము నేరములలోఁగూడ దింపి కారాగృహమున నుంపఁదలఁచితివా? అయ్యో! అయ్యో! ఎంతకర్మముపట్టినది. (ఏడ్చును)

జగ్గ:— అన్నా! నీ వేమియు మాటలాడకు. ఎక్కడనో అసందర్భపుమనుష్యుఁడవు! ప్రాణప్రదమైనరహస్యముకదా! అట్లు నోరు చేసికొందువేల? బుద్ధిలేదా? నావలన నీపనిజరిగినదికాని లక్షరూపాయలిచ్చిననైన మరియొకఁడాపని చేయింపఁగలఁడా? 'శ్రీరాములు మొదలుచిత్తగింపవలయును'

వఱకునంతయు నేఁబదియైదువేలతోఁ గ్లుప్తముగాఁ గడతేర్చినాను. నీ క్షేమము కొఱకుఁ జేసినపని యేదో కూడ గ్రహింపలేక యట్లు మొత్తుకొందు వేల?

సుంద:—అమ్మయ్యో! తిరిగి 55 వేలా? నాయనా! నాప్రాణమైన మిగుల్తువా లేదా? మీరు నాకొఱకేమియుఁ జేయవలదు. నేను బ్రతివాదులతో సఖ్యపడినాను. వ్యాజ్యము వదలుకొన్నాను. మీరు దయయుంచి నన్నింతటితో వదలిపెట్టుఁడు.

జగ్గ:—జగ్గన్నశాస్త్రి వెఱ్ఱిముండకొడుకని నీయభిప్రాయము కాఁబోలు. న్యాయవాది సింహమని నమ్ముము. ఇదివఱకు, నేనుబట్టిన వ్యాజ్యములలో విజయమొందితినే కాని కక్షిదారునితో నెన్నఁడైన తుచ్ఛమైన రాజీ కంగీకరించితినా? నేనెప్పుడైన నట్టి పౌరుషహీనమైనపని చేసితినా? నాపరువును బ్రతిష్ఠను నీవు చూడ నక్కఱలేదా? ఇటున్నసూర్యుఁ డటుపొడిచిన నరే వ్యాజ్యమేదో డిక్రీవఱకు నడవవలసినదే కాని యీ నపుంసకపురాజీనామాకు నే నంగీకరించెదనా? నీకేమి? పదివేలు వచ్చునని తోఁచినయెడలఁ బ్రతివాదితో సఖ్యమున కొడఁబడుదువు. నే నట్లొడఁబడుదునా? కోటిరూపాయలు విలువ చేయఁగల నాకీర్తిని నీకొఱకు గంగలోఁ గలుపుకొందునా? షాలాత్ముఁ డడ్డపడిన నరే వ్యాజ్యము జరుగవలసినదే.

సుంద:—అయ్యా! నాకుఁ దెలియక యడుగుచున్నాను వ్యాజ్యము నాకొఱకా మీకొఱకా?

జగ్గ:—అదే బుద్ధిహీనమైనమాట. నేను నీ పక్షమున వకాలత్నామా యెప్పుడు తీసికొంటినో యప్పుడే యంతయు నాదే. నీ వూరక నిమిత్తమాత్రముగనుండఁదగినదే.

సుంద:— నిమిత్తమాత్రముగా నున్నందులకుఁ బ్రాయశ్చిత్తమైనదికాదా! వ్యాజ్యము మొదటివిచారణయైనఁ గాలేదు. అప్పుడే లక్షపాతికవేలు కాఁబోలు నా నెత్తిని రుద్దినారు. ఇఁక నా కక్కఱలేదు. నేను వ్యాజ్యమును వదలుకొన్నాను! బాబూ! రక్షింపుము.

జగ్గ:—వదలుకొనుటకు నీయిష్ట మనుకొంటివా? వ్యాజ్యము కడవఱకు నడపవలసినదనియుఁ బెట్టుబడి యంతయు నేనుబెట్టవలసినదనియు నీవు నా కొడంబడిక వ్రాసి రిజిస్టరిచేసి యీయలేదా? ఇప్పుడు నీ విట్లు గింజుకొనినంతమాత్రమున నాబంధము నిన్ను వదలునా? నీవు నీయొడంబడికకు వ్యతిరేకముగా నడపఁ బ్రయత్నించినందులకు నిన్ను "క్రిమినల్"లోనికీడ్చి యెంతపనియైన నేను జేయలేనా? కాని జగ్గన్నశాస్త్రి అపకారి కాఁడు. భూతదయగలవాఁడు. స్వార్థపరిత్యాగి. అది సిద్ధాంతమైనమాట. గాంధిటోపీలు పెట్టుకొని యింతమంది ప్లీడర్లు వృత్తులు మానుకొన్నారుకదా! నే నట్లు మానుకొంటినా? ఎందుకు మానుకొనలేదు? ప్రజాక్షేమము

కొఱకు, లోకోపకారముకొఱకు. నేను వకాల్తీ తీసుకొనుటయే తమకు మహాగౌరవమని జమీందారులు నాకొఱకుఁ బడికాపులుపడుచుండ నన్ను వదలుకొందునని మొత్తుకొందువేల? ఇంతనిర్భాగ్యతయున్నదా?

సుంద:—నాయనా! ఈవ్యాజ్యము వచ్చిన తరువాతనే నా కీనిర్భాగ్యత కలిగినది. అన్నమునకుఁ గూడ మొగము వాచి ముష్టి యెత్తుకొనవలసివచ్చునేమో యని మిమ్ము నేను వదలుకొనుటకుఁ గారణమైనది.

జగ్గ:—సరే. నీ వంత మొత్తుకొను చుండగా నడుమ నాకేల? నాసొమ్ము నాకిప్పుడిచ్చెదవు? లక్షపాతికవే లిదివఱకు వ్యయమైనది. నాఫీజు - సాటిబ్రాహ్మణుఁడవు కావున - పాతికవేలకంటె నెక్కువ తీసుకొనుట ధర్మముకాదు. మనకు ధర్మము ప్రధానముకాని ధనముకాదు. ఏదో చేతిసొమ్ముపెట్టితిని గావునఁ దిరుగ నడుగవలసి వచ్చినది. కాని నే నట్లడిగెడివాఁడను గూడఁగాను. ప్రస్తుతము సొమ్మునకుఁ జాల నిక్కచ్చిగా నున్నది. నా సొమ్మంతయు మొత్తముగా రేపే యీయవలయును.

సుంద:— అయ్యయ్యో! నే నొక్కసారి యీయఁగలనా? ప్రతివాదు లీయవలసిన పదునైదువేలు తెప్పించి రేపిచ్చెదను. తరువాతఁ గ్రమముగాఁ దీర్చుకొందును.

జగ్గ:—ప్రతివాదు లిచ్చినారు. నీవు పుచ్చుకొన్నావు. ఆసంగతి చెవిని యిప్పుడు నేను వినియే వచ్చినాను. నాకాసంగతియేమియు నక్కఱలేదు. నా సొమ్ము నా కిచ్చి మఱి మాటలాడుము.

సుంద:—నాయొద్ద సొమ్ములేనిదే.

జగ్గ:—లేదు లేదని తెగనీల్గెద వేల? ముప్పదిపుట్ల మాగాణి పెట్టుకొని బీదయఱపు లఱచెద వేల?

సుంద:—అయ్యయ్యో! ఆభూమి తాకట్టుపెట్టుమందువా?

జగ్గ:— తాకట్టా! నీ మొగము! ముప్పదిపుట్లు కూడ నమ్మిన నెడల లక్షరూపాయలకంటె నెక్కువ

వచ్చునా? ఆ భూమి యూస యిఁక బెట్టుకొనకుము. అది పోయినదన్నమాటయే. మిగిలిన యేఁబదివేలమాట యేమిరా భగవంతుఁడాయని నేను దేవులాడుచుండగాఁ దాకట్టుపెట్టదనని చేబదులు తెచ్చెదనని బుద్ధిహీనమైనమాటలాడెదవేల?

సుంద :— అటులైన నన్నిప్పు డేమిచేయ మందురు?

జగ్గ :— ఒకఁడు చెప్పనేల? ఆభూమి నాపేర వ్రాసియిమ్ము. మిగిలినసొమ్మునకుమావదినె యొడలిమీఁద గుల్లగుట్ర యింటిలో వెండి పాత్రసామాను మొదలగునవి నాపరము చేయుము. ఇట్లు నేను స్వాధీనపఱచుకొందును. ఆచింత నీకక్కఱలేదు. ఇంతకన్న వేరే యాధారము కనఁబడకపోవునప్పుడు నీ వేమిచేయగలవు? నేనేమిచేయఁగలను? నీభూమి నీభార్యనగలు పుచ్చుకొనవలసి వచ్చెనే యని నేను లోపల నెంత యేడ్చుచున్నానో ఆపరమాత్ముఁడే యెఱుఁగును.

సుంద :— ముప్పదిపుట్లభూమి. నిక్షేపమువంటిది. బహిరంగముగా నమ్మినయెడల రెండు లక్షలువచ్చునేమో? మీసొమ్ము మీకుఁ బోఁగా నేఁబదివేలు నాకు మిగులును. వానితోఁ బొట్టఁబోసికొందును. నన్ను రక్షింపుము. ఇవి చేతులు కావు.

జగ్గ :— నే నేయుద్దేశముతో నీభూమి రెండవ కంటివానికిఁ దెలియకుండ వ్రాసియిమ్మంటినో దానికిఁ గారణము నీవెఱుఁగకున్నావు. ఇందులోఁ బరమార్థమేమనగా, సృష్టించిన కాగిదములు బోలెఁడున్నవి. అవియన్నియు నీవు నాకిచ్చినట్లేకదా. నీ వీయకుండినయెడల నాకెట్లు రాఁగలవు. వానినిగూర్చి యేమాత్రము పైకిఁబొక్కినను నీకు మావదినెకుఁగూడఁ బదునాల్గు వత్సరములు కారాగృహవాసము తప్పదు. ఈబాధ మీ కెక్కడఁ గలిగిపోవునోయని నే నింతగాఁ బ్రాకులాడుచున్నాను. అందుకొఱకు బహిరంగముగా భూమినమ్మఁదగదు. దానివలన లక్షబాధ లున్నవి. ఇవి యన్నియు యోజించియే భూమి గుప్పచుప్పకాకుండ నాపేర వ్రాసియిమ్మని నేను బలుకవలసివచ్చినది.

సుంద:— అయ్యయ్యో. ఈయక తప్పదా?

జగ్గ :— అంతసొమ్ముకూడ నే నిచ్చినయెడలఁ దప్పును. అది నీ వీయలేవు. అందుచే భూమి వ్రాసి యీయక తప్పదు.

సుంద:— సరే వ్రాసియిచ్చెదను. అటుపైన సృష్టించినకాగిదములవలన మాకేమియు బాధ లేదుకదా.

జగ్గ:— అన్నా! అటుపైన నీపై నేఁగవ్రాలిన యెడల నన్నుఁ దుపాకిపుచ్చుకొనికొట్టు. అంతే? మీకాగిదా లేవో మీయెదుటనే చింపివైచెదను. కాని యెప్పుడు వ్రాసియిచ్చెదవు?

సుంద:— మీయిష్టము.

జగ్గ:— ఈరోజుననే స్టాంపు కొనుము. సాపు వ్రాయవలసిన చిత్తును బంపెదను. రేపు రిజిస్టరి కాకతప్పదు.

సుంద:—అలాగే.

జగ్గ:—"అన్నా! నమస్కారము. వదినెను జాలచాల నడిగినానని చెప్పుము." (తనలో) ఇదివఱకు నే నీవ్యాజ్యమునఁ బెట్టుబడిపెట్టినవి ముప్పదిరూపాయ లైన లేవు. రూపాయకుఁ బుట్టెడుభూమి. వహ్వా! ధర్మకాలము!

ప్లీడరుపోయెను సుందరరామయ్య మఱునాఁడు స్టాంపువ్రాసి రిజస్టరిచేసి యిచ్చెను. భార్య యొడలి పదివేలరూపాయల వస్తువులు రెండువేలరూపాయలు వెండిపాత్రసామగ్రియుఁ బ్లీడరు నధీనము చేసెను. మిగిలినముప్పది యెనిమిదివేల రూపాయలు ముందెప్పుడైన నీయవచ్చునని చెప్పి యా మొత్తమునకు సుందరరామయ్యచేఁ బ్లీడరు నోటువ్రాయించుకొనెను. సుందరరామయ్య మతిపోయి యేవృత్తియు నెఱుఁగనివాఁడు కావున "సీతారామాభ్యాన్నమః" యనుచు నక్షయపాత్రతోఁ గాలక్షేపమును జేసెను.



ఐక్యము

పల్ల వేంకటశాస్త్రిగారు

నాకొరకుగాదె సృజియించినావు నీవు, సౌష్ఠవం బది పొంగారు జగములెల్ల
గనియు నానందవార్ధిలో మునిగి మునిగి, జనని యద్దాన నైక్యమైతిని గదమ్మ!

అల్లగోదావరీ నదీ బిల్లతరగ, పింఛులో నుండి వెల్వడు దండిముత్తి
యంపుసరులన నెప్పెడి తుంపురులను, జనని! భవదీయకళగని తనిసితమ్మ!

లలితబృందావనీ వీథికల లతాంత, సౌరభంబుల గోపాల చక్రవర్తి
మధురగానమ్ము భుజముల మలపికొనుచు, మోసికొని తెచ్చి వీనుల మోనల నిడు
పిన్నపవనుని నడకల వన్నెలందు, జనని! భవదీయకళగని తనిసితమ్మ!

లలితవాసంతచూతపల్లవము లనెడి, కవినృపతివాళి పద్మరాగంబులెల్ల
ధవళిమము సేయ బూను యంత్రంబనంగ, చంద్రనిర్గత మసృణ ప్రసారములను
జనని! భవదీయకళగని తనిసితమ్మ!

విమల శాంత ప్రపూతమై వెలయు నభ్ర, మందు భవదీయకళగని డెందమందు
నిర్మలాకారశాంత మిదే యటంచు, జనని యద్దాన నైక్యమైతిని గదమ్మ

భగవదజ్జుకము

ప్రహసనము

వేటూరి ప్రభాకరశాస్త్రి గారు

(నాంద్యంతమున సూత్రధారుఁడు ప్రవేశించును)

సూత్ర—

క. సురవరమకుటేంద్రమణి [నిశా
స్ఫురితము, శుభలక్షణము, సుపూజితము,
చరణమితాంగుష్ఠము, శివు
చరణము, మి మ్మెల్లవేళ సంరక్షించున్.

ఇదె మాయిల్లు లోనికిఁ బోయెదను.

(పోయి) విదూషకా! విదూషకా!

విదూ—(ప్రవేశించి)
అయ్యా! ఇదుగో ఉన్నాను.

సూత్ర—ఇతరు లెవ్వరును లేరుగద! నీకొక మంచిమాట చెప్పెదను.

విదూ—సరే; (బయటికి వెళ్లి చూచి వచ్చి) అయ్యా! ఇత రెవరూ లేరు, ఆమంచి మాట యేమిటో సెలవివ్వండి.

సూత్ర— అనేకసిద్ధపురుషులయనుగ్రహము పొంది గొప్పశక్తులను సంపాదించినవాఁడు, ఉత్తమలక్షణములుగలవాఁడు, ఒకబ్రాహ్మణుఁడు దేశాంతరమునుండి యిక్కడికి వచ్చుచు, ఇప్పుడు నాకీక్రిందివిధముగా జోస్యము చెప్పినాఁడు. —

"నేఁటికి ఏడవనాఁడు నీకు రాజాస్థానమున దర్శనము దొరకఁగలదు. అప్పుడు నీప్రయోగమునుజూచి సంతోషించి రాజుగారు నీకు గొప్పసమ్మానము బహుమానము జరుపుదురు" అని.

ఆబ్రాహ్మణుఁడు అసత్యములాడువాఁడు కాఁడు గావున నుత్సాహముచెంది సంగీతసాధనము సాగించుచున్నాఁడను.

విదూ—ఐతే; మీ రిప్పుడు నాటకమా ప్రకరణమా ఏది ఆడుదా మనుకొన్నారు?

సూత్ర—ఇక్కడనే నాకు నాలోచనము; నాటకప్రకరణోద్భవము లయిన వాకేహామృగ డిమ సమవకార వ్యాయోగ భాణ సల్లాప వీ థ్యుత్సృష్టికాంక ప్రహసనాదులగు నాట్యరసములందు హాస్యమే ప్రధానమైనదని నాతలంపు. కాన ప్రహసనమే ప్రయోగింతును.

విదూ—నేను ప్రహసన మెరుగను.

సూత్ర—అట్లైని నేర్చుకొనుము. నేర్వకుండ నేదిగాని రాదు.

విదూ—ఐతే తమరే మరి నాకు నేర్పండి.

సూత్ర—లెస్స.

గీ. బుద్ధిని గుదుర్చుకొని జ్ఞానసిద్ధికొఱకు
నమగమింపుము సన్మార్గమునను నన్ను

(తెరలో)—శాండిల్య! శాండిల్య!

సూత్ర—(విని)

బ్రాహ్మణశ్రేష్ఠుఁడయి బ్రహ్మపదము కోరి
సన్న్యసించిన యోగీంద్రు భాత్రునట్లు.

నిష్క్రమించిరి.

ఇది ప్రస్తావన

(పిదప పరివ్రాజకుఁడు ప్రవేశించును.)

పరి—శాండిల్య! శాండిల్య! (వెనుకకుఁజూచి) కానరాకున్నాఁడే, అజ్ఞానసంవృతుఁడయిన వీని కీనడవడి తగినట్లే యున్నది.

సీ. వివిధరోగములకు పీడుపట్టయి, వార్ధ
కమునకు వశమయి, కాలునకు ర
హస్యంపుఁబొంచుచోటై, యున్న దీదేహ
మడఁగారు నెప్పుడో, పొడిచి పొంగి
పాఱునదికి గూలిపడు తటక్రమమట్లు;
నమ్మరానివి దీనిమెప్పులెల్ల
బహుజన్మకృతపుణ్యవశమున నరజన్మ
మందియు భ్రమసి దేహాత్మబుద్ధి

గీ. నజ్ఞుఁడగుఁవాఁడు బలము ప్రాయమ్ము రూప
మరసికొని పొంగిపోవుచు నవి ఘటించు
దోషములఁ గానలేక తుందుడుకుచెంది
చెడెడు; నయ్యయో యజ్ఞానచేష్టితంబు!

కాఁబట్టి దయనీయుఁడైన యీయజ్ఞానునిపై నపరాధములను లెక్కించి లాభము లేదు. మరలఁ బిలిచెదను. శాండిల్య! శాండిల్య!

(అంతట శాండిల్యుడు ప్రవేశించుచున్నాఁడు)

శాండి—ఓహో! నాకథ తలుచుకొంటున్నాను. మొదటిది. నేను కాకులకు పిండాలు వేయగా మిగిలినకూళ్లతో పొట్టల్నింపుకొంటూ, పొట్టకోసినా అక్షరమ్ముక్కైనా లేక, మెళ్లోజంధ్యం మాత్రం వేసుకొని అంతటితోనే బ్రాహ్మణ్యం అబ్బిందిగదా అని సంతోషించుకొంటూ ఉండే కుటుంబంలో పుట్టాను. ఆతర్వాత రెండోది; మాకొంపలో బువ్వకు లేకపోవడంచేత, ఆకలికి తాళలేక పిండలాడి పింపానికి ఆశపడి బౌద్ధశ్రమణకులలో కలిశాను. వాళ్లుమంకమెయ్య! అక్కడ ఆతోత్తుకోడుకులు, ఒంటిపూట సాపాటు వాళ్లే కావడంచేత, ఆకలికి ఆగలేక దాన్ని విడిచిపెట్టి చీవరము చించివేసి, పాత్రము బద్దలుకొట్టి, గొడుగు ఒకటి మాత్రం పుచ్చుకొని బయలుపడివచ్చాను. ఇహ మూడోది; ఈ చెడ్డస్వాములవారికిప్పుడు సరకులు మోశేగాడిద నైనాను. స్వాములవారు ఈచేరువనే ఉన్నారనుకొంటాను. ఆయన్ని చేరబోతాను. ఏరీ స్వాములవారు? ఎక్కడికో వెళ్లినట్టున్నారే; ఆఁ! ఈచెడ్డసన్న్యాసి పిండలాడి తిండిమీద ఆశపడి తాను ఒంటిగానే భిక్షమెత్తడానికి ముందుగా పరిగెత్తాడల్లే ఉంది. అట్టే దూరంపోకముందే వెంటబడి కలుసుకొంటాను. (పరిక్రమించి చూచి) ఇదుగో! స్వాములవారు! (చేరఁబోయి) అయ్యో! స్వాములవారు! క్షమించండేమి; క్షమించండేమి;

పరి—శాండిల్య! వెఱవకుము. వెఱవకుము.

శాండి—అయ్యో! స్వాములవారూ! నిత్యకల్యాణం పచ్చతోరణంగా ఎప్పుడూ ఉత,

వాలు జరుగుతూ, సుఖప్రధానమై, వుండే యీజీవలోకంలో, మీరు భిక్షాటనం చేసేటప్పుడు ఏవిధాన వర్తిస్తారండీ?

హరి—విను.

చ. అడఁకువఁ బూని ధర్షణము
లందియుఁ గుందక కామమానముల్
విడుకొని బీదలిండ్లకడ
భిక్షము నెత్తి శరీరధర్మముల్
గడపుచు, దుఃఖదోషబహు
ళంబగు లోకమునన్, మొసళ్లపెన్
మడుగునఁబోలె నెప్పుడుఁ బ్ర
మాదముపాల్పడకేఁ జరించెదన్.

శాండి— పద్యకము :
తల్లీతండ్రీ లేరు, తమ్ము లన్నలేరు
దైవానుగ్రహముత్తదే, వొంటిగాణ్ణి!
పొట్టకూటికోస మిట్టా వస్తీఁగాని
ధర్మలోభము నాకింతైనా లేదండీ!

హరి—శాండిల్య! ఇదియేమోయీ!

శాండి—అవునండీ! తమరు, ధర్మమూ, అధర్మమూ రెండూ బంధకము లవుతవని శాదండీ అన్నారు.

హరి—నిజమే! ధర్మము అధర్మము ఫలాభిసంధితో చేసినచో బంధకములే అవును.

గీ. ఎవఁడు ఫలముఁగోరి యెదియేని కర్మ మూహించి చేయు నవహితేంద్రియుఁడయి
వానికొఱకు దానిఫలము మరల్ పర
మందు దాఁచియుంత్రు న్యాయమట్లు.

శాండి—అయితే, అయ్యా! ఎప్పుడండీ అఅకామకర్మఫలం పొంద గలిగేది?

హరి—ఎప్పుడు విరాగైశ్వర్యము లభించునో అప్పుడు.

శాండి—ఆవిరాగైశ్వర్యంఎట్టాలభిస్తుందండీ!

హరి—అసంగత చేత.

శాండి—ఓ స్వాములవారూ! ఇదేమిటండోవ్ అసంగత అని ఒకటి అంటున్నారు? అదేమిటో కొంచెం సెలవియ్యండి.

హరి—అదిరాగద్వేషములకు మధ్యస్థమైనదశ!

గీ. దుఃఖమున సుఖమున నిత్యతుల్యబుద్ధి
భయమునను హర్షమున నేకభావకలన
శత్రులందు మిత్రులయందు సామ్యచింత;
ఘనులు పలుకుదు రదియసంగత యటంచు.

శాండి—అయ్యా! ఇటువంటిదికూడా ఉంటుందా?

హరి—లేనిచో పేరెట్లు కలుగను?

శాండి—అయ్యా! అట్లా ఉండడము సాధ్యమౌతుందంటారా?

హ—సందేహ మేమి?

శాండి—అబద్ధం, ఇది వట్టి అబద్ధం.

హరి—ఏహేతువుచేతనోయి అట్లనెదవు?

శాండి—అయ్యా! స్వాములవారూ! అదిసాధ్యమే ఐతే మీరెందుకండీ నామీద కోప్పడతారు?

హరి—అధ్యయనము చేయవని.

శాండి—నేను అధ్యయనము చేస్తేనేమి చేయకపోతేనేమి; ముక్తులైనవారికి మీకెందు కీగొడవ?

హరి—కాదోయీ, అట్లుకాదు, అభ్యుపగతుండై నశిష్యునిమేలుకొఱకుదండింపవలసినదని

స్మృతులు చెప్పుచున్నవి. కాఁబట్టి కోపము లేనివాఁడనయినను నేను నీశ్రేయస్సుకొఱకు దండించుచున్నాను.

శాండి—ఆశ్చర్యముగా ఉందే; ఆశ్చర్యముగా ఉందే; కుపితులు కాకుండానే కొట్టుతున్నారుగా నన్ను! ఇహ కట్టిపెట్టండి ఈకథ. అతిక్రమించి పోతున్నది భిక్షావేళ.

పరి—తెలివిమాలినవాఁడా! ఇది ప్రాతస్సమయము. మధ్యాహ్నసమయము గాదు; ధాన్యము దంచి రోకళ్లు మూలఁబెట్టినతర్వాత, ప్రొయులు చల్లాఱినతర్వాత, అందఱును ఆరగించినతర్వాత, మధ్యాహ్నకాలమందు భిక్షుకుఁబోవలెనని ధర్మోపదేశమున్నది. కాఁబట్టి యందాఁక విశ్రమార్థ మీయుద్యానవనమునకుఁ బోవుదము రమ్ము.

శాండి—ఆహా! మీరుచెప్పే దొకటి, చేసే దొకటిగా ఉన్న దేమిటండీ!

పరి—ఎట్లు?

శాండి—అయ్యా! తమరు సుఖదుఃఖసమానులుగా!

పరి—అవును సుఖదుఃఖములందు సమానమైనదే అంతరాత్మ. కర్మాత్మ విశ్రాంతిని గోరుచున్నది.

శాండి—అయ్యా! స్వాములవారూ! ఏమిటో అంతరాత్మ అంటున్నారు, కర్మాత్మ అంటున్నారు. ఎటువంటివండి అవి? అంతరాత్మ అంటే ఏమిటి? కర్మాత్మ అంటే ఏమిటి?

పరి—విను.

గీ. స్వప్నమందు గగనసంగతమగునది
యంతరాత్మ, మఱి సమస్తవిధులు
గష్టములు సుఖములుఁ గనునది కర్మాత్మ
జనుఁ డనంగ దేహి యనఁగ నదియె.

శాండి—అజరమై, అమరమై, అచ్ఛేద్యమై, అభేద్యమై, ఉన్న దేదో అది అంతరాత్మ. నవ్వేది, నవ్వించేది, శయనించేది, భుజించేది, నశించేది, ఏదికలదో అది కర్మాత్మ. ఇంతేనా?

పరి—ఎట్లు గ్రహింపవలెనో అట్లు గ్రహించితివి.

శాండి—చాలుచాలు. కట్టిపెట్టండి. పట్టుపడ్డారు.

పరి—ఎట్లు?

శాండి— అయితే ఆ అంతరాత్మ, ఇప్పుడీకనబడేమీరూ అంతా ఒక్కటేకదా! శరీరం లేకపోతే ఇహ మరేమీ లేదాయె గదా! మళ్లీ ఇపుడు అంతరాత్మ వేరు; కర్మాత్మ వేరు; అంటూ ఏమో చెప్పసాగిరి. పొందుబాటుగా ఉందా యిది?

పరి—లౌకికముగానిప్పు డిట్లుచెప్పినాఁడను. ఇతిహాసపురాణాదులు, లౌకికరీతిని సురనరపశుపక్ష్యాదిజీవభేదములసత్యత నంగీకరించుచున్నవి.

శాండి—అదిఅంతా అట్టా ఉండనియ్యండి. మీరెవరు? 'మీరు' అనిపిలవబడే మీరెవరు?

పరి—విను.

చ. అనలము వాయువుర్వి జలము
　　నాకస మన్నవి పాళ్లు గూడగా

బొనరినప్రాణివాయువుల
ప్రోవు చలించెడు విగ్రహంబునన్
దనరఁగ వీనులుం గనులుఁ
ద్వక్కును ముక్కును జిహ్వ గల్గఁగాఁ
గనె నరసంజ్ఞ, జీవన మె
కానొకఁ డట్టిఁడఁ బ్రాణిధర్ముఁడన్.

శాండి—ఆహా! ఇంతకూ మిమ్మి మీరే ఎరగ లేకుండాఉంటిరి. ఆత్మ నింకా ఎరిగుండే దేమిటి? సరే లెండి! అయ్యా! ఇదుగో ఉద్యానము.

పరి—నీవు ముందుగాఁ బ్రవేశింపుము. సందడిలేక శాంతమై యుండునరణ్య ప్రదేశములఁ జూచుకొని ప్రవేశింపఁ దగినవారము మేము.

శాండి—అయ్యా! తమరే ముందు ప్రవేశించండి. నేనే తర్వాత వస్తాను.

పరి—అదేల?

శాండి—పాతకాలపుముండ మా అమ్మ చెప్పేది. ఈవనంలో అశోకవృక్షపు చిగురుటాకులచాటున పెద్దపులి ఉన్నదని. అందుచేత భయమవుతున్నది. అయ్యా! మీరే ముందు దయచెయ్యండి.

పరి—మంచిది.

(ముందువెనుకలుగా ఇద్దఱు ప్రవేశించుచున్నారు.)

శాండి—అయ్యో! అయ్యో!! పెద్దపులి పట్టుకు పీకుతున్నదండోవు! ఈపులిబారి నుండి తప్పించండోవు! దిక్కుమాలిన వాణ్ణి పులినోట పడిపోతున్నానండోవు! ఇదుగో కారుతున్నది కంఠంలోనుంచి రక్తం.

పరి—శాండిల్య! భయపడకు. ఇది నెమిలిగదవోయి!

శాండి—నెమలాండి! ఆఁ! నిజంగా!

పరి—ఔనోయి! నిజముగానే నెమిలి.

శాండి—అమ్మయ్యా! నిజంగానెమలే అయితే ఇహ కళ్లు తెరుస్తాను.

పరి—భయపడ బనిలేదు. తెఱవుము.

శాండి—అమ్మ!! లంకెముండాకొడుకు, పులిగాడు; నన్నుచూచి భయపడి నెమలిరూపంతో పరుగెత్తాడుసుమా! (ఉద్యానము నిరూపించి) ఏమిఉద్యానం, బలే! బలే!! సంపంగులు, జవ్వాలు, కలిగొట్లు, నీపములు నిచుళములు, తిలకములు, గోరంటలు కొండగోగులు, కల్హారములు, మామిళ్లు క్రేంకణములు, ఏపులు, తాళ్లు, తమాలములు, పొన్నలు, నాగములు, పొగడలు, సరళములు, సర్జములు, సిందువారములు, సప్తపర్ణములు, గన్నెరులు, కొండమల్లెలు, చందనములు, అశోకములు, మల్లెలు, నంద్యావర్తములు, తగరములు, ఖదిరములు, అనంట్లు మొదలయిన వృక్షాలతో శోభిస్తున్నది. వసంతుఁడు తాండవమాడుతున్నాడు. చిగురుటాకులు, ముదురుటాకులు, పువ్వుగుత్తులు, నిండిఉన్నవి. మాలతులు, గురివెందలు, తీగెపంది ళ్లల్లుకొనిఉన్నవి. నెమళ్లు, కోవెలలు, చిలకలు, తుమ్మెదలు, తేనెటీగలు, మధురధ్వనులు చేస్తున్నవి. ప్రియజనమును వదలి ఉండడంచేత చివికిచింతిస్తూఉండే పడుచు

ప్రాయపువారికి పరితాపాన్ని, జోడువీడకుండా ఉండే సాగసర్లకు సుఖాన్ని కలిగిస్తూ ఈ ఉద్యానము ఎంతరమణీయముగా ఉన్నది!

పరి—మూర్ఖుఁడా! పూఁటపూఁటకు నింద్రియములు హీనగతి పొందుచుండఁగా నీకిందు రమణీయత యెట్టుకన్పట్టుచున్నదోయి! చూడుము:

ఉ. ఆమని వచ్చెఁ గ్రొంజిగురు
 టాకునగల్ ధరియించి యంచు, ఫు
ల్లామలపుండరీకమయ
 మై శరదాగమ మింపుగొల్పెనం,
చీమొయి వచ్చుచో ఋతుప్ర
 లెంతయు నజ్ఞలు సంతసింతు రి
స్సీ! మృతి చేరువౌ టెఱుఁగరే
 రమణీయత యిందు నున్నదే!

శాండి—ఏది యెప్పుడు రమణీయముగా ఉంటుందో దానిని అప్పుడు రమణీయంగా ఉన్నదంటారు.

పరి—ప్రాజ్ఞసమ్మతము కానిమాట మాటాడితివి. విను:

గీ. గతముఁగూర్చి మిగుల వెతకుదువ్వా, రనా
 గతముఁగూర్చి యాశఁ గాంచువారు
 వర్తమానమందుఁ బరితృప్తిగననివా
 రెందుగాని ముక్తి నందలేరు.

శాండి—త్రోవ చాలాపొడుగుఁగా ఉంది. మన మిప్పుడు ఎక్కడ కూర్చోవడము?

పరి—ఇక్కడనే కూరుచుందము.

శాండి—ఇక్కడి నేల అపరిశుభ్రంగా ఉంది.

పరి—అరణ్యభూమి పవిత్రమైనది. పరిశుద్ధమైనది.

శాండి— మీకుగనక బడలికగా ఉన్నదంటే, కూర్చోవలెనని బుద్ధిపుట్టిందంటే, ఇహ, చెడ్డభూమినైనా మంచిభూమినిగా చేసివేస్తారు.

పరి—ఓయీ! శ్రుతి ప్రమాణము. నేనుగాదు

క. అతిమానోన్మాదమున న [నాత్మో
 హితమును హితమయని యెంచుచెప్పెడు
 దితమే ప్రమాణమనికొను
 కితవులకుం బరములేద కించిత్తైనన్.

శాండి—తెగచెప్పేస్తూ ఉంటారు- అట్లాగు ఇట్లాగు అదీ యిదీని; మీ కో ప్రమాణమున్నట్టు నాకు తోచలేదు.

పరి—కాదోయి! అట్లు కాదు.

గీ. లోకమంను విబుధులు ప్రమాణమనుదాని
 నే ప్రమాణముగను నీవుఁ గొనుము
 అప్రమాణ మెప్పు డొప్పరుసుమ్ము ప్ర
 మాణమంచు సుప్రమాణవిదులు.

శాండి—అయ్యా! నాకు తోచ లేదండీ. మీకో ప్రమాణం ఉన్నట్టు- అట్టా ఇట్టా చెప్తూ ఉంటారు.

పరి—నాయనా! అధ్యయనము చేయుమోయి! తెలియును.

శాండి—నా కక్కర లేదండీ అధ్యయనము.

పరి—ఎందుకని?

శాండి— అధ్యయనానికి అర్థమేమిటో చెప్పండి?

పరి—అధ్యయనము చేసినవారికిఁగూడ నధ్యయనార్థములు కాలాంతరమునఁ దెలియఁదగినవిగానుండును. కావున నీవు ముందుగా నధ్యయనము చేయుము.

శాండి—అధ్యయనముచే నేమివస్తుందండీ?

పరి—విను- జ్ఞానము; జ్ఞానమువలన విజ్ఞానము; విజ్ఞానమువలన సంయమము; సంయమమువలనఁ దపస్సు; తపస్సువలన యోగప్రవృత్తి; యోగప్రవృత్తివలన నతీతానాగతవర్తమానతత్త్వదర్శనము; దీనివలన అష్టగుణమైన యైశ్వర్యము లభించును.

శాండి—అయ్యా! స్వాములవారూ! ప్రత్యక్షములుగాని విషయములందు నాబుద్ధిని మీయిష్టమువచ్చినట్టు పరిభవించి మాట్లాడుతున్నారు. నాకెందుకుగాని అదంతా. అయితే! అధ్యయనంవల్ల ఎవ్వరికి అగపడకుండా పరులకొంపల్లోకి దూరడానికి శక్యమౌతుందా?

పరి—నీకోరిక యెట్టిదోయి?

శాండి—నాకోరిక యెట్టిదో చెప్పమంటారా? ఆ శాక్యశ్రమణులకోసం, సంఘాలలో తయారవుతూఉండే, కమ్మకమ్మని భక్ష్యభోజ్యాలను కడుపునిండుగా ఆరగించడం నాకోరిక!

పరి—అయ్యో! మిక్కిలితుచ్ఛమైనదిగదోయి నీకోరిక!

శాండి—ఇందుకోసమే కాదండీ తమరు బుఱ్ఱ గొరిగించుకొన్నదీని? ఇంతకంటె వేరే ప్రయోజనం నాకు కనపడ్డంలేదు సుమండీ!

పరి—ఆఁ, ఆఁ, కా దట్లుకాదు.

గీ. విప్రులు మహాత్ములెపుడు సేవించుచుండ్రు
[illegible]
అవ్యయమవార్యమక్షోభ్యమద్భుతమును,
హత్తరం బట్టి యోగమే నభ్యసింతు.

శాండి—తమరొక్కరూ సమాహితులై కూర్చుండి యోగాభ్యాసచింత జరుపుకోండి. నేను సుసమాహితుణ్ణై సుభోజనచింత జరుపుకొంటాను. అయ్యా స్వాములవారూ! యోగం యోగం అని మీవంటి సన్యాసి స్వాములవార్లు తరుచుగా ప్రశంసిస్తూ ఉంటారు! ఎటువంటిదండీ ఆయోగమనేది?

పరి—విను:

గీ. జ్ఞానమూలము ద్వంద్వనాశకము తత్త్వ
సంశ్రితమ్ము మహాతపస్సార మింక
ద్వేషమునకు రాగమునకును వేఱుపడిన
తీరుగలది యోగంబని తెలియుమోయి!

శాండి—'ఆహారప్రమాదము సర్వప్రమాద'మని బోధించిన బుద్ధదేవునికి పదివేల నమస్కారాలు.

పరి—శాండిల్యా! ఇదేమోయి!

శాండి—స్వాములవారూ! ఎరగరా ఏమిటి? మొదట నేను పెండలాడి తిండికోసం శాక్యశ్రమణులలో కలిశాను.

పరి—అక్కడ నేమేని నీకు పరిజ్ఞానము కల్గెనా?

శాండి—కలిగింది-కలిగింది-బోలెడంతకలిగింది.

పరి—కానీ, ఏదో విందుము.

శాండి—అయ్యా! ఐతే వినండి "అష్టౌ ప్రకృతయః, షోడశవికారాః, ఆత్మా, పంచవాయవః, త్రైగుణ్యం మనః, సంచరః, ప్రతిసంచరశ్చేతి." ఈవిధంగా జినభగవానులు పిటకపుస్తకాలలో చెప్పినారు.

పరి—శాండిల్యా! ఇది సాంఖ్యసమయము, శాక్యసమయము కాదు.

శాండి—ఆకలిగా ఉండడంచేత మనస్సంతా అన్నముమీదికి పోయింది. అందుచేత లోపల అనుకొన్న దొకటైనా పైకి చెప్పింది ఇంకొకటి అయింది. ఇప్పుడు చెపుతాను వినండి. "అదిణ్ణాదాణాదో వేరమణింశిక్ఖాపదం, పాణాదిపాదాదో వేరమణిం శిక్ఖాపదం, ముథావాదనో వేరమణిం శిక్ఖాపదం, అబ్బమ్మచయ్యాదో వేరమణిం శిక్ఖాపదం, అకాలభోఅయణాదో వేరమణిం శిక్ఖాపదం, అహోణ్మణం బుద్ధం ధమ్మం సంఘం సరణంగచ్ఛామి."

పరి—శాండిల్యా! స్వసమయమును విడనాడి నీవు పరసమయమును బలుకుట యుక్తముగాదు.

గీ. తమముపీడుకొనుముత్యజియింపుమురజస్సు
సత్త్వమందు సంప్రసక్తిఁ గనుము
ధ్యానయోగమందుఁ దగిలి యుపాసింపు
మిదియె జ్ఞానమునకు నొదవు ఫలము.

శాండి.—అయ్యా! స్వాములవారూ! మీరు సమాహితులై యోగాన్ని చింతించండి. నేను సుసమాహితుణ్ణై సుభోజనమునే చింతించుకొంటాను.

పరి—కట్టిపెట్టుమోయి యీకథను.

గీ. ఇంద్రియముల నాత్మయందు యోజింపుము
సకలజగము మేన సంగ్రహింపు
సర్వమందు నాత్మసమవేక్షణ మొనర్పు
సత్త్వమాశ్రయింపు జ్ఞానమునను.

(అంతట గణిక, ఇద్దరు చెలికత్తెలు, వత్తురు.)

గణిక—ఓశే, మధురికా! మధురికా! ఎక్కడనే ఎక్కడనే రామిలకుడూ!

చేటి— అజ్జుకా! శావ, ఇదుగో వస్తున్నానని చెప్పి నగరంలోకే వెళ్లాడు.

గణి—ఓశే! అక్కడి కెందుకువెళ్లాడో గదా!

చేటి—ఆఁ! ఇంకో లేముంది; జూదగాళ్లను తొందరపెట్టేటందుకు వెళ్లాడు.

గణి—ఇంతసేపైనా ఇంకా జూదం ముగియ లేదటే!

చేటి— బాగానే ఉంది! మంచిమాట న్నావు. జూదమంటే తప్పదాగడంగాదటే! సిగ్గుతో చితికిపోయే స్త్రీలనుకూడా ఆతాగుడు గంతులువేయించి, కొవ్వొక్కేట్టు చేస్తుందే! దానిమజా మగవాళ్లకు ఓపట్టాన ఒదులుతుం దనుకొన్నావు?

గణి—వెళ్లు, తొందరపెట్టి తీసుకురా!

చేటి—అజ్జుకా! అట్టాగే వెళ్లుతున్నాను, పిల్చుకొని వస్తాను. (వెళ్లును.)

గణి—ఓశే, పరభృతికా! ఎక్కడ కూర్చుందామే; చెప్పు, ఎక్కడకూర్చుందాము?

చేటి—అజ్జుకా! ఇదుగో పూచినమామిళ్లు, తిలకములు, చుట్టుకొని ఉన్న యీశిలాపట్టముమీద కూర్చుందాము. కూర్చుండి ఏదీ ఒకపాట పాడు.

గణి—పరభృతికా! సరే. అట్టాగే.

(ఇద్దఱు కూర్చుందురు, ఇద్దఱును పాడుదురు.)

గేయము.

పరభృతమధుకరరుతశింజితములు
మొరయ చూతశరముల్, మునిజన
విరాగపరిహారముల్, తాలిచి
పరాక్రమము చెలఁగఁగ, మదనుఁడు,
బలే! యిందు మెలఁగుగ.

శ్రీ వేంకటేశ్వర స్తవము

మండలేముల వెంకటశాస్త్రి గారు, బి. ఏ., ఎల్. టి.,

అతులమహానుభావముగదా! పరికింప భవత్కృపారసం
బతిమృదుల ప్రభావము ననన్యసులభ్యము, నార్యలోకస
న్నుత, మగుటన్ దరిద్రుఁడు ననూనశుభమ్ముల నొందు దాన; భూ
పతి యధమాధముండగు లవం బెడ యైనను; వేంకటేశ్వరా! ౬

చ. జగముల సృష్టి సేసితట! చక్కఁగ వానినిబ్రోచుచుండి య
త్యగణితకీర్తి నొందితట! యంతమునందు లయమ్ముఁగూర్చి యీ
జగములలోనఁ గొందువట! సర్వవిభుం డన నీవ కావె? యి
మ్ముగ నినుగొల్చుభక్తులకు ముక్తి సుసాధ్యము వేంకటేశ్వరా! ౭

చ. మము భవరోగపీడితవిమానసులన్, మదమత్సరాది దో
షముల గలంగు జీవులను సత్కరుణామతి బ్రోవనున్న దై
వమవని నిన్నుఁజేరితిమి భక్తి తెఱం గెఱిగించి పాపకూ
పమునఁ బడంగనీక మనుపంగదె పావన! వేంకటేశ్వరా! ౮

చ. సలిపినతీర్థయాత్రలును జన్నములున్ దపమున్ వ్రతమ్ములున్
సలలితమైన ధర్మమును సత్యవచోనియమం బుపాస్తియున్
ఫలమును బొందనేరవు స్వభావము నిర్మలమైనఁగాని కే
వలము విశుద్ధమానసమె భక్తికి మూలము వేంకటేశ్వరా! ౯

చ. కలియుగమందు నీవె మము గావఁగ దైవతమంచుఁ దెల్పు ప్రా
జ్ఞులపలు కాలకించితి మనోహరమైన భవత్స్వరూపమున్
నిలిపితి నెమ్మనమ్మున ననిందితమైన భవన్మహత్త్వమున్
దెలియ నుతింపగాఁ గడఁగితిన్! నను బ్రోవుము వేంకటేశ్వరా! ౧౦

[సశేషము]

భాషా కుటుంబములు

కోరాడ రామకృష్ణయ్య గారు

భూభాగమం దాయాప్రదేశముల నివసించుచుండెడి మానవకోటియంతయుఁ గొన్ని జాతులు, కుటుంబములుగా విభజింపఁబడుచుండినట్లే, యామానవకోటిచే వ్యవహరింపఁబడుచుండెడి భాషలు కూడఁ గొన్ని కుటుంబములుగా విభజింపఁదగియున్నవి. భాషయనునది మానవుఁడు తనజన్మకుఁ గారణభూతుం డగు పూర్వపురుషులనుండి పడసిన యొకయపూర్వం బగు సొత్తు. ఇట్టియపూర్వసంపత్సంపన్నుఁ డగుటచేతనే మానవుఁడు తక్కిన జంతువులకంటె భిన్నుఁడై జంతుకోటిలో నగ్రస్థానమును వహించుచున్నాఁడు. అనుకరణశక్తి, జ్ఞాపకశక్తి, విశ్వాసము, బుద్ధిబలము, సుఖదుఃఖాద్యనుభవము, మొదలగువిషయముల మానవులకుఁ దక్కిన జంతుకోటికిని విశేషభేద మగపడదు. కాని యీభాషయనునదిమాత్ర మీజీవకోటిమధ్య నొకపరిహద్దుగా నేర్పడి మానవకోటిని తక్కిన జీవకోటినుండి వేఱుపఱచి దాని యాధిక్యమును జాటుచున్నదివలె నున్నది.

భాషయనున దెట్లు ఏకాలమున నేర్పడినది? ఒక భాషనుండి యనేకము లేర్పడినవా, లేక యేకకాలమున పలుచోట్ల పలుబాసలు బయలుదేరినవా యను విషయములు వివాదములో గూడినవిగా నున్నవి. కాని ప్రస్తుతము వ్యవహారములోనున్న భాషలను వానిస్థితిగతులను, అవిపొందుచున్న మార్పులనుబట్టి విచారింపఁగా, భాషలకు మార్పు సహజగుణమైనట్లును, అనేకవిధములగు కారణములచే నొక్కభాషయే యనేకవిధములగు మార్పులను జెంది, యొక్కజనసంఘముచేతనే భిన్నరీతుల వ్యవహరింపఁబడుచుఁ, దుదకుఁ గాలక్రమమున భిన్నభాషలుగా మాఱిపోవుచున్నట్లును దెలియవచ్చుచున్నది. ఒక్కయాంధ్రభాషయే దేశభేదమునుబట్టియు, వర్ణభేదమునుబట్టియు, నెన్నివిధములుగా వ్యవహరింపఁబడుచున్నది మన మెఱింగిన విషయమే. మొట్టమొదట భాష లనేకముగఁ బుట్టి కాలక్రమమున నవి కొంతసంస్కారమును బొందినకొలఁది కొన్నిప్రతిరూపములు లేక ప్రత్యేకాకారములు (Types) కలదిగా నేర్పడియుండ, వానినుండి యిప్పుడు భూభాగమున వ్యవహారములో నున్న భాషలు బయలుదేరియుండవచ్చును. అట్లుకాక అనాదియగు నొకభాషనుండి బయలుదేరినవేయైనను, ఆయాదేశకాల స్థితులనుబట్టియు, నాయాజనుల ప్రకృతులనుబట్టియు, భిన్నములై వేఱువేఱురూపములఁ బొందినవై యుండవచ్చును. కాని మొత్తముమీద నిప్పుడు వ్యవహారములో నున్న భాషలన్నియుఁ గొన్ని మూలభాషలకుఁ జెందినవై కొన్ని కుటుంబములుగ నేర్పఱుపఁదగియున్న వనువిషయమునమాత్రము భాషాతత్త్వవేత్తలందఱు నేకాభిప్రాయులై యున్నారు. భాషాకుటుంబముల నేర్పఱచుట యనఁగాఁ గొన్నికొన్ని భాషలలోఁ గలపోలికలనుబట్టి యాపోలికలకుఁ గలకారణములను వానికిఁ గలసంబంధమును గూర్చి విమర్శించి యవి పరస్పరము జన్యజనకభావసంబంధమో లేక సోదరభావసంబంధమో కలవై యుండెనని సనిదర్శకంబుగ నిర్ధారణచేసి యాసంబంధమునుబట్టి వాని నొకవంశవృక్షముక్రింద సమర్ప యత్నించుటయే యైయున్నది. భిన్నభాషలు మాట్లాడువారికిఁ బరస్పరము నేమాత్రము నర్థముకాకుండునంతగా మాఱి వేఱుపడిపోయిన యాయాభాషలకుఁ గలసంబంధ మెట్టి దని నిర్ధారణచేయుటకుఁ దగినమార్గము లేవో మన మిప్పుడు విచారింపవలెను.

భాషలపరస్పరసంబంధమును నిర్ధారణచేయుటలో మనకుఁదోడుపడునవి రెండు ముఖ్యములగు నంశములు కలవు. అందొకటి యాభాషలయందలి పదపరికరము (Material), రెండవది యందలి పదవాక్యముల సంఘటనాపద్ధతి (Method of expression) లేక వ్యాకరణాంశములు. మొదటిది కొంతసులభమైన మార్గము. ఆయాభాషలయందలి పదపరికరమును సరిపోల్చిచూచుట. అట్లు సరిపోల్చిచూచినపు డాయాభాషలయందు

సమానార్థకములగు పదములుగాని, లేక పదములమూల రూపములు (root elements) గాని యొకరూపము గలవై (లేక తుల్యరూపములు కలవై) కన్పడినచో నా భాషలు పరస్పరసంబంధము కలవని యూహింపవచ్చును. సంబంధము కలవనేకాదు, అవియన్నియు నేదో యొకకాలమున నొకప్రాచీనభాషనుండి బయలుదేరి కాలక్రమమున విడిపోయి తుదకు భిన్నత్వమును జెందినవనికూడఁ జెప్పుదుము. చరిత్ర మనకుఁ దోడ్పడినచో నీభిన్నభాష లేయేకాలమున నేయేమార్పులను జెందినవో సూచించుచు ప్రాచీనభాషతో నేకాలమున నైక్యమును బొందియున్నవనిసూచించుచు వానిచరిత్రను వెనుక కన్వేషింపగలుగుదురు. ప్రస్తుతము భిన్నభాషలుగా వ్యవహరింపఁబడుచున్న, ఫ్రెంచి, స్పానిష్, పోర్చుగీస్, రుమేనియన్, ఇటాలియన్, మొదలగు భాష లొకకాలమున నాయాప్రదేశములవాడుకలో నున్నభాషలతో మేళనము బొందినవ్యావహారికల్యాటిన్ భాషారూపములే. ఆయా దేశకాల పరిస్థితులను బట్టి యాయొక్క భాషయే యిన్ని రూపములఁ జెంది భిన్నభాషలుగా మాఱినదను విషయమును నిర్ధారణచేయుటలో చరిత్రయు భాషావిషయములును, భాషానిదర్శనములును చారిత్రకనిదర్శనములును బరస్పరము నవ్యలకము లగుచున్నవి. ఇట్లే ఉత్తరహిందూస్థానమున వ్యవహరింపఁబడుచుండెడి భాషలన్నియు నొకకాలమున నాయాప్రదేశముల వ్యవహారములోనున్న ప్రాకృతభాషలనుండి బయలుదేరినవనియు, నీప్రాకృతభాషలయందలి భేదముకూడ, ప్రాచీనప్రాకృత భాష మగధావంతి శూరసేనాది దేశభాగములలో భిన్నరీతుల వ్యవహరింపఁబడుటచేఁ గలిగినదేయనియు, నీప్రాకృతమును, వైదికభాషనుగూడ 'జెండవెస్టా' (Zend Avesta) భాషతోఁ బోల్చిచూచినయెడల నివియన్నియు సన్నిహితసంబంధము కలవేయై ప్రాచీనార్యభాషనుండి వచ్చినట్లును, కేవలమాయాభాషలయందుఁగల పోలికలనుబట్టియేకాక ఆయాభాషాగ్రంథములందలి యితరనిదర్శనములనుబట్టికూడ మనము నిశ్చయింపవచ్చును. ఇంగ్లీషుభాషకును యూరపుదేశమందలి ట్యూటానిక్ కుటుంబభాషలకు గలసంబంధమును, ఒకకాలమున జర్మనుదేశస్థులగు ఆంగిలులు, సాక్సనులు మొదలగుజాతులు బ్రిటిష్ దేశము నాక్రమించిరనియు, నప్పుడే తమభాషనుగూడ నచ్చట నెలకొల్పిరనియుఁ దెల్పెడి చారిత్రకాంశములే సమర్థించుచున్నవి.

ఒకవేళ నీపై విషయములను సమర్థించుటకు చారిత్రకనిదర్శనము లేమియు లేకున్నను, ఈభాషలయందగపడుచుండెడి సమానార్థకములగు సరూపపదజాలమునుబట్టి భాషాశాస్త్రజ్ఞుఁడు వీనికిఁ గలసంబంధమును నిర్ధారణచేయలేకపోఁడు. కాని యట్లునిర్ధారణచేయుటకుఁబూర్వము మాత్రము కొంచెము నిదానించి యాపదములను బాగుగఁ బరిశీలింపను. రెండుభాషలలోఁ గొన్నిపదములు సమానముగఁ గన్పడినంతమాత్రమున నాభాష లొకకుటుంబమునకే చెందినవని నిశ్చయింపవీలులేదు. ఏలయనగా నొకదేశముపై మఱియొకదేశమువారు దండెత్తుటవలనఁగాని, వర్తకవ్యాపారములవలనఁగాని, వలసపోవుటమొదలగు కారణములవలనఁగాని, భిన్నభాషలు మాట్లాడువారికి పరస్పరసంబంధము కలుగుచుండును. అప్పుడాజనులతోపాటు ఆభాషలకు నన్యోన్యసంబంధము కలుగుటచే, నొకభాషనుండి మఱియొకభాష యనేకములగు పదముల నెరువుతెచ్చుకొని స్వభాషాపదములవలెనే (ఒక్కొకప్పుడు స్వభాషాసాంప్రదాయానుసారములగు యత్కించిత్సంస్కారములతో) వాడుకొనుచుండవచ్చును. ఈరీతి నెరువుతెచ్చుకొనుటచేఁ గలిగిన యాభాషలలోని పదములసారూప్యమును బట్టి యవి యేకకుటుంబమునకుఁ జెందినవేయని నిశ్చయింప వలనుపడదుకదా! కావున భాషలసాజాత్యమును నిశ్చయించుటకుఁ బూర్వభాషలలో సరూపములై కన్పడుపదజాలము, ఒకదానినుండి యొకటి యెరవుగాఁ దెచ్చికొనినది కాదని రుజువు కావలెను. ఒకప్పు డీయెరువుతెచ్చికొనిన పదములకే యాభాషలలోఁ బ్రచారం బెక్కువయగుటచే నంతకుఁబూర్వమం దాభాషలలో నాయాయర్థముల వాడుకలో నున్న నైసర్గికపదములు (Native words) బహిష్కృతములై క్రమముగా వాడుకలోనుండి తప్పిపోవుటయుఁ దటస్థించును. అట్టిపదముల సంఖ్యనుబట్టి మనము స్థూలదృష్టితో విచారించి యాభాషల సంబంధబాంధవ్యములను నిశ్చయించినచో నది సత్యమునకు దూరము కాకమానదు. ఆధునికపరిషియన్ (పార్సి) వాస్తవముగ ఇండోయూరోపియన్ భాషాకుటుంబములోఁ (సంస్కృతము ల్యాటిన్, గ్రీకు, ఎవెస్టాభాష, ఇంగ్లీషు మొదలగువానిలో) జేరినదైనను, ఇప్పుడాభాషలోఁ గలిసిపోయిన అరబిక్ పద

సమూహమునుబట్టి స్థూలదృష్టితోఁ జూచినచో నది సెమెటిక్ (హీబ్రూ, అరేబిక్ మొదలగు భాషల) కుటుంబములోఁ జేరినదిగాఁ జెప్పఁబడియుండును. ఇంగ్లీషుభాష వాస్తవముగ ఇండోయూరోపియన్ కుటుంబమునకుఁ జెందినట్యూటానిక్ శాఖలోనుండి బయలుదేరినదై జర్మన్ మొదలగు భాషల కత్యంత సన్నిహితమైయున్న భాష. కాని తరువాతికాలమున దేశము నార్మనులచే నాక్రమింపఁబడినపిదప, నీభాషకు ల్యాటిన్ ఫ్రెంచిభాషలతోఁ గలిగినయత్యంతసాంగత్యమునుబట్టి యాభాషలనుండి యమితంబగు పదజాలమును సంగ్రహించికొనియుండుటచేఁ గోశములయందలి పదజాలమును బట్టియే విచారించినచో నింగ్లీషుభాష ల్యాటిన్ శాఖకుఁ జెందినదని చెప్పవలసియుండునుగాని జర్మన్ భాషకుఁగాని ట్యూటానిక్ శాఖకుఁగాని వానికంటె సన్నిహిత సంబంధముకలదని చెప్పుట కవకాశము లేదు. ఇంతయేల? మనయాంధ్రభాషవిషయమునఁగూడ నిట్టిసందిగ్ధస్థితి లేకపోలేదు.

ఆంధ్రభాష వికృతియని యాంధ్రవైయాకరణులందఱు చెప్పుదురు. అనగా సంస్కృతప్రాకృతములు ప్రథమద్వితీయ ప్రకృతులనియు, వానినుండివచ్చినదిగావున నిది వికృతియనియు వారిమతము; కాని సంస్కృతాంధ్రభాషలకుఁ గలసంబంధము ప్రకృతివికృతిభావములకుఁ గలసంబంధమే యనువిషయము మాత్రము విచారణీయమైయున్నది. ఏలయన నాంధ్రభాషయనునది సంస్కృతభాషయొక్క వికారము లేక వికృతియేయైనట్లయితే "తజ్జా సమా చ దేశ్యా గ్రామ్యా చేయం చతుర్ధా భవతి" (ఆంధ్రశబ్దచింతామణి)అనియు;

ఆ. "తత్సమంబునాఁగఁ దద్భవంబన వచ్చు
తెనుఁగునాఁగ మఱియు దేశ్యమనఁగ
గ్రామ్యభాషనాఁగ గల యైదుతెలుఁగులు
చెలఁగె వేఱె వాని విస్తరింతు.
(కేతన-ఆంధ్రభాషాభూషణము)"

అనియు నీమొదలుగ నాంధ్రభాషను నాలుగు విధములుగను, నైదువిధములుగను విభాగంబొనర్చిన యాంధ్రలక్షణకర్తల యభిప్రాయమేమో దురూహ్యంబగుచున్నది. ఆంధ్రభాష నాలుగు, ఐదు తెలుఁగు లన్నప్పుడు, తత్సమభాష, తద్భవభాష, దేశ్యభాష, అచ్చతెనుగుభాష, గ్రామ్యభాష యనియా వీరిభావము అని సందేహము కలుగకమానదు. తెనుఁగుభాష, గ్రామ్యభాష యనఁగా నేమో కొంచెమర్థమగును గాని తత్సమభాష తద్భవభాష యనఁగా నర్థముకాదు. మనము అచ్చతెనుఁగుగాని, గ్రామ్యభాషగాని మాట్లాడవచ్చునుగాని తత్సమభాష తద్భవభాష మాట్లాడుట లేదు. కావున "తెల్లమగు నైదు తెలుఁగులఁ దెనుఁగుభాష" (కూచిమం.) యని తెలుఁగుభాష యైదుతెలుఁగులని చెప్పినలక్షణకర్తలయభిప్రాయము, తెలుఁగునందలి పదము లైదుతెలుఁగులుగా నున్నవనియేకాని తెలుగుభాష యైదుతెలుఁగులని కాదని వారా "యాంధ్రభాషాభేద చతుష్టయము (లేక పంచకము)నకుఁ జెప్పినలక్షణమునుబట్టి మనము తెలుసుకొనవలసియున్నది.

"క. మును సంస్కృత పదములపైఁ
దెనుఁగు విభక్తులు ఘటించి తేటపడఁగఁ జె
ప్పిన నదితత్సమమనఁజను
వనము,ధనము,పురుషుఁ,డబల,వసుమతి యనఁగన్
(కేతన-ఆంధ్రభాషాభూషణము)

"తే. ఆంధ్రదేశపురస్థాయులైన సకల
జనములకును మఱుంగు దేశంబు లేక
తేటతెల్లమిగాఁ బల్కు మాటలెల్ల
నవని శుద్ధాంధ్రదేశ్యంబు లనఁగఁ బడును.
(అప్పకవీయము.)"

దీనినిబట్టి ఆంధ్రభాషాభేదము - అనగా నాంధ్రభాషాపదములయందలి భేదము అని యర్థమైనట్లు స్పష్టమగుచున్నది. అయితే ఒకభాషలోని కొన్నిపదములు మఱియొకభాషనుండి వచ్చిన వికృతులైనప్పుడాభాష యంతయూ దీనివికృతియని చెప్పవలసినదేనా? ఒకవేళ అట్లుచెప్పఁదలఁచినచో నీలక్షణకర్తలు చేసిన యాంధ్రభాషాపదముల విభాగములోఁ జేరిన దేశ్యపదములు, అచ్చతెనుఁగుపదములు అనునవి యాద్యప్రకృతినుండిగాని ద్వితీయప్రకృతినుండిగాని వచ్చినవికావే; ఈపదములతోఁగూడినభాషనే వికృతియని చెప్పఁదలఁచిన నది యెట్లుపొసఁగును. అను సందేహములు కలుగుట కవకాశములు లేకపోలేదు. దీనిని సావకాశముగఁ బరిశీలింప

వలసియున్నది. పూర్వలాక్షణికులు సంస్కృతము దేవతల భాషయని, దానియం దుండెడియభిమానముచేఁ గాఁబోలును "జనని సమస్తభాషలకు సంస్కృతభాష ధరాతలంబునఁ" అని ధరాతలంబునందలి (అనఁగా బహుశః హిందూదేశమునందలి) భాషలన్నిటికిని తల్లి భాషయే యని చెప్పఁగడంగినప్పు డాంధ్రభాష వికృతియనుటలో నాశ్చర్య మేమియు లేదు. ఇట్లు లాక్షణికులు సంస్కృతాంధ్రములకుఁ బ్రకృతివికృతి భావసంబంధమును నిరూపింప మఱికొంద ఱది జన్యజనకభావ సంబంధమే యని చెప్పుదు వీరెంటికి నభేదమును సాధించుచున్నారు. సంస్కృతభాషాభిమానము యొక్క విలాస మిట్లుండ, "ఆంధ్రవాఙ్మయచరిత్ర" కారులు:

"కాశ్మీరదేశమునందలి శారదపుల నివసించువారు మొదలు కన్యాకుమారికడ వసించువారివఱకు మాటలన్నియు సంస్కృత జనితములు; కొన్ని యనాగరకజాతులమాటలు, కొన్ని విదేశజులమాటలు నుండవచ్చును. వానికైన నుత్పత్తులు లేకపోవు. ప్రపంచభాషలకే సంస్కృతము తల్లిభాషయనుట యసత్యమని నాకుఁ దోఁపదు" అని సంస్కృతమే ప్రపంచభాషలకుఁదల్లియను వాదమును బలపఱచుచు, కాశ్మీరదేశమునుండి కన్యాకుమారివఱకు వ్యవహరింపఁబడుచుండెడిభాషలలో నెక్కడనైన కొన్నియనాగరకజాతులమాటలు(ఇవి దేశ్యములా!) కొన్ని విదేశజులమాటలు నుండినచో వానికిఁగూడ నుత్పత్తు లుండకపోవు. అనగా నేసంస్కృతధాతువునుండియో -ఇవియవంతములుగఁగలవుగావునను, "ధాతూ నామనేకార్థత్వా" త్తను సూత్రసహాయము చేతను— ఏదోయొక ప్రత్యయము కలుపుటచే వ్యుత్పత్తి కల్పింపవచ్చునని సూచించుటతో మాత్రము వారు తృప్తిఁజెందలేదు. ఇంకనేమనఁగా; నాంధ్రభాష యేప్రాచీనప్రాకృతమునుండియో వచ్చిన దనుటచేతను ఈప్రాకృతములు వేదకాలమునకే గ్రంథగౌరవమందిన సంస్కృతమునకే మాతృకలైన ట్లగపడుటచేతను, ఆంధ్రభాషయే సంస్కృతభాషకుఁగూడ జనని కావచ్చునని సూచించుచు, సంస్కృతభాషాభిమానముకంటెఁగూడ నెక్కుడగు మాతృభాషాభిమానమును వెల్లడించినారు. "కావున నాయూహచేఁ బ్రాకృతములలో నొకటియైన యాంధ్రభాషయు లిపియు, నవీన భాషయగు సంస్కృతముకంటెను, దేవనాగరలిపికంటెను ప్రాచీనములనితలంచుచున్నాను." (ఆం. వాఙ్మయ. చ. 26 పుట) కావున నిట్లాంధ్రభాష ప్రపంచభాషల కన్నిటికిని జననియగు (సంస్కృత) భాషకు జననీ—వృద్ధపితామహి—యగుచున్నది. ప్రపంచభాషల కన్నిటికిఁ గాకపోయినను ఇండోయూరోపియన్ కుటుంబమునకంతకు నీసంస్కృతమే తల్లిభాష యయియుండు నని శబ్దశాస్త్రజ్ఞులు తలంచినకాలము లేకపోలేదు. కాని సమీమర్శంబును సువ్యాప్తంబు నగు నవిరతాభ్యాసము చేసిన మీఁదట పాశ్చాత్యశబ్దశాస్త్రవేత్తలీసంస్కృతవాఙ్మయము ఇండోయూరోపియన్ కుటుంబమునకుఁ జెందిన భాషావాఙ్మయములలో నతిప్రాచీనమై, ప్రాచీన భాషాలక్షణముల నధికముగఁ జూపుచున్నను, గ్రీకు, ల్యాటిన్, జర్మానిక్, ఇంగ్లీషు మొదలగు భాషలు మఱికొన్ని ప్రాచీనతాములగు లక్షణములను జూపుచున్న వనియు, వీనికిని సంస్కృతభాషకును సోదరభావమే— అనగా నివియన్నియుఁ గూడ నతిప్రాచీనంబగు ఇండోయూరోపియన్ భాషనుండి వచ్చినవే-యనియు సనిదర్శకంబుగ నిర్ధారణచేసిరి. దీనికిఁదగిన నిదర్శనంబులఁ జూపుట కిచ్చట నవకాశముచాలదు; కాని యొక్క విషయము మాత్రము గమనింపఁదగియున్నది. యూరపుఖండము యొక్క పశ్చిమపుఁగొననున్న బ్రిటిషుద్వీప నివాసుల భాషయగు నింగ్లీషు, నెక్కుడైన మైళ్లదూరమున ఖండాంతరమందున్న యీసంస్కృతభాషకు, సమీపమున నొకదేశముననే కలసియున్న తెలుఁగుకంటె, సన్నిహిత సంబంధంబుకలదని మాత్రము మనకుఁ దెలియవచ్చుచున్నది.

భాషలసంబంధబాంధవ్యముల నిర్ణయించుటలో సరూపపదము లొకసాధనమనియు, నాసారూప్యము సహజమై యుండవలయునుగాని యొకవు తెచ్చుకొనుట వలనవచ్చినదికాఁగూడదని గదా సూచింపఁబడినది. అయితే మన వాఙ్మయచరిత్రకారులు సంస్కృతాంగ్లములకుఁగల సంబంధముకంటె సంస్కృతాంధ్రముల సంబంధమే సన్నిహితంబని తెలుపుటకుగా "సారూప్యపదములే జన్యజనకసంబంధమును, సన్నిహితత్వమును నిర్ణయింపఁగలిగినచో నీక్రిందియుదాహరణములవలన నాంగ్లేయభాష

తెలుఁగుకంటె సంస్కృతమునకుఁ జేరువగాఁ గన్పడును" (కాని నిశ్చయముగ నట్లుకాదు.) అని వ్రాయుచు నా క్రింది యుదాహరణములలో నేరీతిపదములయందు సారూప్యము కనఁబడినచో నవి యాభాషలసహజసంబంధమును సూచించునో అట్టిపదములనే కొన్నిటిని గైకొనిరి. అనఁగా నిందు నుదాహరణముగాఁ గైకొనిన పదములలోఁ గలసారూప్యము కేవలము యాదృచ్ఛికమే కాని కొన్నిటిలోనైనను సహజముకాదని యభిప్రాయపడినట్లు కనఁబడుచున్నది. ఇంతేకాక యిట్టిపదములయందుఁగల సారూప్యము సంస్కృతాంగ్లముల సన్నిహితత్వమును నిరూపింపలేదని యాయన తలంచిరిగావున "సారూప్యపదము లున్నంతమాత్రమున నాంగ్లము మనభాషకంటెఁ బ్రాచీనమైనదని కాని, మనభాషకుఁ దల్లివంటి దనికాని తలంచుటకు వీలులేదు" అని యాపైపదముల పరిశీలనవలనఁ దేలినఫలితముగా నొకయపూర్వ సిద్ధాంతమును జేసిరి. ఉదాహృతపదములలోని కొన్నిటికిఁగల సారూప్య మాభాషల సన్నిహితసంబంధము నెట్లు తెల్పుచున్నది ముందు చూపఁబడును. ఇంతేకాక మఱి కొన్నిటితోఁ గలవైరూప్య మాభాషలకు సన్నిహితసంబంధములేదనికూడ నెట్లు సూచించునది ముందే తెలుపఁబడును.

కావున భిన్నభాషలలోని రెట్టిపదములసారూప్య మెంతవఱకు వానిసాజాత్యమును వెల్లడించి నిర్ణయింపుచున్నది యనువిషయమును ముందు పరిశీలించి, తరువాత వా రుదాహరించిన యింగ్లీషు పదములలోని సారూప్యము యొక్కయు, తెలుఁగుపదములయొక్క భేదముయొక్క యీ లక్షణములను దానివలనఁ దేలుఫలితమును గూర్చియు విమర్శించుకొందము.

భిన్నభాషల కొక్కొకకాలమునఁ గలిగెడి సంపర్కమువలన నొకభాష మఱియొకభాషనుండి విశేషం బగుపదజాలము నెరవు తెచ్చుకొనుచుండును గావున, భాషాశాస్త్రజ్ఞుఁడు పదజాలము నుబట్టి భాషలసంబంధమును నిర్ణయించుటకై, నాపదములను గొంతజాగ్రత్తగాఁ బరిశీలింపవలసియుండునని పైనఁజెప్పఁబడియే యున్నది గదా! ఈపరిశీలనములో నాతఁడు చేయుపని యేమనఁగా నాతఁ డీపదజాలములో నేవి సహజములో యేవి యితర భాషలనుండి యెరవు తెచ్చుకొనినవో తెలిసికొనుటకు యత్నించును. ఈసందర్భమున నిజముగా భాషయనఁగా నేదో మనము గుర్తింపవలసియున్నది. ప్రతిభాషయందు నేయేపదజాలము ఏయేపదవాక్యసంఘటనారీతులు, సామాన్యముగా నాభాషమాట్లాడువారందఱకు సులభముగ నర్థమై, నిత్యవ్యవహారమున వారిచే వాడుకొనఁబడుచున్నవో, ఆపదములే, ఆరీతులే, ఆభాషకు సహజము లగుచున్నవి. అట్టిసామాన్యపదజాలమే నిజముగా నాభాషయని చెప్పఁదగియున్నది. ఇట్టిపదములు నిత్యపరిచితములగువస్తువులు, జంతువులు, వ్యాపారములు, గుణములు, మొదలగువానిని గూర్చిచెప్పునవియు; తల, ముక్కు, కన్ను మొదలగునవయవవాచకములు; తల్లి, తండ్రి, అక్క, అన్న, మొదలగుసంబంధవాచకములును; నేను, నీవు, వాడు, అను సర్వనామములును, సంఖ్యావాచకపదములు మొదలగునవియై యుండును. కాని శాస్త్రవిషయములకు, కళలకు సంబంధించిన పదములు గాని, మత, తత్త్వవిషయములకు సంబంధించినవి గాని యాభాషయం దెన్నియున్నను, అవి జనసామాన్యమున కర్థముగుననికాని, ఆయావిషయములవారికిఁ బ్రసక్తికలిగినపుడుతక్క యితర నిత్యవ్యవహారమునఁ బ్రయోగింపఁబడుచుండునని గాని చెప్పుట కవకాశము లేదు. అంతమాత్రమున నీపదజాలమంతయు నాభాషలోనిది కాకపోదు. కాని సర్వత్ర నిత్యవ్యవహారమునమాత్ర ముండదు.

కోశములందు సంగ్రహింపఁబడిన పదజాలములో నిట్టిపదము లనేకము లుండుటచే, నిత్యవ్యవహారమందున్న పదములసంఖ్య మిగులతక్కువదై యున్నట్లు కనఁబడుచున్నది. మఱియుఁ గోశములందలి పదజాలములోఁ గొన్ని పదము లొకభాషాపదములతో సారూప్యముకలవై మఱికొన్ని మఱియొకభాషాపదములతో సారూప్యము గలవైనచో నందెక్కువవంతుపదము లేభాషాపదములతో సారూప్యము కలిగియుండునో యాభాషతో దీనికి సహజసంబంధ మున్నదనికూడ మనము నిర్ధారణ చేయఁగూడదు. అనఁగాఁ గేవలసరూపపదముల బాహుళ్యమునుబట్టి కూడ మనము భాషలసాజాత్యమును నిర్ణయింపలేమనుట. ఇంక నేమనఁగా నాసరూపపదములు పైఁజెప్పిన నిత్యవ్యవహారములోనివై యుండవలయును. నిత్య

వ్యవహారములోనున్న పదములతోడిసారూప్యమే భాషాపదములకు విశేషముగాఁ గలదో యాభాషకు దానితోడిసాజాత్యము కలదని నిర్ణయింపవచ్చును. కాని భాషలసాజాత్యమును నిర్ణయించి కుటుంబములుగా నేర్పఱచుటకుఁ బదములగూర్చిన సంబంధ మొక్కటియే ప్రమాణము కాదనియు, నందలి వ్యాకరణాంశములును, వాక్యరచనా విధానమును, దీనికంటెఁ గూడ బలవత్తరమైన ప్రమాణములై యున్నవనియు నిదివరకే సూచింపబడినది. మనప్రస్తుతాంశము పదములవిషయమైనది. ఇంగ్లీషుభాషలో ననేకపదము లనేకభాషలనుండి, నాలుమూలలనుండి వచ్చిచేరినవి. ప్రపంచమునందుఁ బ్రఖ్యాతిగాంచిన దేశభాషలలోఁ దనపదముల నింగ్లీషుభాష కరువివ్వనిభాషయే లేదనుట యత్యుక్తిగాదు. ల్యాటిన్, గ్రీకు, హీబ్రూ, కెల్టిక్, ఫ్రెంచి, స్పానిష్, హిందూస్థానీ, చీనాభాష, అరవము, తెలుఁగు, మళయాళము, మొదలగుభాషలలోనిపదము లెన్నియో యాభాషయందుఁ గలసి తత్కోశములందు సంగ్రహింపఁబడినవి. తక్కినభాషలలోనిపదములమాట యటుండ, బ్యాండికూట్ (Bandicoot) జాగరి (Jaggery) జాక్ (Jack-fruit) మొదలగునవి తెలుఁగు, తమిళము, మళయాళములలోనుండి గ్రహింపఁబడిన వనేకములు కలవు. మొత్తముమీఁదఁ గోశములందలి 43566 పదములలోను, 29853 పదములు ల్యాటిన్ కుటుంబమునకుఁ జెందినవనియు, 13230 మాత్రమే ట్యూటానిక్ కుటుంబమునకుఁ జెందినవనియు, తక్కినవి మిగిలినభాషలనుండి వచ్చినవనియు లెక్కలఁజూచి తేల్చిరి. ఇట్లు పదముల సంఖ్యలనుబట్టి మాత్రమే చూచినచో నింగ్లీషుభాష ల్యాటిన్కుటుంబమునకే చేరియున్నదని చెప్పవలసివచ్చును. కాని యేదైన నొకచిన్నశాస్త్రంబుఁ దీసికొని యందొక పత్రమునందలి పదములను లెక్కపెట్టినచో తక్కినభాషలమాట యటుండ, ల్యాటిన్ కుటుంబమునకుఁ జేరిన పదములకంటెఁగూడ ట్యూటానిక్ కుటుంబమునకుఁ జేరిన ఆంగ్లోసాక్సన్పదములే యెక్కుడుగాఁ గన్పట్టును. నిత్యవ్యవహారమందలి పదములలోఁ గూడ నాంగ్లోసాక్సన్పదములే కాక ప్రత్యయములు, క్రియలు మొదలగునవికూడ విశేషముగఁ గన్పడుటచే, కోశమందలిలెక్కలెట్లున్నను, ఇంగ్లీషుభాష ట్యూటానిక్ కుటుంబమునకే చెందియున్నదని నిశ్చయింపఁబడియున్నది.

[సశేషము]

ముగ్ధప్రణయము

నాయని సుబ్బారావు, సాహితీసమితి

చిత్తమున నిన్ను భావించి చెవులుసోకు
ప్రేమఘంటారవోదితావేశవశత
పోదు నీమందిరద్వారభూమి దనుక!
అలసభావమ్ము న న్నంత నలముకొనును!

నీ పవిత్రోత్తమాంగ పూజాపరత్వ
మున విరిసికొన్న నాదులోచన సుమమ్ము
లభినవోన్మేష లజ్జాభరానతములు
ముకుళితమ్ములు నీ పాదపూజ కగును!

అంతవఱకు సుధా ప్రసన్నాతిమధుర
మోహనశ్రీకమైన నీ మోము దమ్మి
ముగ్ధలజ్జాద్యగంతమై మూడుచుకొనును!
భక్తునకు తగినట్టి దైవతమ వీవు!

తనువు ముచ్చెమ్మటలు పోసి తప్పిదారి
ఎట్టులో గర్భగుడి ప్రవేశింపగలను!
ప్రణయ భావాతి ముగ్ధదేవతకు నీకు
విమల కహ్లార నీరాజనమును పూని!

అదియు వణకెడు నాచేతులందు కలగి
పాడము నిట్టూర్పులో నారి పోవనిమ్ము!
చీకటులు బాపు నీ రూపు రేకలందు
నొక్కనిముసమ్ము వెలిగి ధన్యుడను నేను!

పిశాచం

శ్రీ వాసుదేవ రావు

"మనూ" జవాబు లేదు.

నాకు కోపం వచ్చింది. ఎందుకురాదు? నాకు జ్వరంతెగిలి కోర్టులో కూర్చోలేక యింటికి వచ్చాను. తలవాకిలి మూసివుంది. నాలుగు పిలుపులు పిలిచాను. తలుపుతీయ లేదు. ఎండలో నిలిచాను. ఎంతసేపు నిలవనూ? కాళ్లుగజగజావణికి పోతూన్నవి. తలుపు బద్దలయ్యేటట్టు కోపంతో కొట్టాను.

"మనూ! తలుపు." అన్నాను.

"ఆఁ!"

తలుపు తెరిచింది. నేను గడపలోపల అడుగుపెట్టాను. మను నన్ను చూచింది. నేనూ మనూముఖంకేసి చూచాను. మనూమొహం వెలవెలబారింది. గాభరాపడ్డది మను. నేను పలుక లేదు. మనూ నన్ను పలుకరించ లేదు. నాకంటే ముందుగా లోపలికి నడిచింది మను. నేనూ వెంటనే పోయినాను. మను వంటయింటిలోకి పోతూ తనగదితలుపు ముందుకు తోసుకుని వెళ్లిపోయింది. నేను నాగదిలోకివెళ్లి డ్రెస్సుతీసి మంచంమీద పరున్నాను. కాని, ఒంటరిగా వుండలేక పోయినాను. మనూగదిలోకి వెళ్ళాను పరుండామని. ఇటు తిరిగిచూచే సరికి మేజాబల్లమీద టోపి ఒకటి కనబడ్డది. వెండీబంగారు జరీ చంకీబుటేదారీపనితనం, బహు అందంగా ఉంది. చాలా వెలగలది. గొప్ప జమీందారుల కుండదగింది. ఎవరి దాటోపి? ఇక్కడి కెట్లా వచ్చింది? బల్లను సమీపించాను. టోపీని తీసి పరీక్షించాను. అది చిన్న పిల్లవానిదికాదు. నాయీడువానిది. నా తలకు సరిపొయ్యేది. నా కండెలో గుబిల్లు మన్నది. కడుపులో ఒక విధంగా వికారంపుట్టుకొచ్చింది. కన్నులు గిర్రున తిరిగి పోయినవి. నిలవలేక పోయినాను. కూలి అట్లే పడిపోయినాను.

ఆతర్వాత నేమి జరిగిందో నాకు తెలియలేదు. ఆస్థితిలో నేనెంత సేపున్నానో తెలియలేదు. కండ్లు తెరచి చూచేసరికి మను నాపక్కన కూర్చున్నది. ఒక్కచేతితో నాతల ఒత్తుతూన్నది. నేను కండ్లుతెరిచేసరికి నామీదవున్న మనూ చూపులు నేలవంకకు మరలినవి. పెదవు లింమక విడిపడినవి. పలువరుస కొంచెముగా కనబడ్డది.

"టీ చల్లారి పోతూంది. లేచి తాగుదురూ? సుస్తీగా ఉన్నారు. తలనొస్తున్నదా? జ్వరం తగిలి నట్టుంది." అన్నది మను.

నేను బదులు మాట్లాడ లేదు.

"టీ, తాగండీ, డాక్టర్ను పిలిపిస్తాను" అన్నది దైన్యంతో.

నిజానికేమిగాని, అప్పుడు నేను మానవ లోకంలో వుంటేనా? కడుపులో యెన్నెన్నో ఆలోచనలు పుడుతున్నవి. అంతరిస్తూన్నవి. ఎట్లాగో నాదృష్టి బల్లమీదనున్న టోపిమీదికి తిరిగి పోయింది. మాయం! టోపి బల్లమీద లేదు! మాయమై పోయింది. మనూవైపు చూచాను. మను తిరిగి తలవాల్చింది, చిరునవ్వు మొహానతోచింది. దాచేసింది. మాయలమారి! ఏమీఎరగనట్టు నాపక్కన కూర్చున్నది. ఒక్కనిమిషం అట్టే చూశాను.

"టీ, కాచి చాలాసేపయింది. లేచితాగుదురూ; మంచాని కడ్డంగా పరున్నారేల? లేచి సరిగా పరుండవచ్చు. కాళ్లు తీపులా? ఒత్తనా?" అని మను 'టీకప్పు' నాచేతి కందిచ్చింది.

నేను లేవలేక పోయినాను. ఎందుకు? పడ్డది పెద్ద బండ హృదయంలో! అట్టే తాగేశాను. కండ్లు మూశాను.

"డాక్టర్ని పిలిపించనా?" అని మను నాకాళ్లు పిసుకుతో టక్కు మొహంపెట్టి అడిగింది.

ఆచేతులు నాపాదాలమీద పడడంతోటే భగ్గున మండింది. కాళ్లు విదిలించుకున్నాను. మరో మొహం పెట్టి పరున్నాను? మనసు పరిపరి విధాలా పోతూన్నది. గుండెలు దడదడ కొట్టుకుంటున్నవి, మనసు విచారంలో మునిగి పోయింది.

"దాచేసింది! మాయలమారి! ఏమీయెరగనట్లు నటి స్తూంది! నేను చూడలేదనుకుంది! ఎందుకు దాచేసింది? ఏమీ భయంలేకపోతే యెందుకు దాచాలి? ఏదోవుంది! ఉంది. ఎక్కడ దాచింది? ఎక్కడ దాచి వుంటుంది! దొంగవస్తువు నింట్లో దాచిపెట్టుతుందా? ఏమో? నేను చూడలేదనుకుని యిక్కడే దాచరాదా? రేపోమాపో సమయం కనిపెట్టి యెవరిది వానికిచ్చివేయరాదా? ఇంట్లో నేవుంటుంది? ఎట్లా దొరుకుతుంది? ఉందో లేదో? వెదుకుతాను. ఏమను కుంటుందో? ఎందుకింతానుమానం అనుకుంటుందేమో! తాళంచెవు లిమ్మంటే యేమనుకుంటుందో? ఎందుకంటే ఏమనను? ఎదుటకాదు. చాటున వెదకాలె." అని నాలోనే ఆలోచించుకున్నాను.

"ఉస్సు! మనూ, నాకాయాసంగా ఉంది. ఒక్క గంటసేపు నన్ను నిద్రపోనీ. అంతవరకూ నాదగ్గరికి రాకు." అని నేనిటు మొగమై అన్నాను.

"అయితే, కాస్తసేపు నిద్రించండీ; వంటచేసి పెట్టివచ్చి డాక్టర్నిని పిలిపిస్తాను. ఒంటరిగా వుండలేకపోతే నన్ను కేక వేయండీ" అని మహాప్రేమతో అని మను వెళ్లిపోయింది.

నేను తలచినట్లు నాకొంటిపాటు చిక్కింది. తలుపులోపలవైపున గొళ్ళెంపెట్టాను గదిలో వెదక ఆరంభించాను. తాళపు చెవులగుత్తి తలగడ కిందవున్నది; తీశాను. పెట్టెలన్నీ తెరచిచూచాను. బీరువాలో వెదకాను. అల్మారులో పరీక్షించాను. బల్లసొరగులో చూచాను. లేదు. ఎక్కడాలేదు. ఇంతలో నేమైవుంటుంది? లేదు. ఇంట్లోలేదాటోపి. వానిది వానికే పంపించేసింది. అవకాశమేది? ఎంతవకాశంకావలె? ఎంతసేపుకావలె? గజంత! ఛీ-ఛీ!

తిరిగి మంచం మీద పడ్డాను. విచారంలో మునిగి పోయినాను. మనసు వేయి విధాల పోతూన్నది. ఏది నిజమో, యేది కాదో, యెవరు చెప్పగలరు? ఇంతకాలం నుంచీ నన్నెంతో ప్రేమిస్తున్న నామను యిప్పుడీలా చేస్తుందా? చేయకపోతే, తలుపు తీయడాని కింతాలస్యం దేనికి? నేను కోర్టులోనుండి వచ్చేవేళ కాలేదుకదా యింతలో రాననుకున్నది! మోసపోయింది. నేను తనగది లోకిప్పుడే రాననుకున్నది. రాకూడదనే కాబోలు తలుపులు ముందుకు తోసికొని తొరతొరగా నడచి దొడ్లోకి పోయింది? నేను నాగదిలోకి పోయి, డ్రెస్సుతీసేలోపలనో, కాక, తలుపుతీసే లోపలనో, గాభరాపడి తరిమివేసింది! ఆగాభరాలో, ఆహడావిడిలో, టోపి మరిచి పోయినాడు. మను తలుపుతెరిచింది! నన్ను చూచింది! కోర్టునుంచి ఈవేళ ముందుగా వచ్చినాననీ, అందులోనూ యీలాటి వేళ కానివేళకు వచ్చినాననీ, తెల్లబోయింది! నాకంటే ముందుగాబోయి నాకంట బడకుండ జాగ్రతచేసింది. నేను తనగదిలోకి వెళ్లననుకుంది; కాని, నాకర్మం, నన్నిక్కడికే లాక్కువచ్చింది. గట్టు బయటపెట్టింది టోపి! తిరిగి, యేమీ యెరగనట్లు, వగలమారి! ఎంతసాహసం! ఎన్నాళ్లనుంచీ యీలా జరుగుతున్నదో? ఒకసారి, రెండుసార్లుచేసే దొంగతనాలు బయటికిరావు. ఎంతోకాలం నుంచీ చేస్తూన్న దొంగతన మేఒక్కసారి బయటపడదలెవి. పాపఘటం నిండవద్దూ? నేడు బయటపడ్డది. రోజూ నింతే నేమో? ఇంక వేరేప నేముంది? నే నన్నంతిని కోర్టుకు వెళ్లిపోగానే పాయింత్ర మింటికి మళ్లీ వచ్చేవరకు—ఎంత తీరిక! ఇంతే నేమో! ఆహాహా! ఎంతకాలం దాగింది? నేను కండ్లుమూసుకుని పాలుతాగానా? ఎంగిలిపాలు తాగానా? ఛీ-ఛీ-వ్యర్థం నా జన్మ. ఈబాధపడడంకంటే వురిపోసుకుని చచ్చేదే మేలనిపిస్తూంది! ఇంతటి నిర్భాగ్యురాలైనదా మనూ? "మనూ, మనూ, ఎంతటిదానవు? ఎంతలో, ఎంతచేసినావే! నీప్రేమఅంతా నిజమనుకుని మహానందసాగరంలో తేలుతూన్నాను గదే! అన్నినటన అనుకోలేదే! మోసమనుకోలేదే! నీవగలు నాకు తెలియక మోసపోయినాను కదే! మనూ, మనూ! ఇంతటి నీచానికొడికట్టావే! అబ్బబ్బబ్బా! తల వూడిపడిపోయే టట్లున్నదే!" అని నాలోనేను పరిపరివిధాల ఆలోచనలో మునిగాను. దుఃఖం, కోపం,

అమాయ, మానభంగావస్థ, ఇన్ని అవస్థలూ, యింకా కొన్ని అవస్థలు, నన్ను దహిస్తున్నవి. నాతల చీలిపోతుం దేమో అనిపించింది. అంతలో నాతల రెండుచేతులతో పట్టుకున్నాను. అంతలో మను నాదగ్గరికి వచ్చింది. నాచేతులు మెల్లగా తొలగించి తన చేతులతో నాతల పట్టింది. ఈవగలువాకు తెలుసును! ఆచేతులు నాకు తగిలేసరికి నాదేహం గగుర్పొడిచింది! అరకాలి మంట నెత్తికెక్కింది! చేతులు విసిరేశాను. ఎందు కనుకుందో? నన్నోరచూపుల చూచింది. నేనూ ఆసమయంలోనే క్రీగంట చూచాను. చిరునవ్వు నవ్వడానికి ప్రయత్ని స్తూన్నట్లు కనబడ్డది. కాని, అరక్షణంలోనే, పెదవులు స్ఫురించినవి. కన్నులకుండా గంగ భవాని ప్రవహిస్తూ న్నది. దేనికి? వగలమారి! నా కామాత్రం వగలు తెలియ దనుకొన్నది పాపం !

"తలనొప్పి చాలా బాధగా వున్నదా? 'అమృ తాంజనం' రుద్దనా? పాంతిపాలు కలికంపెట్టనా? ఇట్లుంటే నేలాగా? నాకేమీ తోచటం లేదు. డాక్టర్ని పిలిపించనా?" అని ప్రస్ఫుటప్రేమతో, మహాదయతో అడిగింది మను.

వగలమారి! ఎంతప్రేమ? నాకొడలు మండ సాగింది. ఈవగలెందుకో? ఇంకెందుకుంటుంది? చేసిన నేరం దాచడానికే! నాకు అనుమానం కలగ కూడదనే! ఇంతమాత్రం చేతనే నాకండ్లు కప్పేయగలదా! పెట్టింది పెద్దటోపినాకు! ఇంతకాలంనుంచీ కండ్లుమూసికునే వున్నాను. దాచింది—ఎంతకాలందాగుతుంది? ఎంతదా చినా నిది దాగుతుందా? పాపం నిండింది. బయటపడ్డ దీవేళ! మనూ, నామనోహరి, యింతటి విశ్వాసం మాలిన దైనదా? నామనోహరి, నన్నింతో ప్రేమిస్తూన్న నామ నోహరి, నన్నే పరమదైవంగా భావిస్తూ సకలవిధాలా నన్ను సుఖానందసాగరంలో తేలుస్తూన్న నామనోహరి, నేటికి అటోపీవాని మనోహరి—అంతలో నాకండ్లు గిర్రున తిరిగి పోయినవి. అట్టే దిండు మీదికొరిగి పోయి నాను. లోకంమరచి పోయినాను. ఎప్పుడువచ్చిందో మను, నాకు తెలియలేదు. నన్ను లేపింది. గడియారం పదకొండు కొట్టింది.

"ప్రొద్దున పదిగంటలకు తిన్నఅన్నం, మధ్యాన్నం కూడా ఫలహారమేమీ పుచ్చుకోలేదు, రాత్రి రెండు ఝాము లైనవి. రెండు మెతుకులు మిరియాల చారులో కలిపి యివ్వనా? ఇట్లా గుంటే శోష వస్తుందేమో!" అని అన్నది మను. అప్పటి ఆమె ప్రేమ, దయా, జాలీ, పూర్వమెప్పుడో నేను కల్లో అనుభవించినట్లు నాకు తోచింది. మొదటినుంచీ యింతే, ఇంకా యింతకంటే యెక్కువే! కాని, యిప్పటి యివన్నీ వగలు! ఈస్థితి లోనే నాకు నవ్వువచ్చింది! మనూ నన్నోరగంట చూ చింది! తిరస్కారంగా నవ్వినాననుకున్న దేమో! తల వాల్చింది!

"పలుకరూ! చారులో అన్నంకలిపి యివ్వనా!" అని తిరిగి అన్నదిమను.

"ఉఁహుఁ!"

"బార్లీ జావ కాచి యివ్వనా ?"

"ఊహుఁ!"

"లంఖణ ముంటారా?"

"ఉఁ!"

"శోష వస్తుందేమో, ఇంత పాలైనా—"

"నాకేమీ అక్కరలేదు. నన్నూరికే బాధించ వద్దు!" అని నేను కసిరాను.

అప్పు డామె కండ్లనుండా ముత్యాలు రాలినవి. మెల్లగ నాపక్కనుంచి లేచి వెళ్లిపోయింది. వెంటనే తలుపులన్నీ మూసిన చప్పుడు వినబడ్డది! తాను భోజనం చేయందే తలుపు లన్నిమూస్తూన్న దే!—వెంటనే వచ్చి కూర్చుంది నాపక్కన! నేను మొంగ మావలివైపునకు తిప్పు కున్నాను. మను నాకాళ్లొత్త నారంభించింది. కాళ్లు తప్పించుకున్నాను. అట్టే కూర్చుంది. ఎంతసేపు కూర్చుం దో నాకూ తెలియదు. నాలోకంలోనేనుండి పోయి నాను.

మను నన్ను నిద్రలేపింది. కండ్లు తెరచాను. సూర్యుడు తన కిరణాల్ని మాగదికిటికీ గుండా పంపి నన్నుతట్టి లేపుతున్నాడు.

"చాలా పొద్దెక్కింది. కాఫీ చల్లారిపోతూంది. వేడివేడిగా ఒక్క కప్పుపుచ్చుకుంటే—"

లేచాను దంతధావనమయింది. కాఫీ గుటక వేశాను కాని, కాఫీ రుచిగా ఉండ లేదు.

"మొఖం చిట్లిస్తున్నారు. కాఫీ చల్లారిందా?"

"ఊహుఁ!"

"బాగుండ లేదా?"

"ఊఁ!"

"పైత్యం చేసిందేమో?" అన్నది మను.

కాని, నేడు కాఫీ రుచిగా వుండకపోవడం దేనికి? ఎప్పుడూచేసే చేతులే నేడుచేసినవి. ఎప్పుడూ యిచ్చే చేతులే నేడు యిచ్చినవి. కాని, కాఫీలో మాత్రం యెప్పుడూవుండే రుచి నేడు లేదు. విషప్రాయంగావుంది! ఎట్లాగైతేనేమి. ఏదిలేకపోయిన వుండగలను గాని, కాఫీ లేకుండ నేనొక్క-క్షణ ముండలేను. ఒక్క గుక్కన తాగేశాను, కషాయంతాగినట్లు! పడక కుర్చీలో పడ్డాను.

"సిగరెట్ కావాలి? ఎందుకూ? ఇవి మా పెద్దుకూ" అన్నది మనూ 'సిజర్సు' ఒకటి నాకు చూపుతూ.

'సిజ'ర్సొకటి ముట్టించాను. ఆలోచనలో మునిగాను. పావుగంటలో మను నాదగ్గరకువచ్చి పక్కన కుర్చీలో కూర్చుంది. నాపొట్టమీద చెయిపెట్టి చూచింది.

"కొంచెంగా తగ్గిందికాదూ జ్వరం?"

నేనా మొహం తేరిచూచాను. చిరునవ్వు నవ్వింది మను.

"పలకరూ? ఆయాసంగా ఉందా? పలకనివ్వటంలేదా? నిన్నటినుంచీ నాతో మాట్లాడలేదు. జ్వరం తగిలింది కదా, ఆయాసంగా ఉందేమో అనుకున్నాను. ఇప్పుడు కొంచెం తగ్గిందిగా! యిప్పుడూ పలుకరూ? పావుగంట, మాట్లాడుకుందాము. వంట త్వరగా చేయాలేకాదా! ఈవేళ కోర్టుకు వెళ్లడమెట్లు? పోకుడామా! వద్దు. శరీరం బాగుంటేనే అన్నీ! 'లీవ్ లెటర్' వ్రాసి పంపుదురూ!"

"వగలు! నేను కోర్టుకు పోతానో లేదో తెలిసికోవటానికే వన్నెగడ! పోతే పిలిపించుకోవచ్చును. పోకుంటే పెండలాడే రావద్దని కబురుపంపవచ్చును! వగలమారి! ఎంత గడుసుతనం! నా కివన్నీ కొత్తలుకావు. కాని యిప్పుడన్నీ కొత్తలే! విపరీతాలే! వగలే! విచిత్రాలే!" అని యింక నేమేమో నాలో నేనాలోచిస్తూన్నాను.

మను మళ్లీ యిట్లన్నది: "ఈలా పలక్కుంటే నాకేమీతోచటంలేదు. నేనేమనుకోవాలె? ఒంట్లో ఫలానిజబ్బుగా వుందని చెప్పితేనా? ఒంటరిదాన్ని, నాకేమి తోస్తుంది? పలకరూ?"

నేను పలకదలచుకొని వుండలేదు. కండ్లుమూసికున్నాను. మళ్లీ నావిచారంలో మునిగి పోయినాను.

"అడుగనా? ఏమనుకుంటుందో! ఆటోపి యెక్కడదాచిందో? అడగనా? చెప్పునా? ఇంట్లో దాచివుంటుందా? అమాత్రం ఆలోచన మనూకూ తోచకుంటుందా? ఇంట్లో దాచితే చిక్కుతానేమో అని భయం లేకుంటుందా? ఇంట్లో దాచలేదు, నిశ్చయం. కాని, ఆటోపీరేమిటో, అది యెవరిదో, వాడెందుకువచ్చాడో అడిగి అనుమానం పరిష్కారం చేసుకుంటే నయం. కాని చెపుతుందా? నిజం ఒప్పుకుంటుందా? ఒప్పుకోవకపోతే మరి టోపీ సంగతియేమి? నాకండ్లతో చూచానే. ఒప్పుకోక పోతేమాత్రం నమ్ముతానా! నిజం చెప్పేవరకు మానుతానా! చెప్పేతీరవలెనుగాని, దాచ శక్యమా! చెప్పితే, నేరం ఒప్పుకుంటే, తన అధఃపతన చరిత్రం తన నోటిగుండా మనూ చెపుతూండగా ఈచెవులతో నేనూ వినవలసిందే! ఛీఛీ! దుర్భరం, అసహ్యం! వదలే నీబాధ. అంతకంటే వురిపోసికుని చస్తేనే మేలు! కాని, యీలాటి అనుమానాలచేత బాధపడడంకంటే ఒక్కసారే యేదో ఒకటి తేలుతుంది కదా! అడుగుతాను. కాని, అట్లయి వుంటుందా? నామను ఇంతటి విశ్వాసఘాతుకపు పనిచేసి వుంటుందా? నన్నుగాదని యింకొక్కనికి తనప్రేమ—నాయందలి ప్రేమలోభాగం—ఇచ్చి వుంటుందా? ఇంతటి నీచానికి పాల్పడి వుంటుందా? ఏమో! అయినా, అడిగితే మంచిదే! ఏదొకటి తేలితే మంచిది."

అని నాలో అనుకున్నాను. ఇటు మొగమైనాను.

"మనూ,"

మను చిరునవ్వు నవ్వింది, అందులోనూ విషాదం కలిసీవుంది. దుఃఖం కలిసీవుంది. కాని, నవ్వుమాత్రం అరువు తెచ్చుకుందని స్పష్టంగా కనబడ్డది. ఎప్పటి ఆ చిరునవ్వు మొహం నేనెరుగనా? ఎప్పటి నవ్వుకాదు; ఆమొహముపైన యెప్పటి కళా లేదు.

"ఏమి?" అన్నది మను.

ఊరుకున్నాను. ఆలోచనలో పడ్డాను.

"ఏమనుకుంటుందో! నన్నెంతటి వాణ్ణిగా భావిస్తుందో! కేవలం మూర్ఖుణ్ణి అంటుందేమో! పట్టి అనుమానపు మనుష్యుడంటుందేమో! అంతేమాత్రం అయితే నయమే! తనపై నేరం మోపినానని, తన నడతనుగూర్చి, పాతివ్రత్యమును గూర్చి, శంకిస్తూన్నానని, భరించలేక, దొందులోనైనా పడి—అలాగైనా నాకొంతమేలే! ఈలాటి విశ్వాసఘాతకురాలు, ఈలాటి పగలమారి పిశాచి; ప్రపంచానికి బరువు—స్త్రీలోకానికి అపకీర్తి—నాకు తలవంపులు."

నాకు మళ్లీ తలనొప్పి సాగింది. నాతల బద్దలై పగిలి పోతుందేమో అని తోచింది. అదీ సమాధానమే. తల బద్దలైతే ప్రాణం పోతుంది. ప్రాణంపోతే ఈఅనుమానం వదులుతుంది! కాని, కాలేదు. మనూ నాయెదట వుండడం నాకిష్టం లేదు.

"వంట పని యేమీ లేదా? ఈలాకూర్చున్నావు?" అన్నాను నేను.

"ఇక్కడ ఈలాగుంటే నాకేపని తోస్తుంది? వంట యెంతసేపు కావాలి?"

రాత్రిభోజనం లేదు. ఎండెక్కుతోంది. ఇంతవరకూ వంటపనికి మొదలుపెట్టలేదు. అనుమానంవల్ల, కోపంచేత, అసూయతో, నాపొట్ట నిండేవుంది. ఆకలి వేయడం లేదు. మనూకో? రాత్రీభోజనం లేదు. నాపాదాలకడ వాలి నిద్రపోయిందికదా! నాకు జాలి పుట్టింది.

"మనూ, వంటపనికి ప్రారంభించు" అన్నాను.

"వంట యేంచేయను? ఏది సహిస్తుందో చెపితే వండుతాను." అని మను మహాదరంతో నన్నది.

నే నూరకున్నాను.

"ఏమి కూర వండనూ?"

"ఏదో ఒకటి వండుదూ!"

మను లేచి తొందర తొందరగా నడిచి పోయింది. తిరిగి వచ్చింది.

"ఒంటరిగ వుంటారా? కుర్చీ వంటయింటో వేస్తాను. అక్కడ కూర్చుంటే మాట్లాడుతూ వండుతాను. ఇక్కడ నొంటరిగా వదలి అక్కడ నాకేమీ తోచదు. మాటిమాటికీ యిక్కడికి వస్తా మంటే వంట..."

"అక్కరలేదు. వంటత్వరగాచేసి వచ్చి చెప్పు."

మను వెళ్లి పోయింది. తిరిగీ నాలోకంలో నేనుండిపోయినాను. ఎంత ఆలోచించుకున్నను అనుమాన పిశాచం నన్ను వదలింది కాదు. మను చాటున ఉన్నంతసేపూ అడిగి నాఅనుమానం పరిష్కారం చేసుకుందా మనుకుంటాను. మను నాయెదుటికిరాగానే అంతా మరపు. అనుకున్నదంతా మరచిపోదును. నోట మాటేరాదు. లోలోపలనే బాధ, లోలోపలనే తర్కవితర్కాలు. అబ్బబ్బ; ఆబాధ నాకే తెలుసును. ఆ పరమేశ్వరుడికే తెలుసును.

ఈ విధంగా వారం రోజులు గడచినవి. నేనంతగా మనూను పలకరించ లేదు. ఆమె ముఖ మెప్పుడు చూచినా విచారం తోనే వుండేది. తన దొంగతనం నాకు తెలిసినందుకు లోలోపలనే కుళ్లుతూన్న దేమో! ఆవిడకే తెలియవలె.

నాకు జ్వరం నిమ్మళించింది కాని, నన్ను పట్టి పీడిస్తూన్న పిశాచంమాత్రం నన్ను వదిలిందికాదు. మరింత తీవ్రంగానె పీడించ సాగింది. నేననేకవిధాల నామనసును సమాధాన పరచుకోన యత్నించాను.

"మను ఇంతటి విశ్వాసఘాతకురాలేనా? నామను ఇట్టి తుచ్ఛపు పనికి లొంగునా? ఎవరైనా నమ్ముదురా? బ్యాంకు దివాలాలో నాపూర్వార్జితం సొమ్మంతా పోగా నేను విచారిస్తూంటే, నాపక్కలో కూర్చుండి, నాభుజాన తన తలచేర్చి, నాకంఠాన్ని తన రెండుచేతులా పెనవేసికొని, చిఱునవ్వు మొహాన చిందులాడుతుండగా నన్నెంతగా ఓదార్చింది! "ఇంత మాత్రానికే యింత విచారం దేనికి? ఒక్కనాడు విచారంలో వుండడంతోటే శరీరం జబ్బుచేసి నానాబాధలూకలిగి శరీరంపాడై పోతుంది కదా! మళ్లీ నెలరోజుల దాకా మనుష్యులలో కలవరు కదా! ఇంత మాత్రానికే యెంత కాలం విచారిస్తూంటారు! వెధవడబ్బు! డబ్బును మనం సంపాదించామూ, డబ్బు మనల్ని సంపాదించిందా? పోతే మానె, వెధవడబ్బు! ఉన్నప్పటినుంచీ భయమే, విచారమే. ఉన్నవాళ్లకంటే లేనివాళ్లే యెక్కువ సుఖపడ

తారు. చూడండీ! బ్యాంకులో డబ్బు పోయిందంటే, అన్నీ పోయినవా? నావంటిమీది నగలున్నవి కదా? అవీ పోయినా మానె? శరీరం కులాసాగా ఉంటే యెంత సంపాదించ లేరు! పోయినంతా సంపాదించలే మనుకోండి. మనకు ముఖ్యంగా కావలసినంతమాత్రం సంపాదించలేరా! అందులోనే మితంగా వాడుతూ నెలకేదో కొంత వెనక వేసుకుంటే అదేచాలును. పైగా యింకా యెన్ని లాభా లున్నవో చూడండీ! వంటవాళ్లతో పని లేదు. నేనే నాచేత నైనట్లే వండిపెడతాను. మీకు సకలమైన ఉపచారాలూ చేస్తాను. ఇప్పుడు నన్ను సుకుమారిగా కూర్చో పెట్టి వున్నారు. అన్ని పనులకూ నౌకర్లున్నారు. అందరితోనూ అవసరం లేదు. అన్నిటికి నేనున్నాను గదా! ఈమూలాగైనా మీపాదసేవ చేసే పుణ్యం, భాగ్యం, సంతోషం, నాకు కలుగుతుంది ఇంత పెద్దిల్లు మన కెందుకు? అద్దె కిచ్చివేసి మనకు సరిపోయే చిన్నయిల్లొకటి మన మద్దెకు పుచ్చుకుందాము. ఇల్లు శుభ్రంగా ఉంచి ముందరి భాగంలో సీమపూల మొక్కలూ, నాటు పూలచెట్లూ నాటి నేనే నీళ్లు పోసి పెంచుతాను. గులాబీమొక్కలు నాప్రాణం కదా! వెనుక దొడ్డిలో కూరతోట వేసి పెంచుతాను. కూరలకు పనికి వస్తవి. అప్పటికీ యిప్పటి సంపాదన చాలక పోతే, ఉన్నవి కదా నావంటి మీది నగలు! కాలక్షేపం చేయ లేమా! ముఖం తేలవేశారేల? నగలు పోతవని విచారమా! అందరూ నగలు పెట్టుకొన్నవారే ఉన్నారా? నగలైనా దేనికి! ఈలాటి చిక్కులకు పనికి రావడానికేనా? పోనీండీ. నా కావిచారం లేదు. సింగారించుకొనే దాన్ని నేను. నేనే నా మనస్పూర్తిగా నానగలన్నిటిని మీ స్వాధీనం చేస్తున్నాను. ఇంక మానవచ్చు మీ విచారం. ఒక్క నవ్వు నవ్వండురూ! నేను చూడలే నీవిచారం. సంతోషంతో వుండురూ! డబ్బు సంపాదించడానికి ఒంట్లో బలం వున్నది. విద్యావున్నది. కావలసినంత వుపచారం చేయడానికి నేనున్నాను. ఇంకా విచారమెందుకూ? లేచి "టీ" పుచ్చుకోండురూ! చల్లగ చల్లారి పోతూంది" అని యింకా పరిపరివిధాలా నాదుఃఖమంతా పోగొట్టి నన్ను సమాధానపరచిన ఆమనూకా యీ దుర్బుద్ధి?

ఆపెద్ద యిల్లు విడిచి మేమీ యింటికి వచ్చినప్పటినించినీ సకలమైన వుపచారాలు చేస్తూ నన్ను సుఖ పెట్టుతూన్న ఆమనూకా యీ దుర్బుద్ధి? ఇది నమ్మవచ్చునా? ఏమో? ఎందుకునమ్మకూడదు? అప్పుడూ నావద్ద పుట్లకు ధన ముండేది. ఆవిడ ఒంటిమీద కావలసినన్ని నగలుండేవి. ఇప్పుడు డబ్బు పోయి పేదవాణ్ణి అయినాను. నగలలో కొన్ని అమ్మేసినాను. కాబట్టి యీ దుర్బుద్ధి ఆవిడకు ఇప్పుడు పుట్టివుండకూడదా? ఛీ! ఛీ! అట్లవునా? నామనూ నేనెఱుగనా? ఇంతకాలం నుంచీ యెంతో ప్రేమతో వుండిన మను యిప్పుడు దరిద్రుడైనావని తన శీలం విక్రయిస్తుందీ డబ్బుకోసం? నమ్మవచ్చునా? నమ్మకపోవడాని కాధారమేది? స్త్రీలమనసులోతు బ్రహ్మదేవుడికైనా తెలియదట. ఇంక నాబోటివారికెట్లా తెలుస్తుంది? అటుగాక పోతే అన్ని పురాణాల్లోనూ యెందు కిదే మాట రేకరు పెట్టాలే?

ఛీఛీ! నిరర్థక మీ జన్మ. నిష్ప్రయోజన మీ బతుకు.

--

ఈవిధంగా యింకా నానావిధాలా ఆలోచనలో తర్క వితర్కాల్లో మునిగాను. ఆలోచనకు అంతు లేదు. అనుమానం పుట్టనే కూడదు. పుట్టిందా పెద్ద పిశాచం పట్టినట్టే వదిలించుకోవడం బ్రహ్మతరం కాదూ? అందులో ముఖ్యంగా భార్య నడత విషయం అనుమానం బ్రహ్మరాక్షసి పట్టినట్లే. నా మనూమీద నాకెప్పుడు నేలాటి యనుమానం కలగలేదు. సరళమనస్క—విశాల హృదయ—దయామయి. అన్నీ బాగానేవున్నవి. కాని, యిప్పుడు కలిగిందనుమానము. వదిలించుకోవడమేలాగా? పట్టి పీడిస్తూన్నది. నా మనసులోనున్నది ఇది అని మనూకెట్లా తెలుస్తుంది? ఈ నెల రోజులనుంచీ చూస్తూ వున్నాను. ప్రతి విషయంకూడా పరీక్షిస్తూనే వున్నాను. నడతలో అనుమానం సరేకదా! నడకలో అనుమానం, కన్నీటిలో అనుమానం, మాటలలో అనుమానం, ఆచూపులలో అనుమానం, నాయెదుటవస్తే అనుమానం, చాటున వుంటే అనుమానం, అన్నీ అనుమానాలే! ఎన్నివిధాలింకా పరీక్షించవచ్చును? ఎంత కనిపెట్టితే మాత్రమేమి? కన్నులు కప్పివేయలేమూ? మూతి బిగించివేయ లేదా?

పోనీ, అడుగనా? అనుమానం తీర్చుకొందునా? నిజం చెప్పుతుందా? నేర మొప్పు కుంటుందా? పైగా అనుమానించానని యెందులో నైనా పడి చస్తే! ఆపరాభవం నాకే! ఛీ!ఛీ! ఇంకా చూదాం; ఇంకా చూదాం.

అని నానాటికీ నేను కృశించిపోతూ వున్నాను. మనస్సులోని వేదన మనస్సుకే తెలుసును. మనసులో నిలకడ లేదు. బుద్ధి పాడై పోయింది! మెదడు బరువయింది. బలం క్షీణించింది. చిక్కి శల్యమై పోయినాను. మంచంమీదనుంచి లేవ లేక పోయినాను. మనూ మహాశ్రద్ధతో నాకుపచారాలు చేసేది. కాని, ఆవుపచారాలు నాకింపుగా ఉండేదికాదు. చేయి నాకు సోకితే ముండ్లకంపగా తోచేది. మాట్లాడితే వెగటుగా తోచేది. ఎదురు వస్తే పెద్దదయ్యాన్ని చూచి నట్లయ్యేది. చాటుకు వెళ్లిపోతే అనుమానం. ఈలా వున్నది నాస్థితి.

నేను వద్దన్నావినక మను డాక్టర్ని పిలిపించింది. ఆయన నన్ను పరీక్షించాడు. రోగం ఫలానిదని నిర్ణయించలేక పోయినాడు. ఏదో ఒక మందిచ్చాడు. నా రోగం సంగతి డాక్టరు కేలా తెలుస్తుంది? దగ్గర వున్న మనూకే తెలియదు. చేయి పట్టిచూస్తే తెలుస్తుందా? మందిస్తూన్నాడు. నేనూ పుచ్చుకుంటూన్నాను. వ్యాధి కుదరదు. కొంతకాలం గడిచింది! మందు ఒంట పట్ట లేదు. ఏలా పట్టుతుంది? రోగ మొకటైతే మందు వేరొకటి! తెలియకనే అన్నారా 'మనోవ్యాధికి మందు లేదు!' అని! మరీ వాడిపోయినాను. కండ్లు గుంటలు పడ్డవి. బుగ్గలు సొట్ట పడ్డవి. నారూపమంతా మారిపోయింది! వికారాకారం దాల్చాను. పలకలేను. చేతులు కదిలించలేను. అన్నహితవు తప్పింది! నాస్థితి నాకే తెలియాలి! ఆదేవుడికే తెలియాలె! ఒక్క నెలరోజుల్లోనే నేను జీవచ్ఛవ మైపోయినాను.

ఈమధ్య ఒకటి రెండు మార్లు నిద్రాదేవి నన్ను కదిలించింది. కాని, నాలోపల వున్న అనుమానపిశాచం ఆమెకు నన్ను లొంగనిచ్చింది కాదు. నిద్రాదేవి నా పిశాచాన్ని వదిలించడానికి ప్రయత్నించింది. కాని, సవతిమచ్చరం ఎక్కడికి పోతుంది? ఇద్దరూ పోట్లాడినారు. ఒకనాడు నిద్రాదేవి నన్ను ఆవహించింది. ఎంత సేపామె అధీనంలో వున్నానో నాకు తెలియలేదు.

ఉన్నట్లుండి నామొహం మీద నీళ్ల చుక్కలు నాలుగైదు పడ్డవి. కండ్లుతెరచి చూచాను. మనూముఖం ఆవలికి తిప్పింది. నాతలవేపున కూర్చుండి నాతల పిసుకు తూన్నది. పైటచెరగుతో కండ్లు తుడిచికొన్నది. నాకు మహాకోపం వచ్చింది! "మాయ" అన్నాను కోపం పట్టలేక. నాతలమీదనున్న చేయి విసరేశాను.

"నిద్రాభంగ మయిందా? క్షమించండి. పాపిష్ఠురాలిని!" అని మను మనస్సు నొచ్చుకుంటూ దైన్యంతో అన్నది. కండ్లు కన్నీరు కారుస్తున్నవి. నేను చూడ లేక పోయినాను!

"మాయ"! అన్నాను మళ్లీ.

"ఏమి మాయ! ఎందు కట్లా కసురుతారు? బాధ అవుతుందా? నన్ను కాళ్లు పట్టనీయరు, తల ఒత్తనీయరు, నన్ను చూడడంతోటే మొహం మావల తిప్పుకుంటారు. నేను దగ్గరవుండడం కిట్టలేదా? ధుమధుమ లాడుతారు, విసుక్కుంటారు, కండ్లు మూసుకుంటారు. ఎప్పుడూ ఇట్లుండలేదే! నాచేతులూ తగలనీయడం లేదు. నేనేమి చేయపోయినా మీకింపుగా వుండడం లేదు! కారణ మేమిటో? నేనేమిచేశాను? మీకు మనసుకురాని పని నేనేమి చేశాను? నన్నెందుకు కసురుతారు? మీకు నేను భారంగా తోచానా? నా సేవలు మీకు రుచించడంలేదా? చెప్పదురూ, నేను చేసిన అపరాధ మేమిటో? ఇన్నాళ్లుచూశాను. ఓర్చుకోలేక ఓర్చుకోలేక ఓరుస్తూన్నాను. ఈకసురులు, ఈనిరాదరణ, ఈకోపంతోటి చూపులు, ఈపెడమొగం, ఈవెత, ఇంకా యేమి కావాలె? డాక్టర్లు జబ్బేమీ లేదంటారు. మందు ఒంటబట్టలేదాయె. డాక్టర్లకు తెలియనిజబ్బు—నాకు తెలియని జబ్బు—కడకు మీకూ తెలియని జబ్బు—ఆజబ్బేమిటి? ఆలోచిస్తే యేదో మనోవ్యాధి పిమ్ముపట్టి పీడిస్తూన్నట్లున్నది. కాకపోతే యింతలోనె యిట్లవుతారా! చిక్కి శల్యమై పోయినారే! ఎందుకు వచ్చిన జబ్బు! మీ మనోరోగాని కేదో కారణముండాలె కదా.

"నీవే" అన్నాను. తటాలున నోరు జారింది.

"నేనా? నేనా? నేనేనా మీ మనోవ్యాధికి కారకురాలిని? నేనేనా మీ యీ దుర్దశకు కారకురాలిని? అయ్యో; చెప్పరైతిరే! ఈమాట వినీకూడా నాప్రాణా

లు లేచిపోవే! నెత్తిమీద నా పెద్దపిడుగు పడరాదా! ఈమాట వినలేను; ఈనింద భరించలేను; ఈపరాభవం సహించలేను. అయ్యో అప్పుడే చెప్పివుండరాదా? వుండరాదా? తన ప్రాణాలకంటెనూ ప్రాణంగా, తనకంటి రెప్పలకూ రెప్పలుగా, నన్ను రక్షిస్తున్న మీ కింతటి దైన్యం—ఇంతటిదుఃఖః—కలిగించి, యింకను ప్రాణా లుపట్టుకొని వున్నానే! ఎంతటి పాపిష్ఠురాలిని! మీచేతులతో నన్ను చంపండి! ఈయాతన కోర్చలేను. ఈబాధను అనుభవించలేను." అని అంటూ మహాదుఃఖముతో మను తూలి నామీద పడ్డది:

"ఛీ, కులభ్రష్టురాలా; నీముఖం చూడవచ్చునటే! ఎంతటి వగలాడివే! నీవు నాకు భార్యవేనా? ఎందు కీవగలు? ఇంతకాలంనుండి అట్లే అనుకొని నమ్మాను. నీమాయమాటలకు లొంగాను. నీ కపటప్రేమపాశంలో చిక్కుపడ్డాను. నీరూపదీపానికి శలభమైనాను. వగలమారీ, బంగారుపూతబొమ్మ వనుకుని భ్రాంతిలో చేత పట్టుకున్నాను. అది అవిరైగాలిలోకలిసి మాయమై పోయింది. పూలదండ అని తలచి మెడలో తగిలించికున్నాను. నాకు బామైకరిచి విషంయెక్కింది. నీళ్లు అని భ్రమిసి దిగాను. ఊబిలో దిగబడ్డాను! వానచినుకు అనుకుని ఆత్రంతో నోరు తెరిచాను. పెద్ద పిడుగు అయింది! నీమరాలా! నీమూలాన నా పేరు మాసింది! ఆనాడు, మన డబ్బంతా బ్యాంకులో దివాలాకాగా, అందుకు నేనుదుఃఖిస్తూంటే... ఇంకాబతికియెందుకని నేను చావసిద్ధమైతే, అప్పుడు— అప్పుడు—నీవు, వగలమారి! నీవు, నన్నెంతగా సమాధానంచేసినావే! ఎంతగా దుఃఖాన్ని చల్లార్చినావే! వదులుటకు నిశ్చయించుకున్న నాప్రాణంమీద తీపి నాకెంతగా తిరిగి పుట్టించినావే! మనూ! అమనూ నీవేనా, నీవేనా! మనూ, మనూ! నన్నెంతగా మోస పుచ్చావే! నేనూ నీభావం తెలియక యింటిలో నీవుపన్నినవురిలో తగులుకొన్నానే! అన్నిటికీ, మీకు కావలసిన వుపచారాలు చేయడానికీ, నేనున్నానంటివే! వెధవ డబ్బు పోయినందుకు ఇంత విచార మెందుకంటివే! ఎంతో ప్రేమ వూడిపడినట్లు నటిస్తివే, తెలిసింది; నీవగలు! ఛీ! ఛీ! నీమొహం చూస్తేనే పారెకం చుట్టుకుంటుంది. ఛీ!ఛీ! దురాత్మురాలా!" ఇంకే మాటాడలేక పోయినాను. ఆవేశం పెరిగింది. అశక్తుడనై పోయినాను, నాలుక యెండబారింది. గుండె దబదబలాడింది. పడపోయినాను. కన్నులు మూతలు పడ్డవి. మను యేమీ మాట్లాడలేదు. శాంతభావంతో నా నా మొహం మీదనే తన చూపులు నిలిపింది. కాని, ఆకండ్లలో గంగాయమునాసంగమం అయి మహావేగంతో ప్రవహిస్తూన్నది. ఉస్సుమని నిట్టూర్పులు మాత్రం వినబడుతూన్నవి.

ఎంత సేపటికో, నాకు తెలియదు, కాని, కండ్లు తెరిచాను. మను నాపాదాలపైన మొహం పెట్టుకుని పడి వుంది. ఒక చేతితో విసనకర్రపట్టుకుని నాకు విసురుతూన్నది. నేను కండ్లు తెరిచానని తెలియలేదు. ఏమో అనుకుంటూంది. వినబుద్ధి పుట్టిందినాకు. కండ్లు తిరిగీ మూశాను.

"ఎన్నడూ అన లేదే! నేడేమి నాకర్మమూ! ఎంతతిట్టినా ఎంతకొట్టినా, చంపినా, ఓరుస్తాను! గాని, భార్యను కానా? వగలమారినా? విశ్వాసఘాతకు రాలినా? అయ్యో! అపనింద, దయామయుడా! పరమేశ్వరుడా! ఇంకానన్ను పరీక్షిస్తావా? ఈదూషణ చాలదా! మగని చేతనే పరాభవమా? అంతకంటే చావు మేలు! ఎందుకిట్లా నన్ను అనుమానించారో?"

"తెలిసింది, నీవగలు." అని తటాలున నేనన్నాను.

మను లేచింది. నాకు కొంచె మెడంగా నిలిచింది. దేహమంతా గజగజ వణుకు తూంది, కన్ను లెర్రపడ్డవి. భయంకరాకారం దాల్చింది మను. అప్పుడు నాకు కరాళమూర్తి మహిషాసురమర్దనీరూపం జ్ఞాపకం వచ్చింది. ఏదో శక్తి నన్ను మింగవచ్చిందనుకున్నాను.

"నేను భార్యను కానా? నన్నట్లు ఎందు కనవలసివచ్చింది? నేనేమి ద్రోహం చేశాను? అవినయంగా నేను విశ్వాసఘాతుకురాలినని అనుమానించడానికి నిదర్శనమేదీ? కారణముండవలెకాదా? రుజువు పరచవలె, నిజం కనుక్కొనవలె. తప్పుంటే శిక్షించాలె! అన్యాయం లోలోపలనే కుళ్ళడ మెందుకు? అడగాలె, నేరముంటే చంపాలె. నాయేనడత మీకు సహ్యమైంది? నేను మిమ్మెట్లా మోసపుచ్చాను? నా నేర మేమిటో నా నెత్తికి చుట్టాలె. ఇంతవరకూ ఓర్చుకున్నాను. ఇంకూరుకోను.

మీ మనసులో వున్నదేమిటో బయటికి రావాలె. కాక పోతే నే నుయ్యో గొయ్యో—!"

"అదీ మేలే! అదే మంచిది. ఇంతటి పగలమారి బతికివుండి యితరుల పరువును బూడిద పాలుచేసి, కొంపలు కూల్చడంకంటే—అప్రతిష్ఠ నెత్తికెత్తి, తానూ చుట్టుకోవడంకంటే—చావే మంచిది. ఇంతటి విశ్వాసఘాతకురాలికి బలవంతపు చావు కాక మంచి చా వెప్పటికిని రాదు. చేసినచేత లేలాటివి? నన్ను పెట్టిన బాధ లెంతటివీ! బాధకుబాధ—నన్ను బాధించినంత బాధా—వడ్డీతో యింకా అంత బాధా—అనుభవించాలె"

"కానిండి, నా నేరం నాకప్పు జెప్పండీ! నాతప్పేమిటో?

"మాయలాడీ! ఇంకా యీనగ లెందుకూ? ఇంకా బూమతా వెందుకూ? నీ తప్పు నీ కెరుగనట్లా నటిస్తావు!"

"లేదు, ఎరగను, నా నేరం నే నెరగను. తమ తప్పులు తామెరిగి నట్లైతే లోక మెందు కింతపాడవుతుంది? చెప్పండీ, నాతప్పు లేమిటో?"

"ఆహాహా! ఎందుకీజన్మ—పాడుజన్మ—భార్యయింకొకని కోరిందని లోకు లందరూ ఛీ-ఛూ, అని మొహాన్ను మొత్తుతూంటే—కడకు కండ్లార చూసీకూడా—ఈ ప్రాణాలు—మొండిపడి పోకున్న వే? ఎందుకీ మొండిబతుకు!" అని అంటూ నేను నాతల పగలకొట్టుకున యత్నించాను. మను నన్నాపనిచేయనీయక ఆపింది. నన్ను పట్టుకుంది.

"ఏమి మీ కండ్లార చూచారు? నే నితరునితో మాట్లాడుతూ? ఏమి చూచారు? ఎవరేమి చెప్పారు? ఎవరిని, ఛీ-ఛూ, అంటారు? ఎందుకు? ఎవరిని చూచారు? అప్పుడే పట్టుకోవలసి వుండె. ఒక్క దెబ్బతో యిద్దర్నీ నరకవలసి వుండె. ఆవాడెవడు? ఎవడువాడు? ఎవడిని చూచారు? చెప్పండీ, ఇంక దాచీ లాభం లేదు."

"టోపీ—"

"ఏటోపీ వానిని? ఎప్పుడు?

"నాకు జ్వరం తగిలి కోర్టులో కూర్చోలేక యింటికి మధ్యాహ్నం వచ్చిన నాడు."

"చూచారా? స్వయంగా చూచారా?

"ఆఁ. చూచాను. విను; ఇంకా దాపడ మెందుకు? కుండ బద్దలు చేస్తాను. ప్రాణం పైకెగిరి పోతూంది. అయ్యో పట్టుకో, నన్ను పట్టుకో, అది కాస్తా చెప్పిపోతాను, ఇంక ప్రాణాలు ధరించలేను. నాలుక పిడచ పడ్డది. కొంచెం నీళ్లు—వద్దు. అపవిత్రం అయిన నీచేతితో వద్దు."

మను గ్లాసుపట్టుకొచ్చింది. 'వద్ద'న్నాను. 'నీళ్లు కాదు పా'లన్నది గ్లాసు చేత బట్ట పోయినాను. చేతులు వణుకుతూన్నవి. గిన్నె పట్టుకోలేక పోయినాను. దిండు పై నొరిగాను. మను ఆపాలు కాస్తా నానోట్లో పోసింది. పది నిముషా లూరుకున్నాను. మనూ మొహంచూచాను. ఏమో ఆలోచిస్తూంది. కాని, మొహాన విచారం కనబడలేదు. వికారం కనబడలేదు. నిష్కపటంగా కనబడుతూంది—కొద్దిగా దుఃఖం మాత్రం కనబడుతూంది. పగలు—నటన! ఇంత నేర్చింది అంత నేర్చివుండదూ? చేయ నేర్చింది దాచ నేర్చదూ?

"విను, ఆనాడు, కోర్టులో నాకు జ్వరం తగిలింది. కూర్చో లేక పోయినాను. ఇంటికి వచ్చాను. తలవాకిలి మూసివుంది. తట్టాను, పిలిచాను పది పిలుపులకూ జవాబులేదు. ఎండ—జ్వరం—నిలవలేను. ఎట్లాగో అర్థ ఘంట ఆలస్యంగా తలుపు తెరిచావు; నన్ను చూచావు; నీమొహం వెలవెలబారింది; గాభరాపడ్డావు! నన్ను ముందుగా పోనీక నీవే నన్ను తోసికుని ముందుగా యింట్లోకి వెళ్లావు. నీగదితలుపు మూశావు. నాగదిలోకి వెళ్లాను. డ్రెస్సు తీశాను. పరున్నాను. మనసుకు నచ్చ లేదు పడక కుదర లేదు. నీవూ దగ్గర లేవు. నన్ను పలకరించలేదు. నాకేమీ తోచలేదు. ఒంటరిగావుండలేక నీవు నీగదిలో వుంటావేమో అని అనుకుని అక్కడ పరుందామని వెళ్లాను. చూచాను—బల్లమీద జరీబుటేదారీ పనిచేసిన చక్కనిటోపీ చూచాను.

"ఎవరి దా టోపీ"

'ఎవరి దాటోపీ! అక్కడి కెందుకు వచ్చింది? నే నింటికి వచ్చినప్పుడు ఎంత పిలిచినా తలుపు తీయ వైతి వెందుకు! ఆటోపీవా డుండబట్టే.'

"ఏటోపీవాడు? ఎవరా టోపీ వాడు?"

"ఆబల్లమీద వుండీపటోపీని పెట్టుకునేవాడు— ఎవడో ? తలుపు ఆలస్యంగా తీసిన కారణ మేమిటి? వాణ్ణి దిడ్డిదోవను సాగనంపి రావడానికి.

"ఆఁ— తెలిసింది."

"విను, పూర్తిగా విను. అడ్డు మాట్లాడకు. తలుపు తెరచిన తోటే నీముఖం వెలవెలబారింది. గాభరా పడ్డావు. అన్నీ కలియవేసుకున్నాను. చేర్చాను. పెద్ద కత అయింది. ఇంతలో నీవు వచ్చావు. 'టీ' యిచ్చావు. ఓరగంట నన్ను చూస్తూ ముసిముసి నవ్వులు నవ్వుతూన్నావు. దేనికి? నీపగ్గాకు సంతోషించి; టోపీ దాచేశావుగా! గొప్ప పన్నె! వచ్చినవాడు పోయేటప్పుడు టోపీని వదిలి పోవడ మెందుకు? గాభరా ! నే నింటికి వచ్చానని గాభరా! చూస్తానని గాభరా! తప్పించుకో పోవాలెనని ఆత్రం— నీకు అంతకంటే ఆత్రం. పంపించే ఆత్రం, తలుపు తెరిచే ఆత్రం, అంతా ఆత్రం, అంతా గాభ్రా! మరచి పోయినారు. టోపీని మరిచి పోయినారు. 'టీ' నాకీయవచ్చినప్పుడు దాన్ని చూచావు. ముసిముసినవ్వు లందుకే. నామీద విసిరిన ఓరచూపులందుకే. చూచాడేమో! ఏమో! ఏమో! పడ్డది పెద్ద అనుమానం. లోలోపలనే దాచాను. పరీక్షించాను. ఎటు చూచినా అనుమానమే. ఛీ— ఈబతుకుకంటే చావే నయమనుకున్నాను. అందుకు సిద్ధమైనాను. ఇంక—"

"ఇంక నామాట వినండి అంతా తెలిసింది. అప్పుడే నన్నడిగివుండరాదూ; ఇంతదూరం అయివచ్చి వుండదే! ఇంకాకొంతకాలం దాచాలె ననుకున్నాను. ఇంతకువచ్చింది. ఇంక దాచి లాభం లేదు. ఇక తీరుస్తాను మీ అనుమానం వినండి— శాంతంతో వినండి.

మనద్రవ్య మంతా బ్యాంకు దివాలాతో టీ పోయింది. మీరు విచారంలో వున్నారు. కర్చు తగ్గించి మిమ్మల్ని సంతోషపెట్టాలె ననుకున్నాను. ఏదో సంపాదిస్తూన్నారు— వంటిమీద నగలున్నవి— సరేకదా నాకొక ఆలోచన తోచింది. పెద్దమొత్తంగా ఒక్కసారిగా రొక్కం మీకు చూపి ఇది నా స్వార్జితం అనిచెప్పుదామనుకున్నాను. అందుచేత మీకు తెలుపకుండా నే యీ టోపీ—"

"ఆఁ-ఆఁ- మాయి!నోరు మూయి! మాయలాడీ! సిగ్గుమాలినదానా! మూయింక! నాయెదుటనే నీకోటిసుందనే చెప్పుతూన్నావుగా? గొప్పమొత్తంరొక్కం నాకు చూపాలెనని నేనింతదరిద్రస్థితిలో వున్నందుకు నాకు సహాయం చేయలెనని నీవు నీతిమాలి, సిగ్గువిడిచి, విశ్వాసఘాతంచేసి, ఆటోపీవాని చేపట్టి—"

"కాదు— శాంతించండి అది కాదు నావుద్దేశం. పూర్తిగా వినండి."

"చాలు— విన్నదిచాలు— చెప్పినదిచాలు— నీనాలుక చీలిపోదూ! ఛీ!పో— అవలికి తొలగిపో— నీముఖం నాకు చూపకు, నీచురాలా! నీ నీతిమాలిన చరిత్ర— నీనోటితో—"

"వినండి— పోను— తొలగిపోను — చాలించను. పూర్తిగా నాపలుకులు విని, ఆతర్వాత మీకిష్టము వచ్చినట్లనండీ. మిమ్ము సంతోషపెట్టవలెనని— ఇది అంతా నా స్వార్జితం— కష్టార్జితం, అని చెప్పుదామని బుద్ధిపుట్టింది. మన సరస్వతితోటి ఆలోచించాను. నలుగురు నేస్తులం కలిశాము. మా కందరికీ చంకీబుటేదారీపని చేతవును. ఆవిద్య సమయానికి పనికి వచ్చింది. మీరు భోంచేసి కోర్టుకు వెళ్లిపోయిన తరువాత అందరం కలిసి టోపీలు కుట్టేవాళ్లం. ఆరోజూ, టోపీ కుట్టుతూండి, అప్పుడే వంటయింట్లో పిల్లి యేదో పడవేస్తే, చేతిలోని టోపీని బల్లమీద పెట్టి పోయినాను. అంతలో మీరు వచ్చారు. తలుపు తెరిచాను. మీముఖం నల్లబారివుంది. ఆవేళకు యింటికి వచ్చారు ఎందుకా అని భయపడ్డాను. జబ్బేమయినా కలిగిందా ముఖం యీలాగున్న దెందుకా అని గాభరాపడ్డాను. అలసివచ్చారుకదా త్వరలో,'టీ'కాచి తెద్దామని లోపలికి పరిగెడాను. మీరు మీగదిలో కూరుచున్నారు. టోపీ దాచలేదు. గది తలుపుమాత్రం ముందుకు వేసి నే'టీ' కాచపోయినాను. మీముఖమిల్లాగున్నందుకు నా మనసు స్థిమితం లేకపోయింది. టోపీ సంగతే మరిచాను. 'టీ'తీసికుని మీగదిలోనికి వెళ్లాను. అక్కడ లేదు. నాగదిలోకివచ్చాను. మంచానికి అడ్డంగా పడివున్నారు. టోపీ దాచేశాను, మీరుచూడ లేదనుకున్నాను."

"అప్పటి నీయోర చూపులకు అర్థమేమి."

"అనుమానం— చూశారేమో— ఏమనుకున్నారో? ఎవరిది అనుకున్నారో? అడుగుతారేమో ఏమి చెప్పాలె?

నిజంచెప్పాలెనా? ఇంక కొంతకాలందాచాలెనా?—అదే విచారం—ఆలోచనా. భర్తతో తెలుపకుండానే భార్య యేవ్యవహారమైనా చేయడంతప్పు. నేను తప్పు చేశాను. కోప్పడుతారేమో అని భయం. నామనసు మనసులో లేదు. ఎన్నివిధాలో—"

"నిజమేనా. నీమాటలు నమ్మవచ్చునా?.

"నమ్మండీ! నిజమే చెప్తున్నాను. ఒక్కటోపీని చూచి నన్నింతగా అనుమానించి దూషించి అవమానించారుకదా. అదిగో చూడండి." అని అంటూ మను లేచి వెళ్లి ఒక పెట్టె తెచ్చి తెరచి నాకు చూపింది. "ఇవిగో నల్లవై టోపీలు. అన్నీ యీమోస్తరువే కదా! ఇన్నిటినీ చూచి యింకా యెంతగా అనుమానిస్తారో ?"

అని అంటూ మనూ పరమానందంతో నవ్వసాగింది; నాకాశ్చర్యం కలిగింది. నానేత్రాల్లో బాష్పాలు కురుస్తూన్నవి. వాలోనే నేను పశ్చాత్తాపపడ్డాను.

నాకేదో ఒక విధమైన వికారం కలిగింది. అంతే కంఠం రెక్కుపగాసిగ్గయింది. పట్టలేక పోయినాను. తటాలున మంచం మీదనుండి లేచి కిందికి దిగాను. మను నాభావంగ్రహించింది కాబోలు నన్ను తటాలున పట్టుకుని మెల్లగ మంచం మీద కూర్చోపెట్టింది. నాకంఠాన్ని తన రెండు చేతులా పెనవేసి, నాముఖం కొంచెం పైకెత్తి "ఏమిటపని? ఈలా కూర్చోండి" అన్నది. నా కండ్లల్లో నీరు గిర్రున తిరిగివచ్చినది. కంఠం బొంగురు పోయింది !



"మనూ! తప్పు మన్నించవూ? వజ్రాన్ని గాజు ముక్క అనుకున్నాను. నీలమణిని బొగ్గనుకున్నాను. అమృతమును విషంగా భావించి పారపోశాను. నీవిలువ నాకు తెలియక పోయింది. తెలిసికూడా భ్రమతలో పడ్డాను. మహాఘోరంగా అనుమానించాను. నీ శీలాన్ని సంశయించాను. తప్పు క్షమించు మనూ! కోపపడకు. నా యింటి లక్ష్మివని తెలిసికోలేక భ్రమలో చిక్కి కన్నులమూసుకుని, బుద్ధి క్షీణించగా, యెడమకాలితో తన్నేసినాను. క్షమించు మనూ!—"

అని నేను దీనభావంతో అంటూండగా మను నా నోరు నొక్కిపట్టింది. నన్ను తన హృదయానికి బిగ్గబట్టింది. ఆకండ్లలో బాష్పాలు కురుస్తూన్నవి. అందులోనూ మనూ మొహం మీద చిరునవ్వు తాండవమాడుతూంది. నన్నాపైట గాఢంగాకౌగిలించుకొని, నాముఖం కొంచెం పైకెత్తి తనముఖం దగ్గరగా చేర్చి మిక్కిలి ప్రేమతో యిట్లన్నది.

"ఇందులో నేను క్షమించడమేమి? తప్పు నాదే. నన్ను మీరు క్షమించాలె. భర్తకు తెలుపకుండానే యేలాటి వ్యవహారం చేయడమూ భార్యకు తగదు. నేనంతదూర మాలోచనచేయలేదు. నేమందరంకలిసి టోపీలుకుట్టి, మన సరస్వతీ భర్తవల్ల షాపులోకి పంపి వానిమీద వచ్చిన పైకం పెద్ద మొత్తం మీకు చూపి విస్మల్ని ఆశ్చర్యంలో తేలుస్తా మనుకున్నాము. అదే ఉత్సాహంగాని, యింతవుతుందని అనుకోలేదు. పోనిండి ఇంకనైనా నన్ను వెనుకటివలె ప్రేమిస్తారా ? నన్ను నమ్ముతారా? ఇంకనైనా వదిలిందా మీ అనుమానపిశాచం?"

నాహృదయం కృతజ్ఞతతో మహానందంతో సిగ్గుతో అపరిమితమైన ప్రేమతో నిండిపోయింది. నేను మనూ నొక్కి విస్మయంగా చూచాను. అంతలోనే మను చిరునవ్వు నవ్వింది. అక్షణమే పెదవులు నాలుగు కలిసిపోయినవి.

సన్ధ్యోపాసన

సాహిత్యసరస్వతి సిరిపి ఆంజనేయులు గారు

II

౬. మనసాపరిక్రమాగీతలు—

పూర్వదిశయందు జ్ఞానరూపుండ వగుచు!
ఖరకరునిపాదములె విశిఖములు గాఁగ
మమ్ము నలయించు నంధకారమ్మునుండి
యెప్డు రక్షణ మొనరింతు వీవు తండ్రి! ౭

దక్షిణదిశను నైశ్వర్యధాముఁడ వయి
జ్ఞానమూర్తులు బాణసమాను లగుట
మమ్ముఁ గలఁచు తిర్యక్సమూహమ్మునుండి
యెప్డు రక్షణ మొనరింతు వీవు తండ్రి! ౮

తలఁపఁ బశ్చిమమ్మున మహోత్తముఁడవగుచు
నన్నమొక్కటె రోపతుల్యంబుగాఁగ
మము నజగరాది క్రూరసర్పములనుండి
యెప్డు రక్షణ మొనరింతు వీవు తండ్రి! ౯

ఉత్తరదిశను శాంతగుణోజ్జ్వలుండ
వయి, యజన్ముఁడవగుచు, సమ్యగ్విధాన
నశనిమార్గణముగ మమ్మనంతశక్తి
నెప్డు రక్షణ మొనరింతు వీవు తండ్రి! ౧౦

వీరుధను యొకయాశుగ కారణముగ
హరితవర్ణవృక్షాదుల చోరవనుండి
మము నధోదిశ విష్ణురూపము వహించి
యెప్డు రక్షణ మొనరింతు వీవు తండ్రి! ౧౧

ఊర్ధ్వముఖమున వేదవేద్యుండ వగుచు
వర్షకణములె శరములై వఱల మమ్ముఁ
గడిఁది శ్వేతకుష్ఠాదిరోగములనుండి
యెప్డు రక్షణ మొనరింతు వీవు తండ్రి! ౧౨

అఖిలగుణముల కధిపతివగుట మమ్ము
నహితభావమ్మునుండి కాపాడ దట్టి,
గుణములకు- బాణములకు- రక్షణమునకును-
సర్వమునకును మానమస్కారశతము. ౧౩

౭ ఉపస్థానగీతలు—

నీవు విజ్ఞానమయుఁడవు దేవదేవుఁ
డవు, మఱిచరాచరాత్మకుఁడవు, మహోత్త
ముఁడవు, నజతుండ వానందమూర్తి వగుట,
నిన్నుఁ దెలియ మే ముపాసింతు మన్నిగతుల.

సర్వదర్శనమునకు నెసంగు నీదు
విమలసద్గుణగణాపతాకమును గాంచి,
యాఋుగాదివేదముల సత్యాంతదీప్తి
వెలయు, నీమహామూర్తి నిఁ దెలియఁగలము.

వసుధనీకృపచే శత వత్సరమ్ము
లైనజీవింతు మేము నీ యర్చకొఱకు,
నిన్నె కనెదము, వినెదము నీచరితనె,
నిన్నుఁ గూర్చియె భాషింతు మన్నికడల. ౧౪

తలఁప నూతేండ్లకంటె నత్యధికముగనె
క్షితిని నీదయామృతవృష్టి కతన మేము
బ్రతికి-విని-కని-వినిచెడు వారమయ్య!
స్వాత్వములఁ బొంది ముదమందు వారమయ్య!

దేవ! నీవప్పుడు.

పూలరంగఁడు

చింతలపూడి శేషగిరి రావు గారు

౧

సమయము నిశీథము. ప్రదేశము భీకరారణ్యము. వీఁడు మిక్కిలి నిర్జనము. దిగంతములందు దట్టముగ వ్యాపించిన చిమ్మచీకటియందుఁ గన్నుఁ బొడిచికొనినను గానరాకుండెను. ప్రకృతికాంత నిశ్చేష్టయై నిదురించుచున్న స్త్రీరత్నమువలె చైతన్యముఁ దక్కి యుండెను. నిదురయందున్న వనిత యప్పుడప్పుడు దోమకాటు మొదలైనవాని వలన నవయవములు కదలించునట్లు ప్రకృతి కూడ నప్పుడప్పుడు కొంచెము చలనముఁ గలిగియుండెను. ఇట్లు కతిపయదినములు గడచిన వెనుక నాకసము జీమూతావృతమై యీఱుగాలి 'భంయి' 'భంయి' మని వీచి వన్యపాదపంబుల సమూలంబుగఁ బెకలింప మొదలిడెను. అప్పుడప్పుడు కానిపించు సౌదామినీలతల దివ్యకాంతులు తప్ప వేఱొండు కాంతి లేకుండెను. అంతటఁ గుంభవర్షము వర్షింప భూమియంతయు జలమయంబయి మిఱ్ఱుపల్లము లేకమయ్యెను. కొంతవడికి వానయు గాలియుఁ దగ్గియాకస మెప్పటియట్లఁ దేజోవిరాజితంబై ప్రకృతికాంత తన సహజస్వరూపముఁ గైకొనెనుగాని యింకను మెఱుపులు తగ్గలేదు. ఇట్టి యర్ధరాత్రమున, నిట్టి ప్రళయాకాశనిపాత సమయంబున, నిట్టి ఘోరారణ్యమునఁ గర్కశశిలావృతంబయిన నొక యిఱుకుమార్గమున నొకమనుజుఁ డొక కట్టెలమోపు శిరముపై నిడికొని, యొకగొడ్డలి భుజముపై నుంచి మోపు యొక్క భారమును దగ్గించుటకుఁ గాఁ బోలు మోపునకు వెనుక ప్రక్కగొడ్డలి నూఁతగ నొనర్చి నడువలేక నడువలేక

నడుచుచుండెను. ఈతఁడింతవఱకుఁ బ్రాణములఱచేతఁ బట్టుకొని యేచెట్టుక్రిందనో తలదాచుకొని యిప్పుడు బయలుదేరియుండనోపు. ఈతనివయ స్సిరువదియైదువత్సరముల కెక్కుడుగ నున్నట్లు తోఁపదు. ఎగుడుదిగుడుగఁ గొట్టఁబడిన కట్టెలవిధమును, వదులువదులుగఁ గట్టఁబడి కుదిరియుఁగుదురకుండఁ దలపైఁ బెట్టుకొనిన మోపువిధమునుజూడ నీతఁ డీవృత్తికిఁ జిరపరిచితుఁడు కానట్లు తోఁచెడిని. దేహసౌకుమార్యమును, శరీరచ్ఛాయయు, శరీరాచ్ఛాదనకైనను సరిపోని చినికివస్త్రములనుజూడ నీతఁ డొకబ్రతికిచెడ్డ యుత్తమకులీనుఁడనియు, విధివశమున నిట్టిదుస్స్థితికి వచ్చెననియు నూహింపవచ్చును. పాప మీపాంథుఁడు భయవిహ్వలుఁడై ముందువెనుకల బెదరిబెదరి చూచుచుఁ, జీమ చిటుక్కుమనిన గుండె లవిసి హఠాత్తుగ నిలువఁబడుచు, మరల ధైర్యము దెచ్చుకొని ముందునకు సాగుచుఁ గాలుజారి పడఁబోవుచు మరలఁ గాలు నిలువద్రొక్కుకొనుచుఁబయన మొనర్చుచుండెను. అట్లయ్యు మనోవీథియందు భావపరంపర లేవియో వచ్చుచునేయుండెను. ప్రాయశః తనకుఁ బ్రాప్తించిన దైన్యస్థితింగూర్చియో ఇంటియొద్దనున్న భార్యాపుత్రుల దీనావస్థంగూర్చియో, జరాభారమునఁ గ్రుంగికృశించి చావునకుసిద్ధముగనున్న తల్లింగూర్చియో, తలపోయుచుండనోపు. కొంతకాల మిట్లుగడచిన పిమ్మటఁ గన్నుచెదఱునట్టొకతీవెమెఱపు మెఱయ నాతఁడు తననివాసస్థల మొకకూతవ్రేటుదూరమున కెక్కుడు లేదని తెలిసికొని కొంతధైర్యముఁ దెచ్చుకొని వడివడిగ నడువసాగెను.

౨

గోపాలరావునాయఁడు వెలమవంశమునందు గొప్పకుటుంబమునఁ బుట్టినవాఁడు. ఇంటిపేరు రాకులవారు. నివాసస్థలము రాజమహేంద్రవరము. తల్లిదండ్రు లితనికి బాల్యమునందే హూణవిద్యాభ్యాసముఁ జేయించిరి. ఇతఁ డాకాలమునాఁటి యప్పర్ సెకండరీ (Upper Secondary) పరీక్షయందు తీర్ణుఁడై సర్కారు కొలువునం దిరువదిరూప్యముల వేతనమునకుఁ గుదిరెను. రానురాను వేతనాభివృద్ధిఁ గాంచుచు రాబర్ట్సన (Robertson) న్నను కలెక్టరుగారియొద్ద నాంగ్లేయ ప్రధానలేఖకుఁ డయ్యెను. గోపాలరావునాయఁడు తనబుద్ధిసూక్ష్మతవలనను మాటనమ్మకమువలనను దనయజమానుని ప్రాపకము గొలఁదిదినములలోనే సంపాదింపఁగలిగెను. యజమానుఁడును దన లేఖకుని మిక్కిలి దయార్ద్రహృదయమున నాదరించుచు, నతని సౌశీల్యమున కచ్చెరువందుచు నతని కేదోయొక గొప్పబహుమాన మిచ్చితీరవలయునని గట్టిగ నిశ్చయించుకొనెను. గోపాలరావునాయని కొక్కఁడే కొమరుఁడు గలఁడు. అతనిపేరు రంగారావు. ఆంగ్లేయభాషవలని లాభనష్టములను, సేవకవృత్తియందుఁ గల సాధకబాధకములను బూర్తిగ ననుభవించినవాఁ డగుటంజేసి గోపాలరావునాయఁడు తనకుమారు నాంగ్లవిద్యయందుఁ బ్రవేశపెట్ట నిచ్చగింపలేదు. రంగారావు తెలుఁగుమాత్రము కొలఁదిగ వ్రాయను జదువను నేర్చినవాఁడు. తల్లిదండ్రుల కేకపుత్రుఁడు కావుటంజేసి చిఱుతప్రాయమునుండియు

సీతఁడు మిగుల గారాబముతోఁ బెరిగెను. ఈతఁడు కొంతకాలమువఱకు నిర్వ్యాపారుఁడై యూరక తినితిరుగుచుండెడివాఁడు. విలువగల దుస్తులు ధరించి యిట్లు తిరుగుచుండుటంజేసి జను లీతనిఁ బూలరంగఁ డని పిలుచుచుండిరి. ఇట్లు కొండొకకాల మేఁగ 'ఉద్యోగం పురుష లక్షణ' మ్మని యుండెఁ గాన తండ్రి తన కుమారుని నిరుద్యోగిగ నుంపనొల్లక కొంత ధనమిచ్చి చిన్నవ్యాపారమునందు దింపెను. రంగారావు తనబుద్ధిచాకచక్యమున వర్తకమునందు శుక్లపక్షచంద్రునివలె దినదినక్రమాభివృద్ధి గాంచుచుఁ దుదకు రత్నములందును వజ్రములందును నోడవర్తకమునుగూడ సాగించెను. గోపాలరావునాయఁడు తనకుమారుని యౌన్నత్యదశఁ గాంచి పూర్తిగ నానందింపకపూర్వమే యకాలమృత్యువువాతం బడుట సంభవించెను. రాబర్టుసన్ దొరగారును పెన్షన్ దీసికొని స్వదేశమున కేగిరి. 'అత్యుచ్ఛ్రియః పతనహేతుః' అనునట్లు రంగారావు జీవితసౌధమునకుఁ బతనకాలము సమీపించినది. అతఁడు నిర్లక్ష్యముతో నతివిరివిగ వ్యాపారమును సాగించెను. పిన్నవయస్కుఁడు. ముందువెన్కలారయుశక్తి లేదు. మందలించుటకుఁ దండ్రి లేఁడు. తనకుఁగలయావదాస్తిని దాకట్టుపెట్టి పదిలక్షల రూప్యములవిలువగలరత్నములనువజ్రములను విదేశమున కెగుమతిఁ జేసెను. దినములు, వారములు, పక్షములు, మాసములు నొకటిరెండువత్సరములుగూడఁ గడచినవి. కాని తా నెగుమతిఁ జేసిన యోడజాడ యించుకంతయుఁ దెలియదయ్యె. పాపము! ఏమి చేయఁగలఁడు? రంగారావునాయఁడు తుపానువలన నోడ బ్రద్దలై యుండునని నిశ్చయించుకొనెను. నిర్విణ్ణుఁడయ్యెను. హృదయపేటిక బీటలువాఱెను. అతనిపరిస్థితులను దెలిసికొని కొలఁదిదినములలో ఋణదాతలు పైకొని యాస్తినంతయు వశపఱచుకొని కట్టుగుడ్డలతో బైటికి వెడలనిచిరి. నిస్సహాయుఁడై రంగారావు గర్భవతియైనభార్యను, పసిపాపయైనపుత్రుని వృద్ధయైన తల్లిని వెంటనిడుకొని పూల నమ్మినవాడనే కట్టెల నమ్మఁజాలక గ్రామాంతరమునకుఁ బోయెను.

3

పోలవరగ్రామమునందుఁ బాడువడిన సత్రమొండు కలదు. చాలకాలమునుండి నిరాదరింపఁబడుటంజేసి యది మిక్కిలి శిథిలావస్థయందుండెను. ఆకారణమున నది గ్రుడ్లగూబలకును గబ్బిలములకును నివాసస్థల మయ్యెను. ముందుప్రక్కనున్న వసారామీఁది పెంకులు బొత్తుగఁ బోయి వాసములమీఁద నమర్పఁబడిన వెదురుకూర్పు మాత్రము కానుపించుచుండెను. ఎడమప్రక్కనున్న గోడలు నేలమట్టమగుటంజేసి యాభాగమందలి కప్పుగూడ నేలపాలయ్యెను. మిగిలిన భాగములందు సహితము సూర్యచంద్రులు నిత్యము వాహ్యాళి సల్పుచుందురు. కుడిప్రక్కనున్న యొక్కగది మాత్రము కొంచెము నివాసయోగ్యముగ నుండెను. ఈగదికి ముందువసారాయం దొక యరుఁగుగలదు. సత్రముచుట్టును జిల్లేడు ఉమ్మెత్త, మొదలగుచెట్లచ్చటచ్చట గుంపులుగుంపులుగఁ బెరిగియుండెను. ఒకనాఁటియర

రాత్రమున వసారాయందుఁగల యరుఁగు మీఁద నొక స్త్రీ పెద్దపెట్టున గోదనము చేయుచుండెను. ప్రక్కన నొక బాలుఁడు కారణము తెలియకయే తల్లి యేడ్చుచున్నది గానఁ దానును వెక్కి వెక్కి యేడ్చుచుండెను. వీరిద్దఱికిని ముందు నాపాదమస్తకము గుడ్డకప్పఁబడిన యొక మానవాకారముగలదు. ప్రాయశః యిది యొకశవమై యుండనోపు. పాపమా స్త్రీ మధ్య మధ్య తనయు నోదార్చుచు నిదురింపుమని బ్రతిమాలుచుఁ దా నట్లే యేడ్చుచుండెను. ఆపె యేమాత్ర మలికిడియైనను ముందునకు వంగి యటునిటు చూచుచుండెను. దీనినిబట్టి చూడ నాపె యెవరిరాకకొఱకో నిరీక్షించుచుండెనని తోఁచెడిని. కొంతసేపిట్లుగడచెను. ఆపె పరాకున నున్నసమయమున నొకకట్టియలమోపు క్రిందఁబడినట్లు శబ్దమయ్యెను. రొప్పుచు రోజుచు నొకవ్యక్తి లోనికివచ్చుచుండ నావనిత యెదురుగ నేగి కౌఁగిలించుకొని పూర్వముకంటె నెక్కుడుగ నేడ్చుచు నస్పష్టోచ్చారణముతో "అహా! నేను గాపురమునకు వచ్చినది మొదలు కన్నతల్లి కన్న మిన్నగ నన్నాదరించెడి యత్తయీలోకమును విడిచిపోయినది. ఆమెకును మనకును నేటితో ఋణము తీరిపోయినది" అనెను. ఈమాటలు శ్రవణపుటంబులుసోఁకఁగ నేమానూతనవ్యక్తి తటాలున నేలంగూలి కొంతతడవు విలపించెను. పాపము! భార్యను భర్తయు భర్తను భార్యయు ననునయింపవలసిన దేకాని యితరులెవ్వరు లేరుగదా! కొంతతడవునకు భర్త కొంచెము ధైర్య మవలంబించి తా నా సాయంసమయమునఁ గట్టెలఁ గొట్టుటకుఁ దత్ప్రాంతారణ్యమున కేఁగఁ జీకటిపడుటయుఁ ద్రోవఁదప్పి యడవియంతయుఁ గలయఁదిరుగుటయు, మధ్యమార్గమునఁ బెనుగాలిపిడికుంభవర్షము వర్షించుటయు మొదలుగాఁగల తన కథను సవిస్తరముగ భార్య కెఱుకపఱచెను. భార్యయుఁ దాను పింఛివిసరి తెచ్చినయల్పద్రవ్యముతో సోలెడునూకలంగొని వండి బాలునకు గొంతయిచ్చి తానర్థాన్నమే భుజించి మిగిలినది మఱునాటికి మిగుల్చుటయు, నత్తగారిమరణవేదనయు, భర్త రాక తడవయ్యెనని తా ననుభవించిన మనోవేదనయు, మొదలుగాఁగల తనవృత్తాంతము నంతయు భర్తకు వినిపించెను. ఇట్లారాత్రి మూఁడుజాములు గడచి నాల్గవజాము ప్రారంభమయ్యెను. ప్రక్కనున్న యేనాదివానికోడి ఱెక్కలు టపటప నార్చి, మెడ ముందునకు సాచి, కొక్కొరకో యని కూయసాగెను. భర్త యిట్లు మాటలాడుచు గోడకుఁ జేరఁబడి యించుక నిద్రించెను; కాని భార్యకు నిదురరాదు. గర్భమునందు సన్నసన్నగ నొప్పి ప్రారంభమయ్యెను. అదియే క్రమక్రమముగఁ బెద్దదై ప్రసవవేదనగా మాఱెను. పాప మాసుశీల తన్నావరించిన పీడాభరమున భర్తను మేల్కొల్పి యిదమిత్థమని తెల్పఁజాలదయ్యె. కొంతవడికి భర్త మేల్కాంచి సకలమును గ్రహించెను. కాని యేమి చేయును? పిట్టలు 'పీచు' 'పీచు' మనుచుండెను. కాల్యకృత్యములఁ దీర్పవచ్చిన జనసమూహముసం దప్పుడే కట్టెలరంగనితల్లి మరణించె ననువార్త వ్యాపించెను.

౪

సూర్యోదయకాలమునకు శిశూదయమయ్యెను. నిస్సహాయురాలైన రంగనిభార్యయే యన్నికృత్యములను నెరవేర్చుకొనెను. కట్టెల రంగనియింటఁ జావుపుట్టుక లొక్కమాఱు సంభవించెను.

ఆహా!

"గురువులరాక దాసిమృతి
గుజ్జువుదాడియు నల్లునల్కయుఁ
వరసతిగర్భవేదన వి
వాహము విత్తులఁ జల్లుకార్తెయుఁ
పోరుగున నప్పుబాధ చెవి
పోటును వీథిని దొమ్మరాటయుఁ
కలప్రదరిద్రమాబ్దికముఁ
గల్గు నొకప్పుడె కృష్ణభూవరా!"

యనినట్లు రంగనికిఁ జిక్కులన్నియు నొక్కమాఱు సంభవించెను. తల్లికిఁ బ్రేత కర్మ నొనర్చుటకుఁగాని కుమారునకు జాత కర్మ నొనర్చుటకుఁగాని రంగనిచేతియందు గ్రుడ్డిగవ్వయు లేదు కాన గడచిన రాత్రి తా నుదెచ్చినమోపు నెత్తిపై నిడుకొని వీథివీథిని "కట్టెలుకట్టెలో" యనియఱచుచు బయలుదేరెను. జాముప్రొద్దెక్కినది. రాజమహేంద్రవరమునుండి పోలవరమునకు రాదారిపడవ వచ్చినది. పోస్టాఫీసు (Pcst Office) నందు టపా పగులఁగొట్టి పోస్టుజవాను లెవరియుత్తరములు వారు తీసికొని యెవరివాడకు వారు బయలుదేరిరి. అందొకజవానునొద్ద 'ఆకుల గోపాలరావునాయని కుమారుఁడు రంగారావునాయఁ" డను చిరునామాగల జాబులు రెండు గలవు. ఆతఁడు గ్రామమంతయుఁదిరిగినను రంగారావునాయని జాడఁ దెలిపినవారు లేరైరి. రంగారావునాయఁడు చిఱుతప్రాయమునఁబాలరంగఁడై తిరిగినదియు నిప్పుడు కట్టెలరంగఁడై కట్టెల నమ్మునదియు నాయూరివారం దెవరికిఁ దెలియును? రంగఁ డట్లు లాకట్టెలమోపును నాలుగణాలకు విక్రయించి యాఁకలి యాతురముతో గృహోన్ముఖుఁడై చనుచుండ మార్గమధ్యమున నిరువురు పోస్టుబంట్రోతు లిట్లు మాట్లాడుచుండిరి.

ప్రథ:—'ఆకుల రంగారావునాయఁడు పోలవరం-' అని యీజాబుపై నున్నది. ఊరంతయుఁ దిరిగినను వానిజాడ తెలియలేదు.

ద్వితీ:—ఏమి చేయఁగలవు? మఱల వ్రాసినవారికిఁ బంపుము.

ఆకుల రంగారావునాయఁడని రంగని చెవిసోకినంతనే యాశ్చర్యపడుచు నాతనిఁగుఱించి యేమిమాటాడుచుంటిరని ప్రశ్నించెను. ఆతఁడు తమ కెవ్విధమైనసహాయముఁ జేయ నోపఁడని కాఁబోలు! వారు ప్రత్యుత్తర మీయకుండిరి. కాని రంగఁడు రెండుమూఁడుసారులు నొక్కినొక్కి యడుగ నాతనికి రెండు జాబులు గలవని ప్రత్యుత్తరమిచ్చిరి. రంగని యాశ్చర్య మినుమడించెను. తానే యామనుజుఁడనని యొప్పించునప్పటికి రంగనికిఁ దలప్రాణము తోఁకకువచ్చెను. ఆతఁ డిట్టులా రెండు జాబులను దీసికొని యందొకటి విప్పిచూచెను. అకాగితపుఁ బైభాగమున 'రాబర్ట్సన్ లంబార్డిస్ట్రీటు, లండన్- (Robertson—Lombardy Street, London)' అనియుండెను. ఇంకను దిగు

నకురాఁగ, దనకుసంతానము లేమిం జేసి తనకుఁ గలయాస్తియందుఁ గొంతభాగము విద్యావ్యాప్తికినిఁ గొంతభాగము బీదలకును బంచియిచ్చి మిగిలిన రెండులక్షల పౌనులను దనయాదరణకు మిక్కిలి పాత్రుఁడైన గోపాలరావునాయని కుటుంబమునకుఁ జెందఁజేసితిననియు నాపైక మాతనిపుత్రుఁడు రంగారావునాయఁడు మదరాసునఁగల యిండియన్ నేషనల్ బ్యాంకు (Indian National Bank) లోఁ దీసికొనవచ్చుననియు వ్రాయబడి క్రింద రాబర్టుసన్ సంతకముతోఁ గలదు. రంగని కది కలయో నిక్కువమో తెలియదయ్యె. తా నెచ్చటనుండెనో యేమిచేయుచుండెనో కొంతతడవు మఱచిపోయెను. కొంచెము మనఃస్థైర్యముఁ దెచ్చికొని రెండవజాబు విప్పిచూచెను. అది కాకినాడనుండి యొకబాల్యస్నేహితుఁడు వ్రాసినది. అందు రంగారావునాయనియొద్ద జర్మనీకీరమునందుఁగనుఁగొనఁబడెననియు నచటిసర్కారువారు మరల హిందూదేశమునకుఁ బంపిరనియు నది యిప్పుడు రంగూన్ పట్టణముఁ జేరననియుఁ దనకు వార్తవచ్చెనని వ్రాయఁబడియుండెను. ఆహా! రంగనిసంతోషసముద్రమునకుఁ బారము లేదు. పేదకుఁ బెన్నిధియబ్బియున్న నిట్టిదియేమైయుండనోపు; రంగఁడి జాబులను రెంటిని దీసికొని యింటికేఁగి యాశుభవార్త భార్యకు వినిపించి యామెనుగూడ సంతోష సముద్రమున నోలలాడఁ జేసెను. తత్కాలమునఁ దనకుఁగల నాలుగణాలతోడనే జననికిఁ బ్రేతకర్మ యొనర్చి లే దనిపించుకొనెను. పాపము! పూలరంగఁడు కట్టెలరంగఁడై దైవకృపవలన మఱలనొకపరి పూలరంగఁడు కాబోవుచున్నాఁడు.

శాస్తి

బసవరాజు అప్పారావు గారు, బి. ఏ.

ఏనాడునాటితినో
యీవలపుమాను,
చిట్టి, లతలా నన్ను
చుట్టుకున్నావు!
వెనకజన్మలో యేమి
పెట్టిపుట్టితిమొ,

బంగారుపంటంటి
పసిబాల కలిగె!
పెట్టి యెవరినియేమి
తిట్టుకున్నామొ,
ఇచ్చినదైవమూ
మర్చిపోడాయె!

ఆ రా ధ న ము



చిత్రకారుడు:— శ్రీయుత పి. వీరభద్రరావుగారు, కలాభవనము, శాంతినికేతనము.

ప్రాచీన హైందవ గణితము

దర్భా యజ్ఞేశ్వర సోమయాజి గారు, బి. ఏ., యల్. టి.

[ఆఱవ సంచిక తరువాయి]

47. మహావీరాచార్యుడు: మహా వీరాచార్యుని గణిత సారసంగ్రహము ప్రాథమికాంశములనుగూర్చి చెప్పు సంపూర్ణ గ్రంథము. సాధారణగణిత వ్యాపారములనుగూర్చి యిది సమగ్రముగ నుద్ఘోషించుచున్నది. గుణోత్తర శ్రేఢులిందే తొలిసారి కాన్పింప నారంభించినవి. కుట్టకములనుగూర్చిన యనేక ప్రశ్నలిందున్నను వృత్తీయవిధిని మాత్రము పురస్కరించుకొననేలేదు. దీనియందు విధ్యుక్తరీతిని పెంపొందినబీజ గణితమే లేదు. దీర్ఘవృత్తములనుగూర్చి వ్యవహరించిన (కొంతదోష భూయిష్ఠమే యనుడు) ప్రథమ గ్రంథమిదియే.

48. శ్రీధరాచార్యుడు: శ్రీధరాచార్యుని గ్రంథముకూడ మహావీరాచార్యుని గ్రంథమట్లే యుండి, దానికంటె చిన్నదిగనే యున్నది. ఈతేడు వ్యక్తవర్గ సమీకరణములనుగూర్చి వ్రాసినట్లు వేరొకగ్రంథకర్తవేరొక్కనియుండుటచేత నీత డీ సమీకరణములను గూర్చికొంతపరిశ్రమ చేసినట్లే తోచుచున్నది.

48. భాస్కరాచార్యుడు: భాస్కరాచార్యుడు క్రీ. శ. 1114 వ సంవత్సరమున జన్మించెను. బ్రహ్మగుప్తునితరువాత నుజ్జయినీసిద్ధాంత శాలాగారాధ్యక్షుడై వన్నె కెక్కెను. ఈతడొక సిద్ధాంత గ్రంథమును వ్రాసెను. దీనిలో మొదటి యధ్యాయములీలావతియను పేరబరగుచున్నది ఇదియంకగణితమునుగూర్చి వివరించుచున్నది. రెండవయధ్యాయముబీజగణితమునుగూర్చియు మఱియొకటి ఖగోళశాస్త్రమును గూర్చియు వేరొకటి గోళమునుగూర్చియు, క్రమముగా వివరించుచున్నవి. భాస్కరాచార్యుని లీలావతి శ్రీధరాచార్యుని గ్రంథము నాధారముగఁ జేసికొని వ్రాసిన ట్లగపడుచున్నది. వీరి బీజగణితము బ్రహ్మగుప్తుడు వ్రాసినవిషయములనే ప్రకటించుచున్నను శాస్త్రసాంప్రదాయానుసారముగ విషయనిరూపణముఁ జేసిన ప్రౌఢగ్రంథ మిదియే. మిగిలిన యధ్యాయములలో కొన్నిట గణితశాస్త్ర భాగములుకూడ గోచరించుచున్నవి.

50. ఈ గ్రంథమంతయు శ్లోకములరూపముననేయున్నను, సూత్రముల వ్యాఖ్యానములు గద్యాత్మకములుగనే యున్నవి. ఈతని బీజగణితము బ్రహ్మగుప్తుని బీజగణితముకంటె మిన్నయనుట కెంతమాత్రము సందేహము లేదు. ఈతడు తనబీజగణితమునందు సంకేత

ములనే వాడుచు కేవలబీజవ్యవహారములకు మార్గదర్శకుడై వర్తిల్లుచున్నాడు. వీరి రేఖా గణిత భాగములుగూడ బ్రహ్మగుప్తుని రేఖా గణిత భాగములకంటె చాల శ్రేష్ఠములుగానే యున్నవి.

51. ఈతని గ్రంథముయొక్క మొదటి యధ్యాయమునకు లీలావతియని పేరుపెట్టి నట్లు పైన చెప్పియున్నాను. పూర్వాచారము చొప్పున నీతడు దీనిని సరస్వతీ స్తవముతో ప్రారంభించి యున్నాడు. విషయసూచికను చూచి లీలావతీయొక్క సాధారణక్రమమును తెలిసికొనవచ్చును. తూనికలు కొలతలు, సంఖ్యానీకము; సంకలనము, వ్యవకలనము, గుణకారము, భాగహారము, వర్గములు, వర్గమూలములు, ఘనములు, ఘనమూలములు నను నీయెనిమిది గణిత క్రియలు; భిన్నములను సామాన్యహారస్థితికి మార్చుట; భిన్నరాసుల భిన్నములను కనుగొనుట, మిశ్రాంకములు, భిన్నములకు సంబంధించిన యెనిమిది గణిత క్రియలు; శూన్యవ్యవహార క్రియలు (కం=క, 0 =0, $\sqrt{0}=0$. $\frac{క}{0}=00$); అంకగణిత ప్రశ్నలకువలె నుండి యంకగణితములందు వ్యవహరింపబడు నేకవర్ణ సమీకరణములు; అన్యజూహాలు (false assumption); ప్రథమఘాతీయనిశ్చిత సమీకరణములు, వీనితోడి వ్యవహారముచేయు నభ్యాసములు; అవ్యక్తవర్గ సమీకరణముల వివరణము; త్రైరాశికము; కూటత్రైరాశికము (Compound rule of three); వడ్డీ; వియోగీకారము (Discount); సమిష్టివ్యాపారము (Partnership); గొట్టములతో తొట్లను నింపుటకు పట్టుకాలము నిర్ణయించుట; పరివర్తము (Barter); అంకశ్రేఢి, సరళాంకముల వర్గములయొక్కయు, ఘనముల యొక్కయు మొత్తములను కనుగొనుట; గుణోత్తరశ్రేఢి; త్రిభుజములతోడను, చతుర్భుజములతోడను వ్యవహరించు ప్రశ్నలు; π యొక్క స్థూలఫలము; త్రికోణమితికసంకేతలు; మూర్తములఘనపరిమితులు; ప్రథమఘాతీయ కుట్టకములు; అంకపాశమునకు సంబంధించిన కొన్ని ప్రశ్నలతో నీ గ్రంథము ముగియుచున్నది.

52. దశాంశ సంఖ్యానీకమును గూర్చి శాస్త్రీయాచారవిధిపురస్సరముగ జెప్పు గ్రంథములలో నిదియే మొదటిది. ఆర్యభటుడు దీని నెరిగియేయుండును. బ్రహ్మగుప్తునితో వీనికి పరిచయమున్నది. కాని యీ గ్రంథమునందున్న తోగూడ మన యంకెలన్నిటిని సునిశ్చితముగ భాస్కరాచార్యుడు వ్యవహరించియున్నాడు.

53. భాస్కరాచార్యుడు గణితశాస్త్రమునం దెంత ప్రవీణుడో జ్యోతిషమునందు గూడ నంతసామర్థ్యముగలవాడు. తాను జోస్యుడగుడు, తనకూతురగు లీలావతి పెండ్లివలన తనకు జేటుకలుగునని తెలిసికొని, యామెను తనకడనే యుండుటకుగాను, ఆమెకు వివాహము జేయలేదు. ఆమెకు చిత్తశాంతి కల్పించుటకో యన్నట్లాతడు తన గ్రంథ ప్రథమ భాగమునకు లీలావతియనునామకరణ మొనర్చి, దానియందలి పెక్కు ప్రశ్నల నామెను సంబోధించి యడిగినట్లు వ్రాసి యున్నాడు. హైందవ గణితములలోని లెక్కలా గ్రంథములు వ్రాసినవారి దేశకాలపాత్రాదు

లనైన సాంఘికార్థిక పరిస్థితులకు సంబంధించిన చక్కని విషయములను వెల్లడించుచున్నవి. భాస్కరాచార్యుడు బానిసల వెలలనుగూర్చి చర్చించియున్నాడు. మనవారు నెలకు నూటికి రు 3½ మొదలు రు 5 వఱకు వడ్డీ పుచ్చుకొను నాచార మున్నట్లు తెలియవచ్చుచున్నది. కొన్ని ప్రశ్నలవలన వారెంతంతకూలి నిచ్చెడివారో యనుసంగతి మొదలగునవికూడ తెలియుచున్నవి.

55. బీజగణితము: మత తత్త్వ, వేదాంత తత్త్వ, గణితతత్త్వాంశముల మూఁడిటిని ప్రకటించు నర్థగర్భితమగు త్య్రర్థిశ్లోక మొకటి యీభాగమునకు మొట్టమొదట నున్నది. ఈభాగమున సామాన్యక్రియల వ్యవచ్ఛేదమునుగూర్చి ముచ్చటింతునని ప్రకటించి యున్నాడు. దానియం దుపయోగించిన సంకేతములవివరము క్రిందిగువరీతిని ప్రకటించి యున్నాడు. సంక్షేపపదములను, పేరుల మొదటి యక్షరములను, సంకేతములుగ వాడెను. తీసివేయవలసిన పరిమాణముయొక్క గుణక (Coefficient) మీఁద నొకచుక్క పెట్టి దానిచే వ్యవకలనమును ప్రకటించిరి. ఒక పరిమాణము ప్రక్క మఱియొక పరిమాణమును నిలుపుటచేతనే సంకలనము సూచింపబడెడిది. గుణకారమునకును; తుల్యత, విషమత్వలకును; ప్రత్యేకముగా సంకేతములు లేవు. వీనిని సంపూర్ణముగ వ్రాసియే ప్రకటించెడివారు. గుణజమును ప్రకటించునప్పుడు వివిధగుణావయవములకు (factors) (భ) యనుసజ్ఞను [ఘాతమను పదముయొక్క తొలి యక్షరమును] లేక కొన్నియెడల గుణావయవములకుమధ్య నొకచుక్కనో చేర్చెడివారు. మధ్య గీత లేకయే విభాజకమును విభాజ్యము క్రింద వ్రాసి భజనఫలములను (quotient) లేక భిన్నములను (fractions) కూడ ప్రకటించెడివారు. సమీకరణముల యిరుపార్శ్వముల నొకదాని క్రింద నొకటి వ్రాసి దానివలన నెట్టి క్రమభంగమును కలుగకుండున ట్లాగణిత క్రియాత్మకమగు సన్నివేశములను సంపూర్ణముగ వ్రాసి ప్రకటించెడివారు. అవ్యక్త పరిమాణమును ప్రకటించుట కనేకసంకేతముల నుపయోగించి యున్నారు. ఇవి చాలమట్టుకు రంగులపేర్ల మొదటియక్షరములే. సాధారణముగా "వర్ణ" మనుపదము నవ్యక్తపరిమాణమునకు పర్యాయపదముగ నుపయోగించుచున్నారు వర్ణమను పదమున 'అక్షర'మను నర్థముకూడ గలదు. కావున నైదుబరులలోని యక్షరములనో లేక లెక్కలలోని విషయనామముల తొలియక్షరములనో యవ్యక్త పరిమాణమునకు(Variable quantity)సంకేతముగ నుపయోగించుచున్నారు. వర్గ, ఘనముల ప్రథమాక్షరములు ద్వితీయ తృతీయ ఘాతములను ప్రకటించును. వర్గమూలమను పదముయొక్క తొలియక్షరములు (వ. మూ) కరణాంకములను (Surds) ప్రకటించును. బహుపదములు (Polynomials) ఘాతానుక్రమముగనే ప్రకటించు నాచారము కలదు. వ్యక్తపరిమాణముల నెల్లయెడల నత్యపదముగనే ప్రకటించి "రు" యనుసంకేతముతో గలిపి వ్రాసెడివారు. "రు" యన్నది రూప

ములను (Units) పదములయొక్క ప్రథమా క్షరము. "స్వ, ఋ, ఞ" పదము లెట్టినిబం ధనలేక యథేచ్ఛగ నాదిమధ్యాంతములలో నెచ్చోటనేని ప్రయోగించుచుండెడి వారు. సమీకరణముయొక్క యుభయపార్శ్వము లందునుకూడ ప్రతిఘాతమును ప్రకటించుచు నాఘాతఘాత మాయాపార్శ్వముల లేనపుడు శూన్యము నాపదముయొక్క గుణకగా నుప యోగించి ప్రయోగించు నాచార మున్నది.

56. హిందువులు బీజగణితీయ ప్రశ్నలను వేయువిధము చాల నాహ్లాదజనకముగ నుండును. ప్రాచీన గ్రంథములు సాంకేతిక యుతములు గావు. వారు ప్రయోగించిన సంకేతములు పేరులసంక్షేపణములే. ఋణపరి మాణములతోడి వ్యాపారములందు ఋణ భావనగల యాయాపరిమాణములమీద నొక చుక్కను నిలుపు నాచారము గలదు. తక్ష శిల ప్రాచ్యలిఖిత పుస్తకమునందు ఋణ భావము నొక హంసపాదును (× cross) పరిమాణములపైన నిలిపి ప్రకటించిరి. కొంత కాలమైనతరువాత శారద వ్రాతప్రతులలో చుక్కను శూన్యమునకు బదులుగా వాడి యున్నారు.

57. భాస్కరుడు తా నుపయోగింప బూనిన సంకేతములనెల్ల విశదపఱచిన తరు వాత బీజగణితమాపల (algebraic expressions) సంకలన, వ్యవకలన, గుణకార, భాగ హారములకును; వర్గమూలమును గనుగొను టకును, సూత్రముల నిచ్చియున్నాడు. లీలా వతియందువలెనే, కొన్ని శూన్యవ్యవహార ములను, కొన్ని సమీకరణముల వివరణలను, కరణాంకములతోడి ప్రక్రియలను, ప్రకటించి యున్నాడు. రూపవతులగు దేవకన్యలను గూర్చియు, మహావీరులగు యోధాగ్రేసరులను గూర్చియుఁ జెప్పఁబడ్డ్యాత్మకములగు ప్రశ్నలీ గ్రంథములందు చాలగాన్పించుచున్నవి.

58. పంద్రెండవ శతాబ్దమున భాస్క రుడు వ్రాసిన గ్రంథమునం దవ్యక్త పరిమాణ ములను ప్రదర్శించు ప్రత్యేకపదములను ప్రక టించియున్నాడు. ఏదేని యభీష్టసంఖ్యను యావత్తావత్తనియు, దీనికి పర్యాయపద ములుగ-నలుపు (కాలక), మబ్బురంగు (నీలక), పసుపు (పీతాక), ఎరుపు (లోహిత), మున్నగు- రంగులపేళ్ళను పూర్వు లుపయోగించియు న్నారు. హిందువు లోకట్లకు రూపము (Units) లని యుపయోగించియున్నారు.

సంకేతము.	పదము.	ప్రయోగము.
యా =	యావత్తావత్	- మొదటి యవ్యక్తపరిమాణము
కా =	కాలక	- రెండవయవ్యక్తపరిమాణము
రూ =	రూపము	- వ్యక్తపరిమాణము
వ =	వర్గము	- ద్వితీయ ఘాతము
ఘ =	ఘనము	- తృతీయఘాతము
క =	కరణము	- $\sqrt{\text{మూలాంకము}}$

చతుర్థఘాతమును, వర్గ ఘాతమనియు; పంచమ ఘాతమును, వర్గఘన ఘాతమనియు; షష్ఠ ఘాతమును, ఘనవర్గమనియు; నిట్లే తక్కిన ఘాతములను నేర్పరచుకొనుచు బోయిరి. వారు సమీకరణములను వ్రాసిన విధమును తెలుపుట కీదిగువ రెండుదాహరణ ములను చూడుడు:

i యా 6 రూ 300 యా 10 రూ 100	6 యా × 300 = 10 యా — 100 [అని మనమిప్పుడు వ్రాయు సమీకరణ మగుచున్నది.]
ii యా 197 కా 1644 నీ i రూం యాంకాంనీంరూ 6302	197 యా — 1644 కా. నీ = 6302 [అని మన మిప్పుడు వ్రాయు సమీకరణమగుచున్నది.]

59. తక్కిన ప్రకరణములందు కూడ నచ్చటచ్చట బీజగణిత, త్రికోణమితి, రేఖా గణిత ప్రయోగాశ్రిత భాగములును గలవు. త్రికోణమితిక సంకేతలలో నాధునికులచే వ్యవహరింపబడు * చ (జ్యచ) = కోజ్య చచ. యను సమీకరణమునకు తుల్యమగు నొకసంకేత యున్నది.

60. ఆర్యభట్ట బ్రహ్మగుప్తులయు; వారి తరువాతవారగు శ్రీధరపద్మనాభాదులయు, గ్రంథములలో ప్రథమమున నరబ్బులకు పరిచయ మున్నట్లు యగపడుచున్నది. భాస్కరుని గ్రంథము నరబ్బు లంతగా నుపయోగించినట్లగపడదు.

61. మనవా రుపయోగించిన గ్రీకు పదములను కొన్నిటి నిచ్చట కుదురుపఱచెదను.

సంస్కృతము.		గ్రీకు.
1. జామిత్ర	=	డయామిట్రః
2. కేంద్ర	=	కెంట్రాన్
3. త్రికోణ	=	ట్రిగాన్
4. లిప్త	=	లిప్టె
5. హోరిజ	=	ఆరిజన్
6. పార్శ్వ	=	ప్లియూర
7. జాత్య	=	ఆర్థోగ్నియ
8. కొలికమ్	=	కథిటాస్

* d (Sin చ.) = cos d చ.

సందర్శనము

సన్నిధానము సూర్యనారాయణశాస్త్రి గారు

అలరు శంపాలతా ప్రగ్రహములు గలుగు
వారివాహాశ్వములఁ గట్టఁబడిన పుష్ప
రథముపై నెక్కి యూరేగు రమ్యమూర్తి
దివ్యతేజస్విఁ గనుఁగొంటిఁ దృప్తిఁగంటి
ఆనదీసైకతములకు నరిగి యచటఁ
దనకటాక్ష వివర్త శీతల తరంగ
ములను బ్రసరించు నాకృపాపూర్ణహృదయుఁ
గనులపండువుగా నేను గాంచినాఁడ.

కోకిలధ్వని శ్రుతిసేసికొని వసంత
రూపగీతంబుఁ బాడి భూరుహములెల్లఁ
జిగురువెట్టంగఁ జేయుచుఁ జిత్తములను
బరవశము సేయు గాయకవరునిఁ గంటి.

కవిరాయడు - మహారాజు

చింతా దీక్షితులు బి. ఏ. ఎల్. టి, సాహిత్యసమితి సభ్యుడు

౧

ఒకనాటి ప్రాతఃకాలమున కవిరాయడు స్వప్నావస్థనుండి మేల్కొన్నాడు. బాహ్యప్రపంచవైఖరి అతనికి గోచరమైనది. నిజస్థితి యతని మనస్సునకు తట్టినది. ఖిన్నుడై పోయినాడు!

మహారాజునకు తనపై దయతప్పినదని యాతడు గ్రహించినాడు!

౨

కవిరాయడు కవి కుటుంబమున బుట్టినాడు. కవి గర్భమున జన్మించినాడు. అతడు పుట్టినప్పుడు కోకిలలు కూసినవి, చిలుకలు పలికినవి, మోడు చెట్లు చిగిరించినవి!

లోకమంతయుకవిరాయనికిస్వాగతము చెప్పినది.

కవిరాయని జనకుడు తన హృదయమును ఆ సమయమున పరిశీలించి చూచికొన్నాడు. కవితారసమునకు బదులు ఆనందరసము హృదయమున నిండియుండుట గమనించినాడు. ఆనంద బాష్పములతో తనకు బుట్టిన కవిరాయని నొక్కమారు తలచుకొని "మహారాజునకు కృతిగా నొసగగల నాకతసారి ప్రబంధ మీతడే గదా" అనుకొన్నాడు. తన చిన్నప్రబంధమును, ఈ కవిరాయని మహారాజు చేతిలో బెట్టి జనకుడు నిద్రావస్థను జెందినాడు.

౩

మహారాజు రాజ్యభారమున మునిగి తేలుచున్నాడు. ఎయ్యది మంచి, ఎయ్యది చెడ్డ-అను విషయమును నిర్ణయించుకొనుటలో కాలము జరిగిపోవుచున్నది. ప్రజలను శాసించుచున్నాడు, పన్నులు గొనుచున్నాడు. ఉపదేశవాక్యములను మహర్షుల వదనములనుండి వినుచున్నాడు. రాజ్యపరిపాలనము కష్ట సాధ్యమైన పని అనుకొనుచున్నాడు. అప్పుడప్పుడు మహారాజు చెవులలో కవులగీతములు పడుచుండుటకూడకలదు. అవి ఈర్ష్యాగీతములో, ప్రణయగీతములో ఆమహారాజు ఎట్లు నిర్ణయించుకొనగలడు ? కవిజనకుడర్పించిన కుమారప్రబంధమును మహారాజు ఎక్కడనో పెట్టి మరచిపోయినాడు ?

౪

కవిరాయుడు చిన్ననాటి చెలిమికాండ్రతో దృఢమైత్రి చేసికొని ప్రపంచమును మరచి పోయినాడు.

చిలుకలతో జట్టుకట్టి తీయని పలుకులను నేర్చుకొన్నాడు.

కోయిలలతో సంచారముచేసి పలుకులకు మంజులత్వ మలవడజేసి కొన్నాడు.

గోదావరి నాశ్రయించి స్వేచ్ఛాగాన మభ్యసించినాడు.

ఆతని నివాసము ఎల్లప్పుడు కొండలమీదను చెట్ల మీదను.

ఆతని దృష్టులెల్లప్పుడు ఆకాశపథమున నక్షత్ర మండలములవైపే.

ఈసహవాస బలముచేత కొంతకాలము పాటపాడుటే మరచిపోయినాడు కవిరాయడు.

సహవాసులప్రోద్బలముచేత కొంతకాలమునకు గీతములను పాడుట మొదలుపెట్టినాడాతడు.

ప్రకృతి గీతములు, ప్రణయగీతములు! చిలుకలు, కోకిలలు ఆతని గీతములు మెచ్చుకొన్నవి.

ఇంతవరకును ప్రజలు రంగు బొమ్మలను మెచ్చుకొనువారు. సజీవగీతములను చూచి వారు మూకీభావము వహించినారు.

కవిరాయని వంశము వారందరు మహారాజునకు కృతులిచ్చినవారే.

కవిరాయడు చిలుకలకును, కోయిలలకును తనతొలిచూలి బిడ్డ నర్పించినాడు!

మంచి సావాసము చేయుచుండలేదని మహారాజు కవిరాయని మరచినాడన్నారు కొందరు! చిలుకలకును కోయిలలకును కృతియిచ్చుట తగని పనిగా గణించి కోపమందియుండవచ్చునని మరి కొందరన్నారు!

నిజస్థితి మాత్ర మెవ్వరికిని తెలియలేదు.

౫

మహారాజునకు తనపై దయతప్పినదని తెలిసికొని కవిరాయడు ఖిన్నుడై దుఃఖగీతములుపాడ మొదలుపెట్టినాడు. లోకమునావరించియున్న దుఃఖసముద్రములో నవి లీనమై పోయినవి.

కొంత కాలమునకు తెలివితెచ్చుకొని మహారాజుపై గీతములల్లినాడు కవిరాయడు. మహారాజున కందచేయుదునని చెప్పి వాయువా గీతములను తనగర్భములో దాచుకొన్నది.

మరల క్రొత్తగీతముల నాతడు పాడినాడు. మహారాజున కందజేతుమని చెప్పి చిలుకలా గీతములను దాచి వేసినవి.

క్రొత్తకృతుల మరల నాతడు కల్పించినాడు. ఈమారు కోయిల లాకృతులను మహారాజునకందజేతుమని చెప్పి పుచ్చుకొని ఎక్కడకో లేచిపోయినవి.

తన చిన్ననాటి సహవాసులు తనపై కినుక వహించిన ట్లాతడు గ్రహించినాడు. చిన్ననాటి సావాసగాండ్రను పూర్తిగా మరచినాడు. లోకమునంతను పూర్తిగా మరచినాడు. తన దృష్టి మహారాజుపై నిల్పి ఎంతో విశ్వాసముతో నాతని తన హృదయ పీఠమున నిల్పుకొన్నాడు.

"ధనదేవత నుపాసించుచున్నావా" యని చిలుకలు గేలిచేసినవి.

"మేము లేని గీతములు గీతములా" యని కోయిలలు పరిహాసించినవి.

"వంశగౌరవమును కాపాడుకొనవలెను సుమా" యని స్వప్నములో కవిజనకుడాదేశించినాడు.

కవిరాయని దృష్టిమాత్రము చెదరలేదు. ఒకటే లక్ష్యము—అది మహారాజే.

కవిరాయునికి యౌవనమువచ్చినది.

మహారాజునకు దయకలుగలేదు.

౬

ధ్యానముద్రలో కొంతకాలముండి తరువాత మహారాజుపై మరలగీతములు వ్రాయ మొదలు పెట్టినాడు కవిరాయుడు.

సొంతముగా వీనిని తాను కృతియీయదలుచుకొన్నాడు మహారాజునకు.

మహారాజుదర్శనము కవిరాయునికి కలుగలేదు.

తన వంశీయుల పూర్వకృతులలో గలిపి తన కృతులను గూడ గొంతెత్తిపాడ మొదలు పెట్టినాడు కవిరాయుడు.

మహారాజు కార్యభారమున నుండుటచేఆతని చెవుల బడలేదివి.

గీతముల సంఖ్య నానాటికి హెచ్చిపోవుచున్నది. పాటలు నిరతము పాడుటచే కవిరాయని గొంతు బొంగురుపోవుచున్నది.

మహారాజు కార్యనిమగ్నుడై యున్నాడు. కవిరాయునికి నిరాశ ఎక్కువగుచున్నకొలది మహారాజుపై విశ్వాసము అధికము కాజొచ్చినది. తాను రచియించిన గీతముల నన్నింటిని లోకములో ప్రచారార్థమై వదలిపెట్టినాడు కవిరాయుడు.

లోకములోనివారు గీతములను పఠించినారు.

"మహారాజు హృదయము వజ్రశకల" మన్నారు కొందరు.

"కవిరాయడు ప్రకృతిని వదలిపెట్టిన తరువాత స్తోత్రపాఠములను వ్రాయుచున్నాడుగాని గీతములను వ్రాయుటలేద" న్నారు కొందరు. "సత్కార్యమునకు కవిరాయడు ఫలము నాశించుటతప్ప" న్నారు కొందరు.

"వంశాచారమును వదలించుకొనుట ఎవ్వరితర"మని కొందరన్నారు.

కవిరాయనికి లోకముపై కోపము పుట్టినది. మనస్సున నొకవిగ్రహము కల్పించుకొని తాను రచించిన కృతుల నన్నింటిని దానికి కృతి యీయ మొదలుపెట్టినాడు.

ఆవిగ్రహమే మహారాజన్నాడు కవిరాయడు.

ఎంతో కాలము గడిచినది.

మహారాజు తల నరసినది, ఒడలు ముడుతలు పడినవి. రాజ్యభారము నానాటికి అతిశయించుచున్నది.

కవిరాయనికి దృష్టి మందగించినది. చేతులు వణకుచున్నవి. కంఠము రుద్ధమైనది. గీతములను పాడుచునేయున్నాడు.

మహారాజునకు కవిరాయనిపై అనుగ్రహము కలుగలేదు.

కవిరాయనికిమహారాజుపైవిశ్వాసముతగ్గలేదు!



భమిడిపాటి రామ సోమయాజులు గారు బి. ఏ.

౬

వస్తులక్షణపరిశోధనము

(Model Study.)

జ్ఞానాభివృద్ధికి ప్రపంచ పరిశోధనము మార్గము. ఏసంగతిగూర్చియైన సంపూర్ణముగా నెరుంగుట కాసంగతిని సవిస్తరముగా పరీక్షించుట ముఖ్యము. రాత్రి కొన్ని జంతువులకు కన్నులగపడునని చెప్పుటకు నాజంతువులుచేయుపనులబరీక్షించి పరీక్షించి, రాత్రి వేళ కన్నులు కానరానిజంతువుల చర్యలకును, వానికిని గల భేదముం దెలిసికొనవలెను. జ్ఞానసౌధమునకు పరిశోధనాసోపానము లమరియుండును. ఆసౌధముం బ్రవేశింప గోరువాడు శ్రమనెంచక నీ సోపానముల నన్నిటి నెక్కవలెను. అట్లుకానిచో నాతడజ్ఞానభూమిపై నిలచిపోవలయును. సవిస్తరమైన పరిశోధన మున్నపైనగాని జ్ఞానము సంపూర్ణము కానేరదు. చిత్రలేఖనమున నిట్టి పరిశోధన ముండకతీరదు. చిత్రకారుడు కంటికి గానవచ్చు రూపముల దనభావానుసరణముగ జిత్రించుచున్నాడు చిత్రము ప్రకృతి విపరీతము కాగూడదు. దాని ననుసరించి యుండవలెను. అందువలన చిత్రలేఖకుడు తాను లిఖింపవలసినవస్తులయొక్క లక్షణమును బాగుగా పరిశీలింపవలసియున్నది. పరిశీలన మెంతజాగరూకతో చిత్రకారుడు చేయగలడో, చిత్ర మంత ప్రకృతిస్వభావానుసరణమై యొప్పుచుండును. వస్తులక్షణముం బరిశోధింపకయే, జ్ఞాపకశక్తిపై నాధారపడి, చిత్రకారుడు వస్తువుల జిత్రించినను అయ్యవి భావానుసరణములైనను ప్రకృతిస్వభావాను

సరణములు గాకుండును. గొప్పబుద్ధిమంతు
డైనవాడు వస్తువుల నెదుట నుంచుకొనకుండ
గనే తనచిత్రములను జాలవరకు ప్రకృతి
ననుసరించియుండునట్టుల జేయ సమర్థుడై
యుండవచ్చును. కాని యాతడే వస్తువుల
నెదుటనుంచుకొని వానిని బరీక్షించుచునైననే
చిత్రలేఖన మొనర్చినచో నాతనిచిత్రము
లందు లక్షణలోప మెన్నటికిని గానరాదు.
అదియట్లుండగా, ప్రపంచమునగల ప్రతివస్తు
వును గమనించినకొలది వానిలక్షణములందు
రహస్యములు బయలువెడలుచునేయుండును.
చిత్రకారు డాజన్మాంతము బరిశోధన మొన
ర్చినను, కడసారినిగూడ నాత డిదివర కెరుం
గనిరహస్యములను వస్తువులయందు గ్రహింప
గలుగుచుండును. పాశ్చాత్యచిత్రకారులలో
నగ్రగణ్యులగు వారెల్లరు, తమజీవితాంత
ములవరకు వస్తులక్షణపరిశోధన మొనర్చు
చునే యుండిరి. వారిజీవితకాలములో నెన్న
డును వస్తువుల బరిశోధింపకుండ వా రొక్క
బొమ్మనుగూడ లిఖించియుండలేదు. అట్టి
నియమము చిత్రకారుల కందఱకు నుండవల
సినదే. వస్తులక్షణపరిశోధన మొనర్పకుండుట
చేతనే బంగాళాచిత్రకారుల చిత్రములన్ని
యును భావయుతములయ్యును, లక్షణహీన
ములును లక్షణవిరుద్ధములు నై యున్నవి.

ప్రపంచమునందుగల యచేతనపదార్థ
ములను లిఖించుటకే చిత్రకారుడు వానిలక్ష
ణముల నెంతయో పరిశీలింపవలసియున్న
ప్పుడు జీవప్రపంచమును లిఖించుట కాత
డెంతతీక్ష్ణముగా బరిశీలింపవలయునో చెప్ప
బనియేమున్నది? ఒకపాత్ర నెన్నిరీతులుగా
నుంచినైన లిఖింపవచ్చునుకదా! ఒకసారి
వ్రాసినరీతి నొకసారి వ్రాయకుండ లెక్కలే
నన్ని వివిధరూపములం జూపి వ్రాయుట కవ
కాశమున్న నిర్జీవవస్తువులను, చిత్రకారు
డాయాసందర్భముల కుచితమగురీతినుంచి దాని
లక్షణము గ్రహింపవలసినదేకదా! పరీక్ష
లేనిదే యాలక్షణములందు గూఢమై చూచిన
గాని యెరుంగరాని రహస్యముల నాత డెరుం
గజాలడుకదా! ఘనుడగు చిత్రకారుడు,
తానుబోయినను తనచిత్రము లంతరింపరా
దను నాలోచనగలట్టివాడు, నిర్దుష్టములగు
చిత్రముల లిఖింపవలెను. లేనిచో నవి శీఘ్ర
కాలములోనే, తనకళ్ల యెదుటనే, పండిత
దూషణాగ్ని కాహుతియై నశించును. అట్లు
నిర్దుష్టములై యుండునట్లు లిఖింపవలెనన్న
నేచిత్రకారుడైనను తనచిత్రమందు జూప
దలంచుకొనిన వస్తువుంగాని, వస్తువునం దొక
భాగముంగాని, యనేకవస్తువుల సముదాయ
ముంగాని, చూచి, పరిశోధనానంతరమున
లిఖింపవలయును. భావమున కుచితమగురీతిని
వస్తువులంగూర్చి వానిలో దనభావమునకు
దోడ్పడు గుణములనే గ్రహించి, దోషముల
విడచి వ్రాయుటే చిత్రకారునినేర్పు.

అది యట్లుండగా నిక జీవప్రపంచము
నందలి వస్తులక్షణపరీక్ష కంతమనునదే లేదు.
జంతువులనుగాని, యంతకు నెక్కుడుగా, మా
నవునిగాని పరిశోధింప చిత్రకారుడు గడంగి
నచో నాతనిపరీక్ష కంతముండదు. మాన
వునియొక్క నేత్రము నొక్కదానిని చిత్ర

కారుడు పరిశీలింప మొదలుపెట్టి ప్రతిదినము నందుననే కాలముపుచ్చుచుండినను, దానిని బూర్ణముగా, దనజీవితమంతయు ధారవోసి యైన గ్రహింపలేడు. భగవంతుని సృష్టిలో గల చిత్రమంతయు నిట్టిదియే. ఏశాస్త్రజ్ఞుడైన దనశాస్త్రమును సంపూర్ణముగా నెరుంగుదునని చెప్పజాలడు. జ్ఞాన మెక్కుడైన కొలది, బుద్ధిమంతున కెరుగని సంగతులే యెక్కుడనియు, దనకు దెలిసిన దేదియు లేదనియు బోధయగును. చిత్రకారుడు ప్రకృతిని ప్రకృతివలెనే చూపించుచున్నా డనగా, ప్రకృతిస్వభావమును జాలవరకు దనచిత్రములందు జూపింపజేయుచున్నాడని భావము. లక్షణము మూలము ననుసరించినకొలదిని, చిత్రము ఘనత జెందియుండును. అందుకే లక్షణపరిశీలనము చిత్రకారున కత్యవసరమై యున్నది. ఒకఘనుడగు చిత్రకారుడు నాతో నొకసారి యిట్లు చెప్పెను. "లక్షణపరిశీలనము లేనివానిని చిత్రములుగా విమర్శకు దెంచరాదు. మన హిందూదేశమున మానవశరీరలేఖనమందు, ఉండవలసిన తావులందు, కన్నులు, ముక్కు, చెవులు, నోరు, నుంచగలిగిన చిత్రకారులు చాలతక్కువగా గలరు." ఆమాటలయందలి యర్థమును బుద్ధిమంతులైన పాఠకులకు నేచెప్ప బనియేమున్నది? ఆతడు హిందూదేశమునందలి పెదపెద్దవారల మనుకొను చిత్రకారుల చిత్రములనెల్ల బరిశీలించి చెప్పినమాట లట్లున్నవి. గానమునకు సాధక మెట్టిదో, చిత్రలేఖనమునకు వస్తుపరిశీలనముతో గూడిన సాధక మట్టిది. అది లేకుండుట చిత్రకారుల కులసంప్రదాయమునకుం గేవలము వ్యతిరిక్తము. పెద్దతప్పు.

ఇదివరలోని వ్యాసములందు, భావము లేని చిత్రములు నిర్జీవములనియును, ప్రకృతి నున్నదాని నున్నట్టులనే ఫొటోగ్రాఫులదీయు క్యామెరాయంత్రమువలె బొమ్మలోని కెక్కించుట యుత్తముడగు చిత్రకారుడు చేయదగదనియును చెప్పితిమి. అట్టియెడల, నేదివ్రాసినను ముందు నావస్తువు నుంచుకొని వ్రాయుట యనునది, తొలుత చెప్పబడినదానికి వ్యతిరేక స్వభావముగల సూత్రము కాదాయని ప్రశ్న. కొందరు చిత్రకారులు మానవుని వ్రాయుటకు గడంగునప్పుడు తా మెంచుకొనిన యందముగల్గినవాని నొకని దమయిచ్చవచ్చిన రీతిని గూర్చుండబెట్టియో, పరుండబెట్టియో, చూచి, యున్న దున్నటులనే లిఖింతురు. అట్టి చిత్రలేఖనము శ్లాఘ్యముకాదు (Direct model). వస్తులక్షణమును చిత్రకారు డెప్పుడు పరిశీలింపవలయును? చిత్రకారు డెంతవరకు వస్తువులయొక్క యాకారవిశేషములకు లొంగియుండవలెను? చిత్రకారుని భావము ప్రాముఖ్యముగలది యనగా నర్థమేమి?

ప్రస్తుతమున, మన హిందూదేశమునందు, అందునను ముఖ్యముగా మనయాంధ్రదేశమందు, చిత్రలేఖనమునం దభిరుచిగల బాలురందరును, చిత్రప్రదర్శనశాలలు మొదలగు స్థలములందు వన్నెకెక్కియున్న గొప్ప గొప్ప చిత్రకారులచే లిఖింపబడిన చిత్రములం జూచి యొకవిధమగు నాశాప్రవాహము మన

స్సులం దుబ్బుకొనిరాగా, నిండ్లకుఁబోయి, యొక గంటకాలములో దాముచూచిన చిత్రముల వంటి చిత్రములను వ్రాయ బ్రయత్నించుచున్నారు. అట్టులు ప్రయత్నించువారిలో గొప్ప బుద్ధిమంతులుకూడ నుండవచ్చును. అసమానబుద్ధి కలవాడైనను, ఎన్నటికిని అట్లు తొందరపడి, ఆశాప్రవాహమునకు లొంగిపోయి, చిత్రలేఖనమునకుగాని యే కార్యసిద్ధికిగానిగడంగినచో, విఫలుడేయగును. కాని యిది ప్రపంచమునందలి యువజనుల కెల్ల స్వాభావికమైయున్నది. ఒక ఫలితముం జూచి, యువకు డాఫలితముం దానుగూడ గాంచవలెనన్నయాశ మనమునందు నిండుకొనగా, నయ్యది కాంచుటకుగల మార్గమును, అందలి క్లేశమును, దానికి వలయు కాలమును పాటింపక నేవియో వెర్రిమొర్రి ప్రయత్నముల గావించి, యాఫలితముం బొందజాలక వ్యర్థప్రయత్నుడగును. గానాభ్యాస మెంత క్లేశముతో గూడియున్నదో తెలియజాలక, నొక గానసభలో నొకమహాగాయకుని మహాగానము నాకర్ణించి, యందు నానందము విపరీతముగా నంది, యంతటి పాటను వెంటనే పాడబ్రయత్నించి హాస్యాస్పదుడగుచున్నాడు. ఇట్టి వ్యర్థప్రయత్నములు దేశౌన్నత్యమునకు లాభ మొసంగనేరవు. దేశయువకులయం దిట్టియుద్రేకముం డుట చాలగొప్పసంగతియే...కాని, దాని నీరీతి బాడొనరించుచుండు టెంతయు విచారింపవలసిన యంశము.

గానశాస్త్ర మెంతటి విస్తీర్ణమైనదో, చిత్రలేఖనశాస్త్ర మంతవిస్తీర్ణమైనది. అది యభ్యసించుట చాలకష్టము. ఎంతటిబుద్ధిమంతుడైనను, దానిలో చేయవలసినకృషి న్యాయముగా దీక్షతో జేసినగాని, యందు పాండితి లభింపదు. గొప్ప చిత్రకారులని పేరెక్కినవారందరు, నీయవస్థలన్నియు బడినవారు, పడుచున్నవారు నైయున్నారు. మనలో వేదపరముగా నొక సామ్యమున్నది. "వచ్చేవరకు నేర్చుకొని, చచ్చేవరకు వల్లె వేయవలె" నని. అట్టులనే చిత్రకారుడు తన జీవితములో తుదవరకు నభ్యాసమొనర్చుచునే యుండవలెను. అత డెల్లప్పుడును ప్రకృతికి శిష్యుడై దానిలోని రహస్యస్వభావములను నేర్చుకొనుచునే యుండవలెను. అట్టి రహస్యముల నెన్నిటినో గ్రహించి, తగినంత పాండిత్యముం గ్రహించియున్న చిత్రకారుడు, దేశమునందు బ్రకటింపదగు చిత్రములను లిఖించుటకు మొదలుపెట్టవలెను. అట్టివాడైనను, తాను వ్రాయబూనుకొన్న చిత్రమందలివస్తువుల నెదుటనుంచుకొనియే వ్రాయవలయును. కాని యావస్తువులకు నాతడు భృత్యుడై పోక, తనభావమునకు దగినరీతి నావస్తులనే లొంగించుకొని, భగవచ్ఛక్తి జనితములగు స్వభావరహస్యములకు మాత్రము దాస్య మొనరించి, వానిని దనచిత్రమునందు జూపింపవలయును. అట్లు చేసినపట్ల చిత్రమునందు నవరసములేని గుణములుకాని, యుండకూడని లక్షణములుకాని కానరావు. ఇది బాగుగ తెలిసికొనుటకై యొక యుదాహర

ణముం దీసుకొని దానిమూలమున జర్చింపవలయును.

మనము రాముని విడచి, సర్వసౌఖ్యములకు గడుదూరమై కఠినచిత్తుడగు దశకంఠునిచే హరింపబడి, లంకలోని వనమునందు రాక్షసస్త్రీలు గావలియుండ రామవియోగ దుఃఖానలమున దపించుచున్న హృదయము గల సీతను వ్రాయవలయును. ఏ చిత్రమునందునైన భావమే ప్రధానము. భావము లేనిదే చిత్రమునకు జీవము రాదు. మనము వ్రాయబోవు నీ చిత్రమునందు ముఖ్యముగా జూపింపవలయుభావ మేది? సీతాదేవియొక్క గుణములు ప్రపంచకాదర్శకములగునట్టుల చూపింపవలయును. ఆమహాపాతివ్రత్యము; ఆమహాదుఃఖము; అట్టి దుఃఖసమయమునను గూఢమై రామభక్తిపూరితమైన యాపవిశాలహృదయము, ఇయ్యవియేకదా ముఖ్యముగా జూపింపవలసినభావములు? తరువాత జూపవలసినది లక్షణము. అందు సీతయున్నచోటు, సీతయున్నస్థితి, ముఖ్యములు.

ఘనులగు చిత్రకారులకు, కవులకు, గాయకులకు, ఈశ్వరప్రసాదితమగు శక్తియొక్కొక్కసారి వారల ప్రయత్నము లేకుండగనే కలుగుచుండును (Inspiration). కవియొక్కడు, నేదేనొకచోట గూరుచుండి యే తెల్లవారుజామువేళనో యున్నప్పు డాతని మనస్సునం దొక యాలోచన మెరపువలె స్ఫురించుచుండును. అది యీశ్వరప్రసాదితశక్తి. ఆశక్తి ననుసరించుకొని యాతడసమానమగు రసపుష్టిగల కవిత్వమును చెప్పును. గాయకుడాశక్తివలననే మరియొకసారి తానైన బ్రయత్నించి పాడజాలని పాట నొక్కొకసమయమున బాడగల్గుచుండును. చిత్రకారుడు కూడ నాశక్తివలననే, ఘనములగు భావములను పొంది, తద్భావముల కుచితములగు రూపములం గాంచి, యారూపముల లిఖింపగల్గును. ప్రస్తుతమున మనము వ్రాయవలయు చిత్రములో సీత యేస్థితియందుండిన భావము ప్రపంచమునకు బాగుగా తెలియునో యోచించికాని, దైవప్రసాదితమగు శక్తివలన దెలిసికొనికాని, యాస్థితిని తొలుత మనము కాగితముపైన, జ్ఞాపకశక్తి నాధారముచేసుకొని పూర్ణముగా లిఖింపవలయును. పిమ్మట దానిపైన నాలోచనము వృద్ధికాగా గలుగుమార్పుల ననుసరించి, దానిలో నవసరములైనచో సవరణల జేయవలయును. అదియైన పిమ్మట సందమగు శరీరముకల యొకస్త్రీని, మనబొమ్మలోని విధాన గూరుచుండబెట్టి, తగినంతకాల మోర్చి యోర్చి, చిన్నచిన్న లక్షణము లన్నిటితో గూడ మరల వ్రాయవలయును. ఇచ్చట మనము జేయుచున్నపని కేవల మనుకరణము కాదు. మన భావమునే మనము లిఖించుచుండియు, ప్రకృతిస్వభావరహస్యము లున్నవాని నున్నట్టుల చిత్రమునందు జూపుటకునై, యాస్త్రీ నెదుట గూరుచుండబెట్టుకొని, దాని శరీరముం జాగ్రత్తగా బరిశీలించి, యందలి రహస్యముల నన్నింటిని గ్రహించుచుంటిమి. ఈపరిశీలనముయొక్క ముఖ్యోద్దేశము మానవశరీరలక్షణము సంపూర్ణముగా జిత్రమునందు

జూపింపగల్గుటయే కాని, మరియొకందులకు గాదు. అట్లులు మనుష్య నెదురుగానుంచుకొని వ్రాయ గడంగునప్పుడు, వ్రాయగూడని సంగతులుకూడ చిత్రమునందు వ్రాయుదుమేమోయను భీతి యుండును. అట్టిది యుండవలసినదే. ఎందుచేతననగా, చిత్రకారునియెదుట గూరుచుండికాని, పరుండికాని, నిలుచుండికాని, తన శరీరసౌష్ఠవము జిత్రకారుడు పరికీలించి తన చిత్రమునందు వ్రాయుట కిష్టపడి యట్లుండుట కొప్పుకొను స్త్రీ సర్వసాధారణముగా నుత్తమురాలై యుండదు. అట్టిపనికి చిత్రకారుడు భోగముపడతులనో తత్తుల్యులనో ధనాశపెట్టి తమకు దోడ్పడ దెచ్చుకొనవలసినదే. ప్రస్తుతము సీకార్య మిట్లులనే జరుగుచున్నది. అట్టివారల నెదుటబెట్టుకొని వ్రాయునప్పుడు వారి ముఖలక్షణములు చాలవరకుచిత్రకారునిచిత్రములోనికెక్కును. కాని వారిలక్షణములందు సహజముగా జారస్త్రీలక్షణములైన గర్వాదులు రూపించుచుండుటచే, నట్టివి చిత్రములలోనికి గూడ వచ్చినచో, సీతాదులకు మచ్చగల్పించునవే యగును. అందువలన నట్టి దుర్లక్షణములను జిత్రములలోనికి రాకుండ గాపాడుకొని, వలసినంతవరకే యెదుటివస్తువు నుపయోగించుకొని, తనభావము నెక్కడనైన జెడనీయక లిఖింపగల్గుట చాలకష్టసాధ్యమైనపని. కాని చిత్రలేఖన మట్టులనే చేయవలయును. కానవచ్చు ప్రకృతిలోని మంచిచెడ్డల వేరుపరచి, మంచిని గ్రహించి, చెడ్డను విడచిపెట్టుటయే బుద్ధిమంతునిలక్షణమై యున్నది. అందునను చిత్రకారున కాశక్తి చాలముఖ్యము. అది లేనివాడు చిత్రలేఖనమునకు బనికిరాడు.

ప్రకృతి పరిశీలనము లేనిదే యెవ్వనికైనను మానసికచిత్రకల్పనాశక్తి యమరి యుండనేరదు. ఒకసారియైనను జూచినవస్తువైనచో మనస్సునందు దాగి, దానిరూపమగత్యమగునప్పుడెల్ల మానసికనేత్రమునకు బొడగట్టుచుండును. అందువలననే కొందరు, ఎదుట వస్తువు నుంచుకొని వ్రాయుటకును, మనస్సులో నావస్తువు పొడకట్టగా, దానినే చూచి వ్రాయుటకును (Taking pitcures from imagination) నిజముగా భేదములేదని యనుచున్నారు. కాని యట్టియూహ చాల పొరబాటు. ఎదుటివస్తువునకును, చిత్రకారుని మనసునందు దా నదివరకు ప్రపంచమునందు జూచినవాని ఫలితముగా తనభావమును సూచింపజాలుటకు బొడకట్టిన చిత్రమునకును, చాలభేదమున్నది. ఏయాలోచనమైనను; తానొక్కటి మనస్సునందు కలుగనేరదు. "పుష్పము" అను మాట యాభావముతో గలసియే మనస్సునందు బొడకట్టుచున్నది. ఆక్షణమునందే, యొకపుష్పము కూడ వికసించి యున్న దున్నట్టుగా మానసపత్రమున లిఖింపబడి మనస్సున కెదుట విస్పష్టముగా గానవచ్చుచున్నది. ఈమార్పులన్నియు మనస్సునం దొక్కసారియే కలుగుచున్నవి. కాని పుష్పభావము ప్రత్యేకముగా మనస్సునం దుదయింపజాలదు. అట్టులనే, యేక్షణమునందు రామవియోగ దుఃఖమ్మా

దయయగు సీతయొక్క భావము, మనమన
స్సులందు దైవప్రసాదితశక్తివలన గలుగు
చున్నదో ఆక్షణమునందే, మన కాభావము
సంపూర్ణశరీరాది సర్వలక్షణయుక్తమైనదే
ప్రసాదింపబడును. ఆరూపమే మన కాభావ
మును దెలియజేయును. ఆభావమే మన కారూ
పమును దెలియజేయును. ఒకటిలేనిదే రెండ
వది లేదు. అందువలన నారూపము, నిశ్చయ
ముగా నాభావమును విస్పష్టముగా బోధింప
గలదు. అదియే యాభావమున కుచితమగు
శరీరము. దానినే ముందు మన మొక కాగిత
ముపైన జాగరూకతతో లిఖించుకొని, తదను
కూలముగ నొకస్త్రీని గూరుచుండబెట్టి శరీర
లక్షణరహస్యములం గ్రహించుకొని, చిత్ర
మును వ్రాయవలయును. ఇట్టి మానసిక
చిత్రము, పై ప్రపంచమున మనము చూచు
చున్నవానియొక్క ఫలితమే కాని, యందు
దుర్గుణములు కాలముతో నశించి, స్వచ్ఛ
ములగు గుణములే మనస్సునందు నాటికొని
యుండుటంబట్టి నిర్దుష్టమైయుండును. ఎదుట
బెట్టుకొన్న వస్తువునందు సుగుణదుర్గుణ
ములు మిళితమైయుండును. అందువలన,
చిత్రకారుడు దుర్గుణములను విడచి సుగుణ
ములనే గ్రహించుటకు బ్రయత్నింపవలసి
యుండును. అది యారెంటికిని గలభేదము.
అట్లు లెదుటగలవస్తువునందలి దుర్గుణములను
విడచిపెట్టి సుగుణములను గ్రహింపగల్గుటయే
చిత్రకారునిబుద్ధికి గలనేర్పు.

దీనివలన వస్తులక్షణపరిశీలనము చిత్ర
కారున కెంతటిముఖ్యమైనపనియో తెలియు
చున్నది. అట్లు లెదుటమనిషి నుంచుకొని
యారూపమును వ్రాసినపిమ్మట, సీతాదేవి
యాసమయమునం దెట్టిస్థలమునం దుండునని
ప్రశ్నించుకొని, యందుల కనుకూలమగు
తావు నొకదానిని మనము ప్రస్తుతప్రపంచ
మునం దెంచుకొని, యచ్చటకు బోయి దాని
నున్నదాని నున్నట్లు చిన్నచిన్న స్వభావ
రహస్యములతోగూడ గ్రహించి లిఖింపవల
యును.(Ground) ఆపిమ్మట నాచిత్రములకు,
రంగులును, రేఖయు వేయవలయును.

అట్లు ప్రత్యక్షవస్తులక్షణరహస్యపరిశీల
నము లేనిదే వ్రాయుచుండుటచేతనే, బంగా
ళాదేశచిత్రములందు చాలవరకు వికారా
కారములగు బొమ్మలు కానవచ్చుచున్నవి.
అయ్యవి యుత్తమచిత్రములు కావని మన
మిదివరకే యెఱింగియున్నారముకదా! వస్తు
లక్షణము బాగుగా గ్రహింపకుండ నేవస్తు
వును లిఖించుటయనునది, యనేకవిధములుగా
తప్పు. అది యొకవిధమగు దొంగతనము.
అట్టి ప్రయత్నముతో వ్రాయబడిన చిత్ర
ములను విమర్శకులు దూషించి, యట్టి దుర్న
యములను సాధ్యమగునంతవరకు నడపబ్రయ
త్నించుట మనదేశ చిత్రలేఖన మభివృద్ధి
గాంచుటకు జాలవరకు దోడ్పడును. వస్తు
లక్షణ పరిశీలనము జేయుడని దేశమునంగల
చిత్రకారు లందరకును సంతతము వినవచ్చు
చుండునటుల విమర్శకుడు శంఖనాదముల జే
యవలయును. అట్లుచేసినగాని, నూతనముగా
నుదయమందిన యీ కోమలచిత్రలేఖన
లతిక యున్నతస్థాన మలంకరింపజాలక, నేల

భ్రాకి ప్రాకి తుదకు పండి పాదఘాతమున నశించును. చిత్రలేఖనమున కిట్టికట్టుపాటులతోఁ గూడిన యభ్యాసము ముఖ్యముగా నుండవలయును. కాననే దీనికి కళాశాలలు గావలయునని ఘోష బయలువెడలుచున్నది. చిత్రలేఖనమునందు నభిరుచిగల బాలుర నాకళాశాలలలోఁ వారి తలిదండ్రులు ప్రవేశపెట్టి వారది నేర్చుకొనునట్లుల జేయవలయును. అట్లు గాని, యీ ముఖ్యమైనయభ్యాసము జరుగనేరదు. అదితగినన్నికట్టుబాట్లతోఁ (Discipline) నభ్యాసమైననే కాని ప్రయోజనము లేదు. చిత్రకారునకు, బుద్ధి యొక్క-ఓకాక, యోరిమి, పట్టుదల, జాగ్రత్త, నేర్పు, మున్నగు గొప్పగుణము లమరియుండవలయును. అట్టి గుణము లభ్యాసమూలమునగాని కలుగవు.

ముందు పుటక

నండూరి వెంకట సుబ్బారావు బి. ఏ., సాహితీసమితి సభ్యుడు

౧

నాపక్క తిరిగి మాటాడవా
 రెంకీ!
యీ సిక్కు నీ విప్పగలవా?
యీ జంట విడిపోయి
యే వాడనో తెలి
రెంకిపా టినగానె
యెదర నిలిసే దెవురో?
 నా సూపు
సెదరగొట్టే దెవురో?
 నా దోవ
సదును జేసే దెవురో?—నా.

౨

మన సేతితో నాటి
మనసొంతమని పెంచి
మనకోట యీ తోట
మరుపు రాకుంటాద?—
 నా గుండె
మరిగిపోకుంటాద?—నా.

3

వోయికుంట మే నీతో
వోరుగుతాదని నమ్మి
కలిసున్న నాకాసి
కన్నెత్తి సూసేవ?
 నీ వోన్న
సిన్నెలు సూసేవ?
 యింతింత
అన్నేయ మూంటాద?—నా.

అబ్దుర్ రజాక్

రెండవ (యిమ్మడి) దేవరాయలనాడు విజయనగరమున పారశీకరాయబారి

(౧౪౪౧-౧౪౪౪)

భావరాజు వేంకటకృష్ణ రావుగారు బి. యే., బి. యల్.

అబ్దుర్ రజాక్ జీవితము.

అబ్దుర్ రజాక్ నిండుపేరు కమాలు-ద్దీన్ అబ్దుర్ రజాక్. అతనితండ్రిపేరు జలాలు-ద్దీన్ ఇషక్. అబ్దుర్ రజాక్ తండ్రి మధ్యఆసియాఖండములో 'సమరఖండ' దేశవాస్తవ్యుడు. మనకథానాయకుడుమహమ్మదీయహిజరాశకము ౮౧౬ సంవత్సరము షాబాన్ మాసమున పన్నెండవదినమున (అనగా క్రీస్తుశకము ౧౪౧౩ వ సంవత్సరము నవంబరు ౬వ తేది.) హిరాట్ నగరమున జన్మించెను. పారశీకచక్రవర్తియగు సుల్తాను షారుఖ్ కొలువున జలాలుద్దీన్ కొంతకాలము "కాజీ" యుద్యోగమునను, మరికొంతకాలము "ఇమామ్" ఉద్యోగమునను౦డుచు సుల్తానుచే నప్పుడప్పుడు ధర్మసందేహనివర్తికై యాహ్వానింపబడుచు ధర్మగ్రంథములు చదివి వినిపించుచుండెను. అబ్దుర్ రజాకు తండ్రివలెనే గొప్పవిద్వాంసుడును, అరబీభాషయందు వైయాకరణియునైయుండెను. తండ్రి చనిపోయినతరువాత నతడు అరబీభాషలోని ప్రత్యయములు, సర్వనామములనుగూర్చి 'అజ్డుద్దీన్ యాహ్యా' అనువాతడు వ్రాసిన వ్యాకరణమునకు గొప్పవ్యాఖ్యానమునురచించి, దానిని సుల్తానుషారుఖ్ న కంకితము చేసెను. కృతియొసంగుసమయమున సుల్తాను అబ్దుర్ రజాక్ పాండిత్యమునకును రాజభక్తికిని కడుమెచ్చుకొని తనహస్తమును అత్యంతగౌరవసూచకముగ ముద్దిడనిచ్చి గౌరవించెను. ఆప్రభువు పరిపాలనావసానకాలమున నితడు విజయనగరచక్రవర్తులకడకు[1] రాయబారిగా బంపబడియెను. విజయనగరమునుండి స్వదేశమగు ఖురాసాన్ దేశమును సుఖముగా చేరునప్పటికనేకకష్టము లనుభవించి దుర్దశలపాలయ్యెను. సుల్తాన్ షారుఖ్ మరణించినతరువాతనుగూడ నితడు వరుసగా సింహాసనమధిష్ఠించినమీర్జాఅబ్దు-ల్ లతీఫ్, మీర్జాఅబ్దు-ల్లా, మీర్జాఅబుల్ కాశిమ్ సుల్తానుల కొలువుకూటముల గౌరవింపబడుచుండెను. విజయనగరమునుండి తిరిగివచ్చినతరువాత క్రీ.శ. ౧౪౪౬వ సంవత్సరమున "గిలాన్" దేశమునకు రాయబారిగా బంపబడియెను. కాని యాపనిపూర్తిగాకమునుపే యీజిప్తు దేశమునకు బోవలసినదని సుల్తాను షారుఖ్ వర్తమానము పంపియుండెను. ఇంతలో నాతని నింతయాదరించి గౌరవించినయాసుల్తాను మరణించుటచే ఈజిప్తు రాయబారము కొనసాగియుండలేదు.

క్రీ. శ. ౧౪౫౨ వ సంవత్సరమున సుల్తాన్అబుల్ కాశిమ్ బాబరుతో గలసి "టఖ్ట్ యజ్దు" అనునగరమున కరిగియుండెను. ఆసంచారమున చరిత్రకారుడగు షరూఫ్-ఉద్దీన్ అలియజ్ది అనువానితో సుల్తాను ముచ్చటించినపుడు ఆసంభాషణ నాలకించుట కితడు నాహ్వానింపబడియుండెను. ఇది జరిగినరెండుసంవత్సరములకు సుల్తాను అబుసయిద్ న కాపుసయి యాతనిచే విశేషముగ గౌరవింపబడియెను. ఈతనికాలమున మన రజాక్ (౧౪౬౩ అక్టోబరునెల) "ఖాన్కహ" అనుసుల్తాన్ షారుఖ్ యొక్క భోజనశాల కధ్యక్షుడుగా నియమింపబడియెను. ఈయుద్యోగమునం దితడు చనిపోవువఱకు నుండి ప్రభువున కత్యంతప్రియుడై తనయుద్యోగము నిర్వర్తించియుండెను.

1. ఇమ్మడి దేవరాయలు, మల్లికార్జునరాయలు.

అబ్దుర్ రజాక్ ౧౪౮౨ వ సంవత్సరమున ఆగ్టోబరు నెలలో కాలధర్మమునొందెను. ఈతడు రచించిన గ్రంథములలో మిక్కిలియుపయుక్తమైనది మనకు ప్రస్తుత విషయమును గూర్చి చెప్పు "మత్లా-ఉస్-సఅదయిన్" అను చరిత్ర గ్రంథము. ఇయ్యది యాతని కాలమునుండియు సర్వజనాదరణీయమైయుండెను. ఇందు మనవిజయనగర సామ్రాజ్యవృత్తాంతము మాత్రము గాక యాతడు కొల్చియుండిన ప్రభువుల పరిపాలననాటి విషయములుగూడ చాలగలవు. ఈ గ్రంథము రెండుసంపుటములుగా నున్నది. ప్రథమసంపుటమున విజిగీషామనీషగల తైమూరుచక్రవర్తి యారంభదశ మొదలుకొని యాతనిమరణానంతరము వరకు గల చరిత్రయంతయు సవిస్తరముగ తెలుపబడెను. రెండవభాగమున తైమూరువంశస్థుల చరిత్ర మొదలుకొని యాతడు కొల్చిన కడపటిపారసీక సుల్తాను హసన్ మిర్జా మరణానంతరమువఱకు జరిగియుండిన వృత్తాంతములను వివరించెను. ఈ గ్రంథము అబ్దుర్ రజాక్ చనిపోవుటకు రెండుసంవత్సరములకు పూర్వము (క్రీ. శ. ౧౪౮౦) రచించెను. కడుముదిమికాలమున రచించినదయ్యు నాతని చరిత్ర విజయనగరసామ్రాజ్యమునకు సంబంధించినంతవఱకు మనోహరమయిన సూక్ష్మములయిన చారిత్రక విషయములతో నొప్పారుచున్నది. ఇట్టి గ్రంథమే లేకుండిన విజయనగర సామ్రాజ్యమునుగురించిన కొన్ని యపూర్వ వృత్తాంతములు మనకు దెలిసియుండవు.

"మత్లా-ఉస్-సఅదయిన్" పారసీక భాషయందు రచింపబడియున్నది. ఇందులో మనవిజయనగరసామ్రాజ్యమునకు సంబంధించినంతభాగము, బెంగాలు సివిలుసర్వీసులో పనిచేసిన సి. జె. ఓల్డుఫీల్డు అనునాతనిచే నాంగ్లభాషలోని కనువదింపబడి, సర్ హెన్రీ. యం. ఎలియట్ గారిచే సంస్కరింపబడెను. ఇవు డాయాంగ్లానువాదమునుండియే నేను మనచరిత్ర కుపయుక్తమయినంతవఱకు నాంధ్రీకరించి[1] చారిత్రప్రియులగు నాంధ్ర సోదరులకు విన్నవించుచున్నాను.

హిందూస్థానమునకు రాయబారము

అది హిజరాశకము ౮౪౫ వ సంవత్సరము (క్రీస్తుశకము ౧౪౪౧). జ్యేష్ఠమాసమున నొకశుభదినమున సకల పృథ్వీపతియగు షారూఖును యీచరిత్రకారుడును ఇషాక్ కుమారుడును నగు అబ్దుర్ రజాక్ నకు, హిందూస్థానమునకు రాయబారిగా వెడలవలసినదని యాదేశమంపెను. అంతట నాతడు హోర్ముజు రేవున బయలుదేరి సముద్రమున కావలిగట్టును గూర్చి పయనమయ్యెను......

"......హోర్ముజుపట్టణము ఆరాజధానికి ముఖ్యనగరము. అదిగాక చాల గొప్ప రేవుపట్టణము. దానికి "జెరూన్" అని మఱియొక పేరు కూడగలదు. ఆమహానగరమున కీడగు పట్టణము ఈధరాతలమున నింకొకటి కానరాదు. సప్తద్వీపములనుండి వర్తకులిక్కడ కేతెంచెదరు. ఈజిప్టు సిరియా, రూమ్ (టర్కీ) అజర్ బైజాన్, ఇరాఖ్, పార్సు, ఖురాసాన్, మావారాల్ నహర్, టర్కిస్థాన్ దష్తు-ఇ-కిప్ చాక్, కల్మక్ దేశము మున్నగువానినుండియు, తూర్పున చీన్, మాచీన్, ఖాన్ బాలిక్ మున్నగు దేశదేశాంతరములనుండియు వర్తకులు వచ్చుచు పోవుచుందురు. చీనా, జావా, బంగాళము, సింహళము జీర్ బాద్ నగరములు, తనాసిరి, సకోట్రా, మాలదీవులలోని తొంబదినగరములు, మలబారు, అబిస్సీనియా, జాంజిబారు, విజయనగర సామ్రాజ్యపురేవులు, కలబరిగె, ఘూర్జరము, కంబా, అరేబియా దేశపురేవులు, ఏడెను, జిడ్డా, జంబో, మున్నగు నానా ద్వీప దేశాంతరములనుండి వర్తకులు వారి వారిదేశములందు దొరకెడి యపూర్వములయిన వస్తుసామగ్రి నెల్లప్పుడు దెచ్చుచు నిచ్చట నమ్ముకొనుచుందురు. వారు దెచ్చెడిసరకులు సూర్యచంద్రాదులు, వర్షములు గూడ మెరుగు పెట్టజాలమనంత అపురూపము లయినవి. భూమిపైగల నీయాదేశములని లేక యన్ని ప్రాంతములనుండియు వ్యాపారు లిచ్చట తాముదెచ్చినసరకుల నమ్ముకొనుచు నిచ్చటిసరకులను గొంపోవుచుందురు. వారు ఒకొక్కప్పుడు తమకు గావలసినవస్తువులకు రొక్కము చెల్లించి కొనుచుందురు. మఱియొకప్పుడు ఆవస్తువులకు సరియగు విలువగల తమసామగ్రిని మార్చుకొందురు. వెండి బంగారములపై దప్ప రేవున దిగుప్రతివస్తువుమీదను వెలచేసి నూటికిపదియవపాలు ఆరాజునకు వర్తకులు రేవుసుంకము చెల్లింపవలయును. అనేకవిధములగు మతప్రచారకులు

---

1. నే నీచరిత్రను ప్రతిపదార్థముగా తెనిగింపక, కొంచము స్వేచ్ఛగా యథామూలముగా తెలుగుచేసితిని. పాఠకు లిందులకు మన్నింతురుగాక!

కాఫరులు, నాస్తికులు, మున్నగు నానాదేశీయులగు వారనేకు లీనగరమున గలరు. వారందరు నానగరాధీశ్వరుని ధర్మపరిపాలనముక్రింద నేయన్యాయమును బొందక సుఖించుచున్నారు. అందువలన నీనగరమునకు న్యాయపరిపాలనమునకు ధర్మమునకు మనికిపట్టు అను అర్థ మిచ్చు "దారుల్ అమాన్" అనుప్రసిద్ధిగలదు. ఈనగరవాస్తవ్యులు విరాశీయుల వినయమర్యాదలను, హిందువుల నేర్పుతో ప్రకటింతురు.

ఈనగరమున నేను ప్రయాణమునకు బూర్వము రెండుమాసము లుండవలసివచ్చెను. నేను వ్యాపారినేమో యనియు సుంక మీయక పారిపోవవలదనవాడనేమో యనియు, నారేవుసుంకాధికారులు నన్ను త్వరలో వెడలనీయక పరీక్ష చేయసాగిరి. ఈపరీక్షలో ఓడలు బయలుదేరుఋతువు దాటిపోయెను. అంతట వర్షకాల మారంభమయి యుండినందున వర్షములు వెనుకపడి తుపానుల భయము తీరువఱకును నన్ను పయనము సేయనీరైరి. నాతోడనుండినగుఱ్ఱములను, మనుష్యలెక్కు ఓడలో * నుంచ వీలులేనని యాగుఱ్ఱముల నొకయోడలోను, నన్ను నాపరివారమును మరియొకయోడలోను నెక్కించిరి. అట్లు ఆరెండోడలలో నేనును నాపరివారమును పయనమైతిమి.

ఓడలలోనిదుర్వాసన నాకు స్మృతిలేకుండ జేసెను. దానికి తోడు సముద్రప్రయాణము నాకు భయావహమయ్యెను. ఈరెండుకారణములవలన నేను మూడుదినములవఱకు నూపిరిలేకుండ చచ్చినవానివలె మూర్ఛపోయి యుంటిని.

మూడవనాడు నాసికాగ్రమున కొనయూపిరి కనబడినపుడు మావారు నేనింకను జీవించియుంటినని ధైర్యము దెచ్చుకొనిరి. నాకు కొంచము తెలివివచ్చునప్పటికి ఓడమీద నాతోపాటు ప్రయాణముసేయుచుండిన నామిత్రులగు వర్తకులందఱు నైకకంఠ్యముగ సముద్రప్రయాణమున కనుకూలమైన అదను దాటిపోయినపిమ్మట బయలుదేరిన నెట్టియుపద్రవములైన రావచ్చుననియు, అట్టిసమయమున నెవ్వడైన నకాలమరణము నొందినవానిని వాడే నిందించు కొనవలయునుగాని యితరుల నేమనినను లాభములేదనియు మొదలగు నెన్నియో మాటలు నన్నాడి, తుదకు మేమింక నీతో నీయోడమీద రామని యొక్కపెట్టున నందరును "మస్కాటు" రేవున ఓడదిగిపోయిరి. పాపము వారందఱు నోడ రేవును ముందుగానే యిచ్చియుండినందున, యానము పూర్తిగాకుండ నోడదిగుటచే వారెంతో నష్టపడుటయే కాక పరకుల గూర్చి చాల చిక్కులుపడిరి,

ఇక నేను వారితోపాటు మస్కాటురేవున దిగి యచ్చటమాత్రి మాగక "కరియాట్" అనుపట్టణము నకుబోయి యచట నివాస మేర్పఱచుకొంటిని. ఓడపయనము పూర్తిగాకుండినపుడును, అర్ధాంతముగ నెక్కడనైన కొంతకాలము తలదాచుకొనవలసి నపుడును, సముద్రవ్యాపారులు చిక్కుమాలినవారివలె యిడుములపాలగుదురు. ఆయిబ్బందులు వారికే తెలియవలయును. దైవము నిర్దయుడై యుండుటవలన, నాదురదృష్టము ఇంకను దరిచేరకుండుట వలనను నేను కొంచ మధైర్యముచెందితిని. నాహృదయము బ్రద్దలయిన గాజుముక్కలవలె చెదరిపోయెను. నాబాధల ననుభవింపలేక, తుదకు ప్రాణముపై అసహ్యముకలిగి యంతకన్న చచ్చిన మేలనుకొంటిని.

ఇట్టిస్థితియందు, అయిష్టముతో "కరియాట్" గ్రామమున సముద్రపుటొడ్డున కాపుర ముంటిమి. ఇంతలో "మొహరమ్" పండుగ వచ్చెను. ఆపండుగతొలినాటిరాత్రి చంద్రు డతిమనోహరమయిన రేఖతో వెలుగసాగెను. దుఃఖభాజనమై యంథప్రక్రియనున్న నాదుస్థితికి ఆ మొహరమ్ నాటి విదియచంద్రుడు ఆశాకిరణముల ప్రసరింపజేసెను. అయ్యది దక్షిణాయనమైనను సూర్యునివేడిమిమాత్రము దుస్సహముగా నుండెను. గనులలోని కెంపులును, ఎముకలలో క్రొవ్వునుగూడ కరిగింపజేయు నంతటి వేడిగాడ్పులు వీచెను....... ..
ఆవేడికి మేము తాళలేకపోతిమి. నేనును, నాజ్యేష్ఠసోదరుడు, మరికొందఱు ప్రియమిత్రులు మొదలగువారలనేకు లాయుష్షమునకు తాళజాలక ఆరోగ్యముచెడి చాల జబ్బుపడితిమి. అట్లు జబ్బువలన నొకరితరువాత నొకరు నాలుగు మాసములు బాధపడుచు నచ్చటనే

* మనుష్య లెక్కు ఓడకు "జోగు" అనియు సరకుగొంపోవునోడకు "కప్పల్" యనియు నాంధ్రమున పేరలు గలవు.

యుండిపోతిమి. కాని ఆయూరివారు కొందఱు, కరియాట్ గ్రామమునకంటె, 'షఫూర్' అను పట్టణము చాలమంచి ఆరోగ్యకరమైన నగరమనియు,నచ్చట మంచి తియ్యని ఆరోగ్యవంతమైన నీరు లభించుననియు నచ్చటికి బోయిన శీఘ్రమే పునరారోగ్యము గలుగుననియు బలుమారు చెప్పుచుండుటచేత వారిమాటలు విశ్వసించి, యింకను లేవలేనిస్థితిలో నున్నను నేను ఓడమీద బయలుదేరితిని. కాని నాదౌర్భాగ్యవశమున అక్కడ ప్రవేశించిన వెంటనే నాకు రోగ మెక్కువయ్యెను. ఇక్కడ నున్నప్పుడే నా పెద్దన్నగారు మవులానా అఫీ-ఫుద్దీన్ అబుల్ వహాబు గారు కాలధర్మమునొంది మమ్మందఱను దుఃఖసంద్రమున ముంచివేసిరి.

ఎట్టకేలకు ఇక్కడనుండి హిందూస్థానమునకు నోడ నెక్కితిమి. పదునెనిమిదిదినము లహోరాత్రము లొక్కరీతిగ మాయోడ గాలిబోసికొనుచు నడచెను. పరిశుభ్రమైన యాసముద్రపుగాలివలన నాకు సంపూర్ణముగ తిరిగి ఆరోగ్యము కలిగెను. అటుల పదునెనిమిదిదినములు గడచి, పందొమ్మిదవనాటి యుదయమున, దైవకృపవల్ల సురక్షితముగ కల్లికోటరేవునమాయోడ లంగరు దింపెను. ఇంతటినుంచి నాదేశమున నేను చూచి వినినవింతల నన్నిటిని యథార్థముగ వర్ణించెదను.

నేను హిందూస్థానమును జేరుట— ఆదేశపు పరిస్థితులు—ఆచార సంప్రదాయములు—అందందు గన్పట్టువింత విశేషములు:

కల్లికోట మిక్కిలి నిరపాయకరమైన నౌకాశ్రయము. హార్ముజువలె నిచ్చటికి నానాదేశీయులగు వ్యాపారులు, వాణిజ్యార్థమై వచ్చుచు బోవుచుందురు. అబిస్సీనియా, జీర్బాన్, జాంజిబారు దేశీయులనుండి యోడలు సరకుతీసికొని తఱచుగా నీరేవునకు వచ్చుచుండును. అప్పుడప్పుడు మక్కానగరమునుండియు, నరేబియాదేశపుటితర నగరములనుండియు నోడలువచ్చుట గలదు. ఆవచ్చినయోడలు యిచ్చవచ్చినకాల మాగుచుండును. ఈపట్టణమం దచ్చటజూచినను నాస్తికులు (కాఫరులు) గలరు. అంకు వలన నీనగర మవశ్యము ముసల్మానులచే జయింపబడనిది. ఇచ్చట చాలమంది మహమ్మదీయులును గలరు. వారు శుక్రవారమునాడు, నమాజుచేసికొనుటకై రెండుగోపురములు గలపెద్దమసీదులను కట్టించుకొనిరి. వారలకందఱకును దైవభక్తిపరాయణుడయిన యొక 'కాజీ'కూడ గలడు. ఇక్కడి మహమ్మదీయులందఱు 'షాఫీ!' కులస్థులు, సంపన్నులయిన వర్తకులు. సముద్రతీరపు దేశాంతరపట్టణములనుండి, విలువయిన వస్తువులను దెచ్చి యీరేవున దింపికొనుచు విచ్చలవిడిగ వీధులందును, రచ్చలందును రాజబాటలందును కావలిలేకయే నిలువజేసికొందురు. ఈనగరమున నెవనికి నేభీతియు నన్యాయభయమును కలుగనంతటి ధర్మపరిపాలనము గలదు. ఎంతటి విలువగలవస్తు వెచట నిర్భయముగా పారవేసియుంచినను దొంగభయమనునది లేదు. వర్తకులు తాము నిలువజేసికొనిన సరకులపై నెవరిని కాపుంచ నక్కరలేకయే రేవు సుంకాధికారులచే భద్రముగా జూడబడుచుండును. రాత్రింబవళ్లు వారు వాటిచుట్టును కావలి గాయుచుందురు. విదేశవర్తకులు దెచ్చినసరకు అమ్ముడు పడునఱకు వానిపై సుంకమును దీయరు. అమ్మబడిన సరకులకు వెలపై నూటికి ౨ (2½) చొప్పున సుంకము గైకొందురు, ఇతర రేవులను జేరవలసిన సరకుతో నిండు ఓడలు వాయువశమున గమ్యస్థానమునగాక నితరరేవులకడ మెట్టుపట్టిపోయినచో నచ్చటిప్రజలు ఆయోడలలోని సరకులను గొల్లగొట్టునాచారము* కాని కల్లికోటలో నట్లుగాదు. ఏదేశమునుండివచ్చిన యోడఅయినప్పటికి ఎట్టిస్థితిలో రేవునుజేరినప్పటికి నితరయోడలతో సరిసమానముగ సంరక్షింపబడును. ఆయోడ కెట్టియాపదయు వాటిల్లదు.

మారేలికయగు సుల్తానుఫారుఖ్ ఖాకానీ-షయిన్ నృపాలుడు కల్లికోటనగరాధీశున కుత్తమాశ్వములను మేలైన జరీయంగీలు, కుళ్ళాయిలు మొదలగు నమూల్యములయిన యుడుపులను—సంవత్సరాదిపండుగ

* ఇట్టిదురాచారమే యాంధ్రదేశమున కాకతీయగణపతిదేవుని కాలమునకు పూర్వ ముండినట్లు శాసన ప్రమాణములు గలవు. చూడుడు. ప్రాచీనాంధ్ర నౌకాజీవనము పుట ౧౫౬-౭; Ep. Ind. Vol. XII. p. 188 ff.

నాడు కానుకగా సర్పింపదగినవి—బహుమతిగా నంపియుండెను.*

ఇందులకు కారణ మాచక్రవర్తిచే నంపబడిన రాయబారులు బంగాళా దేశమునుండి తిరిగివచ్చు సమయమున, కళ్లికోటరేవున దిగవలసివచ్చుటయు, నప్పుడు వారు సామూరీకి మారాజు ప్రశస్తినిగూర్చి విశేషముగా దెలుపుటయు సంభవించెను. ఆ రాయబారులు స్వదేశము చేరినపుడు వారిముఖమున మాచక్రవర్తి కళ్లికోటను గూర్చి యంతయు దెలిసికొనియుండెను. మరియు ప్రపంచమున నున్న నృపాలురందఱుగూడ కళ్లికోట ప్రభువుతో నైయ్యము సలుపుట కిచ్ఛగింతురనియు, నాతనిదేశమునుండియు వారికావశ్యకములయిన సరకులు దీసికొని రాబడుచుండుననియుగూడ వినియుండెను.

ఇదిజరిగిన కొంతకాలమునకు వంగదేశపుసుల్తాను, జాన్పూరుసుల్తాను ఇబ్రహీంవలన తన కెక్కుడుబాధ కలుగుచున్నదనియు, నాతని జయించుటకు కొంతసహాయ మంపవలసినదనియు, మాచక్రవర్తిని శరణుజొచ్చెను. శరణాగతరక్షకుడగు మాచక్రవర్తి వెంటనే జాన్పూరునకు షెయిఖుల్-ఇస్లామ్ ఖ్వాజాకరీముద్దీన్ - అబూ - అల్ మకారిమ్ జామీ అనునాతని రాయబారిగా నంపి, వంగదేశముపై నిక ముందెప్పుడును యుద్ధమునకుబోయి బాధింపవలదనియు, నట్లు గావించిన వాటిల్లు అనర్థములకు తానే నిందింపబడవలయుననియు సందేశ మంపియుండెను.

అందులకు జాన్పూరుసుల్తాను చక్రవర్తి యాజ్ఞను శిరసావహించెను. కళ్లికోటనగరాధీశు డీవృత్తాంతము వినినవెంటనే తనదేశమునందు దొరకు విలువగల వింతవస్తువులను ప్రోగుచేసి మాచక్రవర్తిస్నేహ మభిలషించుచు నొకరాయబార మంపెను. మరియు తన రాజ్యమున మహమ్మదీయులు, ప్రతిశుక్రవారమునాడు నిరాటంకముగ నమాజు చేసికొనుచు, మసీదులలో ఖుతుబాను పఠించుచున్నారనియు, వారందఱు మారేలిక యనుజ్ఞ యిచ్చిన నాతనినామముతో జేర్చి నమాజు చేసికొందురనియు విన్నవింపజేసెను.

ఆతనిరాయబారి బంగాళా దేశమునుండి తిరిగి వచ్చుచుండిన రాయబారులతో కలసివచ్చుటచేసి, మారాజాకొలువున నున్న సామంతరాజులు కొందఱు ఆతని ఆగమనము రాజున కెరిగించి కానుకల నర్పింపజేసిరి. ఆవచ్చినకళ్లికోటరాయబారి మహమ్మదీయుడు; మంచి వక్తృత్వవాచాలత్వముచే రాజును సులభముగ మెప్పించి, యింక నీవిధముగ ముచ్చటించెను.

"మా యేలిక మీతో నెయ్యము స్నేహము సెలుప దలచి నన్నంపియున్నాడు. మీరు మాపై ననుగ్రహించి మహమ్మదీయమతప్రవక్తలను మారాజునకు బంపినయెడల అజ్ఞానాంధకారమున నున్న మాదేశపుప్రజలను, ఏలికను, వెలుతురులోనికి దెచ్చి పుణ్యముగట్టుకొనినవారగుదురు." ఆమాటలకు మాచక్రవర్తి మనసుకరిగినవాడై తా నొకరాయబారము బంప నిశ్చయించెను. ఆమహత్కార్యము నిర్వహించుభారము దైవకృపవల్ల యీఅల్పునిపై బడెను. నన్ను కొంద ఱనూయాగ్రస్తులు సముద్రయానమున బోయినవారు మరల తిరిగిరాజాలరనియు, నసహాయకరమనియు, నిరుత్సాహపఱచిరి. కాని వారి భయములు నిష్ఫలము లయ్యెను. మాసములు మూడు గడచుసరికి, నేను సుఖముగా స్వదేశము జేరితిని. అప్పటికి నన్ను నిరుత్సాహపఱచినవారు మాత్రము జీవించియుండరైరి.

కళ్లికోట నగరము.

కళ్లికోటరేవులో నోడదిగి యూరిలోనికి బోవునప్పటికి నేను కలలోనుగూడ కనివిని యెరుగని యొక వికృతజాతిమనుష్యులు నాకంటబడిరి.

… … … … …

ఈదేశపువల్ల మనుష్యులు స్త్రీపురుషులు మొలపై నొకగుడ్డతప్ప నించుమించుగా దిగంబరులయి యుందురు. కుడిచేతిలో ముత్యమువలె తెల్లనై ప్రకాశించు నొక కత్తిని, యెడమచేతిలో కాఱుమబ్బువలె నల్లనై కాన్పించు తోలుతో చేయబడిన డాలును ధరించి తిరుగుచుందురు.

---

* అబ్దుర్ రజాక్ రాయభారిగా విజయనగరమునకు బంపబడియుండగా పొరపడి కళ్లికోటసామూరియే తన యేలిక యనుకొనిన చక్రవర్తియని యాతడు పంపిన కానుకలన్నియు సామూరికి సమర్పించెను. పిమ్మట తనతప్పు తెలిసికొని యది యితరులకు తెలియకుండ గుసుగుసముగ గప్పిపుచ్చెను. ముందు చూడుడు.

తిరిపెమెత్తుకొను బిచ్చగాని మొదలుకొని నగరమేలు నృపాలునివఱకుగూడ నిట్లే యుందురు. ముసల్మానులు మాత్ర మట్లుగాక మంచివిలువకలిగి అందములైన యంగీలను, పచ్చడములను, విరివిగా నరబ్బులవలె ధరించి తమసంపన్నత్వమును వెల్లడిచేసికొనుచుందురు.

పట్టణములోనికి బోయినవెనుక నేను చాలమంది మహమ్మదీయులతోడను, నాస్తికులగు దేశీయులతోడను ముచ్చటించితిని. వారు నాకొక యనుకూలమైన భవనమును బసగా నిచ్చిరి. మూడుదినములయినపిదప నన్ను వారిరాజునొద్దకు దర్శనార్థము దీసికొనిపోయిరి. నేను అచ్చట నితరమనుష్యులవలె మొలగుడ్డకట్టుకొనియున్న యొకనిజూచితిని. అచ్చటివారంత కతని రాజందురు. వారు సమురాజును సామూరి యని పిలుతురు. అతడు మరణించినవెనుక, వానిసింహాసనముపై యాతనితోబుట్టువుకుమారుని కూర్చుండబెట్టుదురు. కడుపునబుట్టిన కుమారునికిగాని, యాతడు లేనప్పుడు సోదరునికిగాని పట్టాభిషేకము చేయరట! శౌర్యపరాక్రమాదులవల్ల నెవడు నిచ్చట రాజగుట లేదు. ఇచ్చటి నాస్తికులలో పెక్కుతరగతి జాతులవారు గలరు. బ్రాహ్మణులు, యోగులు మొదలయినవారు. వారందఱు అనేకమంది దేవతలను గొల్చుచుందురు. విగ్రహపూజలు గావించుచుందురు. ప్రతివర్ణమువారికిని వింతవింత యాచారములు గలవు.

ఇచ్చటిజనులలో నొకజాతి గలదు. ఆజాతిలోని స్త్రీకి పెక్కుమంది భర్త లుందురు. వారందఱు తమ యిష్టమువచ్చినవ్యాపారమును జేసికొను చుందురు. ఆభార్యతో గాపురము చేయుటకు రాత్రిపగ ల్లిరువదినాలుగు గంటలకాలము వారు సమానముగ పంచుకొనుచుందురు. ఒకభర్త యాస్త్రీతో నున్నంతకాలము మరియొకభర్త యాస్త్రీకడకు బోరాదు. ఆదేశపురాజగు సామూరి యీజాతికి చెందినవాడే యట!

నేను సామూరిని దర్శింపబోవునప్పటికి అతని కొలువున అప్పటికే రెండుమూడువేలమంది హిందువులు పైనిచెప్పినవిధముగనే దుస్తులు ధరించి సభ నలంకరించి యుండిరి. ముసల్మానులలో ప్రముఖులుగూడ గొంద ఱచ్చట నుండిరి. వారు నన్నుచితాసనమున గూర్చుండ నియమించినతరువాత నేను మాచక్రవర్తి యిచ్చినశ్రీముఖమును చదివితిని. పిదప ఆమహారాజు పంపిన కానుకల దెచ్చి యర్పించితిని. సామూరి నారాయబారమునకంతగా గౌరవ మొసంగినట్లు కాన్పింపలేదు. అంతట నేను సెలవుతీసికొని నాబసకు తిరిగివచ్చితిని. హోర్ముజునగరపు రాజంపినయుత్తమాశ్వములు మొదలయిన సరకులతో నిండినయోడ ప్రయాణమున చాలకష్టములపాలయి ఓడదొంగలచే దోపిడిచేయబడి, వస్తువులన్నిటిని గోల్పోయి, చిట్టచివరకు ప్రాణములతో కల్లికోట చేరుకొనినది. నిజముగా నాప్రియమిత్రుని ఆయోడలోనుండి బ్రతికివచ్చుట జూచినప్పుడు నాకు పరమానందమయ్యెను.

కల్లికోటనగరమున అయిదారుమాసములు, నిరుద్యోగినై, గౌరవములేక దుఃఖభాజనమైన జీవనమును గడపితిని. ఆరోజులలో నాకు దుఃఖ మొకస్నేహితుడును, కష్ట మొకచెలికాడునై యున్నట్లుండెను. అట్లుండ నొకనాడు చీకటిరాత్రి, నేను మంచముపై పరుండి నిద్రించువేళ, విసుగెత్తిన నాప్రాణమునకు కష్టములు గట్టెక్కెనోయన్నట్లు, అంధకారమునుండి వెలికి త్రోయబడినట్లు స్వప్నమొకటి గంటిని. ఆకలయందు మాచక్రవర్తి కాఖానిసయిద్ సుల్తాను, నిండురాజసముతో నన్నుజేరి, ఆదరమొప్ప "నీవింక భయపడకుము, మనసునూరక నాయాసపెట్టుకొని ఖేదింపకుము. నీకష్టములు త్వరలో తుదిముట్టగలవు" అని గంభీరభాషణముల బలికెను.

ఉదయమయినతరువాత నేను నమాజుచేసికొని కూర్చుండినప్పుడు కడచినరాత్రికన్న కల జ్ఞప్తికి వచ్చి, నన్నొకింత యానందపరవశునిగా జేసెను. సాధారణముగా స్వప్నములు, తదేకధ్యానముతో తలపోసికొనుచున్నవారికి వచ్చును. కలలోనివృత్తాంతములు, పగటిపూట ఎన్నడును జరుగజాలవు. అయినను కొన్నిస్వప్నములు దైవప్రేరితములనియు, నవి తప్పక జరుగుననియు పెద్దలు చెప్పుటయుగూడ గలదు. ఖోరానువం దట్టిప్రమాణము లెన్ని లేవు?

దైవమునకు నాపై నిప్పటికి కరుణ గలిగెననియు దుఃఖభాజనమైన నాజీవితభాగము సాంతమయ్యెననియు, త్వరలో నాకదృష్టము పట్టుట కిది శుభసూచకమనియు,

నూరకతలపోయుచు, ఆనందించుచు కాలము గడపితిని. పండితులయినవారికి కొందఱికి నాకల వివరించి తెల్పి వారిని దానియర్థము విప్పిచెప్పవలసినదని కోరుచుంటిలో విజయనగర చక్రవర్తి కడనుండి యొకదూత వచ్చెననియు, నాచక్రవర్తి చాలసామ్రాజ్యము నేలు సార్వభౌము డనియు, నిప్పు డాతని రాయబారి సామూరికి పారశీక దేశమునుండి యేతెంచిన రాయబారిని తక్షణము తన యొద్దకు బంపవలసినదనియు, నాజ్ఞాపించుచు నొకజాబు వ్రాసియుండెననియు దెలియవచ్చెను. సామూరి విజయ నగరచక్రవర్తికి సామంతుడు గాకపోయినను, ఆతడనిన, సామూరి కత్యంతభయము గలదు. ఆచక్రవర్తికి కల్లికోట వంటి రేవులు మూడువందలు గలవట. మరియు నాతని దేశము మూడుమాసంబులు ప్రయాణము చేసినను తరగని దట.

కల్లికోటమొదలు కాయిల్ వఱకుగల రేవుపట్టణము లనేకము లింకను మలబారుదేశమునందు గలవు. కాయిల్ పట్టణము సింహళద్వీపమున కెదురుగానుండును. కల్లికోటనుండి బయలుదేరు ఓడలన్నియు మక్కాకు సాధారణముగా మిరియములు, ఏలకులు, లవంగములు, జాజికాయ మున్నగు సుగంధద్రవ్యములను దీసికొనిపోవు చుండును. కల్లికోటలోనుండు నావికులు మంచిసాహసికులు. వారిని చీనీపుత్త్రులు అని పిలచెదరు. ఒకానొకప్పుడు చీనా దేశీయులు నావికులు కొంద ఱీకల్లికోటకు వలసవచ్చియుండిరట. అందువలన వారిసాహసిక నౌకాయానమునుబట్టి యీకాలపునావికులకు చీనీపుత్త్రులను పేరు కలిగినదేమో! కల్లికోటకు వచ్చెడియోడలును, రేవులోనియోడలను ఓడదొంగలు దరిజేరరారు. ఆరేవున యీయావస్తువులను భేదము లేక సమస్తమును దొరకును. ఆవుమాంసముమాత్రము లభింపదు. ఇక్కడ వారు ఆవులను చంపరు. వానిమాంసమును భుజింపరు. గోవు నెవరు చంపినను వానిప్రాణము వెంటనే తీసివేయబడును. గోవనినవారల కెంతయో భక్తి. దానిపేడతో చేసినబూడిదను యీమూర్ఖులు నుదుటిపై ధరింతురు—దౌర్భాగ్యులు!

విజయనగర యాత్ర.

ఈ 'నీమదు' సామూరివద్ద సెలవుతీసికొని, కల్లికోటనుండి బయలుదేరి, బందానరేవుమీదుగా, మలబారు సముద్రతీరమున ప్రయాణము చేయుచు విజయనగర రాజ్యము పొలిమేరల నున్న 'మంగళూరు'రేవును చేరను. అచ్చట రెండుమూడుదినములుండి మెట్టదారిని విజయ నగరమునకై బయలుదేరితిని. మంగళూరుదాటి ముప్పది మైళ్లు వచ్చునప్పటికి ప్రపంచమునం దెచ్చటను సాటిలేని యొకచక్కని దేవాలయమును జూచితిని. ఆదేవాలయము పదిగజముల చతురమును అయిదుగజముల ఎత్తును గలిగియున్నది. అదియంతయు కంచులోహముతో చేయబడియున్నది. ఆదేవాలయమునకు నాలుగు అంతస్తులుగలవు. అవి యొకదానికంటె నొకటి యెత్తుగ నుండును. అన్నిటికంటె ఎత్తైన అంతస్తులో మనిషి ఎత్తుగల దేవుని సువర్ణ విగ్రహము గలదు. ఆవిగ్రహమునకు రెండు ఎఱ్ఱని పెద్ద కెంపులు నేత్రములుగా నమర్చబడియున్నవి. అవి చూచువారికి, విగ్రహము తనవైపు చూచుచున్నదేమో యనునంత మనోహరముగా నమర్చబడియున్నది. ఆదేవాలయమంతయు మనోహరమయిన శిల్పపుబనులచే శోభిల్లుచు కనులకు మిరుమిట్లు గొల్పుచుండును.

అచ్చటినుండి పోవుచు, ప్రతిదినమును నొక్కొక్క జనసమృద్ధమయిన పట్టణమునందో గ్రామముచెంతనో ఆగుచు పయనము చేయుచుంటిని. ఇట్లుండ నొకనాడు నేను ఆకాశమున సూర్యుని సైతము కప్పివేయజాలినంత యెత్తైనశిఖరమును జూచితిని. ఆపర్వత మొక యరణ్యమధ్యమున నున్నది. ఆయరణ్యమును, పర్వతశిఖరమును దాటి 'బేదునూరు' అనుపట్టణము జేరితిని. బేదునూరునగరమున నిండ్లన్నియు మేడలవలెను సౌధములవలెను గన్పట్టును. ఈబేదునూరునందు మిక్కిలియెత్తయినయొకప్రసిద్ధదేవాలయము గలదు. దానిశిఖరము బేదునూరునుండి పెక్కుమైళ్లవఱకును గాన్పించుచుండును. అతిశయోక్తియని నిందలేకుండ దాని సౌందర్యమును వర్ణించుట కడు కష్టము. ఆదేవళము నగరమునకు నడుమ విశాలమైన ప్రదేశమునందు, చక్కనిపూవులతోటయందు గలదు. ఆపూదోటయందు పూయనిపువ్వులు, చిగుర్పని ఆకులు లేవు. ఆరామముమధ్య చలువరాతితో గట్టిన మేలైనమంటప మొకటి గలదు. ఆమంటపము మనిషి యెత్తున నుండును. మంటపమునందలి రాళ్లు నున్నగా చెక్కబడి యొకదానిపై నొకటి సున్నము లేకయే అతుకబడినట్లు అమర్చబడియుండెను. చూపఱ కీమంట

మరియు నొక్క జాతితో చెక్కబడినదా యనియు చూడ సందేహము గలుగఁజేయుచుండును. ఆమంటపము నడుమ నల్లరాతితో నిర్మింపబడిన దేవాలయము గలదు. ఆదేవాలయముపైన మనుష్యవిగ్రహములు నానావిధములుగ, మూడుబారులుగ నొకదానిక్రిందట నొకటిగ చెక్కబడియుండెను.

ఎంతటినేర్పరియైనను, చిత్రకారుడు తనకంటముతోగాని, మసిబొగ్గుతోగాని అంత మనోహరముగ నారూపములను చెక్కజాలడని నాఅభిప్రాయము.

ఉన్నతమయిన యాదేవాలయమున శిఖరమునుండి పాదమువఱకు నొకయుంచేరిమేరయినను పూర్వపశ్చిమ ఖండముల పూర్వచిత్తరువులతో నిండియుండనిస్థలమే లేదు. ఆదేవాలయముచుట్టును నాలుగేసి యంతస్థులు గల్గి ముప్పదిగజములు పొడవును ఇరువదిగజములు వెడల్పును ఏబదిగజములయెత్తును గల నాల్గుగోపురములు గలవు.

ఇతర మంటపములు పెండలగునవియన్నియు నిట్లే యతి మనోహరమయిన చెక్కడపు బనులతోడను చిత్తరువులతోడను శోభిల్లుచున్నవి. ఆకోవెలయందు రాత్రింబవళ్లు భగవంతుడు స్వీకరింపనిప్రార్థనలు, సంగీతనృత్యవాద్యములు, నైవేద్యములు జరుగుచుండును. ఆదేవాలయమునుండి ధనమును, వెచ్చములను, సమస్తములును ఆగ్రామవాసులు తెచ్చుకొనుచుందురు. *'నాస్తికులు' సీహిందువుల కీక్షేత్రము ముసల్మానుల మక్కావంటిదని చెప్పుదురు. ఇచ్చట రెండుమూడుదినములుండితిరిగి ప్రయాణము సాగించితిని. జిహిజ్జ [క్రీ. శ. ౧౪౪౩—చైత్రము] మాసాంతమున విజయనగరపట్టణమును జేరితిని. నారాక విని సార్వభౌముడు స్వాగతమిచ్చుటకై తగినపరివారమును ఎదురుగ సన్నాహముబంపెను. వారు మమ్ముచితరీతినిగౌరవించి, చక్కనియొకసౌధమునకు గొంపోయి విడిదినిచ్చిరి. (సశేషము.)

* ఇది యొకవిష్ణ్వాలయము గావచ్చును. అబ్దుర్‌రజాక్ చూచినదేవాలయ మేయూరిదోగాని తెలియరాదు.

ఋతువులు

విద్వాన్ గరిమెళ్ల సోమన్న గారు, ఎం. ఏ., యల్. టి.,

తనయక్షంబు సమాంతరస్థితిని బొంద న్వంగుచు న్భూమి సూ
ర్యునిచుట్టుం దిరుగంగ నీఋతువు లారుం గల్గు నాషాఢమం
దును ఋష్యంబున వచ్చు సంక్రమణము ల్తోడ్తో నగుం దక్షిణా
యనముం బిమ్మట నుత్తరాయణము మధ్యం దుల్యమౌ రేపగల్.

వ్రాసితిని స్వభావోక్తుల బాలురకయి

వసంతఋతువు—ద్విపదలు

చైత్రమాసంబు వైశాఖమాసమును
జిత్రవసంతమై చెలఁగు నేటేటఁగ
ఎండయుఁ జలియును నివ్వసంతమున
మెండుగ నుండక మితముగాఁ దోఁచు.
ఏళ్లు చెర్వులును గోనేళ్లుబావులును
నీళ్ళతో నిండారు నిర్మలంబుగను.
కలువతామరపూల కలిమిచే నొప్పఁ
గొలఁకులు మడుగులు కోనేళ్లు గుములు.
దట్టముగఁ జిగిర్చి తలిరులం గులుకు

చెట్టుచేమలతోడఁ జెన్నును గూర్చు
గుట్టలు కనుమలు కొండచఱియలును
మిట్టలు వనములు మెట్టు పల్లములు.
  చిలుకలు కోవెల ల్చెట్లపై నుండి
కలకలరవములఁ గర్ణము ల్నింపు.
పుష్పంబు లీఋతువున మెండుగానఁ
బుష్పసమయమని పొందెఁ బేరిద్ది.
జాజులు మల్లెలు సంపంగి పూలు
రోజాలు వాసన లుప్పుచునుండు.
పంతంబుతోఁ బూయుఁ బనస జాములునుఁ
జింతలు మామిళ్లు జీడిమామిళ్లు.
  తామ్రకాంతుల నీను తలిరు జొంపముల
ధూమ్రకుట్మలహారిద్ద్యుతిపలాశముల
నమ్రమౌ వృక్షసంతతుల సొంపునను,
ఆమ్ర కిసలయమధ్య పికగానములఁ
గమ్రమౌ వనలక్ష్మిఁ గనుచు వసంత
సామ్రాజ్యసుఖముల జగము హర్షించు.
  ఈరమ్యఋతువున నేఁడాది వచ్చు
శ్రీరామనవమియుఁ జెలఁగుఁ బుణ్యముగ;
వైశాఖ శుద్ధపుఁ బంచమి నచ్చు
శ్రీశంకర జయంతి చితలోకశాంతి,
ఆచతుర్దశి నృసింహజయంతి వచ్చు,
బ్రాచుర్యమొందును వైశాఖపూజ.
చైత్రపౌర్ణమిరాత్రిఁ జంద్రబింబంబు
చిత్రంబుగాఁ జిత్తచెంతనగుపించు.
వైశాఖమాసపుఁ బౌర్ణమిరాత్రి
శశివిశాఖలు గూడి చక్కఁగ నిలుచు,

గ్రీష్మఋతువు—ద్విరదగతిరగడ

జ్యేష్ఠమాషాఢముం జేరి గ్రీష్మర్తు వగు
నిష్ఠురం బిపు డెండ నీరెచ్చటను దఱుఁగు.
భానుఁ డుత్తరదిశకు వాలి నిల్కడ మండుఁ
జేను లేమిని భూమి చీకాకుపడి యెండు.
వేడిగాడ్పులు దుమ్ము వెదజల్లుచును వీచు
వాడుచెట్లన్నియును వడ ప్రాణులను నేఁచు
చల్లనీజలంబులును జంద్రకిరణంబులును
మల్లెపూలును బనస మామిడీఫలంబులును
జనుల కివ్వేసవినిఁ జాల ప్రియమును జేయు.
వీనులకు విందుగను బెండ్లివాద్యము మ్రోయు
పడును. వేసవి తుద వర్షము ల్పందడిగఁ
పిడుగులుఱుములుదిగులు వెట్టఁ గరకలువడఁగ.
పదను గల్గిన నేల వ్యవసాయికులు దున్ని
యదను గని విత్తుచును హర్షింత్రు ఫలమెన్ని.
ఆషాఢమున దక్షిణాయనారంభ మగు
శేషశాయియుఁ బొందు శేషశయనముసొబగు
నెల జ్యేష్ఠపౌర్ణమికి నిలుచు జ్యేష్ఠకుఁ జెంతఁ.
జెలఁగు మఱుపున్నమనికి నాషాఢకుఁ బొంత.

వర్ష ఋతువు—మధురగతిరగడ

వర్ష ఋతువు శ్రావణభాద్రపదము,
కర్షకులి త్తఱిఁ గాంతురు ప్రమదము.
నల్లనిమబ్బులు నలుదెస లానును,
జల్లనిగాలులు జరపును వానను.
  మింట న్దళతళ మెఱయును మెఱుములు,
  వెంటనె పెళపెళ వినఁబడు నుఱుములు.
  హరివి ల్లాకసమందునఁ దోఁచును,
  బోరిపోరి మాలతి పొగడలు పూచును.
  చెఱువులు నేళ్లును జిక్కఁగ నిండును,
  వరి సగమెత్తగు వరగలు పండును.
చాతకపక్షులు చదలం దిరుగును,
గోతులఁ గప్పంగొంతుక లరగును.
మిడుఁగురు లెగురును మింట న్నిశలను,
బుడమిని గంబళిపురుగులు మసలును.
  పచ్చలవన్నెల పచ్చిక పుట్టును,
  ముచ్చట నెమళులు ముఱిపము పట్టును.
  దినపతి దక్షిణదిక్కున కొరగును,
దినములఁ గ్రమముగ దీర్ఘత తఱుగును,
సుదతుల వ్రతములు సూత్రధరణమును.

యదుకులమునఁ గృష్ణావతరణమును.
గణపతిచవితి యింక మహాలయమును,
బ్రణయపతిచెడిని వర్షసమయమును.
శ్రావణపూర్ణిమ శ్రవణముఁ గను శశి,
మావటిభద్రను మఱుపున్నమనిశి.

శరదృతువు—తేటగీతలు

ఆశ్వయుజమును గార్తిక మనెడి నెలలు
శరదృతువగు నిత్తఱిని వర్షములు తగ్గి
తెరలు గాలి పూర్వోత్తరదిక్కునుండి,
ఆకసమునఁ గ్రమ్మను దెల్లయభ్రచయము,
తునుకలగుచును గాలిచే దూదిఁ బోలి
గాలిఁ గలదమ్ము వానను గలసిపోఁగ
నెండ ధావళ్యముగఁ గాయు నీఋతువున;
మింట మణులట్లు చుక్కలు మెఱయుచుండు;
వెన్నెలలు గాయు మిక్కిలి వినోదముగను.
పళ్లలో నీళ్లు చెర్వుకోనేళ్ల జలము
తేటపడు; దమ్మికలువలు తేలుచుండు.
పలుతెఱంగుల పక్షులపంక్తు లొప్ప
నిసుకతిన్నెలు గాన్పించు నేళ్లనడుమ.
తెల్లబడు నేల యిటనట తెల్లుపూయ.
పొట్ల బీరలు కాయును ముదురు వరియు
నెగురుచుండును దూసెఁగ లెర వెదకుచు,
బసువు లీనును మెండుగఁ బాల నిడును.
రాత్రి చలియుఁ బెరుగు నవరాత్రపూజ
లవల దీపావళియు నిటు హర్ష మొసఁగు.
ఆశ్వయుజ పౌర్ణమికి శశి యశ్వినిఁ గనుఁ,
బొందుఁ గృత్తికఁ గార్తికపూర్ణిమ నిశి.

హేమంతఋతువు—సీసపద్యము

మార్గశీర్షముఁ బుష్యమాసంబు హేమంత
మనఁబడు హిమ బిందు నధికమగుట;
హిమబిందువులఁ దాఁకి యినకిరణంబులు
కలువింతేవన్నెలఁ బఱపుచుండుఁ
జాలుకేమియును లేక సూర్యుండు దక్షిణ
దిశకు వాలి త్వరగఁ దిరుగుచుండుఁ
జలియు రాత్రియు హెచ్చి జనులను బాధింప
జాడ్యము ల్పావులు చాలఁగలుఁగుఁ
జెలఁగు ముక్కోటి యేకాదశి వరికోఁత
మకరసంక్రాంతి యిత్తఱి; మార్గశీర్ష
పూర్ణిమనిశి మృగశిరను బొందెడు శశిఁ
బుష్యమిం గనుఁ బుష్యపుఁ బున్నమనిశి.

శిశిరఋతువు—ఉత్సాహపద్యములు

జరగు శిశిరఋతువు మాఘ
ఫాల్గునంబులం దిటన్
బెరుగుఁ బగలు తగ్గును జలి
విరియుఁ బనసమావులున్,
జరగు భానుఁ డుత్తరమున
కొండియుమంచు పొగవలెన్;
ధరను బండుటాకులెల్ల
దట్టముగను రాలెడున్
వరియు నూర్పు చేయఁబడును
బైరుగాలి వీచుచున్
మిరెప వంగ కంది పెసర
మెండుగ నిటఁ గాసెడిన్,
జెఱకులాడుదు రుసిరికయుఁ
జిక్కుడుఁ దఱచయ్యెడున్.
పరమపదముఁ గనెఁ దొలి హరి
వాసరమున భీష్ముఁడున్
సరసిజాప్తుఁ గొల్తురు రథ
సప్తమిం దమి న్నతుల్.
హరు భజింతురు శివరాత్రి
నంతటఁ జలితీరెడున్.
జరుగు మాఘపూర్ణిమనిశిఁ
జంద్రుఁడు మఘచెంత కు
త్తరదెస మఱుపున్నమనిశిఁ
దారకాపతి తఱియున్.

కాళిదాసుని పుష్పములు

ఆయుర్వేద మార్తాండ భిషగాచార్య పండిత హెచ్. సుబ్బరాయ శాస్త్రిగారు,
ఎఫ్. ఆర్. హెచ్. ఎస్.

అశోక

ఇది చింత, రేల, తంగేడి, సుంకేశర (వాతనారాయణ చెట్టు), పతంగి యీ మొదలగుజాతికి చేరినది. రావణుండు సీతాదేవిని లంకలో అశోకవనమం దుంచి యుండుటచే అశోకవృక్షమును జగత్పూజ్య మైనదిగా హిందువులు భావింతురు. దీనిపూలు ఆరంజి ఎరుపు కలిగియుండును.

దీనిసంస్కృత నామాంతరములు

అశోక శ్శోకనాశశ్చ విచిత్రః కర్ణపూరకః,
కంకేలి ర్హేమపుష్పశ్చ పిండపుష్ప స్తథైవచ.

అశోక

ఇందులో రెండుభేదములు కలవు. ఒకజాతి యొక్కపూలు ఆరంజిఎరుపు కలిగి, ఆకులు సీతాఫలము ఆకులవలె నుండును. మాఘఫాల్గుణములలో పుష్పించును. ఇంకొకజాతి అశోకపూలు తెలుపు, పసుపువర్ణయుక్తముగాను, ఆకులు మామిడిఆకులవలె నుండును. దీనియొక్కకాయ మొదట నీలముగా నుండి ఫలించిన వెనుక ఎఱ్ఱగా నుండును. అయితే భుజింప యోగ్యము కాదు. పైజాతి తీగయై యుండును.

రఘువంశము ౮ సర్గలో అజమహారాజు భార్యయైన ఇందుమతిశవముపై నేడుకొనుచు అశోకవృక్షమును చూచి యీరీతి వర్ణించెను:

స్మరతేవ సశబ్దనూపురం చరణానుగ్రహ మన్యదుర్లభమ్,
అమునాకుసుమాశ్రువర్షిణాత్వమశోకేనసుగాత్రిశోచ్యసే

అశోకపుష్పములు వసంతఋతువులో పుష్పించి పాంథులకు మనోవికారము కలిగించుట రఘువంశమున (౯-౪౩)సూచింపబడినది.

అనలసాన్యభృతానలసాన్మనః
కమలధూళిభృతా మరుతేరితా,
కుసుమభారనతాధ్వగయోషితా
మసమశోక మశోకలతాకరోత్.

దీనిచే అశోక ఒకతీగ అని బోధపడును. కుమార సంభవము తృతీయసర్గలో స్త్రీయొక్క పాదతాడనమను దోహదక్రియ లేకనే అశోకవృక్షము ప్రకాండము నుండి పర్ణములతో పుష్పించె నను భావము ఈక్రింద వివరింపబడినది.

అసూత సద్యఃకుసుమాన్యశోకః
స్కంధాత్ప్రభృత్యేవసపల్లవాని,
పాదేన నాపైక్షత సుందరీణాం
సంపర్క మాశింజితనూపురేణ.

కొన్ని కొన్ని వృక్షములు అకాలములో పుష్పింప జేయవలెనన్న యీక్రింది ప్రయోగములు చేయవలెను.

పాదాహతః ప్రమదయా వికసత్యశోకః
శోకంజహాతి బకులో ముఖసీధుసిక్తః,
ఆలోకితః కురువకః కురుతే వికాస
మాలోడిత స్తిలక ఉత్కలికో విభాతి.

మేఘసందేశము ఉత్తరభాగము

రక్తాశోక శ్చల కిసలయః కేసర శ్చాత్రకాంతః
ప్రత్యాసన్నౌ కురువకవృతే ర్మాధవీమంటపస్య,
ఏక స్సఖ్యా స్తవ సహమయా వామపాదాభిలాషీ
కాంక్షత్యన్యో వదనమదిరాం దోహదచ్ఛద్మనాస్యాః.

ఇచట మాధవీమంటపమందున్న అశోకవృక్షము స్త్రీయొక్క పాదతాడన మిచ్ఛయించుచున్న దనియు, వకుళము ముఖమద్యపీత్కార మపేక్షించు చున్నదనియు భావము.

ఇటులనే ప్రియంగు—తరుణస్త్రీస్పర్శనము చేతను
తిలకవృక్షము ,, అవలోకనము చేతను
కురువక ,, ఆలింగనము చేతను



ముల్లుగోరింట

మందార ,, మృదుభాషణము చేతను
చంపక ,, ఉత్తమహాస్యము చేతను
ఆమ్ర ,, ఫూత్కారము చేతను
నమేరు ,, గానము లేక నృత్యము చేతను

పుష్పించును.

రత్నావళీనాటికలో కామదేవపూజ జరుపుచుండు వనితయొక్క చేయి అశోకవృక్షముపై పెట్టగా అదికూడ నొకరోమలమైన చెట్టుశాఖయో యన్నట్టుండెనని యీక్రింద చెప్పబడినది.

స్పృష్టస్త్వయైష దయితే
స్మరపూజావ్యాపృతేన హస్తేన,
ఉద్భిన్నాపరమృదుతర
కిసలయ ఇవ లక్ష్యతే ఒశోకః.

కురువక (ముల్లుగోరింట)

గోరింటజాతికి చేరినవన్నియు పొదలుగా ఎండ ప్రదేశములలో పెరుగునవియే. ఆకులు ఎదురెదురుగా కొంచెము గుండ్రముగా నుండును. పూలు ఒక్కవిధముగా గాక, కాడలపై మొలచునదిగను, పువ్వుక్రింద సన్నని యాకులు కలిగియుండును. పువ్వులోపల రెండు పొడవుగ రెండు కురుచగ నుండుపండను లుండును. బీజాశయము (ovary) 2 గదులు కలది. ఈజాతిలో చేరిన యితరవృక్షము లెవ్వియన :—

గోకిమిడి Hygrophila Spinosa
నేలవేము Andrographis paniculata
అడ్డసరము Adhatoda Vasica
ఎఱ్ఱగోరింట Barleria Cristata కురువక
పచ్చ ,, ,, Prionites కురంటక
తెల్ల ,, ,, Longiflora సైరేయక
నల్ల ,, ,, Mysorensis ఆర్తగళ

కురువక నామాంతరములు

రక్తామ్లానోర క్తపుష్పో రామాలింగనకాముకః,
రాగప్రసవక శ్చైవ సుభగ శ్శోణఝింటికః.
రక్తపుష్పః కురుబకః పీతపుష్పః కురణ్టకః
నీలపుష్ప స్త్వార్తగళ స్సైరేయ శ్శ్వేతపుష్పకః.

శ్రీమన్మహాకవి కాళిదాసు రఘువంశము ౯సర్గలో యిటుల వర్ణించెను :

విరచితా మధునోపవనశ్రియా
మభినవా ఇవ పత్త్రవిశేషకాః,
మధులిహాం మధుదానవిశారదాః
కురవకా రవకారణతాం యయుః.

వనరమణి పత్త్రాభరణములుగా నుండుకురువక పుష్పములపై భ్రమరములు వసంతఋతువునందు ఝుమ్మనిమ్రోగి మధుపానము చేసెను.

మేఘదూతిములో

రక్తాశోక శ్చలకిసలయః కేసర శ్చాత్రకాంతః
ప్రత్యాసన్నౌ కురువకవృతే ర్మాధవీమంటపస్య;

యక్షస్త్రీలు కురువకములను తలలో ధరించెదరని యీక్రింద చెప్పబడినది.

చూడాపాశే నవకురవకం చారుకర్ణే శిరీషమ్.



కర్ణికార (కొండగోగు)

కర్ణికారః పరివ్యాధః పాదపోత్పల ఇత్యపి.

దీని ఆకులు ద్రాక్షచెట్టు ఆకులను పోలియుండు ననియు పూలు ఎఱ్ఱపుష్పము కలవనియు సాలగ్రామ నిఘంటునందు తెలుపఁబడినది.

శ్రీ కాళిదాసు రఘువంశము ౯ స. ౪౫ లో

"హుతహుతాశనదీప్తివనశ్రియః ప్రతినిధిః కనకాభరణస్య యత్."

అజ్యాదులచే ప్రజ్వలితహుతాశనప్రభ కలకర్ణికార కుసుమము వనరమయొక్క కనకాభరణప్రతినిధిగానుండె నని చెప్పబడినది.

శ్రీమద్భాగవతము దశమస్కంధము ౨౧ అధ్యాయములో శ్రీకృష్ణుఁడీకిటిగ బృందారణ్యము ప్రవేశించెనని చెప్పబడినది.

బర్హాపీడం నటవరవపుః కర్ణయోః కర్ణికారం,
బిభ్రద్వాసః కనకకపిశం వైజయంతీంచ మాలామ్.

కుమారసంభవము ౩ స. ౨౮ లో

వర్ణప్రకర్షే సతి కర్ణికారం
ధునోతి నిర్గంధతయా స్మచేతః,
ప్రాయేణ సామగ్ర్యవిధౌ గుణానాం
పరాఙ్ముఖీ విశ్వసృజః ప్రవృత్తిః.

దీనిచే వర్ణప్రకర్షత్వమున్ను, నిర్గంధత్వమున్ను తెలియుచున్నది. బ్రహ్మ ప్రతివస్తువునందును కించిద్వైకల్యము చేసియుండుట సూచింపను. వసంతఋతువులో శ్రీపార్వతీదేవి వావిలిపూవుల ముత్యాలహారములతో, కర్ణికారమువంటి స్వర్ణాభరణములతో, అశోకపుష్పము లనుకంపులతో వచ్చెను అని యీక్రింద

కుమారసంభవము ౩ స. ౫౩ లో

అశోకనిర్భర్త్సితపద్మరాగ
మాకృష్టహేమద్యుతికర్ణికారమ్,
ముక్తాకలాపీకృతసిందువారం
వసంతపుష్పాభరణం వహంతీ.

కుమారసంభవము ౩ స. 62 లో

ఉమాపినీలాలక మధ్యశోభి
విస్రంసయంతీ నవకర్ణికారమ్;
చకార కర్ణచ్యుతపల్లవేన
మూర్ధ్నా ప్రణామం వృషభధ్వజాయ.

పార్వతీదేవి నీలాలకములమధ్య శోభించు కర్ణికారముతో వృషభధ్వజునికి విల్లు నొసంగెను.

దీని ఆకులు ద్రాక్షచెట్టు ఆకులను పూలు వహ్ని శిఖలఁబోలియుండుటంబట్టి "జెరేనియం" జాతిలో చేరిన Pelargonium crianthum Dc, అని యూహింపఁగలిగితిమి. ఈలాటి చిన్నపూలచెట్లు పెద్దతోటలలో కలదు. ఈజాతిలోని యితరచె ట్లివ్వియును:

పులిచింత	Oxalis Corniculata
కమరకపండ్లచెట్లు	Averrhoe Carambola
కాశితుమ్మిచెట్టు లేక గోరంటె	Impatiens Balsamina (Garden Balsam)
	Garden Misturtium

రాయబారి—కృష్ణుఁడు

ముక్కపాటి వేంకటరత్నము గారు

క. విను మవధానంబున నా [యుఁడ
యనునదిధృతరాష్ట్ర మహీతలాధిప! మఱి
గను మనుజానిబిడ్డల స
జ్జననుత మహనీయదివ్యచరితులఁ గృపమై.

క. పాండవులకుఁ గలవాఁ డీ
తం డనినానుడువు సంధి తంత్రము నెద వే
ఱొండుగఁ దలఁపకు ధర్మ వె తా!
టుండటువలె నుందు నే నయోన్నతచరి

క. నీతనయుఁ డొకఁడు దక్కఁగ
భూతలమున నెవ్వరేని పోరితమునకున్
చేతమున సమ్మతింపరు;
భూతభవిష్యత్తులెఱిఁగి భూతలనాథా!

క. ఒకని యసంగతకార్యము
నకు నై లోకంబు తెగడు నట్టివనికి నీ
వకట! యొడఁబడుట ధర్మవె
సకలంబును నెఱింగినట్టిచతురుఁడ వయ్యున్.

క. చేవకలవారు పాండు
క్ష్మావిభుతనూజాతు లార్యసన్నుతచరితుల్
కేవలదయ నీయులు నిన్
గావలసినవారు వారిఁ గాదింపకుమీ.

క. కుంతీతనయాగ్రజ మత
మెంతయు నినుగూడి మనికియే, కాదే దు
శ్చింతు లగుకౌరవుల లో
కాంతరమున కనుపుటే యథార్థం బధిపా!

క. తమ మును జేసినయపరా
ధము లెల్ల క్షమింప వేఁడి ధాత్రిసగము వి
క్రమజీవను లగువారల
కమలినమతి నీకుమారు లర్పింపఁ దగున్.

క. శాంతింబొం దెదునంతట
గుంతీప్రజ రాజులెల్లఁ గూడిమనుదు రొ
క్కింతయు లోకము దొసఁగుల [లున్.
పొంతంబో దఖిలదివము ముదమునఁ బొద

చ. సమయముగావుటన్ బలుకఁ
జాలెద నిక్క మకారణంబు లో
కము నుతిఁగన్న సాధ్వి తమ
కన్నను బెద్దకు గేస్తురాలు వం
శమునకు వన్నెఁ దెచ్చుగుణ
శాలిని నా కనయంబఁ గూర్చుచు
ట్టము నగు ద్రౌపదిన్ బలిదు
టల్ దగవే మనవారి కంగడిన్.

మ. కలనన్ మార్కొని కౌరవాన్వయము జ
క్కన్ జేతురే చూడుమె
న్వలనం బాయునె పాండవేయులకు జీ
వంబుండునందాక నీ

తులువల్ దార్కొని బిట్టు రేఁగి సభలో
దుర్వారులై ద్రౌపదీ
లలనన్ జేసిన చేఁతయున్ విమతులౌ
ల్యం బంతరాంబునన్.

క. పాండవు లల్పులుగా రు
ద్దండులు నిరవద్య ధర్మతత్పరు లైదూ
ర్లిం డని యడిగెద రిచ్చిన
భండనముబొసంగ దెల్ల భంగుల సుఖమా.

క. తనకుం బెద్ద వగుటచే
నిను నంధుని సింహపీఠినిడి శౌర్యము చే
తను రాజ్య మెల్ల నార్జిం
చిన యాతనిసుతుల నిట్లుచేయుట తగవే.

గీ. ధర్మజాజ్ఞామహోగ్ర బంధనమునందుఁ
దగిలి తమ్ములు మీమీఁదఁ దెగరుగాక
లేనిచో వార లోర్కురె పూనికొర [డ.
వాన్వయము మొదలు సెడఁజేయరయ్యనాఁ

గీ. సాధుకోపార్ణవము మానవంపు టెల్ల
మీఱకుండంగఁ జేయుటే మేల్మితనము
పృథుతరోపేక్షయే సంభవించె నేని
సమయఁ జేసెడు నదియు లోకముల నెల్ల.

క. నిను నీతమ్ముఁడు సేవిం
చినదానికి నైన నతని చిన్నారిసుతుల్
దినఁ గట్ట నెనఁగఁ దగదే [న్నన్.
మనుజాధిప! సాముపాలుమాట యెటు

క. తెగునంతికు బిగఁదీయుట,
తగ దెవ్వరి కైనఁ బాండుతనయులు నీ వి
ట్లగునన్న వచ్చి నీపద, [పా!
యుగ మిప్పుడ పట్టికొల్చు చుందురు భూ

క. తనయులు బంధుగులును భూ [బీ
జనములు సేవకులు హితులు సామంతులు
డను గందురు పెనఁకువచే
మనుమార్గముగాదు జ్ఞాతిమారణ మధిపా!

ధృతరాష్ట్రుఁడు :

క. అనయము లోకజనక్షయ
జనకం బగుకార్యమునకుఁ జాలక, దుర్యో
ధన! ధర్మపుత్త్రునభిమత [గదే.
మును దీర్చి మముం బ్రమోదమునఁ దేల్పఁ

దుర్యోధనుఁడు:

క. మిక్కిలిబం ట్లని పెలుచెద
వక్కట! పాండవుల కాజి నంగవిభునకున్
ముక్కున నూపిరి కలుగఁగ [కున్.
దక్కెనె! కురురాజ్యపదము ధర్మసుతున

శా. ద్రోణుం డాతనికుఱ్ఱ భీష్ముఁడు కృపా
దుల్ దక్కువారల్ రణ
క్షోణిన్ మాలినయేని శౌర్యనిధి నా
కుంగూర్చు నీకర్ణుఁడుం
బ్రాణానంగలుగంగఁ బాండవులు సా
మ్రాజ్యంబు దిక్కొ కురు
క్షోణిం బాదము వెట్టనేర్తు రె? వృథా
క్షోభంబు నీ కేటికిన్.

కృష్ణుఁడు :

క. చెలఁగి మన భీము నెదుర [వాఁ
నిలువఁగ నెవఁ డోపు నిండు నిక్కమునకు
డలిగిన ఫాలాక్షుండే లా!
పాలికలనను నడుగుమాలిపోఁడె నృపా

క. ఇంతయుఁ జెప్పట మీకుం
బొంతువమే లనెడుతలఁపు.పోతమే మీ
స్వాంతమున కెక్కుచో న [పా!
త్యంతము సంతోష మట్టి దగుఁగాక · న్న

నీ వే నా!

కొప్పర్తి నారాయణమూర్తి బి. ఏ., యల్. టి., సాహితీసమితి.

డాక్టరుగారి భార్య పల్లెటూరి పిల్ల. ఈమె కాపురమునకువచ్చి సుమారొక సంవత్సరము మాత్రమే యయినను పరమ పతివ్రతయనియు సుగుణరాశి యనియు నా గ్రామములో ప్రఖ్యాతిగాంచెను. తలిదండ్రులు తమపిల్లల కీమెను మాదిరిగా చూపి యట్లు నడచుకొనవలెనని చెప్పుచుండెడివారు; కాని యామె భర్తవంటివాడు తమ పిల్లలకు పెనిమిటి కాకుండుగాక యని యాడు పిల్లలుగల వారెల్లరు భగవంతుని ప్రార్థించెడివారు. ప్రపంచమం దిప్పటికాలమున చెలరేగియున్న కృత్రిమనటనల కండ్లు కాయలు కాచునట్లుకాంచి కాంచి మహారసికాగ్రేసరుడనని మిక్కిలి విఱ్ఱవీగుచున్న డాక్టరుగారు వారి భార్యయందలి సహజ సౌందర్య సుగుణ సంపదల నెట్లు గ్రహించి యానందింప గలరు?

వేశ్యాలోలుడైన భర్తను సన్మార్గమున ద్రిప్ప నామె శక్తికొలది ప్రయత్నించకుండ లేదు; స్వభావసిద్ధములైన యామె చేష్టలు మనుజ స్వభావమును చాలవరకు కోల్పోయిన డాక్టరుగారి కేమియు రుచింపలేదు. ఉచిత రీతిని సద్బోధగావించుట కామెకు భర్త యాస్పదమీయకుండెను. భోజనముచేయు టాలస్యముగ నాతడు గృహము వీడిపోవును. అందుచే నొకటి రెండు పర్యాయములు భోజన సమయమున నీవిషయమై యొక్కింత ప్రసంగింప బోయెను సుశీల. 'అయ్యవారిని చేయ బోవ కోతి యాయె' నన్నట్లాతడు విస్తరి విడిచిపెట్టి తటాలున లేచిపోయి వారమురోజుల వరకు నింటివైపు తిరిగి చూడలేదు. సుశీల యేమిచేయగలదు? కొంతకాలము లోలోన విచారించి తుదకు మనస్సును సమాధానపరచుకొనెను. చిన్ననాడు తన తండ్రి తన కుపదేశించిన హిందూవనితా ధర్మములే యామెకు ధైర్యము గొల్పెను. పతియేదైవము; అతని సౌఖ్యమును పెంపుచేయుటయే వనితాధర్మము; భర్త యిష్టమునకు వ్యతిరేకముగ మాటాడుట హిందూ యువతికి తగదని సుశీల యెంతయు చింతిల్లెను. పతినే యెల్లపుడును సంస్మరించెడిది. మగని దుష్ప్రవర్తనమును గూర్చి యిరుగుపొరుగువారు గుచ్చిగుచ్చియడిగినను నాతని చర్యల వెలిబుచ్చకుండ స్వగౌరవమును కాపాడుకొనుచుండెను. ఇట్టి సుశీలపై భగవంతుడు కరుణజూపకుండడని పలువు రనుకొనెడివారు.

ఒకనాటి యుదయమున నానుపత్రిలో సన్నని చాకుతో నేర్పుగా గోళ్లను తీసికొనుచు మధ్యమధ్య దీర్ఘముగనావలించుచు

నొంటరిగ కుర్చీపై కూర్చునియున్న డాక్టరుగారి యెదుట నలుబదియేండ్ల మనుష్యుడు బుజముపై పిల్లవానిని వేసికొని యుండి నిలువబడి సవినయముగ నమస్కరించెను. మాటాడుట కెవరయిన దొరకిన చాలునని యెదురుచూచుచున్న డాక్టరు తమచేతిలోని పని నప్పటికి ముగించి యా మనుజునితో సంభాషణ లోనికి దిగెను.

'ఆకుర్రాడు మీకుర్రాడిలాగే వున్నాడే!"

"చిత్తం బాబయ్యా! నిన్నరాత్రి......"

"మొన్నసాయింత్ర వీడు వీధిలో ఆడుకుంటూవుంటే చూశానే!"

"హఠాత్తుగా రాత్రి పదొకండు గంటలకి..."

"వాయువు కమ్మింది కదా!"

"లేదు బాబూ; ఏదో........."

"కడుపు నెప్పి వచ్చింది. పోతుందిలే అదెంతసేపు!"

"అదేం కాదండి! మామూలుగా..."

"బాలరోగమా! చురక వేశారా?"

"అబ్బె! మే మొక ముంగిని పెంచామండి..."

"ముంగి కాటే కదా!"

"ఆముంగి దీపపు సెమ్మా పడగొట్టింది......"

"అయ్యో, పాపం; వొళ్లు కాలిందేం?"

"ఆచప్పుడికి పిల్లాడు ఉలికిపడి యేడవడం మొదలెట్టాడు..."

"ఓరి, ఇదేనా? ఊరికే భయపడ్డాడు; దీనికి ఔషధం ఎందుకు!"

"అప్పటి నుంచి పిలిస్తే పలకడం లేదు. మధ్యమధ్య కాళ్ళూ చేతులూ తన్నుకుంటాడు."

"ఓహోహో! ఇది సాధారణ రోగం కాదు..."

"బాబూ; ఒక్కడే కొడుకండి, లేకలేక పుట్టాడు. వీణ్ణిబతికించండి. మీమేలు మరచిపోను."

దీనికి ఘుత్తి మందు వేస్తేనేగాని లాభం వుండదు. కొత్తసీసా విప్పాలి......"

"ఏలారక్షిస్తారో; మీఋణము తీర్చుకుంటాను; దయవుంచి......"

"ఏలా తీర్చుకుంటావు?" అనెను, డాక్టరు నవ్వుచు. ప్రక్కగదిలో డాక్టరు కొరకు నల్లుచున్న జేబురుమాలును చేతబట్టికొని పై సంభాషణలు వినుచున్న కోమలి—ఈమె మంత్రసాని యని వేరుగ చెప్పనక్కరలేదు—కిటికీగుండ తలను దూర్చి మందహాసముతో

"మీకు సంగీతం నేర్పుతాడు. మీకు ఆ వొక్కలోటూకూడా తీరిపోతుంది!" అని తిరిగి చాటుకు పోయెను.

"అయితే నీకు సంగీతం వచ్చునా?"

"చిత్తం; ఏదో కొంత నేర్చుకున్నానండి చిన్నప్పుడు..."

"బాగా పాడగలవా?"

"ఈ రోజుల్లో పాటలూ సంగీతాలూ ఎవరిక్కావాలండి!"

"ఓయి వెఱ్ఱివాడా! సంగీతం లాంటి విద్యవుందా. సరసుడన్నవాడు సంగీతమంటే

చెవికోసుకోడూ!"

"తమకంత ఆదరముంటే రోజూ మీ యింటికి వచ్చి నాకు వచ్చిన శాస్త్ర విద్యా నేర్పుతానండీ తమకు."

"నాకు వద్దులే; మా ఆడవాళ్లకి రోజూ ఒకగంట నేర్పుతూ వుండు కొంతకాలము; తరువాత చూద్దాం." అనుచు లోనికి జని బీరువానుండి సీసానొకదాని దీసి అందలి ద్రావకముతో మరికొన్ని ద్రావకముల కలిపి యొకసీసానెక్కించి గంటకొక పర్యాయము సాయంకాలమువరకు నిమ్మని చెప్పి సీసాను రోగికందిచ్చెను. అతడు వంగి నమస్కరించి సెలవుతీసికొని వెడలిపోయెను.

పిమ్మట డాక్టరు తనలో తానిట్లు వితర్కించుకొనెను. "నాడు నడతకు నాభార్య చాల కుందుచున్నదనియు, ఇట్లే కొంత కాలము నేనుండిన నామె నాకై విలపించుచు మరణించుననియు పలువురు మిత్రులు నాతో చెప్పి నన్ను మందలించుచున్నారు......... నిజమే! ఇంటనేమియు పనిలేక తీరికగ నెల్లపుడునున్న నెవ్వరికైన మతి చలింపకమానదు. నామిత్రులు చెప్పినట్లు కొంతకాలమునకీమెకు పిచ్చిపట్టిన పట్టవచ్చును. అట్లయిన నామె వంటకుకూడ నిరుపయోగ మగుటయేకాక ఆమెను భరించుట నాకనవసరపు వ్యయమునకును మనోవైకల్యమునకును హేతువగును. ....సంగీతమునేర్చుకొను ధోరణినున్న మొదల కొంతవరకామెమనస్సు శాంతి నొందును. నాపై తలపు మరలును. ఆమెపై నాకు ప్రేమ కలదనికూడ నామిత్రులు నిశ్చయించుకొందురు. ఇప్పుడు నాకీ గ్రామమున నున్న చెడ్డపేరు కొంత తగ్గును......అవును; అదేయెత్తు!"

ఇట్లూహించుచు నింటికేగి స్నానాదుల గావించి భోజనమునకు విస్తరియొద్ద కూర్చుండెను. భార్య యెదుటనుండిన భోజనము సరిగాచేయకుండు టిదివర కెన్నియో సారులు తటస్థించుటచే, వంటకములనన్నింటిని వడ్డించి వంటయింటి మొండిగోడవెనుక నిలువబడి యుండి చూచుట వాడుక యాయెను, సుశీలకు. ఆ ప్రకారమే నేడును దూరమునుండి భర్త కడుపార భుజించుచుండెనో లేదోయనియు, చేసిన పదార్థము లాతనికి రుచించునో లేకో యనియు నాందోళన పడుచుండెను.

తలనించక వంటయింటివైపు మరల్చి. తా జేసిన పనికి సిగ్గుపడుచున్నవాని కంఠస్వరముతో, "ఏమే!" అని మెల్లగ పిల్చెను, డాక్టరుగారు.

సుశీల యొడలు గగుర్పొడచెను. కట్ట తెగిన తటాకమునుండి వెలువడు జలప్రవాహమువలె నశ్రుజలము చెక్కిళ్లపై పార జొచ్చెను. ఒక్కింత తడవు సర్వావయవము లామె స్వాధీనము తప్పెను. రేయింబవళ్లు తాను సేవించుచున్న శ్రీమన్నారాయణమూర్తి తనకు సందేశము దెచ్చెనేమో యని తొలుత భ్రమించెను. నిర్జీవ ప్రతిమవోలె గోడకు జేరగిలబడెను.

"ఏమే! నిన్నే!"

ఈ రెండవసారి పిలుపామెను తిరిగి మానవలోకమునకు దెచ్చెను.



"ఊఁ"అని జవాబు అప్రయత్నముగ నా మెనుండి వచ్చెను.

"సంగీతము నేర్చుకుంటావ్?"

ఇట్టి ప్రశ్న కామె సిద్ధపడి యుండక పోవుటచే మాటాడకుండెను. ఆమె జవాబున కీతడు నిరీక్షించకనే

"సంగీతం చెప్పడానికి ఒకణ్ని కుదిర్చాను. ఇవాళ నుంచి మన యింటికివస్తాడు. నువ్వు జాగ్రతగా నేర్చుకో." అనెను.

అంత భోజనమగుటచే నతడు లేచి యథాప్రకారముగ దుస్తుల ధరించి వెడలెను. వంటయింట కొంగు పరచుక పరుండి సుశీల యేమేమో యోచించుకొనుచుండెను.

"నేడు నానాథునకు నాపై నింత కరుణ గల్గుటకు కారణమేమయియుండును? ప్రతిదినము నకంటె నీదిన మాయన నెక్కుడు గౌరవింపలేదే! వంటకముల నెక్కువగ నెక్కువ రుచిగ చేయ లేదే! భగవంతుడు చేయదలచిన వేళ కారణముండవలెనా? జగదీశ్వరుడు తలచిన ఏమిజరుగకుండును. ఇంత వఱకు ప్రాణేశ్వరుడునను జూడకుండుటకు నే జేసిన తప్పేమి? అంతయు భగవద్విలాసము! పూర్వజన్మమున నాచెనర్చిన పాపము నీవిధమున నేననుభవింపవలసివచ్చెను ఎరుగకేదంప తుల కెడ బాటుగావించితినో; నేడిఁగి యను భవించుచుంటిని. నేటికి పాపవిమోచనము కానోపు! "ఏమే"అనిగదా పిలిచెను. అయ్యో! తలచిన సిగ్గగుచున్నది. నా పూజాఫలము నాకు చేకూరెను. ఎంతయో ప్రేమలేకున్న నన్నట్లు పిలచునా? నేపలుకకున్న తిరిగి నను బిలిచెనే! ఒడలు తెలియక "ఊఁ" అంటిని. లేకున్న నింకొకసారి "ఏమే" యని పిలిచి నన్నానందాబ్ధి నోలలాడించియుండునుగదా! ......ఛా; నాయానందమునకే చూచుకొనుచున్నానుగాని తొలిసారియే పలికియున్న నాథుడెంతయో సంతసించి యుండునుగదా! ఆయనకు రెండవసారి ననుపిలచు శ్రమకూడ తప్పియుండును! సమయమునకు మనస్సు స్వాధీనముతప్పుటయు నాపాపమే! "ఏమే!...ఏమే! ...ఏమే!"...... అంతప్రేమతో, అంత నెమ్మదిగ, అంత సుకుమారముగ, అంతసరసముగ, అంతముద్దుగ పిలచినపుడు నే మొదట పలుక

కుండినపుడు నాథుడు ననుగూర్చి యేమనుకొనెనో? ఏమనుకొనినను ఆయన తప్పులేదు. ఎప్పుడాయన ననుజూచునా యని వేచియున్న నన్నాయన నోటినిండ పిలచినపుడుకూడ సమయము దాటకేసితినే! నావంటి మాంద్యురాలు, నిర్భాగ్యురాలు, పాపిని, క్రూరురాలు, భువినుండునా? ఇట్టి దానిని భర్త యగౌరవింపకుండునా? ఆయన పాదములపై నెరగి యేడ్చి రక్షించుమని వేడిన నను దరిజేర్చకుండునా? అయ్యో! వెడలెనుగా! వెడలునప్పుడు "ఏమే" యని పిలచియుండినను పోలేదే!........... లోకులెన్ని యనుకొనిన నేమి? నానాథునికి నాపై నిక్కమైన ప్రేమగలదని నాకు తెలియును గాని వారలేమెరుంగుదురు? ఎంతయో ప్రేమలేకున్న నాకు సంగీతము నేర్పుటకు కుదిర్చియుందురా? నాకు సంగీతము రాకుండుట కాయన యెంతవిచారపడుచున్నారో! "జాగ్రతగా నేర్చుకో" అని చెప్పి వెళ్ళిరి. ఎన్ని దినములకు నానాథుని మెప్పించునట్లు పాడగలనో! అప్పుడేకదా యాయన మనోభీష్టము తీరును! అప్పుడేగదా నాజన్మ సార్థకమగును! తల్లీ! శారదా! నాకీవిద్య ప్రసాదించుము. నమ్మికొలచినవారి యభీష్టములు నెరవేర్చు బాధ్యత దేవతలకు లేదా!......... ఏమి నా వెఱ్ఱి? దైవానుగ్రహముకల్గెను గనుకనే నా నాథుడు నాపై ప్రేమజూపెను. ఆ యనుగ్రహమువలననే పతిసేవ సేయు సామర్థ్యముకలుగకపోదు........" —

కొంతసేపటికి లేచి భోజనముచేసి సంగీతముచెప్పువాడింకను రాలేదనుకొనుచు చావడిలో కూర్చుండెను.

భార్యకు సంగీతము నేర్పుటకు డాక్టరుగారిచే నియమింపబడిన మంగలి వెంకటస్వామి మధ్యాహ్నము రెండుగంటలకు డాక్టరుగారింటికి వచ్చెను. తన సంగీతవిద్యను పరీక్షించి యానందించువారు లేరను చింత వెంకటస్వామిని పీడించుచుండెను. తనతో నీవిద్య నశించుననికూడ నాతనిభయము. గొప్పవారింట్ల స్త్రీలకిదివరకెన్నడును సంగీతము నేర్పు భాగ్యమాతనికి పట్టియుండలేదు. అందుచే నాతడును వీలయినంతత్వరలో, అమితమైన యుత్సాహముతో, కావలసిన యుపకరణములతో డాక్టరుగారియింటికి వచ్చెను. సుశీలకూడ మిక్కిలి యాదరముతో విద్యనభ్యసించ నారంభించెను. సుశీల విద్యను సూక్ష్మముగ గ్రహించెడిది; ఎక్కువగ నేర్చుకొనవలెనని యభిలాషయు, నేర్చు పట్ల పూనికయు గలిగియుండెను. వీనికి వెంకటస్వామి సంతసించుచుండెను. ఆమె కంఠమునందు మార్దవమున్నదని పలుమారతడు మెచ్చుకొనెను. తనకువచ్చిన విద్యనంతను సుశీలకు వీలయినంత త్వరలో నేర్పవలెనను పట్టుదలతో తనకు తీరిక యయినపుడెల్ల వచ్చి సుశీలకు విద్యాభ్యాసము గావించుచుండెడివాడు, వెంకటస్వామి. భర్త మెప్పుబడయు నంతవిద్యను శీఘ్రమున నేర్చుకొను నిచ్చతో దీక్షగా కృషిసల్పుచుండెను, సుశీల.

ఇట్లారుమాసములు గడచెను. సంగీతమందు గురువును మించినదాయెను, సుశీల. సంగీతవిషయమయి భర్త తనతోడ ప్రసంగించునేమోయని యనుదిన మాశతో వేచి

యుండెడిదిగాని, ఆయన యీమాటయే మరిచిపోయెను. ఒకదినమున ధైర్యముబూని యీవిషయమై కదిపెనుగాని డాక్టరుగారు చెవిని పెట్టకుంటచే సుశీల యూరకొనవలసి వచ్చెను. ఎన్నటికైనను మరల భర్తకు దయవొడమకుండునా యను ఆసయే సుశీల ప్రాణముల నిలువబెట్టెను.

రెండుగంటలలో తనకుమారుని రోగమును బోగొట్టిన డాక్టరుగారియెడల వెంకటస్వామికి గాఢ విశ్వాసము కుదిరెను. ఆయన భార్యను కేవలము తన పుత్రికగాభావించి ప్రేమించుచుండెను. ఆతనికి సుశీల దురవస్థ తెలియకపోలేదు; తెలిసి యేమిచేయగలడు? పెద్దయుద్యోగములుచేయు మిత్రుల యుపదేశముల పెడచెవిని బెట్టిన డాక్టరునకీతడు సలహానొసగ సాహించుటెట్లు? సుశీల తెలివితేటలుగలదనియు, సుగుణముల ప్రోగనియు, పతిచేయుచున్న యగౌరవమున కామె యెంతమాత్రము పాత్రురాలుకాదనియు తనలో తానెన్నియోసారులు తలపోసికొనియుండెను. ఆమెయెదుట నీవిషయమును ప్రస్తావించుటనుచితమని యూరకుండెను. వెంకటస్వామి సుశీలకు చెప్పగల్గినవిద్య యింకలేదు.

ఒకనాటి సాయంకాలమున తానింటికేగుసమయమున సుశీలనుగని,

“అమ్మా! యికనేనిచ్చుటకు రానవసరము. మీయంతట మీరే కృషిచేయవచ్చును.”

“ఇంకా తగినంత విద్యరాలేదని నా నమ్మకం” పాపము తనభర్త తన్ను మెచ్చుకొనకుండుట యామెకు సంశయముకల్గించెను. యథార్థమును కనిపెట్టి, “బాబయ్యగారు మీ విద్యను పరీక్షించి నాకు బహుమతి యిచ్చిందాకా వస్తూనేవుంటా.”

సుశీల యొక్కనిట్టూర్పువిడచెను. వెంకటస్వామి కన్నులు బాష్పపూరితములయ్యెను. విచారించిన లాభములేదని తలచి సెలవు తీసికొని యాతడు వెళ్ళెను.

ఆ రాత్రియంతయు నాతని మనస్సు తొట్రుపడెను. ఏదియో యాలోచించుచుండెను. ఇంటియొద్ద నున్నపుడొక్క నిమిషమైన చంకదింపని తన ముద్దుకుమారునయిన నారాత్రి యతడు పలుకరించనేలేదు.

మరునాటి యుదయమున ఆసుపత్రిలో డాక్టరుగారిని దర్శించి వెంకటస్వామి వినయపూర్వకముగా ననెను,

“అమ్మగారికి నాకు వచ్చిన విద్యను నేర్పడమయింది......”

“అప్పుడే!”

“ఎన్నాళ్లు కావాలండి? నాకు వచ్చిన విద్యయెంత!”

“ఇంతేనా! ఇంకెవ్వరూ సంగీతం నేర్పే వాళ్లు లేరూ?”

“లేకేమండి? అక్కడక్కడ వుంటారు.”

“అదిగాదు; నువ్వెరుగున్న వాళ్లలో వున్నారా?”

“(కొంచె మాలోచించి) ఒక ఆమె వుందిగాని......”

“యెక్కడెక్కడ?” డాక్టరుగారికి ఆత్రమెక్కువాయెను.

"బెజవాడలో..."

"ఏకులం?"

"ఏకులమయితే లెండి; భోగంది."

"అయితే, అది ఇక్కడకు వచ్చి వుండి చెప్పుతుందా?"

"కులానికి భోగంది; కాని వృత్తికి అటువంటిది గాదు."

"మరేం వృత్తి, దానిది?"

"సంగీత సభలలో పాడి బహుమతి పొందుతూవుంటుంది."

"నేను నమ్మను; భోగందేమిటి, ఆవృత్తి కాకపోవడమేమిటి?"

"భోగందో యెవరో బాగా తెలియదు. ఆమె వొక్కత్తె యెప్పుడూ ఇంట్లోవుంటుంది. ఆమె పరులకంటికి సాధారణంగా కనబడనే కనబడదు."

"అయితే మనింటికి వస్తుందా?"

"నేనూ, ఆమెతల్లీ ఒక్క గురువుదగ్గరే చదువుకున్నాము. ఆమె సభలుచేసేటప్పుడు నాకు కబురుపంపించి కూడా తీసుకువెడుతూ వుంటుంది."

"నువ్వు వెడితే దాన్ని తీసుకు రాగలవన్నమాట!"

(సంశయముతో) "తీసుకురాగలను గాని అట్టె రోజులుంటుందని తోచదు."

"అక్కడ దొరికే డబ్బు యిస్తే సరి, మహాచక్కావుంటుంది! తీసుకొద్దూ, తరువాతసంగతి నే చెపుతాను."—

"ఇది ఎన్నో కేసు?" అనెను మంత్రసాని ప్రక్కగది నుంచి నవ్వుచు.

"డబ్బుకోసం ఇప్పుడది చూడడం లేదు. డబ్బు కావలసినంతవుంది ఆమెకేం?"

"మరేమిటి దాని యిష్టం?"

"తగినవాణ్ని చూసి అతనితో యావజ్జీవము ఉండి పోదామని......"

"ఇదిగో ఈపది రూపాయిల నోటు తీసుకెళ్లి రేపు మోటారుమీద దాన్ని తప్పక తీసుకురా. త్వరగావెళ్లు. ఇవాళ మోటారు తప్పిపోతుంది లేకపోతే."

వెంకటస్వామి నోటు తీసుకొని పదియడుగులు పోవగానే, డాక్టరు వెనుకవెళ్ళి యాతని కేకవేసి పిలిచి రహస్యముగ నెద్దియో మాట్లాడెను.

మంత్రసాని తనలో నిట్లు సణుగుకొనెను, "వీడెందరినయినా మోసపుచ్చగలడు. మాటల డంబమేగాని మరేమీ లేదు. ఆశపెట్టడం బాగా తెలుసునువీడికి. నాకొంప తీసేడు ఈడాక్టరు. వీడికి తగినది నగరాజేగాని మరొకత్తె కాదు. ఈవృత్తాంతమంతా దానికి జేరేస్తే వీడికి తగిన ప్రాయశ్చిత్తం జరుగుతుంది."

పదిగంటలయినది. ఆసుపత్రి విడిచి డాక్టరుగారు వారియింటికి భోజనమునకేగిరి. మంత్రసాని నగరాజింటికి జనెను; ఉన్నవానితో లేనివానినికూడ చేర్చి డాక్టరుగారి మీద చాడీలను నూరిపోసెను. డాక్టరుకు నగరాజు మీద కంటె భార్యమీదనే యెక్కువప్రేమయనియు, ఆమెకు సంగీతము నేర్పుటకు విద్వాంసురాలిని చెన్నపట్నం నుంచి నెల కేబది రూప్యముల జీతముపై తెప్పించుచున్నట్లునూ మంత్రసాని నొక్కి నొక్కి చెప్పెను. నగరాజు

క్రోధో ద్రేకముచే నొడలు మఱచెను. మంత్రసాని మంత్రముపారుట గ్రహించి నగరాజును విడిచి పోయెను.

డాక్టరు సుమారు పండ్రెండు గంటలకు యథావిధిగ నగరాజును దర్శింప బోయెను. ఎంత ప్రార్థించినను నగరాజు ప్రసన్నురాలు కాలేదు. "ఛా! యీపాడుముండను ప్రార్థించడ మేమి"టనుకొని లేచి వెళ్లిపో నుద్యుక్తుడై యుండె, నట్లుచేసిన తాను రసికుడనిపించుకొనడని సంశయించి తిరిగి తనచేతనయిన యెల్లవిధముల నామెను సమాధాన పరుప జూచెను. తుదకావేశ్య ముసుగుదీసి మంచముపై నుండి లేచి గదితలుపు వైపు పోవుచు నొక్కవరమును ప్రసాదించెను. "నీ భార్యగారుంటే నేనులేను; నేనుంటే నీపెళ్లాం వుండరాద"నుచు చురుకుగ నడచుచు పొరుగింటికేగి కూర్చుండెను. డాక్టరు మూడు గంటలవరకు విచారించుచు శయ్యపై మేను జేర్చి యుండెను. నిట్టూర్పువిడచి తటాలున లేచెను; అతని ముఖమప్పటున మనోనిశ్చయమును ప్రకటించెను. వేగముగ ఆసుపత్రికిపోయి లోపలి గదిలో మూలనున్న బీరువానుండి చిన్నసీసా నొకదాని తీసి కోటులోపలి జేబులో వైచికొని తనకుర్చీని జేరు సమయమున వెంకటస్వామి చిరునవ్వుతో నెదుటబడెను.

"ఇదేం! నువ్వు వెళ్లనే లేదా?"

"వెళ్లకుండానే పని జరిగింది!"

"ఎట్లా? యెట్లా?"

"నామాట తీసెయ్యదని నే నెరుగుదును. అందుచేత టెలిగ్రాము యిచ్చాను. అందిన తక్షణం ప్లెజర్ కారు (Pleasure car) చేసుకొని వచ్చేసింది."

"భేషయిన వాడవు!"

"ఇదంతా మీ సంకల్పం......"

"దాని నెక్కడుంచావు?"

"ప్రస్తుతం మాయింట్లోనే వుంది."

"అదిగో! మంత్రసానిముండ వస్తూవుంది. మనం ఇంటికి పోదాం రా!" అని వెంకటస్వామిని తోడ్కొని తనగృహముచేరెను. నాటి రేయికి వలయు యేర్పాట్లన్నియు చర్చింపబడినవి. తగిన యేర్పాటుల జేయుట కవకాశ మిచ్చుటకు డాక్టరుగారు షికారు పోవుచు వెంకటస్వామితో 'జాగ్రత సుమా' యని చెప్పెను. వెంకటస్వామి సుశీలను పిలిచి "అమ్మా! నామనవి చిత్తగించరా?" యనిదీనముగ నడిగెను.

"నామనస్సు కాట్టే యిష్టంగాలేదు."

"అమ్మా! కులానికి నేను తక్కువవాడ నయినా వయస్సులో తమకంటె పెద్దవాణ్ణి. మిమ్మల్ని చూస్తే నాకడుపు కరిగిపోతూవుంది. నేను చెప్పినదానిలో ప్రమాదం కలిగించేది ఏముంది?"

"భర్తనుమోసముచేయుటకు"నేనిష్టపడను.

"ఇందులో మోసమేముంది? మీరు పాడుతూవుంటే ఆయన వింటారు. వినకూడదా?"

చాటుననుండి యేలపాడవలెను? ముసుగువేసుకొని యేల ఆయన యెదుట పడవలెను?"

"తలచిన కార్యం జరగడానికి!"

"ఇంకొక మార్గములేదా?"

"నాకు కనబడదు. ఇంత శ్రమ పడి యింతవరకు సాగించాను. కొనసాగు తుందని నానమ్మకం. తప్పదు! ముమ్మాటికి నిశ్చయం. రాత్రి నేను చెప్పినట్టు మీరు చేయకపోతే మోసముచేసానని నన్ను చంపుతారు, డాక్టరుగారు. నామాట విని నన్ను రక్షించండి." అనుచు సుశీల కాళ్లపై బడెను వెంకటస్వామి. సుశీల మోమునందించుక సమ్మతి స్పష్టపడెను. ఆతడు లేచి పదినిమిషము లామెకేదియో బోధించి వెడలిపోయెను.

డాక్టరుగారు ఆరుగంటలకే యిల్లుచేరిరి. ఏడుగంటలకే తొందరగా భుజి[illegible] యించుక విశ్రమించి గడియారమునుచూచి యింకను రాలేదేమని యనుకొని వెంకటస్వామి యింటికరిగెను.

"ఏమోయ్! భోజనమయిందా?"

"నాది అయింది. ఆమె వండు కుంటూ వుంది."

"హోటల్ నుంచి తెప్పించలేక పోయినావా?"

"అబ్బో! ఆవిడకు చాలానియమాలున్నాయి. సొంతంగా వండుకుంటేనేగాని భోజనం చెయ్యదు!"

"తొందరగా కానియ్యమను, మరి..."

"ఏర్పాట్లు అన్నీ జరిగేసరికి ఆమె భోజనం అవుతుంది."

"ఇంకా నేను చెప్పిన యేర్పాట్లుచెయ్యనే లేదా!"

"ఏదీ! మంచం సర్దుతూవుంటే ఈవిడ కబురు పంపింది. వచ్చేశాను. ఎంతలెండి, ఒక్క అరగంట పని. నేను మీయింటికి వెడతాను. మీరొక గంటసేపు ఆసుపత్రికేసి షికారు వెళ్ళిరండి. ఒకటిరెండు సంగతులు ఇంకా ఆమెతో చెప్పవలసి వున్నవి."

"సరే, నేను వెడతాను. నువ్వు అదేదో చూడు."

చావడి మీదనున్నగది శృంగారింపబడినది. అందు చక్కగ శయ్య యమర్చబడినది. ఆగదిలో క్రింద తివాచిపై వీణె యుంచబడెను. గదిగుమ్మమున కెదురుగ చావడిలో కుర్చీయుండెను. గదిలో సన్నని వత్తిగల దీప (Bedroom light) ముండెను. చావడిలో శ్రేలాడు దీపముండెను. సుశీల గదిలో ప్రవేశించి యుండెను.

డాక్టరుగారు గుమ్మములో నిలువబడి వెంకటస్వామిని పిలువ నాతడును గుమ్మములోనికి వచ్చెను.

"అదెక్కడుంది?"

"మీరు చెప్పిన చోటనే!"

"అది కాదు-నీశిష్యురాలు?"

"ఆవిడకు అప్పుడే అవుషధం పట్టిచ్చి గంటయింది. గాఢనిద్రలో వుంది. మీరిచ్చే ఔషధాలు అన్నీ బహుచక్కగా పని చేస్తాయండీ!"

"అది ఔషధం తాగదనుకొన్నాను."

నేను మెల్లగా బోధించి తాగించాను గాదూ!"

"బలే వాడవురా నువ్వు! దానిపేరెవరు? అది వచ్చిందా?"

"అన్నీ సిద్ధం చేశాను. మీరు రావడమే తరువాయి."

"అయితే, నేచెప్పిన సంగతి కదిపావా?"

"కదిపాను గాని అట్టే ఫలించలేదు. మీతో ఏకాంతంగా మాట్లాడడానికి మాత్రం వొప్పించేసరికి తాతలు దిగివచ్చారు."

"సరేలే; తరువాతి సంగతి నేచూసుకుంటాలే!" అనుచు డాక్టరుగారు చావడిలో కుర్చీపై సుఖాసీనులైరి. వెంకటస్వామి గదిలోనికివెళ్ళి ఫిడేలు పుచ్చుకొని వాయించుట ప్రారంభించెను. సుశీల వీణను వాయించుచు గాత్రముతో పాడుచుండెను. ఆమె మోము చూడవలెనని వంగివంగి డాక్టరు చూచెను గాని యామె తలుపుచాటుననుండుటచే కనపడదాయెను. ఆయన కెదురుగ వెంకటస్వామి కూర్చుండెను; ఆతడు డాక్టరు మోమునందలి మార్పులనుబట్టి యాయన భావముల గమనించుచుండెను. "ఓహోహో! హాయ్ హాయ్" యనుచు మధ్య మధ్య తలవిసరుచుండెను డాక్టరుగారు. గానమింపుగనున్నను ముందాయన చేయవలసినకార్య మున్నదిగనుక వెకంటస్వామిని పిలిచి ముగింపమని చెప్పి యాతని సీవలనుండమనెను. తాను గదిలోనికేగి శయ్యపై కూర్చుండెను.

"ఇలా ఓక్కమారురా"

"ఎందుకు?"

"మాట్లాడాలి"

"ఇక్కడనుండే మాట్లాడవచ్చును."

"రహస్యం చెప్పాలి"

"క్రొత్తమనిషితో రహస్యమేముంటుంది"

"ఒక్కమాట వినివెళ్ళు....."

"వెంకటస్వామిరా!......"

"వొద్దువొద్దు! వాణ్ని పిలవకు" అనుచు తానామెచెంతజేరి తాకబోయెను.

"ఇలాచేస్తే నేవెళ్ళిపోతాను..."

"నిన్ను తాకనుగాని, నేనొక్క మాట చెప్పుతాను విను. నాస్థితి గతులు వెంకటస్వామివల్ల నీకు తెలిసేయుండును. నీసమాచారమునుకూడ అతడు నాతో చెప్పాడు. నీవు నాపాలిట రంభవలె చిక్కితివి. నిన్ను నా పంచప్రాణములకంటె యెక్కువగా చూచుకుంటాను. నన్ను కన్నెత్తిచూడవా?"

"నేనుకూడా ఒక్కమాట చెపుతాను వినండి. నాకు ఒకనియమ మున్నది. నన్ను తప్ప మిగిలినస్త్రీలను తల్లులవలె చూస్తానని ఘోర ప్రమాణకము చేసినవాని తప్ప నే నన్యునివరింపను. అట్టివానిని నే దైవముగా చూసుకుంటాను. ఆయనే నాభర్త; ఆయనే నాసర్వము........."

"ఏ ప్రమాణకము చేయమంటే అది చేయడానికి సిద్ధంగానున్నాను......"

"ఎందుకొచ్చినమాటలండీ! భార్యయున్నవానికెట్లు ఇంత ఘోర ప్రమాణకం చేయుటకు వీలుపడును?"

"అదా నీసందేహం? ఇదివరకే ఆ అడ్డు తీర్చడానికి ప్రయత్నంచేశాను. (జేబులోనుంచి సీసానుతీసి) ఇదిగో దీనితో ఒక్క నిమిషములో దాన్ని ఈలోకంలో లేకుండా చేస్తాను......."

సుశీలకు కాళ్ళాడకున్నవి. తల తిరుగు

చున్నది. తన భర్త యిట్టి కృత్యమునకు సాహసించునని ఎన్నడు ననుకోనలేదు. వెంకటస్వామి చెప్పియున్నట్లు ధైర్యమును తెచ్చుకొని ప్రవర్తింపవలెనని గుర్తెరిగి.

"ఆ పాపంకూడా నాకెందుకు?......"

"ఇదిగో! ఇలాచూడు" అనుచు నామెపై చేయి వేయబోయెను. సుశీల తప్పించుకొని గదివిడిచిపోవనున్నది.

"ఇదిగో! ఆఖరుమాట! నన్నువిడిచి వెళ్ళావంటే ఈసీసాలో విషము తాగుతాను. చూడు, చూడు!" అనుచు సీసామూతతీసి దానినోటియొద్ద బెట్టుకొని త్రాగనుద్యుక్తుడయి యుండెను. తటాలున సీసానందుకొని, ఆపాదమస్తకము కప్పియున్న ఉల్లిపొరవంటి వస్త్రమును తొలగించి డాక్టరు మోముదగ్గర తన మోమును చేర్చుచుండ, "నీవేనా" అని యొక్కయరపు నరచెను, డాక్టరుగారు కాలుచేతులు వణకుచుండెను; ఆయన నోట మాట లేదు. వెఱ్ఱిచూపు చూడసాగెను. శయ్యపై మూర్ఛిల్లి పడియుండెను.

"ఇంత యెందుకు? నేనేగా" అనుచు నాతనిప్రక్కను చెమట తుడుచుచు విసరుచు కూర్చుండెను, సుశీల. కొంతసేపటికి తెప్పిరిల్లి "ఏమే!" అని పిలిచెను.

"ఓయ్, నేనిక్కడే వున్నాను. ఇలా చూడండి"

"నన్ను క్షమించావంటేనేగాని నీమొగముచూడలేను. చక్కగా నాకుబుద్ధి నేర్పితివి. నీమేలు మరచిపోలేను."

"నే చేసిందేముంది; దైవమూ, వెంకటస్వామీ చేసారు నాకీ మహోపకారము!"

ఈరీతిగా వెంకటస్వామి డాక్టరుగారి ఋణముతీర్చివైచెను. నాటినుండి డాక్టరుగారు పరస్త్రీని కన్నతల్లివలె చూచెడివారు. భగవంతునియందు సుశీలమ్మకు భక్తి విశ్వాసములు మెండాయెను.

ఆర్తిహరుడు

శ్రీ శివశంకర శాస్త్రి [సాహితీసమితి]

హృదయ శాంతికై నిర్జనభూమికి
నేగితి సంధ్యావేళన్
అలసభావమున నుపవేశించితి
నచ్చటిసేతువు మీదన్.

పార్శ్వమునం దశ్వత్థ మహీజము
భాసిలె పీవనపగిదిన్
మారుత చాలిత తత్పర్ణంబులు
మంజుస్వనితము చేసెన్.

ఆ ప్రదేశమున నిష్కంపంబుగ
నాసీనుడనై యుండన్
సమసిపోయినవి క్రమక్రమమ్ముగ
సంధ్యారాగపు దీప్తుల్
ఆవరించినవి పలుచని చీకటు
లవనీభాగం బెల్లన్
ఆకాశంబున నిలిపి వీక్షణము
లట్లే కదలక యుంటిన్.

అప్రయత్నముగ జ్ఞప్తికి వచ్చిన
నప్పుడు జీవితచర్యల్
బాల్యం బాదిగ నాటివరకును
బలవత్కార్యము లెల్లన్.

తోచిన వయ్యెడ నొక్కొక్కటిగా
దుర్నివార్యగతితోడన్
పడినకష్టములు పొందినబాధలు
భగ్నమనోరథ సంతతుల్.

పొంగి పొరలినది దుఃఖతరంగిణి
భూరితరార్భటితోడన్ —
నిలుపంజాలక రోదించితి నే
నిశ్శబ్దంబుగ దేవా:

అంతకాలమును ఘనీభవించిన
యార్తి భరం బగుకతనన్
ధారాపాతముగా ప్రవహించెను
తరుగక బాష్పకణంబుల్.

పవనాహతిచే బోధిమహీరుహ
పర్ణము లల్లల నాడన్
సత్వరమ్ముగను దృష్టి వాలినది
చల దలమ్ముపయి దేవా!

"అశ్వత్థమ్మను వృక్షములం దే"
నను గీతా వాక్కుల్
తోడనె స్ఫురణకు వచ్చిన, వంతట
దుఃఖ మ్మాగెను నాథా!

సుకృతి కవీంద్రుడు శ్రీమల్లీలా
శుకముఖ నిర్గళితం బౌ
శ్రీమత్కర్ణామృత వాక్కుల నిను
జేసితి స్తోత్రము దేవా!

సమసి పోయినది దుఃఖం బంతయు
శాంతి చెలంగెను హృదిలో
చాలతడవు నిను భక్తిభరమ్మున
స్తవము చేసితిని నాథా!

సేతువ వోహరో దుస్తరసంసృతి
సింధువు కీవే దేవా!
నిశ్చయంబుగా నార్తిహరుండవు
నీ వొక్కడవే నాథా!

నీసుధామధుర నామకీర్తనము
నిరతము సల్పెడివారల్
ఆర్తిహరా! దుఃఖార్ణవపారగు
లగు టబ్బురమే దేవా!

హిందూదేశ వర్తక వ్యాపారము

మల్లంపల్లి సోమశేఖర శర్మ గారు

హిందూదేశమునకు పడమటిదేశములకు వర్తక వ్యాపారము ఎప్పటినుండిసాగుచుండెనో కాలమునకు మాత్రమే తెలిసినరహస్యమది. అత్యంత ప్రాచీన కాలమునకు పోయినకొలది దేశచరిత్రజ్ఞానమునకు మబ్బు క్రమ్మి యేమియు దెలియరాకుండ పోవుచున్నది. కాని వర్తకము చాలప్రాచీనకాలమునుండి జరుగుచుండెనని తెలంచుటకుమాత్రము అవకాశముకలదు. వర్తకవ్యాపారమును సాగించుటకు అప్పటిసాధనములు వేఱు; అప్పటి మార్గములు వేఱు; అప్పటిపరిస్థితులు వేఱు; అప్పటినాగరికత వేఱు; ఇప్పటివలె మానవుడు నీటిని, నిప్పును స్వాధీనపఱుచుకొని యుండలేదు. ఇప్పటి వలె మెఱుపు శక్తి మానవునికి దాసి కాలేదు. ఇప్పటివలె వాయుమండలము మానవునికి విహారభూమి కాలేదు. యంత్రయుగము యొక్క నూతనలైన మానవహృదయమునకు గోచరము కాని పూర్వకాలమది.

ఆకాలమున వింధ్యపర్వతములకు దక్షిణముననున్న దక్షిణాపథనివాసులు ఓడలను గట్టి తెరచాపల నెత్తి వాయుప్రచారము నాధారముగ జేసికొని చుక్కాని నమ్ముకొని సూర్యచంద్రాదులను నక్షత్రములను తమకు మార్గదర్శకములను సాధనములుగ జేసికొని వివిధములైన హిందూదేశపు పంటదినుసులతో ఓడలను నింపి దారులు లేని భయంకరములైన మహాసముద్రములమీద తెడ్లతో నోడలను గడపుచు ప్రియమిత్రులను, ప్రియబంధువులను, మాతృదేశమును ఎడబాసి దూరభారములను లెక్కసేయక శీతవాతాతపక్లేశములనుసరకుగొనక దేశముకానిదేశమునకు ద్వీపముకానిద్వీపమునకు బోయి మహాసాహసికులై వ్యాపారము నడపినదినములవి. దక్షిణహిందూదేశమునకు మూడువైపుల సముద్రముండుటచేత దక్షిణాపథవాసులు సాహసికులైన సుప్రసిద్ధనావికులుగ తయారగుట కవకాశము కలిగెను.

ఇది మూడువేలసంవత్సరములకు పైమాట. అప్పటికే మనహిందూదేశీయులు బట్టల నేతలో నేర్పుగడించి యుండిరి. ప్రత్తిచెట్లనుండి ప్రత్తితీసి యేకి నూలువడికి బట్టలు నేసి హిందూదేశీయులు నేతబట్టలతో పెద్దవ్యాపారము నడుపుచుండినదినములవి. అప్పటికే హిందూదేశమునకు చీనాదేశమునుండి పట్టుబట్టలు దిగుమతియగుచుండినను హిందూదేశీయులు కూడ పట్టుపురుగులను పెంచి పట్టుదారముతో మేలైన పట్టుసెల్లాలు తయారుచేయుచుండిరి. పారసీక సింధుశాఖ, యూఫ్రటీస్ ఆక్ససునదులు, కాస్పియనుసముద్రప్రాంతము, మధ్యధరాసముద్రము — ఈమొదలగు ప్రదేశములు హిందూదేశవర్తకలక్ష్మికి విహారమార్గములయ్యెను. ఫొయనీషియనులు, బాబిలోనియనులు, చాల్డియనులు, అస్సీరియనులు * ఈమొదలగు పశ్చిమదేశవాసులు హిందూదేశమునుండి బావుటాలెత్తికొని తరంగపంక్తులను జీల్చుకొని వచ్చు ఓడలవైపు ఆసక్తి మీదుమ ఆత్రముతో వేచియుండువారు. నెమళ్లు, బియ్యము, చేవ మొదలగుసరకులు — ఇట్టివి దక్షిణహిందూదేశమునుండి, పశ్చిమదేశములకు ఎగుమతియగుచుండెడివి. ఈకారణముననే దక్షిణాపథమునుండి విదేశములకెగుమతియైనవాటిలో కొన్నిటిపేళ్లు తద్భవ

* ఫొయనీషియా, బాబిలోనియా, చాల్డియా, అస్సీరియా అనునవి పెరిషియా మధ్యధరాసముద్రములకు నడుమనున్న దేశములు. ఇవి పూర్వము ఉచ్చదశలోనుండి కొంతకాలము మహావైభవము ననుభవించినవి. ఆయా దేశీయులే ఫొయనీషియనులు, బాబిలోనియనులు, చాల్డియనులు, అస్సీరియనులును.

రూపములేమాత్రమార్పుతో విదేశభాషలందును గాన్పించుచున్నవి.* బియ్యమను అర్థముగల అరిసియను ద్రవిడ పదము గ్రీకుభాషలో 'ఒరుజ'గను, లాటిన్ భాషలో 'ఒరిజ'గను, స్పెయిన్ దేశభాషలో 'అర్రాస్' గను, కన్పట్టుచున్నది. ఇట్లే మరికొన్ని పదములునుగలవు. ఏయితరాధారములును లేని అంతటి ప్రాచీనకాలమున ప్రాక్పశ్చిమదేశములకు వర్తకవ్యాపారసంబంధ ముండెనని దేశ, విదేశ భాషలందలి యిట్టి సమానపదములే రూఢిపఱుచుచున్నవి. అదియటుండ చాల్డియాకు రాజధానిగనుండిన ప్రాచీనమహానగరము 'ఉర్' అనునది ౧౮౫౪ లో త్రవ్వుచుండ నందు పూడిపోయిన భవనములలో టేకు దూలములు కనిపించినవి. చాల్డియాకు ఈటేకు మలబారు తీరమునుండి హిందూదేశపు ఓడలలో అచ్చటికి వచ్చి యుండునని విజ్ఞులు నిర్ణయించియున్నారు.

దక్షిణహిందూదేశ మాలిఖమున సముద్రముమీద వర్తకవ్యాపారము నడుపుచుండ ఉత్తరహిందూదేశము పశ్చిమదేశములతో నాటునవ్యాపారము జరుపుచుండెను. ఉత్తరహిందూదేశీయులు దక్షిణాపథ వాసులవలెగాక గుఱ్ఱములమీదను, ఒంటెలమీదను సరకులవేసికొని పశ్చిమహిందూదేశమునకు పెట్టనికోటగోడలవలెనున్న పర్వతపంక్తులలో సింహద్వారములవలెనున్న కనుమలగుండ ఆర్యభూమిని దాటి ఆఫ్ఘనిస్థానము, పారసీకము మున్నగు పడమటిదేశములకు చెట్లనీడయు, పర్ణపాతము నెఱుగని ఎడారిమార్గములగుండ పోయి పశ్చిమదేశములందలి గొప్పవర్తకనగరములను జేరుచుండువారు. ఉత్తరహిందూదేశమునుండి ఎగుమతియగుసరకులలో బట్టలు ప్రధానస్థాన మాక్రమించుచుండెను.

అత్యంత ప్రాచీనకాలమునందలి ప్రాక్పశ్చిమ వర్తకవ్యాపారమునకు దృష్టాంతమిచ్చు తరువాతి యాధారములు యూదులచరిత్రములు. ఆచరిత్రల ననుసరించి యూదులప్రభువగు సొలోమనుకూడ ఈప్రాగ్దేశవర్తకమునకు ప్రోత్సాహమొసంగి తనప్రజలుకూడ ఈవర్తకవ్యాపారమున బాల్గొని లాభముగడించుట కనువగునట్టి సౌకర్యములు చేసెనని తెలియవచ్చుచున్నది. అతడు సరకులవేసికొనివచ్చు సార్థవాహులకు విశ్రాంతిస్థలములుగ నుండుటకై టాడ్మోర్ (పామీరా), బాల్బెక్ (హెలియోపోలిస్) హామత్ (ఎపిఫేనియా) అనుపట్టణములను గట్టించెననియు, అందువలననే మెసపొటేమియాయందలి ప్రాముఖ్యవర్తకస్థానములైన బేబిలోన్, టెసిఫాన్, సెలెన్షియా, అసిస్పట్టణములు ఈప్రాగ్దేశవర్తకమువలన అమితలాభమునుబొంది చాలకాలము వర్ధిల్లెననియు దెలియుచున్నది.

అప్పటికే హిందూదేశవర్తకమును నడపువారిలో ఫొయనీషియనులు ముఖ్యులుగనుండిరి. వీరు అరాబియాలోను పారసీకసింధుశాఖమీదను వలసలేర్పఱుచుకొని ఆశాపరిపూరితములైన క్షేత్రములతో హిందూదేశపు వర్తకనౌకల కెదురుచూచుచుండువారు. సన్ననిమల్లు సెల్లాలు, సుగంధద్రవ్యములు, మంచిముత్యములు, పట్టుబట్టలు, రత్నములు మొదలగునవి వీరికి హిందూదేశమునుండి వచ్చు వర్తకపుసరకులుగ నుండెను. ఇవిగాక ప్రకృతికి భాగ్యములపంటయైన యీదేశమునుండి బంగారము, వెండి, దంతము, మంచిగంధపుచెక్కలు, టేకు, నల్లచేవ (Ebony) మొదలగునవి, క్రోతులు, నెమళ్లు బియ్యము మొదలగునవియుకూడ నెగుమతియగుచుండెడివి. ఇవియన్నియు ఫొయనీషియనుల ప్రధానవర్తకస్థానమగు టైరుపట్టణమునకు జేరుచుండెను.

అస్సీరియనులు, బాబిలోనియనులు నడపు నీవర్తకవ్యాపారమువాలమున హిందూదేశైశ్వర్య గాథలు పారసీకనులచెవి సోకినవి. క్రీస్తుపుట్టుటకు పూర్వము ౫౨౧–౪౮౫ వఱకు పారసీకసామ్రాజ్యమును పరిపాలించిన డెరయస్‌రాజు సైన్యములనుగూర్చుకొని హిందూదేశైశ్వర్యమును హరియించుటకై పాంచాలముపై దాడివెడలివచ్చెను. చరిత్రయెఱిగినంతవఱకు విజయాభిలాషతో పరరాజఖడ్గము ఆర్యభూమిని తళతళలాడుట కదియే మొదటిమారు. ఈదండయాత్ర వివరములేవియు మనకుదొరయరావు. కాని డెరయస్ జయించినట్లు మాత్రము పారసీకదేశచరిత్రలు వక్కాణించుచున్నవి. జయించినప్రదేశమేదియో వివరముగ దెలియరాదు కాని యిప్పటి సింధుదేశమును, సింధునదికి తూర్పుననున్న పంజాబులోని కొంతభాగమును డెరయస్ విజయములలో

* J. M. S. Vol XII, P. 13.

చేరియుండునని చరిత్రకారులు నిర్ణయించుచున్నారు. ఈజయించినదేశమునుండి డేరయస్ రాజు పదిలక్షల పౌనులవెలగల బంగారమును కప్పముగ గైకొనుచుండు వాడట. ఆరాజుయొక్క ఆసియాఖండరాష్ట్రములు చెల్లించుమొత్తపుకప్పములో నిదిమూడవవంతు ఉండె నట.*

డేరయస్ దండయాత్రమొదలుకొని పెరిషియా, హిందూదేశములకు రాకపోకలును, వర్తకవ్యాపారమును అభివృద్ధియయ్యెను. డేరయస్ యొక్క వర్తకపునావలకు మహాసముద్రముకూడ పాయయొసగెను. నాడుమొదలు కొని ప్రాగ్దేశవర్తకము చాలలాభకరమైనదనియు, హిందూదేశము పాడి పంటలతోడను, సిరి సంపదలతోడను తులతూగు లక్ష్మీనివాసమనియు దేశదేశముల మ్రోగి పోయెను. ఈవఱకే ఫొయనీషియనులవలనను బాబిలోనియనులవలనను, అస్సీరియనులవలనను హిందూదేశసౌభాగ్యమును గురించినగాథలు కట్టుకథలై ప్రాకిపోయి గ్రీసుమొదలగు దేశములు చేరుచుండెను. అందులకు తార్కాణముగ అమూల్యములగు హిందూదేశపుసరకులు కూడ గ్రీషియనుపట్టణములను జేరుచుండెను. దీనికి తోడు డేరయస్ యొక్క హిందూదేశవిజయగాథలు గ్రీషియనుల పాటుచెవులకు వినబడెను. గ్రీసుదేశీయు లప్పటికే హిందూదేశముతో వర్తకము నడపి, అత్యంత లాభమును గడించుచుండిన అస్సీరియనులను, ఫొయనీషియనులను, బాబిలోనియనులను జూచి అసూయపడుచు, హిందూదేశముతో స్వయముగ దాము వర్తకమునడపుట కత్యంతము కుతూహలపడుచుండిరి. కాని అదివఱకే ఇతరుల స్వాధీనములోనున్న వర్తకమార్గములు తక్క వారికి స్వతంత్రముగ వర్తకము సాగించుటకు మార్గాంతరము లెవ్వియు గానరావయ్యెను. అదివఱకున్న మార్గములను పెరిషియనులు, ఫొయనీషియనులు, బాబిలోనియనులు ఆక్రమించుకొనియుండిరి. ప్రాగ్దేశవర్తకవ్యాపారమును దలంచుకొన్నకొలది వారికన్నులు గిఱ్ఱున తిరుగుచుండెను. భారవర్షైశ్వర్యగాథలు చెవినిపడినకొలది వారి కాత్రె మెక్కుడగుచుండెను. గ్రీషియనువర్తకులు ప్రాగ్దేశపుసరకులు కొనుటకై టైరుమొదలగు పట్టణములకు వెళ్లుచుండినను అచ్చటివర్తకు లెక్కువలాభమును జూచుకొని హిందూదేశపుసరకులు ఎక్కువవెలకు దమకంట గట్టుచుండుటచేత ఈవిధమైన వ్యాపారము వారికి రుచియింపనయ్యెను. అందువలన మహోత్కటమైన అభిలాషతోను, అత్యంతాతురముతోను గ్రీషియనులు తమకు హిందూదేశవర్తకమును స్వాధీనపఱిచి యియ్యగల మహానీయునికొఱకు ఎదురుచూచు చుండిరి. దైవము వారియావేదనను, ఆత్రమును పరికించెను. కాలము వారిమొఱ్ఱల నాలకించెను. అసమానపరాక్రమశాలియు, మహామేధావియు, ఉదారహృదయుడు నయిన అలెగ్జాండరు గ్రీషియనులకు ప్రభువయ్యెను. ప్రాచీనచారిత్రపాఠకులకు అలెగ్జాండరు సుపరిచితుడు. తండ్రిగారు పరదేశములను జయించెనని వార్తలు రాగా తానుజయించుట కింక దేశములుండవు గాబోలునని ఖేదముచెందిన ధీమంతు డితడు. పరదేశవిజయాభిలాష ఆతనికి తీరని దాహమయ్యెను. ఆతనివిక్రమఖడ్గమునకు ప్రాగ్దేశము లొక్కటొక్కటిగ తలలువంచెను. ఆతనివిజయసైన్యములు పరదేశములందు గ్రీషియనులకు రాచబాటలువైచెను. అలెగ్జాండరు ముట్టడించియు స్వాధీనపఱుచుకొని దుర్గము లేదు. కత్తిపట్టియు జయింపని యుద్ధము లేదు. తుదకాతడు తనదుర్జయసైన్యముతో బాంచాలమున నడుగుపెట్టెను. యవనసైంధవములు సింధునదిలో దప్పికతీర్చుకొనెను. మానసీయుడును, అభిమానధనుడును, మహాదేశాభిమానియునైన పురుషోత్తముడు అలెగ్జాండ రనబరగిన యవనప్రభునకు ఉజ్జీయై నిలిచెను. ధర్మయుద్ధమున ఆర్యపుత్రులను యవనవీరులు లేరిమాడ జాలకపోయిరి. భారతరాజ్యలక్ష్మికి దుర్దశ సంప్రాప్తించిన దినము అది. యవనులకు భారతీయులకు జరిగిన ఆయుద్ధమున విజయలక్ష్మి యుక్తిపరుడైన అలెగ్జాండరును వరించుట ఆశ్చర్యముకాదు. నాటినుండి హిందూదేశవర్తకమునకు గ్రీసుదేశమునుండి పంజాబుదేశమువఱకు నాటునను, సముద్రముమీదను పెద్దరాజమార్గముపడెను. గ్రీషియనుల భాగ్యరేఖ బయలుపడెను. ప్రాగ్దేశముతో వర్తకమునడపువారిలో గ్రీషియనులు ప్రధానస్థానము నాక్రమించిరి. కాలచక్రము గిఱ్ఱున తిరిగిపోయెను. అది

* V. A. Smith's Early History of India, P 34.

వలను ఉచ్చదశలోనున్న జాతులు పైకివచ్చినవి. వ్యక్తి యెట్టిదో జాతియునట్టిదేకదా! హిందూదేశమునకు వచ్చువారిలో అలెగ్జాండరు ఫొయనీషియనులకు ముఖ్యవర్తకస్థలముగనుండిన టైరుపట్టణమును జయించిన నాటినుండియు ఫొయనీషియనువర్తకము పడిపోయెను. వారిప్రాభవము యావనశోభవలె జారిపోయెను.

అలెగ్జాండరుపూర్వదేశ దండయాత్రనాటినుండి హిందూదేశవిషయములు గ్రీసుదేశమున కింకనుపశ్చిమముననుండిన రోమునగరవాసులకు బాగుగ దెలియవచ్చెను. రోమకులు (రోమునగరవాసులు) తలలెత్తి హిందూదేశముతో వర్తకముచేయు గ్రీషియనువర్తకులవైపు చూచి తలపంకించుచుండిరి. గ్రీషియనువర్తకమును కబళించివైచుటకై సమయము వెదకుచుండిరి. కాని అలెగ్జాండరు యుద్ధతంత్రమున నెంతప్రవీణుడో రాజ్యతంత్రమున నంతనేర్పరి. అతడు తానుజయించిన దేశములన్నిటికి క్షాత్రపులను పేరట స్వదేశీయులనే సామంతులుగ నియమించి, వారినుండి కప్పముగైకొనుచు పరిపాలనావిధానమును కట్టుదిట్టముచేసెను. ఈవిధమున ఆతనిపరిపాలనము ఉక్కుచట్రమువలె బిగిసియుండుటచేత ఆతడు జీవించియున్నంతకాలము రోమకులకుగాని మరెవ్వరికిగాని ఆతడేర్పఱచినవిధానమును బ్రద్దలుకొట్టుటకుగాని, వర్తకవ్యాపారమును గ్రీషియనుహస్తములనుండి మరలించుటకు గాని సాధ్యముకాకపోయెను. హిందూదేశముతో నిరంతరాయముగ వర్తకముసాగుటకై సౌకర్యములను జేయ నెంచినవారిలో నీతడు ప్రథమగణ్యుడని చెప్పవచ్చును. ఈతడీయుద్దేశముతోనే మధ్యధరాసముద్రపు దక్షిణతీరమున నైలునదీముఖద్వారమున ఒక రేవుపట్టణమును గట్టించి దానికి తనపేరుపెట్టెను. ఇప్పటికి నది అతని పేరనే అలెగ్జాండ్రియా అనబరగుచున్నది. ఇంకను ఈవర్తకవ్యాపారాభివృద్ధికై ఆతడు చేయనెంచిన యితరములను ఏర్పాటులును, పరిపాలనాసంబంధమైన మార్పులను కార్యరూపమును దాల్పకపూర్వమే ఆతడు పరలోకగతుడయ్యెను. కాని ఆతనిసంకల్పములు రూపము దాల్పకపోయినను గ్రీసుమొదలగు పశ్చిమదేశములకు హిందూదేశమునకు రాకపోకలును వర్తకవ్యాపారమును హెచ్చెను. దేశమును జూడవలయునను తలంపుతో లేక వర్తకముచేయవలెనను అపేక్షతోనో గ్రీషియనులు హిందూదేశమునకు తరుచురాకపోకలు జరుప మొదలిడిరి. ఈగ్రీషియనులనే మనపూర్వులు యవనులని పేర్కొనుచువచ్చిరి. ఈయవనయాత్రికుల మూలముననే రోముమొదలగు నింకనుపడమటిదేశములకు హిందూదేశమునుగురించి బాగుగ దెలిసికొనుట కవకాశము కలిగెను. హెరొడొటస్, టెసియస్, మెగాస్థనీస్, ఏరియన్ మొదలగు యవనదేశీయులు అలెగ్జాండరు దండయాత్రను గురించియు హిందూదేశమునుగురించియు సవిస్తరముగ వ్రాసియున్నారు. మనప్రాచీనచరిత్ర తెలిసికొనుటకు ఈయవనులు వ్రాసిన గ్రంథములు మనకు జాలవఱకు సహకరించుచున్నవి. వీరందఱిలో హెరొడొటస్ అనునతడు హిందూదేశమును గురించి వ్రాసినవారిలో ప్రప్రథముడు. ఆతడు హిందూదేశమున అపరిమితమైన బంగారముకలదని వ్రాసినవాడు. హిందూదేశమునుగురించి విదేశీయులు వ్రాసిన వృత్తాంతములలో నీయవనులవే మొట్టమొదటివి. అంతవఱకు ఫొయనీషియనులు, బాబిలోనియనులు, అస్సీరియనులు మొదలగువారు హిందూదేశముతో చరిత్రకు దెలియరాని ప్రాచీనకాలముననే వర్తకవ్యాపారమును జరుపుచుండినను వారిలో వర్తకులుగాని యాత్రికులుగాని హిందూదేశమునుగురించిన వృత్తాంతములు వ్రాసినట్లు మన కింతవఱకు దెలియదు. ఒకవేళ వ్రాసియుండవచ్చునని అనుకొన్నను అట్టిగ్రంథము లింతవఱకు మనకు దొరకలేదు. అందువలననే యవనులకు పూర్వము సాగుచుండిన వర్తకమునుగురించి తెలిసికొనుటకు మనకు వీలులేకపోవుచున్నది. పశ్చిమదేశములకు మనదేశమునుగురించి తెలుపుటకేకాక ఆనాటి మనదేశమును గురించి మనకు దెలుపుటకును ఆయవనవృత్తాంతములే యిపుడు ముఖ్యాధారములుగనున్నవి.

అలెగ్జాండరు నైలునదీముఖద్వారమున అలెగ్జాండ్రియాపట్టణమును కట్టించిన తరువాత మఱల నింకొకమాఱు ఈజిప్టుదేశీయులు హిందూదేశ వర్తకవ్యాపార నాటకరంగమున కవతరించి ప్రధానపాత్రము చక్కగ ప్రయోగించిరికాని ఈజిప్టుదేశపు టాలెమీలకాలమునగాని వారి చాకచక్యము పూర్తిగ గనబడలేదు. యవనులకు హిందూదేశీయులకు జరిగిన వర్తకవ్యాపారము అనేకవిధముల

ప్రాముఖ్యమైనది. యవనబాలికలుకూడ హిందూదేశపశ్చిమతీరమునందలి బేరిగాజ్ అనబడు భరుకచ్ఛము రేవునకు ఓడలలో వచ్చుచుండువారు.* దక్షిణాపథపు ద్రవిడరాజ్యాధిపతులకు యవనులు కవచధారులై అంగరక్షకులుగ నుండువారు.† భారతీయప్రభువుల కొలువుకూటములలో యవనస్త్రీలాసీనలై యుండినట్లు ప్రాచీనములైన హిందూనాటకములు తెలుపుచున్నవి.§ యవనభారతీయ నాగరికతావాహినులు సమ్మేళనము నొందిన కాలమదియే. ఈసమ్మేళనమున అటు యవననాగరికతయు, ఇటు భారతీయనాగరికతయుకూడ అనేకవిషయముల మార్పు చెంది నూతనశోభతో దనర్చెను.

హిందూదేశమున కనాదికాలమునుండియు నైసర్గికదుర్గప్రాకారములవలెనుండిన పశ్చిమపర్వతములలోని కనుమలు తెరచిన సింహద్వారములై హిందూదేశమును జయింపవలెనని, హిందూదేశైశ్వర్యమునపహరింపవలెనని వచ్చువిదేశీయులకు దారియొసంగినవి. మొదట పెరిషియనులు, పిదపయవనులు నాదారినే వచ్చి హిందూదేశ పశ్చిమభాగమునుజయించి, హిందూదేశధనప్రవాహము నాటుమార్గమున పడమటికి కొనుటకు కాలువలు చేసిరి. నాటినుండి యితరవిదేశీయుల కాతోవ నిష్కంటకమై ప్రాతదై తమకు రాజమార్గమయ్యెను. కాలక్రమమున అలెగ్జాండరు తరువాత యవనరాజ్యములను పాలించుచుండిన క్షాత్రపులు బలహీనులుకాగా కుషానులనబడు యక్షులు క్షాత్రపులనోడించి వారిదేశమునుస్వాధీనపఱచుకొని తమకు హిందూదేశమునగూడ దమశాఖలు నిలిపిరి. మధ్యధరాసముద్రతీరముల ఈజిప్టులో 'టాలెమీలు' అను పేరంబరగిన ప్రభువులు బలవంతులయి అచ్చటి గ్రీషియను నాయకుల నోడించి దమస్వతంత్ర సామ్రాజ్యమును స్థాపించిరి. ఈకారణమున ప్రాగ్దేశ వర్తకవ్యాపారము గ్రీషియనులచేతినుండి జారిపోయెను. గ్రీషియనులు తమకుపూర్వము వర్తకము జరుపుచుండిన పెరిషియనులవలెనే తాము గొంతకాలము ఈవ్యాపారమున గొంతకథ నిర్విపించి కాలక్రమమున వెనుకబడి పోయిరి. మొట్టమొదట అజ్ఞాతవాసమునుండి పరిస్థితులు అనుకూలించినంతనే పైకివచ్చి ఒక్కవెలుగు వెలిగి, తుదకధఃపతితమై మటుమాయమైన యట్టిజాతుల ప్రాచీనచారిత్రములు కాలస్వభావమును మానవలోకమునకు వర్ణించిచెప్పు గుణపాఠములు కదా!

ప్రాగ్దేశవర్తక వ్యాపారము టాలెమీల హస్తగతమైన నాటినుండియు నది వెనుకటికంటె బాగుగ వర్ధిల్లుటకు తగిన సౌకర్యము లేర్పడియెను. క్రొత్తరేవు పట్టణములు వెలసెను. దక్షిణహిందూదేశపు రేవులనుండి సరకులు పారసీకసింధుశాఖకును, అచ్చటినుండి అరాబియాతీరముననే ఏడెనుపట్టణమునకును, అంతటినుండి ఎఱ్ఱసముద్రముగుండబోయి సూయజామీదుగ ఈజిప్టుదేశమునందలి ప్రసిద్ధనగరములకును బోవుచువచ్చెను. ఈవిధమైనవ్యాపారము నడచుటలో ఈజిప్టుదేశీయులకు హిందూదేశీయులకు నడుమ అరబ్బులు దళారులుగ నుండిరి. అటు పశ్చిమమున టాలెమీలయొక్కయు తూర్పుననిటు యక్షులయొక్కయు ప్రయత్నములవలనను హిందూదేశవర్తకము చాలయభివృద్ధిగాంచెను. ఉత్తరహిందూదేశమునుండి విదేశీయులు హిందూదేశైశ్వర్యమును నాటునవిదేశములకుగొనిపోవుచుండ దక్షిణాపథవాసులు దానినిసముద్రములమీదుగ నోడలలో నెక్కించి మఱల స్వదేశమునకు గొనివచ్చుచుండిరి. ఎప్పుడును విదేశీయులు కూడ హిందూదేశముననే స్థిరనివాసమేర్పఱుచుకొని హిందువులలో హిందువులై, దేశీయులలో దేశీయులై యిచ్చటికళలను ఇచ్చటి పరిశ్రమలను ఆదరించుట మొదలిడిరో నాటినుండి ఈదేశమునందలి ధనమిచ్చట నిలిచిపోవుటయేకాక విదేశములందలి ధనముకూడ వర్తకవ్యాపారమువలనను నిచ్చటికేవచ్చి యిచ్చటనే యిల్లుకట్టుకొని కాపురముసేయ మొదలిడెను. కాలక్రమమున నీయక్షులే హిందూదేశముతో వర్తకముచేయుటకు రోమకసామ్రాజ్యమునకు ద్వారము తెరచిరి.

---

* The Periplus of the Erythraean Sea, para 49.

† Smith's Early History of India P. 400.

§ Rawlinson P. 47.

కొన్ని కాకతీయ శాసనములు

మానవల్లి రామకృష్ణకవిగారు, యం. ఏ.

౧

నేను కొంతకాలము వనపర్తిసంస్థానములో నుంటిని. అప్పుడు నైజామునగవర్న మెంటువారికొఱకుఁ గొన్నిస్థలముల సంచరించి నాలుగు నూఱుల శాసనములవఱకును మసితోఁ గాగితములపై నచ్చుతీయించి (Ink impressions) వానిలోఁ గొన్నిటిని జదివియుఁ గొన్నిటిఁ జదువకయు నట్టెయుంచి కార్యాంతర ప్రసక్తుఁడనై యుండుటచే వానిలోఁ గొన్ని క్షీణించుచుండుటం జేసి కొన్నిటిపైనఁ బ్రచురింత మనుతలంపుతో నీక్రిందిశాసనముల నాంధ్రలోకమున కొసఁగుచున్నాఁడను. ప్రయత్నము చేయువారలకే దోషములు కలుగుచున్నందున వీనిలో నానావిధదోషములు సంక్రమింపవచ్చు ననుటాశ్చర్యము కాదు. ఏతత్పరిశ్రమవేదులు మాస్ఖాలిత్యముల కలుగకుందురుగాక!

ఈక్రిందిశాసనము కాకతీయ శిలాశాసనములలో నతిప్రాచీనమైనది. ఇంతవఱకుఁ బ్రకటితము కాదు. అనుమకొండలో నూరికుత్తరభాగమున వెలిపొలములోఁ బెద్దగుండునకుఁ గొట్టఁబడిన యీశాసనము తత్సమీపమున నుండి యిప్పుడు నశించినయొకానొక శివాలయంబునకు సంబంధించినదని తోఁచుచున్నది. దీనిలో 16 పంక్తులు గలవు. 1001 శాలివాహనశక వత్సరములకు సరియగు 1079 క్రీ. శకములో-సిద్ధార్థి సంవత్సరమున సూర్యగ్రహణకాలమున కాకతీయబేతరాజు (తనతండ్రి పేర నిర్మింపఁబడిన?) బేతేశ్వరంబునఁ బ్రోలేశ్వరదేవునకు దీపనైవేద్యములకు భూమిదానము చేసినట్లు దీనిలోఁ జెప్పఁబడియె. దీనికి మూలమైన మసితోఁ దీసినకాగితమును గవర్నమెంటుశాసన పరిశోధకులకుఁ బంపియుంటిని.

(The oldest kakatiya Inscription of 1001. S. S. (1079 A. D)

1. శ్రీమా న్విక్రమచక్రి శ్రీ బద్ధమ
2. ణ్డలికోత్తమః । ప్రాదాత్ప్రోలేశ్వ రేశాయ
3. దీప మాచంద్ర తారకం॥ స్వ స్తిశకవర్షంబు
4. లు ౧౦౦౧ యగు సిద్ధా ర్థిసంవత్సర
5. సూర్యగ్ర గ్రహణంబున శ్రీమన్మహామ
6. ణ్డలేశ్వ బేతమయ్యలు బేతేశ్వరంబున......త
7. బ్రోలేశ్వరదేవునకు నందదీవియకు నిత్యం
8. పండ్రెండుమానికలు నేయి యాచం
9. ద్ర తారకంబుగఁ బోయునట్లు గాం దే -
10. ...సెప్పి..వి......ర......వ్వ - స్వరమయ్యద్ద......మ (?)
11. నీరినేల యంబదిమఱుతులు
12. మోడజాల సుజనయల్లునుగాను సర్వబాధా (?)

13. పరిహార్తము దణ్డుగువెలిగా నడపువారు
14. దేవర కాపై సుఖంబుణ్డు వాణ్డు ॥ స్వదత్తం ప
15. రదత్తంవా యో హరేత వసుంధరాం । షష్టివర్ష
16. సహస్రాణి విష్ఠాయాం జాయతే క్రిమిః

దీనిలో 10, 12, పంక్తుల నచ్చుకాగితములో మొదటఁ జదివినప్పుడు తోఁచకపోవుటచే దోఁచినట్లు వ్రాసికొనియుంటిని. వానినిమాత్రము మరల నచ్చుకాగితమునుగాని శాసనమునుగాని చూడఁదటస్థించినవారు సవరించుకొనవలయును.

ఇందు విక్రమచక్రి యనఁగాఁ బాశ్చాత్య చాళుక్యచక్రవర్తియగు త్రిభువనమల్లుఁడు. కాకతీయరాజులు మొదట వారికి మండలికసామంతులై యుండిరి.

౨

కాకతీయుల ప్రాచీనరాజధానియగు ననుమకొండలో సిద్ధేశ్వరమను నొకకొండపీఁదఁ బెద్దబండపై ననమ్రముగ నొకశాసనము కలదు. దానియెదుట నొకచిన్నతాతిమకము కలదు. ఆశాసనమునఁ గాకతీయులప్రాభవోన్నతులఁ గావ్యరూపముగ వర్ణించి శాశ్వతముగ శిలాలిఖితము చేసి కవిశేఖరులు కీర్తిధ్వజమెత్తఁ బ్రయత్నించిరి. కాని దైవోపహతులై 26 పంక్తులు చెక్కించి కొన్ని శ్లోకములుమాత్రమే లోకమున కిచ్చినట్లు వ్యక్తమగుచున్నది. దీనిలో నాంధ్రదేశసౌభాగ్య ప్రశంసయు నేకశిలానగరవర్ణన ప్రారంభమును గలవు. కొన్ని సంవత్సరములక్రిందట నే నతిశ్రమమునఁ జాలపాడువుననుండు నీశాసనమును గాకితములపై నచ్చుతీసి 19 పంక్తులవఱకును వ్రాసికొని యప్పటికి నిలిపివేసి చెన్నపురికి వచ్చుటచే నాయచ్చుకాగితములు వనపర్తిసంస్థానములోనే చిక్కిపోయినందునఁ బై భాగమున సరిగా వ్రాసికొనఁజాలకుండఁగాఁ బ్రాచ్యలిఖిత పుస్తకభండారమున మెకంజీదొరవారి పండితులలో నొకరీశాసనము నచ్చటనే చదివి దాని వ్రాసికొనినయాదర్శ మాభండారములోనే లోకల్ రికార్డులో నుండఁగాఁ జూచి వ్రాసికొంటిని. అతఁడు శిలనుజూచి చదివినందున బహుదోషములపాలయ్యె. ఈక్రిందఁ బ్రకటింపఁబడిన శాసనములో 18 పంక్తులవఱకును సామాన్యముగా దోషములు లేవని గ్రహింపవలయు.

ఇందులోనిసంఖ్య పంక్తిసంఖ్య. అక్షరములు రుద్రదేవగణపతిదేవుల కాలము నాఁటివి.

1. (శ్రీ)॥ ఆంధ్రా స్సంతి గరీయాంసః కాంచనప్రాయశాలయః । యథా హాటకశైలస్య కట
   కా రత్నశాలినః॥ కేదారా యత్ర
2. శాలీనాం తరంగితజలాంతరాః । కృష్ణాంగచ్ఛాయహారితా యథా జలనిధే స్త
   టాః । శాలికా రక్షిణీహ స్తతాళైః కంకణనాద
3. తః । త్రాసితాః కిల గచ్ఛంతి యద్గీత్యా సద్గిరాజితాః॥ రసాలసాలహింతా
   లతాలకేతకకర్తనే । కాంతారే యత్ర కాంతానాం జా
4. తః శృంగారసంగరః । రసాలహాలాగంధేన హసనాంగీకృతాదృశః । అరీ
   ణాం యత్ర హాహంతా లక్షయంతి నగేహినీః॥
5. సంతానకాంతారలతా గంధగ్రంథిలచేతసః । యత్రాలయాః కర్ణికార
   నిర్గంధేన నిరంతరాః॥ హాలిక స్త్రీకటాక్షాణాం కాంత్యా

6. గళితచేతనాః। న సీదంతి కృతిం యత్ర కేచి త్కృహాకనందనాః॥ గతాని
హాలికస్త్రీణాం లషయంతి నిజై గతైః। నేత్రాంతనేత్రై హా
స్యంతి హారిణ్యశ్చ య

7. దంతరే॥ కేదారసస్యకాంతీనాం సంక్రాంతానాం తతః పరః। చలేన
సీర నిచయా యదీయా జాయతే శుకాః॥ శంఖకంకణజాలస్య లల

8 నాకరసంగినః। కళేన యత్ర నాదేన కలహంసాః శతం జితాః॥ లక్ష్యంతే
యత్ర నిచితా లక్షశః శాలిరాశయః। గేహాంగణే యథా కాలే తట (...)

9. ంతిధరా ఘనాః॥ ఖళాః శాలీనతాం యాంతి యత్ర కంటకరక్షితాః। కటంకరీ
య నికటనిరాఘాటకటస్థలాః॥ కదళీకాననే యత్ర హరితచ్ఛ

10. ద్మహారిణి। కీరా నిరంతరం యాంతి నిజజాతీయశంకయా॥ హాలాహాలంత్యః
సతతం యత్రతోత్కృత్సాహకారతః। నిర్దిశంతి నిరాతంకం గతనాయ శిఖండి

11. నః॥ యత్ర కాంచనసంకాశా రసాలానాం రజఃకణాః। టంకఘృష్టస్య
తరణే యథా కేశాశ్చకాసతి। కర్షక స్త్రీకేశహస్తే హ స్తనాళీకసంయుతిః।
సహారా (......)

12. యత్ర ధత్తే శంకాతంకం శిఖండిని॥ నగరాణి గరీయాంసి నారీరమ్యాణి లక్ష
శః॥ స్థానీయానాం సహస్రాణి యత్ర త్యాన్యతిశేరతే। ననందనం చైత్రరథం న

13. చ యత్ర నిరీక్ష్యతే॥ కాంతారం నందనం కృత్యం కృత్వా చైత్రరథాహ్వయాః।
కరిణః కరిణీన త్రిం యత్ర సంశ్రితతారకాః॥ సకళత్రాః శంకయంతే గాత్ర

14. హీనా గజాననాః॥ నిచయై రాసతాసీలైః శతశః స్యందనా ఘనాః। సదంతః
కింకిణీజాలై యథా కాంతైస్తడిద్గణైః॥ తటాకా యత్ర శతశః సారి

15. ణ్యశ్చ సహస్రశః। సరిన్నాథాన్ దర్శయంతి తేషాంచ కిల గేహినీః॥ ఆదిత్య
ఘృష్టిసంకాశా దృశ్యంతే యత్ర దృష్టయః। క్షీరం దదత్యః కృత్యా

16. నాం త్రిజగత్యఘనాశకాః॥ ఏ కా స్త్యేకశిలాఖ్యాత్ర నగరీ యా
గరీయసీ। సాగరాంతాం ధరాం కృత్స్నాం కాంతా కాంతం నిరీక్ష్యతే॥ కళాగి
రః కృశాంగీణాం —

17. రశనాః కింకిణీఘనాః। యత్రాంగదాని చాంఘ్రీణాం నిద్రాహాన్యై కిల శ్రియః॥
చంద్రశాలాసంశ్రితానాం చంద్రాస్యానాం నిరంతరైః।

18. యత్రాస్య చంద్రె గ్గగనే చంద్రజ్ఞానం నశంక్యతే॥ యత్ర రథ్యాంగణగతా ఘనసారస్య రాశయః। దృశ్యంతే చంద్రికాసంఘా యథా......

19. ణః॥ ఇంద్రనీలై శ్చంద్రకాంతై స్తథా యత్ర నిరంతరైః। అంధకారా శ్చంద్రికా శ్చ దర్శయంతి కదా గృహాః॥ కాంతా ఈక్షంతి యత్కాంతాః కాంతానాం హృదయం దృశా। కాంతాయా ఘాతి యత్కాంతా కాంతానాం హృదయం దృశా। కళిందకన్యాలహరీ సంఘరింఖాణహారిణః। కటాక్షా యత్ర నారీణాం దృష్టయతి నరింజనాః (?)। హాలారయేణ తరళా యత్రారాళదృశాదృశః। బద్ధరేఖా దర్శయంతి రతినాథకరస్థితాః। అధరా యత్ర నారీణాం సకలా న్నధరీకృతాః। ఆఖ్యాంతి నళినశ్రేణీః కటాక్షాశ్చ కటక్షతాః (?)॥ తర్జయంతి యత్ర నార్య కరకంకణకింకణీః। అక్రీడదీర్ఘికాహంసీ గతితస్కరతాం గతాః। కణకారకీకిరణసంకీర్ణా న్నహారిదంకణమ్ (?)। అంకణాయంతి సంగీతం కలశాఘుః యదంగణాః॥ కర్ణకల్హారకణికా హేలాకేళి కరోహి నః। యత్రాళిన స్త్రాసయంతే కాంతాకటకఝంకృతైః॥ కటాక్ష కాంతికళయా హాసచంద్రైః కళంకితైః। నహాసయంతి నాదానాం రూస్తాయణనేక్షణాః కనినికా కళంకిన్యా కాంతిచంద్రికయా స్త్రియః ఉల్లోళయంతి యత్ర త్యా శ్చంద్రికాహారిణః ఖగాః॥ లలాటనార్ధ చంద్రేణ కృతన్నచంద్రై స్తదాననైః। యదంగనాః కళాస్త్రిం న జానంతి నిజాజితాః (?)। నాసాలంకార కాంతి... నక్షత్ర..................

ఈశాసనము చదివిచూడఁగాఁ గాకతీయులసామ్రాజ్యదర్పముఁ గావ్యరూపముచేసి కల్పాంతస్థాయిగా శిలోట్టంకితము గావింపవలయునని సిద్ధేశ్వరము కొండమీఁద మఠముకట్టుకొని నివసించిన యొకానొక శైవాచార్యుఁడు ప్రయత్నించినట్లు తోఁచుచున్నది. ఇట్లు శిలోట్టంకితములగు ప్రశస్త కావ్యనాటకములు పెక్కులు గలవు. ధారానగరమునఁ బ్రాకృతకావ్యము భోజరాజకీర్తిచంద్రికోల్లేఖమై రెండుశిలలపై లిఖింపంబడియున్నది. అచ్చటనే మదనమహాకవికృతమగు పారిజాతమంజరియను నాటిక యర్జునవర్మప్రతాపమును వర్ణించునది శిలాలిఖితముగలదు. చేదిదేశాధిపతంసమగు విగ్రహరాజు కీర్తిప్రతాపముల నెలకొల్పు హరికేళి యనునాటకము శిలోట్టంకితమై యున్నదిగదా!





వాయువిమానములు

కానూరి లక్ష్మణరావుగారు, (బి. ఇ. యమ్. ఇ. ఆనర్స్)

చాలా పురాతనకాలమునుంచి విమానా లున్నట్టు తెలుస్తుంది. వాటిలో ఎక్కిపోయి అంతరిక్ష మార్గాన్ని సంచారముచేయడమంటే అందరికి కుతూహల ముంటుంది. రావణాసురుడు, కుబేరుడు మొదలైన వాళ్లు విమానాలలో తిరిగినట్లు పురాణాలలో చదువుతాము. ఈమధ్యకాలంలో విమానాలసంగతి మరచిపోయినా నేటికాలానికవి మళ్లీ వెలసినవి. పాశ్చాత్యదేశస్థులు చాలా పరిశోధనచేసి వాటిని తయారుచేయడములో చాలాగట్టి వాళ్లయినారు.

గాలిఓడలు

విమానాలు రెండువిధాలు: అందులో ఒకరకము గాలికంటె బరువైనవి. మరొకరకము గాలికంటె తేలికైనవి. ఈరెండవరకము ఓడ (Airships) లని పిలుద్దాము. వీటితత్వమంతా సముద్రముమీద ప్రయాణం చేసే ఓడలవంటిదే. ఇనుము నీటికన్న బరువు. బరువైనా ఇనపకాగు నీటిమీద వదలితే మునగదు. ఇనపకాగు ఎంతస్థల మాక్రమించుకొంటుందో అంతస్థల మాక్రమించుకొనేనీరు ఇనపకాగుకంటె బరువెక్కువ తూగుతుంది. ఏవస్తువైనాసరే అది పరిసమానమైన నీళ్లకంటె తక్కువ తూగితే నీటిలో తేలుతుంది. అందువల్లనే సముద్రపుటోడకూడా ఇనుముతో చేసినా నీటిమీద తేలుతుంది. అట్లే గాలిలో ఎగరవలెనంటే ఓడలో ఉన్నమాయూలు గాలినితీసివేసి గాలికన్న తక్కువబరువుగల ఏయితరవాయువైనా నింపాలి. వేయిఘనపుటడుగులగాలి దానికి పరిసమానమైన ప్రమాణము గల ఉదజని (Hydrogen) వాయువుకన్న ౭౨ పౌనులు బరువెక్కువతూగుతుంది. కాబట్టి ఒకసంచిలో ఉదజనివాయువునింపి మూతికట్టి గాలిలో వదలితే చక్కగా పైకిపోతుంది. ఇట్లు పోవ



దూలపుటోడ

1. అడ్డరెక్క
2. నిలువురెక్క
3. చుక్కాని
4. ఉదజని సంచులు
5. దూలముల చట్రము
6. కాన్వాస్ గుడ్డ

క్రింద వ్రేలాడునవి బండ్లు

డమే కాకుండా ఆసంచి పరిమాణము ౨,౦౦౦ ఘనపుటడుగులైతే బలిష్ఠుడైన ఒకమనుష్యునికూడా పైకి తీసుకొనివెళ్లగలదు. ఈసంచికి యంత్రసహాయము లేదు కాబట్టి గాలి ఎటువీస్తే అటుపోతుంది. యంత్రాలు లేకపోయినా, మనుష్యులు నడపకపోయినా సముద్రముమీద ఓడగతీ అంతేకదా! ఈపైదానిని 'బెలూన్' అంటారు. దీనిని కొద్దిసంవత్సరములక్రితము మదరాసుపార్కులో ప్రదర్శించినారు. దీనిలో ఉదజనివాయువే ఉండనక్కరలేదు. వేడిగాలిఅయినా, పొగఅయినా ఉంచేచాలు. ఇటువంటి 'బెలూను' కు యంత్రములు తగిలించి మనయిష్టమువచ్చినట్లు నడిపించేదాని పేరే గాలిఓడ (Airship). నిర్మాణమునుబట్టి యీ గాలిఓడలు మూడువిధాలు (1) దూలపుటోడలు (Rigid), (2) సంచిఓడలు (Non-rigid), (3) ఉభయములు (Semi-rigid). మొదటిరకము ఓడకు మధ్యభాగమంతా గుండ్రముగా అల్యూమినము దూలాలతో కట్టుదురు. ఆదూలాలపై గుడ్డలు, తోళ్లు కప్పుదురు. లోపల బోలుగా ఉండే ప్రదేశములో ఉదజని సంచు లుంచుతారు. ఇవి సాధారణముగా ౧౯ ఉంటవి. మొత్తముమీద ఇన్ని సంచులలోనూ ౧౯ లక్షల ఘనపుటడుగులఉదజని ఉండును. ఓడ సుమారు ౭౦౦ల అడుగులపొడుగు, ౬౫ అడుగుల వడిమికొలతో కలిగిఉంటుంది. దీనిఆకారము చేపవలె ఉంటుంది. ముందుభాగము మొద్దుగాను, వెనకభాగము మొనతేలి ఉంటుంది. ఇట్లాఉంటె ఒక్కవిశేషము కలదు. చేప నీళ్లలో పోతూఉన్నప్పుడు నీటిప్రవాహాని కేమీ ఆటంకం లేకుండా నీరు కోసుకుపోతూఉంటుంది. అట్లే గాలికూడా ఏమీ గజిబిజికాకుండా ఉండాలంటే గాలిలోపోయే ఏఆకారమైనా చేపలాగ ఉండాలి. అందుకనే ఇప్పుడిప్పుడు మోటారుబళ్లు అన్నిటినీ చేపవలె తయారుచేయాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందువల్ల మోటారుబళ్లు నడిపించడములోకూడా కొంత సులువుంది. ఎట్లంటే మోటారుబండి మత్స్యాకృతిలో ఉంటె దానిగమనానికి గాలి ఎదురొడ్డకుండా బండే దానిని కోసుకుపోతూఉంటుంది. ఇందువల్ల బండినడపడాని కయ్యేఖర్చుకూడా తగ్గుతుంది. ఇందుకనే గాలిఓడనుకూడా మత్స్యాకారముగా చేయడము. గాలిఓడమలాగ్గా ౬౪ టన్నుల బరువు ఎత్తివేస్తుంది. ఓడలోనియంత్రాలకు ౧౦౦ మోటారుబళ్లశక్తి (1600 H. P.) ఉంటుంది. ఓడకువెనుకభాగమున రెక్కలు రెండు అడ్డముగాను, రెండు నిలువుగాను ఉంటవి. అడ్డముగా ఉన్నవాటిని క్రిందికి పైకి ఎగిరేటందుకున్నూ నిలువుగాఉన్నవాటిని చుక్కానివలె ప్రక్కలకు నడిపేటందుకున్నూ ఉపయోగిస్తారు. గుండ్రనిఆకారముగల ఓడమధ్యభాగములో ఉండేదూలమునుంచి క్రిందికి రెండుబళ్లు వ్రేలాడుతూ ఉంటవి. ఇవి రెంటికన్న ఎక్కువగాకూడ ఉండవచ్చును. వీటిలో ముందుదానిలో యంత్రాలు, ఓడనడిపేనావికులు ఉంటారు. రెండవదానిలో ప్రయాణీకులు ఉంటారు. ఈబళ్లు మనయిళ్లలోని పెద్దపడవలంత పెద్దవిగ ఉంటవి. ఓడ భూమిమీదికి దిగినప్పుడు దానిలో దెబ్బతగలకుండా ఉండేటందుకు బళ్ల అడుగుభాగమున గాలిసంచులు తగిలిస్తారు. ఈఓడనే 'జప్లిను'అంటారు. ఇదిగంటకు ౬౦ మైళ్లుచొప్పున పోతుంది. ఎకాఎకీని ౨,౦౦౦ మైళ్లప్రయాణము చేయడమునకు తగిన సామగ్రి దానిలో ఉంటుంది. ఈఓడలలో ఉపయోగించే సంచుల నిమిత్తము ఒక్కొక్క ఓడకు ౫,౦౦,౦౦౦ల పశువులతోళ్లు కావాలి!

దూలపుటోడను గురించి తెలుసుకొన్నట్టయితే మిగిలినవాటిని అర్థముచేసుకోవడము కష్టము కాదు. రెండవరకమైన సంచిఓడలో దూలపుటోడలోవలె దూలాలుండవు. సంచులు దిట్టముగా ఉంటవి. వాటినుండే మనుష్య లెక్కేబళ్లు వేళ్లాడగట్టుదురు. ఈరకము ఓడలలో ఉన్న గొప్పనష్టం ఏమిటంటే సంచులు తోళ్లతో చేయబడ్డప్పటికీ లోహమంతగట్టిగాఉండకపోబట్టి సంచి చిరిగిపోవచ్చు. దానితో బళ్లు నేలమీద పడిపోవలసినదే. కాని వీటినికట్టడము చాలాసులభము. అందువల్లనే బ్రిటీషువారు మొదలైనవారు వీటినే ఎక్కువగా తయారుచేస్తారు. జర్మనీవారికిమాత్రము జప్లినులు కట్టడములో ఆసక్తి ఎక్కువ.

సంచిఓడకు ఇంకొకకష్టము ఉంది. ఏవాయువునైనా సంచిలో ఉంచినట్టయితే కొన్నాళ్లకు చిల్లులు లేకపోయినా అది తగ్గుతుంది. సైకిలుబండిచక్రాలకు గాలికొట్టి వారమురోజు లైనతరువాత చూ ... లో గాలి తగ్గి



ఉదజని సంచి

నట్లు స్పష్టముగా కనబడుతుంది. దీనికికారణము ఏమిటంటే, ప్రతిపదార్థానికీ స్థూలదృష్టికి కనబడని రంధ్రాలున్నవనీ, ఆరంధ్రాలగుండా వాయువు పోతుందనీ ఒక సిద్ధాంతము. అందులో ఇతరపదార్థాలకంటె సంచికి రంధ్రా లెక్కువ. దీనికితోడు ఉదజని గాలికంటె తేలికైనదగుటచేత ఎక్కువత్వరితముగా పోతుంది. ఇందువలన సంచిఓడలలో ఉదజనిగాలి తగ్గినకొద్ది సంచికి పటుత్వము తగ్గి ముడతలుపడిపోతుంది. అందువల్లకూడా బళ్లకి అపాయం కలుగుతుంది. దూలపుటోడలలో అట్లు కాదు. సంచిలో గాలితగ్గినా, బళ్లు దూలాలనుంచి వ్రేలాడదీయడముచేత పడిపోవు. సంచిఓడలలో ఉదజని తగ్గినప్పుడల్లా మళ్లీ దానిని తయారుచేసేటందుకు అవసరమైన యంత్రాలు వాటిలోనే ఉంటవి.

ఈఓడలు చేయడమునకు, రెండుసంవత్సరాలైనా పట్టును. ఉదజని తయారుచేయడమునకు మధ్యదారిలో యంత్రశాల కట్టించవలెను. ఎంత నేర్పుతో ఓడలు కట్టినాఏదైనాఅపాయమువచ్చిందంటేఅంతా నాశనమే.

కొద్ది సంవత్సరాలక్రిందట అమెరికా వారు బ్రిటిషువారిని ఒకఓడ కట్టియివ్వవలసినదనిపురమాయించినారు. బ్రిటిషువారుకూడా చేతనైనంతవరకు కష్టపడి ఓడ కట్టినారు. బ్రిటిషువారు కట్టిన ఓడలలోనెల్లా అది చాలా పెద్దదని పేరు పడింది. అంతా తయారయిన తరువాత అది అమెరికాకు ప్రయాణ యింది. ఉదజనిగాలి నింపినారు. లంగరు తాళ్లు వదలిపెట్టినారు. ప్రయాణీకులు కిటకిటలాడుతు ఉండగా ఓడ మహావైభవముగా బయలుదేరింది. రివ్వన పక్షిలాగు ఎగిరిపోతోంది. అమెరికాదగ్గర కింకారాకపూర్వమే తటాలున క్రిందకూలింది. ప్రయాణీకులంతా మృత్యుగహ్వరమున పడ్డారు. ఏమీమిగలలేదు బూడిద దూలాలుతక్క. పడిపోవడమునకు కారణం ఏమిటీఅని ఆలోచించారు. కొందరు ఉదజనిగాలి నిప్పుముట్టుకొన్నదదన్నారు (ఉదజనిగాలికి నిప్పుముట్టించినట్లయితే అది వెలుగుతుంది). కొందరు బళ్లువ్రేలాడేదూలాలు విరిగినవన్నారు. ఎట్లయితేనేమి ఎంతోవ్యయప్రయాసలలో కట్టిన ఈఓడ (R38) మొట్టమొదటిప్రయాణములోనే మోసపుచ్చింది.

గాలి పడవలు

రెండవ తరగతి విమానము గాలిపడవ (Aeroplan$_e$). ఇది గాలికంటె బరువెక్కువ. పిల్లవాళ్లు గాలిపటము ఎగరవేస్తూఉంటే మనము చూస్తున్నాము. గాలి బాగా వీస్తున్నప్పుడు పిల్లవాడేమిచేస్తాడు? ఒకచోట నిలబడి దారమువిప్పి పటాన్ని ఎగరవేస్తాడు. గాలివేగముకొద్దీ పటముకూడా పైకెగురుతుంది.

మేఘమండలాని కంటుతుంది. అప్పుడు పిల్లల కెంతో ఆనందము. గాలి ఏమాత్రమూ చలనము లేకుండా ఉండ నుకొందాము. అప్పుడు చలనము కలిగించేటందుకు పిల్ల వాడు గాలిపటముతో పరుగెత్తును. అతనివేగము కొద్దీ పటముకూడా పైకెగురును. కాబట్టి గాలిపటము పైకెగ రవలెనంటే గాలిపటమైనా చలనావస్థలో ఉండాలి. లేక పోతే గాలిఅయినా రివ్వురివ్వుమని వీస్తూఉండాలి. ఇం దులో ఏదైనా ఒకటే. కాని గాలి ఎప్పుడువీస్తుందో ఎప్పుడు మానుతుందో ఎవ్వరికీ తెలియదు. చివరకు తేలిక చుక్కమార్గమైనా కనిపెట్టినాముకాని శాస్త్రజ్ఞుడు గాలి నిగురించి ఎక్కువలోతు తీయలేకపోయినాడు. గాలిప టానికీ గాలిపడవకూ ఒకటేసూత్రము. ఈపడవ గాలికంటె ఎంతబరువైనా పక్షిలాగు తేలికగా పైకెగిరిపోతుంది.

రెక్కలు చదునుగా బల్లపరుపుగా ఉండక ఒకప్రక్కకు కొంచెము వంగి ఉండును. పడవ వెనుకభాగమున చుక్కాని ఉండును. ఈరెక్కల సహాయముతో నావికుడు యంత్రాలు పడిపోకుండా గాలియొక్క చాప ల్యావస్థనుబట్టి పడవనడుపుతాడు. గాలి పడవనడపడము చాలకష్టము. నావికుడు తెలివైనవాడైతే గాలిఓడ మోస్తరుగ అపాయము లేకుండా ప్రయాణముచేయవ చ్చును. పడవ క్రిందికిదిగినప్పుడు నేలరాసుకోకుండా సు లభముగా జారిపోయేటందుకు క్రింద చక్రాలు ఉండును. ఈపడవలు ౩౨ అడుగులుపొడుగు, ౪౨ అడుగులువెడల్పు ౬ అడుగులుఎత్తు ఉండును. ౩ మొదలు ౪ టన్నులబరు వునకు ఇవి తీసుకుపోగలవు. గంటకు నూరుమొదలు రెండు వందలమైళ్లవరకు ప్రయాణముచేయగలవు. భూమిమీద



రెండు రెక్కల గాలిపడవ

గాలిపడవలో నిముఖ్యమైనభాగాలు పటముచూస్తే తెలుస్తుంది. మొదటిభాగములో యంత్రాలుండును. ఇవి మనము ప్రతిదినమూ చూచే మోటారుబండి యంత్రాలవంటివి. ఈయంత్రములతర్వాత ప్రయాణీకులు కూర్చుండేస్థలమూ, తరువాత పడవనడుపు నావికునిస్థలము ఉండును. ఈపడవముందరిభాగానికి, రెండురెక్కలుం డును. ఈరెక్కలు రెండు కలిసిపోకుండా కొయ్యకూ తలు (Supports) నిలబెట్టి వాటిని తీగతో బిగి స్తారు. ఈరెక్కలమూలమునే పడవ పైకెగురును. ఈ

నుంచి పైకిరెండుమూడుమైళ్లు పోతవి. వీటిని కట్టేటం దుకు కొద్దివారాలుపట్టును. మొత్తం అంతా ౪౦,౦౦౦ ల రూపాయలతో వీటిని కట్టవచ్చును.

ఈగాలిపడవలలో అనేకవిధములైనవి ఉన్నవి. ఒకరెక్కఉంటే ఒంటిరెక్కపడవ (Mono-plane) రెండురెక్కలుంటే రెండురెక్కలపడవ (Bi-plane) మూడుంటే మూడురెక్కల పడవ (Tri-plane) అని అంటారు. ఎంత ఎక్కువబరువు తీసుకువెళ్ల వలసివస్తే అన్నిరెక్కలు ఎక్కువకఉండాలి. సాధారణ

ఇదే నిజమైతే మనము బ్రదుకుతాము. క్రొత్తగా కనిపెట్టబడ్డ ఈచక్కని యంత్రము మానవకోటికి అరిష్టప్రదము కాకుండా ఉండడము దైవనిర్ణయమేమో! ఈవిమానాల ఉపయోగములలో ముఖ్యాంశ మేమిటంటే, ఇవి దూరప్రయాణాలకుగాని, దగ్గరప్రయాణాలకుగాని పనికి వస్తవా అని. జర్మనీదేశములో పదేళ్లక్రితమునుంచే మన మిప్పుడు మోటారుబళ్లు, జట్కాబళ్లు ఉపయోగించేటట్టు విమానాలను ఉపయోగిస్తున్నారు. వారికి వాటిని కట్టడములో నేర్పు ఎక్కువ. సులభముగా, చౌకలో, కొద్దిరోజులలో వాటిని పూర్తిచేయడమునుబట్టి వారికి ఆవ్యాపారములో ఎక్కువ అనుభవముకలదని తెలుస్తుంది. ఇంగ్లీషువారూ, మిత్రమండలివారిలో తదితరులూ తలక్రిందుగ తపస్సుచేసి వానిర్మాణములో వారితో తులతూగలేకుండా ఉన్నారు. అందువల్లనే ఈదేశాలలో విమానాలు ఎక్కువబాహాటముగా సాధారణప్రయాణానికి ఉపయోగించే బళ్లలో చేరకుండా ఉన్నవి. అయినప్పటికీ విమానము అంటే వింతగా ఉన్న మనదేశానికీ ఆదేశాలకూ పోలికే లేదు. ఒక ఆంగ్లేయశాస్త్రవేత్త వైమానికసభలో ఈవిధముగా చెప్పినాడు "మనము ఎంతకష్టపడ్డా ఓడను రెండేళ్లలో నిర్మించలేకుండా ఉన్నాము. ఖర్చుకూడా కోటిరూపాయలదాకా అవుతుంది. కాని జర్మనీవారు యుద్ధానంతరము అధోగతిపాలయినప్పటికీ వాటిని కొద్దివారాలలో సగముఖర్చుతో తయారుచేయగలుగుతున్నారు."

ఈఓడలనిర్మాణములో ఇట్టివ్యత్యాసము ఉండడమువల్ల మనదేశములో ఒకచోటనుంచి ఇంకొకచోటికి పోవడమున కెంతఖర్చుఅవుతుందో అంచనా వేద్దామంటే కొంచెము కష్టమవుతుంది. జర్మనీవారిప్రకారం లెక్కవేసుకొని జర్మనీనుండే విమానాలు కొన్నట్టయితే వాటిలో పోవడమునకు రైలులోకంటె ఎక్కువఖర్చుకాదు. అప్పుడు హిందూదేశవాతావరణమంతా విమానాలతో వర్షమురాకపూర్వము తూనీగలతో నిండినట్లు నిండిఉండేదే. కాని జర్మనీవారివ్యాపారము అంతనిలకడఅయినది కాదని చెప్పేదరు. అంతేకాకుండా వారిదగ్గర కొందామంటే ఇంకా మరికొన్ని చిక్కులున్నవి. కాబట్టి మనము ఇతర అయిరోపాదేశీయులదగ్గరే కొనితీరవలసి ఉండును. అట్లాకొంటే రాజమహేంద్రవరమునుంచి చెన్నపట్టణమునకు ప్రయాణీకునికి ఒక్కొకనికి ఎంతఛార్జి అవుతుందో ఈక్రింద తెలుపుతున్నాను.

రాజమహేంద్రవరము నుంచి చెన్నపట్టణానికి రమారమి ౩౦౦ లమైళ్లు. ప్రస్తుతము రీదస్థితిలో కోట్లు ఖర్చుపెట్టి ఓడలుకట్టలేము. కాబట్టి పదిమందికలిసి ఏ కేపరామిల్సుకంపెనీమోస్తరో విమానప్రయాణసంఘమని పేరుపెట్టి ఒకకంపెనీ లేవదీస్తా మనుకోండి. ప్రయాణీకు లిబ్బందిపడకుండా ౯ గాలిపడవలు కొంటాము. తొమ్మిది పడవల ఖరీదు రు ౩,౬౦,౦౦౦ లు (౯ × ౪౦,౦౦౦) ఇంకా నూటవల్కైవేలరూపాయలు ఏదైనా ప్రమాద



నిర్మాణములో ఉన్న ఓడ

ములు సంభవించినప్పుడు ఉపయోగించుటకు బ్యాంకులో వేస్తాము. అంతా మొత్తం అయిదు లక్షలరూపాయలు అయింది. దానిమీద నూటికి పదిరూపాయల వడ్డీ చొప్పున లెక్కకట్టితే మైలు ౧-కి అ ౬ లు తేలుతుంది. ఈపడవలుంచుటకు భవనాలనిమిత్తము ౨౫,౦౦౦ లు అవుతుంది. ఎందుకంటే, చెన్నపట్నములోను, రాజమహేంద్రవరములోను, మధ్య ఇంకా మరిమూడుస్థలాలలోను ఉంటే మొత్తము అయిదుభవనాలు. ఒక్కొక్క భవనానికి రు ౫,౦౦౦ లు అయితే పై మొత్తం కావలసి ఉంటుంది. ఇందువల్ల మైలు ౧-కి రమారమి అ ౨ లు అవుతుంది.

మూడుపడవలు నిలవలోనుంచి ఆరు తిప్పుతూ ఉంటే ఆరుగురు నావికులు కావాలి. మనకు విమానాల గొడవ తెలియకపోబట్టి ఒక్కొక్క నావికునికి నెల ౧-కి వేయిరూపాయ లిస్తే దీనిక్రింద మైలు ౧-కి నాలుగణాలు అవుతుంది.

ఇక నూనె ఖర్చు. ఇది నూరుమైళ్లకు ౮ గాలనుల చొప్పున మైలు ౧-కి అ ౪ ల నూనె అవుతుంది.

జీతగాళ్లకు, మరమ్మతు మైలు ౧-కి మూలకు, అసలురాబట్టటమునకు-ఈ రెండురూపాయ లవుతుంది.

మొత్తం అంతాకలిపి మైలు ౧-కి నాలుగు రూపాయలవుతుంది. మూడువందలమైళ్లకు పన్నెండువందలు. పడవలో పన్నెండుగురు జన మెక్కితే ఒక్కొక్కనికి రు ౧౦౦ లు ఛార్జి అవుతుంది. కాని ఇంతఛార్జి ఎవరు పెట్టుతారు? తేలికగా రు ౩౦ లు పెట్టినట్లయితే పంకాలక్రింద పరుపులమీద రైళ్లలో పొరలాడవచ్చును. కాని ఒక హంశము మనము మరచిపోయినాము. విమానము రాజమండ్రి చేరుటకు మూడుగంటలే పట్టుతుంది. రైలుమీద నయితే పదిహేనుగంటలైనా పట్టుతుంది. కాబట్టి కాలము కలిసిరావలెనంటేను, తొందరపనులుంటేను విమానాలే ఎక్కుతా రనుకొందాము. మనదేశముయొక్క ప్రస్తుత స్థితినిబట్టి ప్రతివ్యాపారమూ మందముగా ఉన్నప్పుడు వీటిని ఉపయోగించేవారు ఇంతఛార్జి ఎక్కువపెట్టేవారు తక్కువ. అందుచేత వీటివల్ల అంతలాభము ఉండదు. ఇంగ్లీషువారిలెఖ్ఖలనుబట్టి చూచినాముగనుక ఇంత ఎక్కువఛార్జి అవుతుంది. కాని ఇవన్నీ వెనుకటిమాటలు. ఇప్పుడిప్పుడు ఇంగ్లాండులోనే పడవలు చాలాచౌకగా కట్టుతున్నారనీ, రైలుచార్జికంటె రెండింతలకు మించదనీ అంచనాలు వేస్తున్నారు. ఈఅంచనాలప్రకారముచూస్తే రాజమహేంద్రవరమునకప్పుడు రు ౬౦ లు అవుతుంది. అప్పుడు కాలమువిలువ తెలిసినవారు, గొప్పవర్తకవ్యాపారముచేసేకోటీశ్వరులు, లక్షాధికారులు విమానప్రయా



ఓడ మధ్యభాగములోని అల్యూమినము దూలముల చట్రము—అడ్డముగా ఉంచి చూపబడినది

కానికికూడా తయారవుతారంటే సందేహము లేదు. అప్పుడు మనవిమానప్రయాణసంఘానికి దెబ్బ ఏమీ తగలదు.

విమానముమీద ప్రయాణము చేయడమంటే కష్టాలంతటితో అంతరించలేదు. రాత్రిళ్లు మేఘాలడ్డము వచ్చి కుంభవర్షము కురుస్తూ ఉన్నప్పుడు నావికుడు పడవను ఎట్లా నడుపుతాడు? విమానాలని రైళ్లతో పోల్చిచూచాము. ఇక సముద్రపు టోడలతో పోల్చిచూడవలసి ఉంది. సముద్రముమీద ప్రయాణముచేస్తూ ఉన్నప్పుడు నాలుగువైపుల తరంగాలు నిశ్శబ్దముగా ఒకటి తరువాత ఒకటి పెళ్లికూతురువలె స్థిరంగా తలవంచుకొని ఓడక్రిందకు పోతూ ఉంటవి. వీటినిచూస్తే కవికి ఆనందమే కాని, పిరికివానికిమాత్రము ప్రాణసంకటము. నావికుడు ఓడను తిన్నగా గమ్యస్థానముచేరడమునకు కొన్నిగుర్తులు పెట్టుకొంటాడు. దిక్చక్రమును (Horizon) బట్టి, త్రోవతప్పుతామేమో అని భయము లేదు. ఇట్టిగుర్తులు ఏవైనా వాయువిమానము చేసేటప్పుడు ఉంటవా అని ఆలోచించవలెను. విమానము భూమికి ఒకటిరెండుమైళ్ల ఎత్తుప్రదేశాలలో ప్రయాణముచేయడమువల్ల దిక్చక్రము (Horizon) యొక్క ఉపయోగము లేదు. మేఘాలు లేనప్పుడు గాలిప్రయాణము ఏమాత్రము కష్టము లేదు. నావికుడు దూరదర్శిని (Telescope) యంత్రము పెట్టుకొని భూమిపైపు చూచి తానేపట్టణములో ఉన్నాడో కనుక్కొంటాడు. త్రోవ తిన్నగా తీస్తాడు. రాత్రి వచ్చింది. చీకటిగుయ్యారము. ఎక్కడో రెండుమైళ్లక్రింద ఉన్నవస్తువు ఎంతపెద్దదైనా చీకటిలో ఏమీ కనబడదు గదా! అందులో పదిగంటలుదాటిందంటే దీపాలన్నీ ఆరిపోతవి. ఏకో ఒకమునిసిపలులాంతరు ముసలమ్మ ప్రాణములాగు గురగురలాడుతూ ఉంటుంది. విమానములో



దూలముల ఓడ (Rigid)

సూర్యచంద్రుల స్థానమునుబట్టి తానెచ్చట ఉన్నాడో, ఏ త్రోవనుబట్టిపోయిన గమ్యస్థానము చేరగలడో తెలుసుకొంటాడు. రాత్రిపూట అతనిపని మరింతసులువు. వేలకొద్ది నక్షత్రాలు త్రోవచూపించడమునకు వచ్చినవా అన్నట్లు ఆకాశము అంతా నిండిఉంటవి. వాటిసహాయమున నావికుడు ఓడను కొంచెమైనా మార్గముతప్పకుండా నడిపిస్తాడు. అట్లాఉంటే బాగానేఉంటుంది. కాని మధ్య పెద్దతుపాను ప్రారంభమైనదనుకొందాము. మిన్నూ మన్నూ ఏకమైనట్లు ఉంటుంది. సూర్యచంద్రాదులు మేఘాలలో పూడిపోయి కనబడరు. అప్పుడు నావికుడు ఏమిచేయగలడు? ఊరికే కూర్చోడు. వెంటనే తంతిలేనివిద్యుచ్ఛక్తిమూలముగా వార్తలు పంపి తానేస్థలంలో ఉన్నాడో, ఎట్లాపోతే అపాయము లేకుండా వెళ్లగలడో కనుక్కొంటాడు. కనుక సముద్రయానమంటే ఉన్నవారికి అది ఏమిప్రయోజనము? ఇట్టిసమయములో సారథ్యముసాగించాలంటే కొన్ని సదుపాయాలు చేసుకోవాలి. అందుకనే అయిరోపాదేశములో గొప్పగొప్ప స్తంభాలు కట్టి, వాటిమీద జాజ్వల్యమానముగ ప్రకాశించుదీపాలు పెట్టెదరు. అవి అత్యంతతేజోవంతములై యుండుటవల్ల నావికు డదికనిపెట్టి అదియేప్రదేశపువలనో తెలుసుకొనును. ఎప్పుడు అవసరమైతే అప్పుడు పైకివెళ్లి ఈదీపములు వెలిగించేటందుకు కొందరుమనుష్యులు ఎప్పుడూ సిద్ధముగా ఉండవలెను. అనుకోని తలంపుగా సూర్యుణ్ణి మేఘము కమ్మికేయడముచేత చీకటి పడవచ్చును. ఇంకా ఇటువంటివెన్నో జరగవచ్చు. అట్టిసమయములో దీపము కావాలి. ఎప్పుడూ మనుష్యులు, కనిపెట్టుకొని ఉండడము, ఈవిధమైనగంద్రగోళము ఏమీ లేకుండా ఇప్పుడు ఒకచిత్రము కనిపెట్టినారు. ఈకొత

గాకనిపెట్టిన విశేషములన్ని మనుష్యులు ఉండవలసిన అవసరమే లేదు. ఎప్పుడు సూర్యుడు కనబడకపోతే అప్పుడే దీపములు వెలుగుతవి. విమానప్రయాణీకులకు ఇబ్బంది ఉండదు. ఇంతవిచిత్రముగా కనబడే యాంత్రవిశేషముసూత్రమాత్రము తెలుపుతాను.

ఎప్పుడూ గొప్పఆలోచనలు మనకు అందరికీ తట్టుతూనే ఉంటవి. కాని వాటినిగురించి మనము అంత శ్రద్ధతీసికొని వితర్కించము. శాస్త్రజ్ఞుడు అట్లుగాక దానిలోనుంచి ఏదో ఒకఅపూర్వవిషయము బైలుపెట్టవలెనని ప్రయత్నిస్తాడు. నల్లకోటువేసుకొని ఎండలో పోతూఉంటే మనశరీరానికి వేడిఎక్కినట్లు ఉంటుంది. అనగా నల్లవస్తువు వేడిని ఎక్కువత్వరగా ఆకర్షిస్తుంది. ఈనల్లవస్తువే లోహమైతే వేడివల్ల సాగి పెద్దదగును. ఇట్టినల్లవస్తువొకటి ఆదీపములాంతరులో ఉండును. సూర్యరశ్మికి అదిబాగా వేడి ఎక్కినట్లయితే అది సాగి దీపము వెలుగుట కవసరమైన వాయువులను పోనివ్వదు. అందువల్ల వెలుగు ఉండదు. వేడి ఎంత తక్కువ అయితే కాంతి అంత ఎక్కువగా ఉంటుంది. ఇట్లు విమానాలు రాత్రింబవళ్లు సునాయాసముగా ప్రయాణము చెయ్యడమునకు ఇంకా ఎన్నెన్నో ఉపాయాలు కనిపెట్టుతున్నారు. తంతిలేని విద్యుచ్ఛక్తి మూలమునకూడా నావికుడు తానెక్కడఉన్నాడో తెలుసుకొనుటకు క్రొత్తగా ఏర్పాటులు జరుగుతున్నవి. అయినప్పటికీ ఒకటిమాత్రం కప్పిపుచ్చడానికి వీలులేదు. మేఘాలు కమ్మి భూమి కనబడకుండా పోయినపుడు ఆకష్టసమయములోనుంచి నావికుని తెలివితేటలవలన, అదృష్టమువలన బైలుపడవలెను.

విమానములను వైద్యులెక్కువగా ఆదరిస్తారు. ధనవంతుల కెవరికైనా ఆకస్మికముగా ప్రాణముమీదికి వస్తే గొప్పవైద్యుడు ఎంతదూరాన్నిఉన్నా అతనిని పిలిపించాలంటే విమానాలకంటె మరొక సులభసాధనము లేదు. అట్లే ఇప్పుడు దక్షిణదేశములో వరదలవల్ల బాధపడుతూ ఆకలితో అల్లాడుతున్న ప్రజలకు సహాయముచేయాలంటే విమానాలు ఎక్కువఉపయోగపడుతవి. రైళ్లు తిరుగుతున్నా లేకపోయినా విమానాలవల్ల భోజనసామగ్రి వాళ్లకందజేసి వాళ్లని రక్షింపవచ్చును.

వార్తాపత్రికాపఠనము మనదేశములో అంతఎక్కువగాలేదు. పాశ్చాత్యదేశాలలో ఇది ఒకనల్లమందు వెఱ్ఱిగా పరిణమించింది. దక్షిణదేశీయులు ప్రొద్దున్నే కాఫీఎల్లాగు తాగుతారో అల్లాగే నిద్రలేవగనే గొప్పవాడిదగ్గరనుంచి కొద్దివాడిదగ్గరదాకా అందరికీ ఏలండను టైమ్సుపత్రికో ఏదోఒకటి చేతులో ఉండాలి. లేకపోతే సుఖంలేదు. అట్టివారికి విమానా లుపయోగించి పత్రికలు అందజేస్తున్నారు. అట్లే ఇంగ్లాండులో ఉన్న మనస్నేహితులతో ఉత్తరప్రత్యుత్తరాలు జరుపుతూ ఉండవలెనంటే నెలరోజులకొకసారిగాని క్షేమసమాచారాలు తెలుస్తూవుండవు. విమానాలమూలముగా ప్రతివారము ఉత్తరాలు తెప్పించుకోవచ్చును.

ఇంజనీరింగుశాఖలో విమానాలెంతో ఉపయోగము. రైలుమార్గమొకటి నూతనముగ వేస్తున్నప్పుడు రెండువైపులనుంచి వెయ్యడము చాలసులువు. ఈరెండు ప్రదేశములమధ్య చాలదట్టమైన అడవివుంటే సామానులు ఒకచోటనుండి ఇంకొకచోటికి చేర్చడము చాలకష్టము. అప్పుడు విమానాలు ఉన్నట్లయితే తేలికగా పనిసాగిపోతుంది. దక్షిణఅమెరికాలో బంగారముమొదలగు ఖనిజములుగల ప్రదేశము ఉన్నదట. దానిచుట్టూ ఘోరారణ్యము. అరణ్యాన్ని కొట్టివేయడము అసాధ్యమైనపని. వాటిలోనుంచి నడచిపోవడమునకు ప్రయత్నించడము నూటిగ సింహాములుమొదలగు క్రూరవన్యమృగముల నోట్లోకి జారిపడడమే. క్రొత్తగావచ్చిన ఈవిమానాలు ఆకష్టాలన్నిటినీ నివారిస్తవి. ఇప్పుడాగనులు త్రవ్వుటకు ప్రయత్నము చేస్తున్నారు. మనహిందూదేశములోకూడా హిమవత్పర్వతప్రాంతములలో ఎన్నోగనులను కనిపెట్టవచ్చును.

ఈమధ్య కెనడావారు విమానానికి ఇంకొకఉపయోగము కనిపెట్టినారు. మనము దవాగ్నిని గురించి విన్నాము. దవాగ్నిఅంటే దట్టమైనఅడవిలో కొమ్మకొమ్మరాసుకొని అగ్నిహోత్రముపుట్టును. ఈఅగ్ని అరణ్యమంతా పాకి కొద్దికాలములో అత్యంతోపయోగమైన ఆఅడవిని భస్మరాశిగా మార్చివేస్తుంది. దీనివల్ల దేశానికి ఎన్నికోట్లో నష్టము సంభవిస్తుంది. కెనడావారిప్పుడు ఏమి చేశారంటే ఈవిమానాలని అరణ్యప్రదేశమంతా తిరగవలసిందని పంపినారు. ఎక్కడనైనా ఇట్టి అగ్నిహోత్రము.

పుట్టినట్టయితే దానినిఆర్పి ఆవైమానికులు అడవులు కాపాడుతున్నారు.

చదువరులారా! మనం మోటారుబళ్లలో నెక్కినప్పుడు గాలి బాగావీస్తున్నదనీ, మనము ఆలస్యముగా బయలుదేరినా గమ్యస్థానము త్వరగాచేరవచ్చుననీ సంతోషపడుదుమేకాని బండిని నడిపే యంత్రాన్నిగురించి కొంచమైనా ఆలోచించము. అట్లేరైలులలో ప్రయాణము చేయనివాడు లేడు. మన మెక్కేబళ్లలో అపాయము అని వ్రాయబడినగోలుసును చూడనివాడు లేడు. అయినప్పటికి దైలునుగురించికాని, అపాయముతటస్థించినప్పుడు తీగ బండిని ఎట్లా ఆపుతుందనికాని ఆలోచనే చేయము. కొద్ది సంవత్సరాలలో విదేశస్థులు విమాన ప్రయాణసంఘాలు స్థాపించి మనదేశములో ఈక్రొత్తచిత్రమును ఉపయోగములోనికి తెచ్చినప్పుడు ఊరికే కూర్చుండి 'ఇది తెల్లవాళ్లమాయ' అనిప్రజలు భ్రమపడకుండా ఉండాలని ఈ వ్యాసముయొక్క ఉద్దేశము.

కాపుపిల్ల

బండారు వీరరాజేశ్వర రావుగారు బి. ఏ

ఉ. తరుణవిలీనరాగఫలితంబునెపాన సురుంగ దేల? కే
దరముల పొంత సస్యసముదాయముఁ గోయుచుఁ జిన్నిచెమ్మటల్
చెఱఁగుల నొత్తుచున్ దనకృశింపులమే నరవాంచి, మంజుల
స్వరమున గీతరాగములు పాడెదు నాంధ్రకుమారిఁ జూడుమా!

చ. చలువడుమై, శ్రమం బుడుపఁజాలిన మెల్లనిపిల్లతెమ్మెరల్
చెలువహారంగుముంగురులఁ జిందఱసేయఁగఁ గుప్పలేర్చుచున్
జలిబిలిముద్దుపాటల పసిండిని నద్దెన కల్లరీలు దాం
గిలికొనిపోవ, శోకరసగీతము పాడెదు నాలకింపుమా!

చ. ఉడిగి యడంగి మైమఱచి యున్నజనంబులకు న్నరేబియా
యెడరులలోని పచ్చికబయళ్ల వసించుశకుంతజాల మె
ప్పుడు లలితంబులైనపదము ల్పచరించుచు, నింతకన్న నె
క్కుడయిన సంతసం బిడునొకో! నిలువక్ తఱిఁ గోలువోదువో?

గీ. కరము దవ్వుల నున్నయుత్తరపుఁగడలి, నెమ్మదిఁ గలంచుచు, వసంతనియతు లలమ
మృదులముగఁ బాడుచిఱుతకోయిలలునింత, కన్న నెక్కుడు సుఖమీయఁగల వె సఖుఁడ?

సీ. కాఁబోలు నాపెచొక్కుఁబాట లెడవుప, ల్లెలజాలి నిడు దుస్థితులఁగుఱించి
కాఁబోలు నాయిచ్చకాలరాగము భక్త, వత్సలుండైన యీశ్వరునిఁగూర్చి
కాఁబోలు నాగీతికారాగములు పురా, తనమహా హవభూములను గుఱించి
కాఁబోలు నాకన్యకాగానగీతసా, రము నేఁటిరాచ కార్యములఁ గూర్చి
గీ. సలలితంబయి, కర్ణరసాయనమయి, మృదులమగు కలకంఠంబు నెత్తి ముగుద
పాటఁ బాడుచునున్న దస్పష్టముగను, దేనిఁగూర్చియొ యిటనిల్చి దీని వినుము.

చెన్నరాజధానియందు 1923-వ సంవత్సరము జూలై మొదలు డిసంబరు నెలవఱకు

ముద్రితములై ప్రకటింపబడిన

ఆంధ్ర గ్రంథముల పట్టిక

పద్యకావ్యము—౧. ఇతిహాసము

పురాణము

శ్రీ వాల్మీకిరామాయణమునందలి యుద్ధకాండము, మొదటి సంపుటము, తాత్పర్యసహితము

శ్రీమత్కన్యకాపురాణము భాగము 3,4,5

భాస్కరరామాయణము

సంక్షేపరామాయణము—కె. వెంకటరమణకవి

పద్యకావ్యము—౨. మాహాత్మ్యము

ఆంధ్రకార్తీకమాహాత్మ్యము-అనిపెద్ది జగన్నాథశాస్త్రి

కార్తీకమాహాత్మ్యము—పి. అప్పలనరసింహకవి

నారాయణాచలమాహాత్మ్యము — అల్లంరాజు రంగనాథకవి

వైశాఖమాహాత్మ్యము

శివరాత్రిమాహాత్మ్యము – శ్రీనాథ

శ్రీశైలమాహాత్మ్యము—చాగంటి వీరమల్లికార్జునలింగం అయ్యవార్లు

సత్యనారాయణవ్రతమాహాత్మ్యము — పంగులూరి వీరరాఘవకవి

పద్యకావ్యము—౩. శతకము

ఆంగ్లేయశతకము—మల్లెల దావీదు

కుమారశతకము కల్లూరు అహోబలరావు

కుమారీశతకము—బచ్చు వేంకటనరసింహకవి

కృష్ణశతకము

కొత్తపల్లిరాఘవశతకము—సరికొండ రామరాజకవి

కొప్పులింగేశ్వరశతకము—కూచిమంచి సోమసుందరుడు

గోవిందశతకము—అల్లంరాజు రంగశాయికవి

జానకీరామశతకము—యం. కామకోటి

దాశరథిశతకము—కంచెర్ల గోపన్న

నృసింహశతకము—శేషప్పకవి

పట్టాభిరామశతకము—ఎ. గోపాలరావు

భక్తచింతామణిశతకము, మహేశ్వరచరణస్తవతారావళి—కూచిమంచి సోమసుందరుడు

భద్రాద్రిరామశతకము

భైరవకోన ఆదినారాయణశతకము—సయ్యం వరదదాసు

మధుసూదనశతకము—తోలేటి వెంకటరత్నం

రాఘవేంద్రశతకము—చిప్పకుల శ్రీరాములు

వాయునందనశతకము—చిన్నంరాజు వెంకటసుబ్రహ్మణ్యశర్మ

వ్యభిచారచరితాపహాస్యార్థశతకము — పసుపు దేవబ్రహ్మం

శతకముల ద్వితీయసంపుటము

శ్రీచెన్నమల్లేశ్వరశతకము—బూస మల్లయ్య

శ్రీతల్పగిరిరంగనాయకశతకము—వావిలికొలను సుబ్బారావు

శ్రీపార్థివలింగశతకము— భోగరాజు నారాయణమూర్తి

శ్రీరామశతకము—ఏనుగు తిమ్మిరాజు

శ్రీవాసుదేవశతకము—పి. వెంకటనరసయ్య, జె. వెంకటసుబ్బయ్య

శ్రీ సాకేత కోదండరామశతకము — ములుకట్ల వెంకటకృష్ణశాస్త్రి

సుజనశతకము—శృంగారం అయ్యమాచార్య.

సుమతిశతకము

పద్యకావ్యము—౪. ఇతరములు

అంబరీషోపాఖ్యానము:—ఎ. రామారావు, కె. రామకృష్ణయ్య

అవజ్ఞ—పంచ్యారం వెంకటసుబ్బయ్యశర్మ

అష్టమూర్తి గురుస్తవము—తంగెడ లక్ష్మీకాంతకవి

ఆంజనేయదండకము

ఆంజనేయదండకము—వడ్డిపర్తి మంగయ్య

ఆంజనేయ స్తవము—యస్. వెంకటసుబ్బారావు
కన్యకాపరమేశ్వరీదండకము—యస్. సీతారామకవి
కుసుమాంజలి—కొమాండూరు కృష్ణమాచార్లు
కైకేయీసౌశీల్యము—పల్లి పూర్ణప్రజ్ఞాచార్య
గణేశ్వరీయము—కన్నేపల్లి సాంబశివరఘురామస్వామి
చారుమతి—కలవపీడు వెంకటరమణాచార్లు
చిత్రకేతూపాఖ్యానము—బి. తిమ్మయ్యనాయుడు
చీట్లపేకచిద్విలాసం—శృంగారం అయ్యమాచార్య
తారావళి—ప్రాత ఆంజనేయులు
తులసీదాసుమాహాత్మ్యము
నవరత్న శ్రీజగన్నాపారాయణస్తుతి—యస్. కాశీరావు
పద్యరత్నపేటిక
పద్యరత్న భాండాగారము—బులుసు పాపయ్యశాస్త్రి
పద్యరత్నములు—వంకాయల లక్ష్మణస్వామి
పులివేట—యస్. సూరిదాసకవి
ప్రార్థనపద్యములు
బమ్మెరపోతనరత్నములు—వావిలికొలను సుబ్బారావు
బలవద్వివాహము—దివిపాల వీరేశలింగం
బ్రాహ్మణ గృహిణి—దేవరకొండ జగన్నాథరావు
భరతవాక్యములు
మహనీయ ఋషుల మహత్వ తత్త్వములు—కె. వేలాయుధంపిళ్ల
రామకృష్ణసన్మతి—తుమ్మల సీతారామమూర్తిచౌదరి
రామరాజీయము—వెంకయ్య
రామ కథన పద్యావళి—కోటమర్తి వెంకటరత్నం
రామస్తోత్రరత్నాకరము—దాశరథి రామదాసు
వినాయకచవితి పద్యములు
వేమనపద్యములు
శశికళ—పెద్దకోటూరి శివప్ప
శివస్తోత్రామృతము—పి. సూరమ్మయ్య
శ్రీకృష్ణలీలలు-దండకము — యస్. పి. రామకృష్ణ నాయుడు
శ్రీరమాస్తోత్ర నక్షత్రమాల—బళ్లారి కృష్ణప్ప
శ్రీరామరాజనీతి—వెంకటపార్వతీశ్వరకవులు
సోదాహరణనీతిపద్యావళి—కె. యం. కృష్ణద్వైపాయనాచార్లు
స్తోత్రకదంబము—కె. వెంగయ్య
శ్రీనీతిమంజరి—కందుల లక్ష్మీపతి
సోమేశ్వర స్తవము—నన్నప నరసింహకవి
హనుమత్పంచ చామరము లు— చింతపల్లి ఆంజనేయులు
హనుమత్పంచవింశతి సీసావళి
హనుమద్రామ దండకము—హనుమద్దాసకవి
హంససందేశము—వేదాంతదేశిక
నలచరిత్రము—వక్రపురి శ్రీనివాసాచార్య
నవనాథచరిత్ర ద్విపద కావ్యము—పోశెట్టి లింగనకవి

వచనకావ్యము—౧. కథ, నవల

అభినవ బాలకాదంబరి—యస్. స్వామినాథశాస్త్రి
అభినవబాలనీతికథాసప్తతి—యస్. స్వామినాథశాస్త్రి
ఆంధ్రకాదంబరి పూర్వభాగము—వేరి సత్యనారాయణశాస్త్రి
ఆంధ్రనైషధసారము—అత్తిలూరి సూర్యనారాయణ
ఆనందరాయ విజయము—పి. వి. శాస్త్రి
ఇందుమతి—ఓలేటి సూర్యప్రభాదేవి
ఈతడు నాయకుడు, ఆతడు నాకూతురుమగడు— విజాపురపు సుందరరామయ్య
ఎడమకాలితన్ను కుడిచెంపముద్దు
కథావళి
కథామంజరి—కె. వెంకటరమణకవి
కాశీమజిలీకథలు—మధిర సుబ్బన్నదీక్షితకవి
గుణసాగర—పి. సుబ్బరామయ్య
గురుదక్షిణ—జనమంచి సీతారామస్వామి
చమత్కార పొడుపుకథలు
చోరశిఖామణి—సి. శ్రీనివాసరావు
జయసేన—యస్. సి. రామకృష్ణనాయుడు
జీవన్మృతరహస్యము
నరాధమ—కె. రామకృష్ణశాస్త్రి
ప్రేమపూర్ణ—బాలకవి వాసిరెడ్డి నాగేశ్వరరాయ
ప్రేమసుందరి—చిర్రావూరి కామేశ్వరరావు
మహాపతివ్రతామహాత్మ్యంబను శ్రీభక్తవిజయము, మొదటి భాగము—కె. చిన్నయ్యనాయుడు
రహస్యవిప్లవము—వేంకటపార్వతీశ్వరకవులు
రామరాజీయము—యస్. వెంకటనరసింహారావు [శ్రీ
లావణ్యమయీసుధాకరము—వా. లక్ష్మీనారాయణశా

వసుంధర—శేషాద్రిరమణకవులు
వినోదిని—తల్లాప్రగడ సూర్యనారాయణరావు
వినోదములు—పి. గోపాలకృష్ణయ్య
సాహసిక—యన్. వి. హనుమంతరావు
సుజనరంజని
సుదర్శన విజయము—తోలేటి వెంకటసుబ్బారావు
సువర్ణ కేసరికృష్ణసేన—కె. జయరామారావు
హరిదాసి—సి. రామకృష్ణరావు
హితోపదేశకథలు—జే. ఓ. రెనాల్డ్సు

వచనకావ్యము—౨. జీవితము

ఆంధ్రమంత్రులు—శేషాద్రిరమణకవులు
తిమ్మరుసుమంత్రి—చిలుకూరి వీరభద్రరావు
శివాజీ—వావిలాల గోపాలకృష్ణయ్య
శ్రీశారదాదేవి—కే. రామకృష్ణారావు
శృంగార శ్రీనాథము—వేటూరి ప్రభాకరశాస్త్రి
సక్కుబాయిచరిత్రము—మునిస్వామి

వచనకావ్యము—౩. చరిత్రము

గుంటూరుచరిత్ర—మల్లాది వెంకటసోమయాజులు
ప్రాచీనాంధ్ర నౌకాజీవన చారిత్రము — భావరాజు వెంకటకృష్ణారావు
పల్లవరాజుచరిత్రము—శ్రీరాం వీరబ్రహ్మం
బాలుర హిందూదేశచరిత్రము. మొదటి పుస్తకము
బాలుర హిందూదేశచరిత్రము. మూడవపుస్తకము
వెలస్లీ రాజనీతి. మహారాష్ట్రసామ్రాజ్య విచ్ఛిత్తి — మొసలికంటి సంజీవరావు
హిందూదేశచరిత్రము, మూడవ పుస్తకము
శ్రీశైలచరిత్రము—చాగంటి వీరమల్లికార్జునలింగంఅయ్యవార్లు

వచనకావ్యము—౪. మాహాత్మ్యము

పౌండరీక మాహాత్మ్యము—అత్తిలూరిసూర్యనారాయణ
శ్రీవేంకటాచలమాహాత్మ్యము—యం. యతిరాజదాసు
సేతురామేశ్వరమాహాత్మ్యము

వచనకావ్యము—౫. ఇతరములు

అంబరీషోపాఖ్యానము—శృంగారకవి సర్వారాయుడు
అబద్ధమాడుటుగుఱించిన ఉపాఖ్యానము—పి. సాంబశివరావు
ఆంధ్రవచన మహాభారతము, సభాపర్వము—వీరరాజ
కుమారవాచక పుస్తకము, ఏడవతరగతి—యం. సుబ్రహ్మణ్యం, వెంకట్రామశాస్త్రి
కుమారవాచక పుస్తకము, నాల్గవతరగతి—యం. సుబ్రహ్మణ్యం, వెంకట్రామశాస్త్రి
గరుడుడు-సర్పయాగము—యం. సీతారామరావు
ద్రోణచరిత్ర—చావలి శ్రీరామశాస్త్రి
నలమహారాజుచరిత్ర వచనకావ్యము
నవగ్రహచింతామణి.
నీతిచంద్రిక, సంధి—కె. వీరేశలింగంపంతులు
బాలనాగేల చరిత్రము—పాలపూడి నరసింహశాస్త్రులు
బాలభారతము—హాసన్నిస వాసుదేవరావు
బాలరామాయణము—హాసన్నిస్ వాసుదేవరావు
బాలికానీతిపుస్తకము—వై. యస్. హనుమంతరావు
భరతుడు—దుగ్గు సుబ్రహ్మణ్యశర్మ
మార్కండేయ చరిత్రము—ధూళిపాళి కృష్ణకవి
మూడవ కథావాచక పుస్తకము—యం. హెచ్. సుబ్బారాయుడు, కె. వీరేశలింగం పంతులు
మొదటితరగతి పుస్తకము
మైరావణచరిత్రము
రాజపుత్రవీరులు
లంకాయాగము
లక్ష్మణుడు—డి. యస్. రామారావు
శ్రీవచనభూషణము—పిళ్ళైలోకాచార్య
సరస్వతీవాచక పుస్తకము ఎనిమిదవతరగతి—శాస్త్రి రాఘవేంద్రరావు
సరస్వతీవాచక పుస్తకము, ఏడవతరగతి—శాస్త్రి రాఘవేంద్రరావు
సాక్షి నాల్గవ సంపుటము—పానుగంటి లక్ష్మీనరసింహారావు

నాటకము

అమరూప—డి. శేషాచార్య
అరిందమ విజయము—ఇక్కుర్తి తిరుపతిరాయుడు
అభిజ్ఞానశాకుంతలనాటకము
ఆంధ్రాభిజ్ఞానశాకుంతలము
కన్యాశుల్కం—శ్రీ వెంకటసుబ్బారావు

కుమారాభ్యుదయము — వడ్డెపాటి నిరంజనశాస్త్రి
కృష్ణలీల — సంపన్నుడుంబ సింగరార్యులు
గులేబకావలి అను పుష్పలీలావతి — వినాపురపు సుందర రామయ్య
చినరంగరాయ నాటకము — చెలికాని వెంకట సూర్య రావు
జేబున్నీసా — పింగళి నాగేంద్రరావు
తారాచంద్రీయము — గూడూరి వెంకటశివకవి
తులసీదేవి — ముత్తినేని వెంకటచన్న కేశవులు
ద్రౌపదీవస్త్రాపహరణము — సీతారామకవి
నలచక్రవర్తి నాటకము
పద్మరాణి — గుడిపాటి వెంకటాచలం
పాంచాలి మానసంరక్షణము — కేశవరపు రామకృష్ణ శాస్త్రి
ప్రహ్లాద — బొమ్మరాజు సీతారామకవి
బభ్రువాహన నాటకము — కోలాచలం శ్రీనివాసరావు
బుద్ధిసాగరవిజయము — పి. వెంకటసుబ్బారావు
భక్తరామదాసు — పండిత, కేతవరపు శివరామశాస్త్రి
మార్కండేయ నాటకము — పింగళి వెంకటనరసయ్య
మార్కండేయవిజయము — కొంతి శ్రీపతిశాస్త్రి
మాలతీమధుకరము — బల్లా స్వామి
ముక్తధార
రుక్మిణీకల్యాణము — జి. జాషువ
లంకాదహనము — ద్రోణంరాజు సీతారామరావు
వనవాసి — హాచి వరసింహం
విచిత్ర సారంగధర నాటకము — కె. వెంకటనరసప్ప
వినోదిని — శ్రీరాం వీరబ్రహ్మం
విషాద కనకతారీయము — ములుగు చంద్రమౌళిశాస్త్రి
విషాద సారంగధర నాటకము — డి. కృష్ణమాచార్లు
వైరాగ్యచింతామణి — బద్దిరెడ్డి కోటీశ్వరరావు
శ్రీకృష్ణతులాభారము — పోతుకూచి సుబ్బయ్య
పనేమిరా అను విజయపాలీయము — టి. వెంకటశాస్త్రి
సహకారి నాటకము — పి. యస్. రామకృష్ణశర్మ
సావిత్రినాటకము — ద్రోణంరాజు సీతారామయ్య
సావిత్రినాటకము
సావిత్రీనాటకము — వి. యల్. నారాయణరావు
సావిత్రీనాటకము — నందిరాజు చలపతిరావు
సుభద్రావిజయము — భాగవతుల చెన్నకృష్ణమూర్తి
సంగీత కనకతార — ద్రోణంరాజు సీతారామరావు
సంపూర్ణ భారతము — రామనారాయణకవులు
సంపూర్ణమహాభారతము — చక్రాంపథానుల మాణిక్యశర్మ
సాంబవిజయము — కె. యం. కృష్ణద్వైపాయనాచార్యులు
హరిశ్చంద్రోదయము — పండిత యడవల్లి వేంకటకృష్ణ శాస్త్రి.

ప్రహసనము

అంతాగమ్మత్తు — మల్లాది అచ్యుతరామశాస్త్రి
అంతాడబ్బు — లక్ష్మణ
ఇద్దరుపెండ్లాల ఇబ్బంది — మల్లాది అచ్యుతరామశాస్త్రి
ఇద్దరుభార్యల ఇబ్బంది — బద్దిరెడ్డి కోటీశ్వరరావు
ఎలెక్షను ప్రహసనము — కపిస్థలం కృష్ణమాచార్యులు
గడుసువియ్యపురాలు
గర్భాదానము
గొంగూర ఎలెక్షన్ — పట్టమట్ట మార్తాండరామమూర్తి
గొంతుకోత — దంటు వీరరాఘవయ్య
దీపావళి ఫార్సు
నవజీవనము — టి. విశ్వనాథ
నిరుద్యోగి ఫార్సు
నువ్వో లేక గొయ్యో — శిష్ట్లా రాధాకృష్ణయ్య
పీడపదులునా — కె. ఆర్. శాస్త్రి
ప్రహసనమంజరి — చిలకమర్తి లక్ష్మీనరసింహం
ప్రహసనములు — ద్రోణంరాజు సీతారామయ్య
బలెవాన ఫార్సు — కె. రామకృష్ణరావు
భీమశంకరం ఫార్సు — నాగమల్లి అప్పలనరసయ్యశెట్టి
ముసలిమగడు, పడుచుపెండ్లాము
మ్యారేజిప్రహసనము — గుండు రాఘవదీక్షితులు
విచిత్రనారీమణులు — లొల్ల భగవానులు
విస్కీ అడ్డాట — కె. వెంకటసుబ్బారావు
సురాజుద్దౌలా లేక అసామాన్య — జమ్ములమడక లక్ష్మీ నరసింహం
హరిదాసు — బద్దిరెడ్డి కోటీశ్వరరావు

భాష - నిఘంటు వ్యాకరణాదులు

అభినవలింగానుశాసనము — యన్. స్వామినాథశాస్త్రి
అభినవశబ్దరూపావళి : మొదటిభాగము [రాయణరాజు
అర్ధానుస్వార శకటరేఫచంద్రిక — పెనుమచ్చ సూర్యనా

ఆంధ్రగద్యవాఙ్మయచరిత్ర—జి. వి. రాఘవరావు
ఆంధ్రశబ్దచింతామణి — నన్నయభట్టు
ఆంధ్రసారస్వతతత్త్వము—సి. జగన్నాథరావు
కాళిదాస భవభూతులు
తెలుగు ప్రైమరు—రెవరెండు. కె. స్ట్యావర్టు
తెలుగు వ్యాకరణము—పి. అబ్బాయినాయుడు
పాఠశాలలోని తెలుగు—కూచి నరసింహం
బాలబోధిని-ప్రథమభాగము—కాశీ కృష్ణాచార్య

జ్యోతిషము

అనుభూతజాతకతరంగిణి—ఇవటూరి అయ్యన్నమూర్తి, రాజశేఖర
సిద్ధాంతసరళంకీరము

గణితము

అంకగణితము—చల్లా లక్ష్మయ్య
చమత్కార గణితము—పి. ఆర్. జనార్దనంనాయుడు
బాలగణితబోధిని.
లీలావతిగణిత సంగ్రహము

వైద్యము

అనుభవయోగానాని వైద్యామృతము
ఆయుర్వేదసారసంగ్రహము — యస్. ఏ. టి. యం. శ్రీనివాసాచార్లు అయ్యవార్లు
ఆరోగ్యమునకు మార్గము
ఆరోగ్యరహస్యము, రెండవభాగము— మంత్రిప్రగడ సాంబశివరావు
ఆరోగ్యరహస్యము, మూడవభాగము— మంత్రిప్రగడ సాంబశివరావు
ఆరోగ్యరహస్యము—యం. సాంబశివరావు
ఔషధగుణదీపిక — వైద్యరాజు యర్రా సీతారామయ్య వైద్యరాజు యర్రా వెంకటస్వామి
త్రిదోషబోధిని—దుగ్గిరాల శివరామమూర్తి
నాడీపరిజ్ఞానము—యస్. ఎ. టి. యం శ్రీనివాసాచార్లుఅయ్యవార్లు
నేత్రదర్పణము—తాడేపల్లి పానకాలరాయుడు
పానీయకల్పవల్లి—యస్. ఎ. టి. యం. శ్రీనివాసాచార్యులు అయ్యవార్లు
వైరాగిచిట్కలు
విష ప్రతివిషయములు—తోట సుబ్బయ్యశెట్టి
వైద్యమాలిని గ్రంథము—కె. మందమరాజకవి
శతలేహ్యపాకప్రకాశిక
సుఖరోగచికిత్సారత్నాకరము—యస్. ఎ. టి. యం. శ్రీనివాసాచార్లు అయ్యవార్లు
క్షీరవర్ధని—సోరి రామశాస్త్రి

మతము

ఆచార్యహృదయం—పిళ్లై లోకాచార్య
ఆర్యధర్మ ప్రత్యక్ష ఫలబోధిని—ముదిగొండ నాగలింగ శాస్త్రి
ఉత్తరసర్కారుల బాప్టిస్టు 10-వ సంవత్సర సంచిక
క్రీస్తుసభయొక్క చరిత్రము
జ్ఞానామృతము
పరమసంజీవి
పాతనిబంధన గ్రంథములోని పాఠములుగూర్చి ప్రారంభికులకు సత్యాత్ములైన పాఠములు
ప్రపంగసారము, మొదటిభాగము—మల్లెలదావీదు
పూడిపెద్ది సాంబశివరావుగారి స్వానుభవనీయ యుపదేశవాక్యములు – పూడిపెద్ది సాంబశివరావు
భక్తాంజలి—గొల్లపూడి లక్ష్మీనరసింహారావు
బృహస్పతివారఅద్భుతములు—కె. ఆయిలెన్
మణిమంజరి
మహత్రయ హితబోధిని—పూడిపెద్ది సాంబశివరావు
మహాద్వైతోపన్యాసము—పూడిపెద్ది సాంబశివరావు
మహాకైవల్యామృతసారము—పూడిపెద్ది సాంబశివరావు
వేదవాక్యపాఠములు—తరగతివారిగానియమించబడినవి, మూడవ పుస్తకము
శైవమూర్తిభావ్యనిర్ణయము—చాగంటి సీతయ్యశాస్త్రి
శ్రీపురాతనశంకరవచనములు—చాగంటి సీతయ్యశాస్త్రి
శ్రీమధ్వదేవతార్చన
శ్రీమన్మథవిజయ
శ్రీరామ దశావతార నక్షత్రమాలిక తేవారము—కరణం అప్పాసామిపిళ్లె
శ్రీవైఖానసపుణ్యాహమ్
శ్రీవైఖానసోపాఖ్యానము

శ్రీ శివప్రసన్నము—కోసూరు కాశీపత్యవధాని
శ్రీ సీతారామ ఖరమర్త్యసంభూము జ్ఞానబోధ—సూర్యదేవర సంజీవరాయణిం
సత్యవేదసారసంగ్రహము—రివరెండు జె. బి. మాక్లోరిన్
సర్వమతసాహిత్యబోధిని—పూడిపెద్ది సాంబశివరావు
స్తోత్రమంజరి—కందుల లక్ష్మీపతి
సంఘచరిత్రసారసంగ్రహము—డబ్లియు. బి. బాక్స్

వేదాంతము

అద్వైతానంద ఆత్మజ్ఞాన అమృతసారము—బొమ్మన రంగస్వామిరెడ్డి
ఆంధ్రపంచీకరణము—రామకృష్ణానందేంద్రస్వామి
ఆంధ్రభగవద్గీత—గుండాల వీరాస్వామినాయుడు
ఆత్మబోధామృత తత్వములు మొదటిభాగము
కర్మయోగము
గణితాద్వైతము—కె. శ్రీనివాసరావు
గీతావాక్యము—వి. యస్. పద్మనాభరాజు
చతుశ్లోకి—ఆలవందారు
జ్ఞానామృతము
తత్త్వగోపాలీయము—అలూరి గోపాలరావు
తారకామృతసారము—బి. నారాయణదాసు
దుఃఖనివారణోపాయము—కె. వీరభద్రాచార్యులు
నేనువాడెక్కడనుండి పుట్టినాడు—పూడిపెద్ది సాంబశివరావు
బ్రహ్మవిద్యావిలాసము—ఇంగువ వెంకటకృష్ణశాస్త్రులు
బ్రహ్మవిద్యాసారము—అల్లాడి మహాదేవశాస్త్రి
భగవద్గీతాంశోపుష్పమాల—పి. తిరుమలరంగాచార్య
మనోల్లాసిని
రామతీర్థస్వామి గ్రంథములు, రెండవభాగము
లఘుప్రస్థానత్రయము—ఆళవందార్
వజ్రసూచ్యుపనిషదర్థము, వైరాగ్యసూచనము—ఘండ బాలకృష్ణమూర్తి
విద్యావిద్యాతీతబోధిని
విశిష్టాద్వైతము—భాగవతుల లక్ష్మీపతిశాస్త్రి
శ్రీరామషండకము-తత్త్వజ్ఞానము—గంగుల ఆంజనేయ
సుజ్ఞానదీపిక—వల్లభాపురపు కామదాసు
సువాసనబోధిని

కల్పము

ఉద్బంధనాదిదుర్మరణనారాయణబలిప్రయోగం
పురాణోక్త అపరచంద్రిక
పురాణోక్త ఆబ్దికమంత్రము
పురాణోక్త కర్మప్రకాశిక
వినాయకవ్రతకల్పము—కె. వీరరాజు
వినాయకవ్రతకల్పము
వినాయకవ్రతము
శ్రీవైఖానస సంధ్యావందనం
శ్రీశంకరజయంతి పూజాకల్పము, శివసహస్రనామసహితము
క్షీరాబ్ధి ద్వాదశీవ్రతము

సంగీతము—౧. హరికథ

భస్మాసురచరిత్రము—ముక్కామల వెంకట్రామయ్య
శ్రీరామజననము-హరికథ—టి. వెంకటాచలదాసు
శ్రీసక్తుప్రస్థునిచరిత్ర-హరికథ--గంగుల నారాయణదాసు

సంగీతము—౨. గేయము

ఆత్మబోధామృతతత్త్వములు 1, 2, భాగములు
ఊర్మిళాదేవినిద్ర
ఎరుకమ్మ పేరంటాలు కథ
కుచేలోపాఖ్యాన కీర్తనలు—బి. సుదర్శనదాసు
గాంధారికథ-ప్రథమభాగము
చిలుకరాయబారము
జావళీలు
జ్ఞానతత్త్వామృతసారము—రంగస్వామిరెడ్డి
త్రిపురసంహారకీర్తన—లంకా వెంకటలక్ష్మీనరసింహకవి
దసరాపదములు—నేకూరు శేషాచలకవి
ధ్రువచరిత్రపాట
దేశింగురాజుకథ—రావూరు వెంకటసుబ్బారావు
నవీనకీర్తనలు-స్త్రీలపాటలు—సత్యసుందరకవులు
నమశ్శివాయపాట—ములుగు శాంభవమ్మ
నిట్టల ప్రకాశదాసుగారి కీర్తనలు
నీలకంఠకృతులు—చాగంటి వీరభద్రకవి
నూతన రామాయణ భజనకీర్తనలు
నూతన వేడుకపాటలు
దశావతార స్తవము

పెద్దబొబ్బిలిరాజుకథ
బసవశంకరదాసు కీర్తనలు—సి. బసవశంకరయ్య
బుద్ధ్యుపదేశిని—కోలకం నరసింహశెట్టి
భగవద్భజనకీర్తనలు—భీమరాజు రుక్మిణమ్మ
భక్తమందారం—బి. భీమశంకరదాసు
భజనకీర్తనలు
మహాత్మాగాంధి భజనగీతములు—గ్రంథం సీతాపతిశర్మ
మంగళగిరి క్షేత్ర దేవతాస్తోత్రము — ముక్కామల జగన్నాథరావు
మంగళహారతులు
లంకాయాగము
శ్రీకృష్ణకళాగీతములు
శ్రీనివాస సువంశవృత్తములు
శ్రీరామకల్యాణము, అంబరీషోపాఖ్యానము
శ్రీరాములవారి అలకపాట, వసిష్ఠవాక్యములు
శ్రావణమంగళగౌరీవ్రతకథ—కొల్లపర్తి రంగనాయకమ్మ
సరస్వతీవిలాసము—సి. సత్యవతమ్మ
సత్రాజిత్తుచరిత్ర-హరికథ—మహావిభట్టు రంగరాజు
సీతాపహర్త
సీతాకళ్యాణం-హరికథ—జె. వెంకటరామరాజు
సంక్షిప్తరామనామగానము—లక్ష్మణాచారి
స్త్రీలపాటలు 1,2 భాగములు—వెంకటరంగనాయకమ్మ
హరిభజనానందం—పెదగాడి చిదంబరకవి
హనుమద్విజయము—దంటు వీరరాఘవయ్య
హాస్యపుపాట—వల్లూరి జగన్నాథరావు పంతులు

ఇతర కళలు

అగ్నిబాణవిద్య—వి. కృష్ణమాచారి.
కౌటిల్యార్థశాస్త్రము—మామిడిపూడి వెంకటరంగయ్య, ఆకెళ్ల వెంకటశాస్త్రి
జలార్గళశాస్త్రసంగ్రహము
నల్లబల్ల చిత్రలేఖనము—ఎ. సుబ్రహ్మణ్యఅయ్యర్
పరిమళద్రవ్యములను జేయుట—వి. కృష్ణమాచారి
ప్రాథమిక ప్రకృతివిద్య—టి. పాలమన్ రాజు
బాలవిజ్ఞానశాస్త్రము—కే. వీరభద్రయ్య
మనశ్శరీరములపై పరిసరముల ప్రభావము — పారనంది జగన్నాథస్వామి
సమ్మోహనము—ప్రొఫెసర్ శేఖర్
హిప్నాటిజమ్ అను మనోవశ్యతత్వశాస్త్రము—యస్. బి. దావుద్ షా సాహెబు

ఇతర గ్రంథములు

అష్టమహార్షికోత్సవము
అడంగులు—కే. ఆర్. యల్. శర్మ
ఆత్మనిర్వేదపంచవింశతి—ఆర్. హనుమంతరెడ్డి
ఆంధ్రజాతీయకళాశాలావిజ్ఞప్తి
ఆంధ్రరాష్ట్రజాతీయోపసంఘము
ఆరవ ఆంధ్రసారస్వతమహాసభ, అహ్వానసంఘాధ్యక్షుని యుపన్యాసము
ఆరోగ్యబోధిని—న్యాపతి బాలకృష్ణరావు
ఊర్మిళాదేవినిద్ర
ఎ. గ్రాఫు టెక్స్టుబుక్కులకు నోట్సు
కన్నీరు:—దేవులపల్లి వెంకటకృష్ణశాస్త్రి
కలువరింతలు—టి. విశ్వనాథ
కారకిల్లి—మంచికంటి రాజారావు
కైకేయి దుస్తంత్రము—రామవఝల రామశాస్త్రి
క్రొత్త నాల్గవతరగతి నవీన గోదావరిజిల్లాభూగోళము—పి. అప్పారావు
కందుల కామక్క, మినుముల మీనక్క, 1,2 భాగములు—వి. దుర్గయ్యశర్మ
కూచకొండరామాయణము, సుందరకాండము, యక్షగానము
కృష్ణజననము, కంససంహరణము
గుంటూరుజిల్లా భూగోళము—ప్రయాగ ప్రకాశరావు
చిలుక రాయబారము
గార్లపాటి గోవిందయ్య వృత్తకంద గీత సీసపద్యములు, శ్రీరామమూర్తి తారావళీ సీసపద్యములు — పూసపాటి రంగరాజకవి
గాంధిమహాత్ముని ఉపదేశములు
గ్రంథాలయోద్యమము—యాతగిరి లక్ష్మీవెంకటరమణ
గ్రామమునసబుల పరీక్షాప్రదర్శిని, మొదటి భాగము—బి. లక్ష్మీనరసింహం
జాతీయవిద్య.—కే. నారాయణమూర్తి
జారచోరశిఖామణి—బద్దిరెడ్డి కోటేశ్వరరావు
తులసిదళము
త్రిశంకువిజయము, దక్షిణదేశయాత్రలు — దుడ్డు సర్వేశ్వరరావు
దాసరథ్యార్థచంద్రికావిమర్శన పరిశోధనఖండనము—బి. కోటిరెడ్డి, కె. సత్యనారాయణరెడ్డి
నవీన కృష్ణాజిల్లా భూగోళము—పి. అప్పారావు
నాట్యాంబుజము—పురాణం సూరిశాస్త్రి
నారదగర్వభంగము—గుండాల వీరాస్వామి
నిశ్చయ తాంబూలప్రకరణము
పతివ్రతామాహాత్మ్యము—జేవినేని సూరయ్య
పెండ్లిపొంగ—ఐ. వి. యోగీశ్వరశర్మ

శాసనసభలు—చెరుకువాడ వెంకటనరసింహం
శాస్త్రవాదక పాఠములు, మూడవ భాగము—యం. సాంబశివరావు
సిగరెట్టు దండకము—లక్ష్మీనరసయ్యశర్మ
శ్రీ దేవమాతృకామహాసామ్రాజ్యలక్ష్మీవిజ్ఞప్తి
శ్రీశివవృత్తరత్నమాల్యము—యం. సుబ్రహ్మణ్యశాస్త్రి
శ్రీశారదాసమాజము, అనంతపురము, చతుర్థవార్షిక నివేదిక—యస్. వి. మీనాక్షీసుందరమ్మ
శ్రీశైలవవిజయము-హరికథ:—బి. బాలాజీదాసు
శ్రీకృష్ణుని చల్లాలు
శ్రీరామపట్టాభిషేక మహోత్సవ పద్యములు—చిలుకూరి నారాయణరావు [మూర్తి
శృంగారచాటుపద్యరత్నావళి—అల్లంరాజు నారాయణ
ప్రణయవిజయము—మైనంపాటి హనుమంతరావు
పోలేరమ్మదండకము
బాలగ్రహదోషచికిత్స
భావనాముని చరిత్రము—జి. గోకర్ణం
భీమలింగసాహిత్యము
మద్రాసు రాజధాని భూగోళము
మల్లుతాళ్ల మహాసభ
మహాత్మ గాంధిగారి కేసు విచారణ
మహార్ణవమి పద్యములు
మేలుకొలుపులు
యోగాభ్యాసదర్పణము—పరమహంస పరివ్రాజకాచార్య బ్రహ్మానంద సరస్వతిస్వామి
రంభారావణ సంవాదము, యక్షగానము—బి. బ్రహ్మచారి
లాడబి త్తిరి—ఎ. వి. సుబ్రహ్మణ్యశాస్త్రి
విశాఖపట్టణము జాతీయోపసంఘము—నిబంధనలు, తీర్మానములు
వీరమహిమ
వేశ్యామధురము—(మూడవ భాగము)
వైదికసభ్యత, ప్రథమతరంగము—పాలకుర్తి శేషాచార్యులు
వోటు—గాడిచెర్ల హరిసర్వోత్తమరావు
శశిరేఖాపరిణయము—బి. బాలాజీదాసు [మూర్తి
శాసనసభలు, శివగిరిరావు పంతులు గారు—కే. కృష్ణ
సద్గురుపూజావిధానము
సరస్వతీవాచకము, గద్యపద్యములటిప్పణి—యస్. వెంకట్రామయ్య
సర్వమానవ సోదర భావ ప్రచారము—కరపత్రము 1. మతములు-సోదర భావము
సర్వమానవ సోదర భావ ప్రచారము—కరపత్రము 2. సోదర భావము-విద్యాభ్యాసము
సర్వమానవ సోదర భావ ప్రచారము—కరపత్రము 3. నేగస్థులయెడ సోదర భావము
సర్వమానవసోదర భావప్రచారము—4. జనాంగసోదర భావము
సర్వమానవసోదర భావప్రచారము—5. ఆంగ్ల భారతీయ సమ్మేళనము
సర్వమానవ సోదర భావప్రచారము—6. విద్యార్థులయందు సోదరభావము
సర్వమానవ సోదర భావప్రచారము—7. సోదరభావము రాజకీయవ్యవహారములు
సర్వమానవసోదర భావప్రచారము—8. అల్పజీవులయెడ సోదర భావము
సర్వమానవ సోదర భావ ప్రచారము—9. హిందూమహమ్మదీయ మైత్రి
సర్వమానవసోదర భావప్రచారము—10. సంఘశాస్త్రము
సర్వమానవ సోదర భావప్రచారము—11. నిమ్నజాతులయెడ సోదర భావము
సర్వమానవ సోదర భావ ప్రచారము—12. సోదర భావము-నూతనయుగధర్మము
సర్వార్థసారసంగ్రహము—చింతా సుందరరామశాస్త్రి
సహదేవ ప్రశ్నశాస్త్రము
సావిత్రీచరిత్రము—ఎ. నారాయణదాసు
సిద్ధాంతిగారి కోడలు
స్కూల్ ఫైనల్ తెలుగు టెక్స్టుబుక్కుల నోట్సు—జి. యస్. గోదావరిశర్మ, వై. వెంకటరామశాస్త్రి, ఎ. యస్. వెంకటేశ్వర్లు
స్వర్గీయమహాసభ—ఆర్య నారాయణమూర్తి
స్వరాజ్యరత్నము—కంభంపాటి లక్ష్మీనరసింహ సోమయాజులు
స్వరాజ్యసంవాదము—కొండపల్లి జగన్నాథదాసు.

విమర్శనలు

భక్తియోగము : (వచనము)

శ్రీవివేకానందస్వామిగారి భక్తియోగోపన్యాసములకుఁ దెలుఁగుసేఁత.

గ్రంథకర్త

శ్రీయుత కూచి నరసింహముగారు, బి, ఏ.

భక్తియనఁగా నేమి? శంకర రామానుజాచార్యులు దాని నెట్లు నిర్వచించిరి? దానిసాధించుమార్గము లెవ్వి? సాధింపబడిన భక్తియెట్లు పరిపక్వమై మోక్షహేతువు గాఁగలదు? ఈవిషయములును, మఱియు,మానవులు జాతిమతభేదములకు లోనయి భగవంతుని నామరూపభేదములు గలవానినిగాఁ దలఁచి యుపాసించినను గమ్యస్థాన మందఱకు నొక్కటేయనియు, ఆస్థానమే సర్వభూతాంతర్వర్తియగు పరమాత్మ (భగవంతుఁడు) యనియుఁ, బ్రతిమానవుఁడు స్వజాతిమతావిరోధముగ నాయాదిదేవు నారాధించి తరించుటకు వలసిన ప్రథమసాధనము భక్తియే యనియు అట్టి భక్తిని బడయుటకు గురూపదేశము, ఆరాధనము, నియతాహారము, ద్వేషరాహిత్యము మొదలయిన వత్యంతావశ్యకములనియు, నిట్టి విషయము లెన్నియో, వలసినన్ని ప్రమాణములు, దృష్టాంతములతోఁ జక్కఁగాఁజర్చింపఁబడినవి. శ్రీస్వామిగా రమెరికాదేశమునఁ బ్రసంగించిన యుపన్యాసములలో నుత్తమము లీభక్తియోగమును గూర్చినవియేయని ప్రసిద్ధిగాంచినవి. ఆంగ్లభాషాపరిచయము లేనివారికి ధారావాహినిగాఁ బ్రవహించు వీరిసరళశైలి యందలి మాధుర్యము దెలియరాదు. వీరు ప్రసంగించుచుండ శ్రోతలు తన్మయులై శిలారూపములవలె నిశ్చేష్టులై యుండెదురు.

ఈ యాంధ్రీకరణము మూలమున కేమాత్రమును వెనుదీసినది కాదు. ఇందలి రచనము ప్రసన్నమధురమై లలితపదబంధురమై భావగర్భితమై యమృతము జాలువార్చుచుండును. ఎట్టి నీరసవిషయమయినను జక్కని శైలిచే మిగులరసవంతమై ముచ్చటలు గూర్చుచుండును. ఆధునికాంధ్ర వచనరచయితలలో మేటి యనఁదగు నీగ్రంథకర్తగారు కదళిపం డొలిచి చేతఁ బెట్టినట్టులు చదువరులకు సుబోధ్యముగా దీనిని రచియించి వారి కృతజ్ఞతకుఁ బాత్రులయిరి. ఎట్టిమాధుర్యమయిన నీగ్రంథమును జదివినమాత్రమున భగవంతుని యెడ సంపూర్ణభక్తివిశ్వాసములు గుదురు ననుటయందించుకయైన నతిశయోక్తి లేదు. ఇట్టి వీరు ముగ్ధమధురమగు శైలి నింకను పెక్కుగ్రంథములు రచించి యాంధ్రులకును, నాంధ్రభాషకును మహోపకారమును గావింతురు గాక!

దీని వెల రు 0-10.0

గ్రంథము వలయువారు "కూచి నరసింహముగారు, బి. ఏ. పిఠాపురము" అని వ్రాసికొనవలెను.

* * *

ఉన్మాదసహస్రము

అను వెఱ్ఱికి వేయివిధములు : (పద్యములు)

గ్రంథకర్త :—శ్రీయుత క్రొత్తపల్లి సూర్యారావుగారు, మేనేజరు, ఆంధ్రసాహిత్యపరిషత్తు, పుదుపేట, మదరాసు.

ఈగ్రంథమున లౌకికములు సాంఘికములు నగు కొన్ని వెఱ్ఱి యాచారములను వెఱ్ఱులుగాఁ బరిగణించి వానితో వైద్యశాస్త్రమున నిరూపింపఁబడిన వెఱ్ఱులను జేర్చి, యొక్కొక్కవెఱ్ఱి నొక్కొక్కపద్యమున, వేయింటిని వివరించిరి. ఒక్కొక్కదాని వరుసలెక్క నావెఱ్ఱిని వివరించుపద్యము మొదటఁ జేర్చిరి. ఇది యొకవిచిత్రవిమర్శన గ్రంథ మనఁదగును. విమర్శనాశక్తి యనువెఱ్ఱియే గ్రంథకర్తగారి నీగ్రంథమును రచింపఁ బురికొల్పినట్టులు తోఁచుచున్నది. కాని యిది కేవలము గ్రంథమున నుడివిన వెఱ్ఱులలో నొకటిగా నెన్నఁదగినది కాదు. ఈవెఱ్ఱి పుస్తకమును జదివినఁ దలతిరుగునేమో యని యాంధ్రసోదరులు దీనిని నిరసింపరాదు. తప్పక చదువఁదగినది.

ఇది లోకమునఁ గల దురాచారములను, దుస్తంత్రములను, గపటములను దెలుపును. చక్కని నీతులను బోధించును. మంచిలోకజ్ఞానమును గలిగించును. చదువఁ బ్రారంభించిన పిదపఁ దుదదనుకఁ జదువఁ గుతూహలము పుట్టును.

గ్రంథకర్తగారిదివఱకుఁ బెక్కు-(చిన్నవి-పెద్దవి) గ్రంథములు రచించి భాషాసేవ గావించినవారగు టాంధ్రలోకమునకు విదితమే. వీ రితరగ్రంథములవలె దీనిని నిర్దుష్టముగనే సంతరించిరి. కాని సంఖ్యతోఁ బద్యము మొదలు పెట్టవలెనన్న నియమము పాటించిన కారణమునఁ గొన్నిచోటులఁ బద్యముల నడక కుంటువడినది. చూడుఁడు:

గీ. మూఁడుయేఁబదిరెండగును ధరనొక్క
వెట్టి కలిగియుఁ దినక బ్రేల్వెట్టిరొట్టె
నేతిగిన్నెకుఁ జూపుదు నీరసిల్లి
లోభివారలసొమ్ములుఁ గొనిపోవ.

గీ. నూటయేఁబదిలోమిక్కి దమ్మి సఖ యిట్టి
వెట్టిని భవది కూడుము బేలలైనఁ...

క. మున్నూటనలువదెనిమిది
మున్నీటఁదు నాజనకు ప్రభుత్వమునం ద
వ్వున్న న్నెత్తుకొనెడువాఁ
డిన్నాఁటికిఁ బెద్దయయ్యెనే యన నిలుచున్.

ఆదియందుఁగాక పద్యములయం దెక్కడనేని సంఖ్యల నిమిడ్చియుండిన నిట్లు కాకుండెడిదేమో!

కొన్నియెడల విరళప్రయోగములగల మాఱుమూల పదములునుగలవు. చూడుఁడు:

క. ముప్పదిరెండవ వెట్టిని
దప్పకొన వ్యార్థముందు దగు మద్యాతిన్...

క. డెబ్బదియాఱవ వెట్టియు
దబ్బాటునవచ్చు నాముదపు జిట్టులు నా
ముబ్బెడు జొన్నయిలకలం
గబ్బినచెయి కడిగికొనక గీటునఁబుచ్చున్.

శా. ఇన్నూటెన్బదియాఱవకు నృతికిఁ బ్రాగ్దేయక్రియన్
వృద్ధయై, మానాక్షిట్టుడికించినట్లు స్నుష బా
ముల్వెట్టి పోనత్తరా, జీవన్ఛి విగవాత్యమంది
సహాజుం జేరు స్వదాకాలనుం, బన్నుంబు ల్పాఱపన్న
నాంధ యౌవతీత్వప్రాభవం బొప్పఁగన్;

ఈసహస్రము పదిశతకములుగ విభాగింపఁబడినది. గ్రంథకర్తగారు గ్రంథాంతమునఁ గూర్చిన,

"చ. నవలలు వ్రాయువారలకు
నాటకము ల్రచియించువారికి
స్వవిధవిశేషము దెలియ
విశ్వనిఘంటుగ నుండునందు నే
వివరముగా వచించితిని
వెట్టులక్రిందను... .. ..”

అను పద్యమునందలి యభిప్రాయము సత్యేతరము కాదనఁదగును.— వెల రు 1-0-0

* * *

జనరంజని:—(సంపుటము ౧-సంచిక ౧.) సంపాదకుడు-శ్రీయుత ఆర్. వెంకటరంగరావుగారు; తపాలు పెట్టె నెం146. మదరాసు. చందా. సం.౧కి రు3-0-0

ఇది క్రొత్తగా వెలువడినయొక సచిత్రాంధ్ర మాసపత్రిక. దీని తొలిసంచిక మా కార్యాలయము నలంకరించినది. రాయల్ 8 పేజీల సైజున 64 పుటలుగల్గి ముచ్చటలు మూటగట్టుచున్నది. ఇందు రసవంతములు భావగర్భితములు, నీతిబోధకములు, హాస్యరసభరితములు సాంఘిక దురాచార నిరాసకములునగు గద్యపద్యవ్యాసములు ప్రకటింపఁబడును. ఈపత్రికయొక్క ప్రధానోద్దేశ్య మిదియే. ఇందున్న గద్యవ్యాసములలో : 'ఆర్యుల అర్థశాస్త్రకథలు-భరతసేలకథ' జైనవేదాంతగ్రంథముల దేవవాచకాచార్యుల నందిసూత్రము లందలిది. జైనవేదాంతరీతిని బుద్ధి 'ఔత్పత్తికము, వైనయికము, కర్మజనితము, పారిణామికము' అని నాల్గువిధములు. అందౌత్పత్తికమగుబుద్ధిని నిరూపించునది యీ కథ. సశేషము. పై నాల్గుతెఱఁగుల బుద్ధిని నిరూపించు నిట్టికథ లెనుబది లవు. వాని నన్నిటి నీవ్యాసరచయితగారు క్రమముగఁ బ్రాకృతమూలమునుండి యాంధ్రీకరింపుదురట. అన్నియు మిగులఁ జమత్కారముగ నుండును. "పితృద్రోహము" వరశుల్కరూపకము సాంఘికదురాచారమును ఖండించి చక్కని నీతిని బోధించుచున్నది. 'ప్రేమపాశము' వేశ్యాలంపటుల దుర్గతిని వర్ణించుచున్నది. 'తిరుపతియాత్ర' యందుఁ దిరుపతియందుఁగల యెల్ల పుణ్యస్థలముల మహిమయు, యాత్రికులసౌకర్యార్థమైన కొన్ని సూచనలు సంగ్రహముగఁ గలవు. ఇది సచిత్రము. 'లంబోదరుని ఉపన్యాసములు' "సాక్షి" కనుకరణముగాఁ దోఁచుచున్నది. కాని యెంతవఱకు నిర్వహింపఁబడునో ముందుం దగయనగును. శైలి మిగులఁ జేలవముగనున్నది. ఇతర గద్యవ్యాసములు కథలు గొన్ని

గలవు. కొన్ని యంతరసవంతములుగాఁ దోఁచవు. పద్యవ్యాసములలో "నిరీక్షణము" రసవంతముగానున్నది. "సురలు - నరులు" భావపరిపూరితమై యున్నది. 'చతుర్మణికటకము,' 'ఒంటరికాపు కన్నె' 'ఇంగ్లాండు' మొదలగు నాంధ్రీకరణములును గలవు. గేయములును గలవు. ఇందలి గద్యవ్యాసములు వాడుక భాష నున్నవి. ఇందు 'నిరీక్షణ' మనుచిత్రము సుందరముగా నున్నది. 'వేణుగోపాలుఁడు' మొదలగు నితర చిత్రములును గలవు.

తెలుఁగునాట నిప్పుడిప్పుడు వెలువడుచున్న పెక్కు మాసపత్రిక లాంధ్రులయొక్కయు, నాంధ్ర భాషయొక్కయు భావ్యభ్యుదయమును సూచించుచున్నవి వ్యయప్రయాసముల కోర్చి భాషాసేవఁ గావింప నడుముకట్టిన శ్రీ. వెంకటరంగారావు గారి కాంధ్రపండిత మహాశయులందఱు నమూల్యవ్యాసముల నొసఁగియు, బత్రిక నుబఠించియు యథాశక్తిని జేయూఁత నొసఁగి తమకృతజ్ఞతను వెల్లడిచేయుదురని యాశించుచున్నాము. ఈ 'జనరంజని' సకలాంధ్రజనరంజనియై క్రమముగ నభివృద్ధినొంద మంగళాశాసకుఁడగు పరమేశ్వరుఁ డనుగ్రహించును గాక!

* * *

సాహితి. [మాసపత్రిక]: సంపుటము ౨. సంచిక ౧. సం॥ చందా. రు ౩. సంపాదకుడు. శ్రీ. కో. సూరయ్యగారు, శారదాభాండారము, బెజవాడ.

ఈమాసపత్రికయొక్క సంచికను మేము కృతజ్ఞతతో స్వీకరించినాము. స్వాభిప్రాయానురూపమై యిది విలసిల్లియున్నది. కథలలో 'నాగాలిబుట్ట' యందు రచయితగారు నవ్వినట్లు పాఠకులు నవ్వుదురనితోఁపదు. 'వృందావిహారి'లో వెంకట్రావుగారికిఁ గాంతమ్మ చక్కని నీతిపాఠమును నేర్పినది. రవీంద్రనాథ టాగూరుగారి 'అమాదేవి' కనువాదము గలదు. అమాదేవి భర్తృసౌరవము శ్లాఘ్యము. 'క్రొత్తరొత్తు'న హేమసుందరముగా రత్తినది చక్కని క్రొత్తరొత్తే. ఇంకను గొన్నికథలు గలవు. 'వేణుగానము' 'ప్రకృతి గీతములు' 'సముద్రగానము' మొదలగు పద్యవ్యాసములు గలవు, 'సూర్యహాస' నాటకమునందలి భాగముగలదు. ఇందుఁ గొన్నివిచిత్రశబ్దరూపములు గాన్పించుచున్నవి. 'ఒంటెన' 'ఒదిలి చేయుఁడు' మొదలగునవి. ఈనాటకము గ్రాంథిక భాషయందు రచియింపఁబడినదే యనఁదగును. కాని, నియమములు పూర్తిగాఁ బాటించినట్లు కాన్పింపదు ఇది ముద్రాపకుల లోపమేమో? గ్రంథకర్తగారించుక శ్రద్ధ వహించియుండిన బాగుండెడిది.

* * *

శారద:—(1924 సం॥ జూలై సంచిక)

సంపాదకుఁడు; శ్రీకవుతా శ్రీరామశాస్త్రిగారు, మచిలీపట్టణము.

ఈసంచిక మాకార్యాలయము నలంకరించినది. ఇందలి గద్యవ్యాసములలో 'నన్నిచోడ కవిరాజ శిఖామణి' యందు నన్నిచోడని కాలనిర్ణయమున నిదివఱకు వెలువడియున్న ప్రమాణసిద్ధాంతములను జర్చించి, యాకవిని నన్నయభట్టుకంటెఁ మిగులఁబూర్వునిగా వ్యాసరచయితగా రూహించుచున్నారు. 'శ్రీమద్రామాయణమందలి వానరులు' అనువ్యాసమిప్పటి వానరులు హీననాగరికతగల యొకజాతిమానవులని సప్రమాణముగాఁ జాటుచున్నది. వారి వేషభాషా వ్యవహారాదులను గూడఁ దెలుపుచున్నది! 'ప్రేమ' నిక్కమయిన ప్రేమ స్వరూపమును నిరూపించుచున్నది. 'ఏమీ లేదు' లో రాముఁడు భీముఁడుతమ యజమానునకుఁ దుడకేమియును లేకుండఁ జేసిరి. 'సుందరమ్మ'యనుకథయందుఁ బునర్వివాహావశ్యకతయును కులకుండగములమూలమున నేర్పడుచున్నది. సుందరమ్మ పడినకష్టములుజాలిగొల్పుచున్నవి. మఱియు 'విజయుల తీర్మ,' 'తోకచుక్కలు,' 'ఆస్ట్రేలియా' మొదలయినవియు, 'హిమబిందు'వను నవలలోని ఏకదేశమునుగలవు. పద్యవ్యాసములలోఁ 'ప్రేమసంగీతము' 'తరులతా వర్ణనము' మొదలయినవి రసవంతములుగానున్నవి. 'సత్యము' సత్యప్రాశస్త్యమును జాటుచున్నది. 'ఏకత్వము' భావగర్భితమైన గ్రామ్యభాషా గేయము. "పురుష—ప్రకృతి" యను రమణీయవర్ణచిత్రమొక్కటి యిందుఁగలదు— ఇట్టిచిత్రములకు వివరణ ముండఁదగును. ఇతరచిత్రములు ననేకములుగలవు. 'శారద' క్రమముగ నభివృద్ధినిగాంచి శారదకలంకారమగుచున్నది. కాని ముద్రణాదికముల పట్ల సంపాదకు లించుక శ్రద్ధవహింపవలసియున్నారు.

శారద తరువాతి సంచికయు వెలువడి మా కార్యాలయము నలంకరించినది. ఇందు సరసములగు గద్యపద్య వ్యాసములు గలవు — 'సంగీతవికాస' మను త్రివర్ణచిత్రమును, ఇతర చిత్రములును గలవు.

సాభిప్రాయ విశేషములు

ప్రపంచపరిస్థితుల నిదమిత్థమని సంభావించుట వర్తమానసంధిసమయమునందు దుర్లభముగ నున్నది. సకలరాజ్యములందును రాజ్యాంగవాతావరణము స్తిమితముగనున్నది. చీనాయందంతఃకలహములు ఘోరమైన సంగ్రామరూపమును దాల్చుచున్నవి. ఆఫ్రికాయందు జాతిద్వేషము వర్ధిలుచున్నది. తెల్లజాతులు నల్లజాతులకు స్వస్థలవాసులకు సయితము శుభస్థితి కాధారములేకుండ జేయ సమకట్టుచున్నవి. ఉష్ణప్రదేశములు తెల్లజాతులకు నివాసయోగ్యములుగాకపోయినను భూమితృష్ణమాత్రము మిక్కుమేకలు లేకను వారిని బాధించుచున్నది. జీవనసంరంభమునందు శ్వేతజాతుల పస మారణసాధనములందు ప్రద్యోతమగుచున్నదిగాని ధర్మసాధనరక్షణములందు ప్రత్యక్షమగుటలేదు. నల్లజాతులభారవహనము ప్రతిబంధకములందును నిర్బంధనములందును గోచరంబగుచున్నదిగాని వికాసమునందును విమోచనమునందును త్యాగమునందును గోచరంబగుటలేదు. ఆఫ్రికాఖండ మంతయు ను తెల్లరాజ్యములకు పాదాక్రాంతమైనది. సంగ్రామఫల మీదాస్యబంధమును బలపరచినను నల్లజాతులయందు ప్రబోధ ముదయించుచున్న విధము నాఫ్రికాదేశచరిత్రము విశదముచేయుచున్నది. ఈజిప్టు స్వాతంత్ర్యమార్గము నధిష్ఠించుచున్నది. శ్వేత జాత్యభిమానులు విఘ్నపరంపరలను స్వాతంత్ర్యయాత్రకు గల్పించుచున్నారు. సుడాను బ్రిటీషు ప్రభుత్వముతో ప్రతిఘటనమునకు బూనుకొనుచున్నది. ఆఫ్రికాజాతు లణగద్రొక్కబడుచున్నను సహజసత్వము వికసించుచు ప్రబోధమును బొందుచున్నవి. కొన్ని లక్షలుగల తెల్లవారు కోట్లకొలదినల్లజాతులను దాసానుదాసులనుజేసి వారి దేశములందు నిలువ నీడలేకుండ జేసి పీడించుట దుర్విపాకమునకు గారణభూతముగదా? పాశ్చాత్యజాతులకు మహాసంగ్రామమునం దగ్నిసంస్కారము గలిగినను జ్ఞానోదయము గలుగలేదు. మహాసంగ్రామము బ్రిటీషుసామ్రాజ్యమును సకలవిధములను ప్రబలముచేసినది. సామ్రాజ్యాభిమానులకు పరపీడనమున కవకాశములు పెరిగినవి. సామ్రాజ్యవ్యాపనము బలయోగము దురభిమానమును ప్రజ్వలింపజేసినవి. కర్జనులు డయరులు ఓడ్వయరులు మెకార్డీలు నిర్భయముగను నిర్బంధములను విధించుచున్నారు. టైమ్సు మొదలగు వార్తాపత్రికలు నిప్పులను గ్రక్కుచున్నవి. కార్మికప్రభుత్వము కర్తవ్యమును నిర్ణయింపలేకను వెనుకముం దాడుచున్నది. కార్మికపక్షము వెనుకను జేసిన ప్రతిజ్ఞలు బ్రిటిషుసామ్రా

జ్యాంతర్భాగములపట్లను మృతాక్షరప్రాయములుగనున్నవి. కార్మికప్రభుత్వస్థితి దుర్భరముగనున్నవిధమును సామ్రాజ్య వ్యవహారములు విశదముచేయుచున్నవి.

*   *   *

బ్రిటీషు ప్రభుత్వము

కార్మికప్రభుత్వము సామ్రాజ్యాంతర్భాగముల వ్యవహారములపట్లను సంశయభావమును ప్రకటించుచున్నను యూరపు రాజకీయపరిస్థితులపట్లను జూపుచున్న పరిజ్ఞానము ప్రశంసనీయముగనున్నది. వర్సేలుసంధితరువాతను ప్రపంచమునందు శాంతిస్థాపనమునకు జరిగిన ప్రయత్నములలో కార్మికమంత్రి రామ్సేమాక్డొనాల్డుగారుచేసిన ప్రయత్నములు ప్రశంసనీయములుగనున్నవి. పాయిన్కారెగారి చిత్తవృత్తినిమార్చుట దుస్తరముగనుండినను హెర్రియటుగారి చిత్తవృత్తిని మాక్డొనాల్డుగారుమార్చగలిగెను. లండను సంధిసభ యథార్థస్వభావమును వహించినది. రాజకీయస్వభావము గలిగియున్నను సహజమైన యార్థికస్వరూపమును నీసభయందు నష్టపూరణసమస్య దాల్చినది. ఇదివరలో డావెసుగారు నిర్ణయించినవిధమునను నష్టపూరణసమస్యను నాచరణయందు బెట్టుటకు ఫరాసులును వారి మిత్రులును నంగీకరించిరి. ఫరాసులు ఆక్రమించిన ప్రదేశమును క్రమముగను ఒకసంవత్సరములో ఖాళీచేయుట కంగీకరించిరి. జర్మనులు ఫరాసులు చేసిన యేర్పాటుల నామోదించిరి. యూరప్పుఖండమునందు శాంతిబీజములు నాటబడినవి. ఈ మహాప్రయత్నమునందు కార్మిక ప్రభుత్వము ముఖ్యముగను రామ్సే మాక్డొనాల్డు చూపిన రాజ్యాంగపరిజ్ఞానము ప్రశంసనీయముగనున్నది. కన్సర్వేటివు పక్షమునకు కార్మికపక్ష చర్యలు భయభ్రాంతులను గలుగజేయుచున్నవి. ఐర్లాండు సరిహద్దు సమస్య విషయమునందు కన్సర్వేటివులు ప్రతిఘటించుటకు దలపడుచున్నారు. భారత రాజ్యాంగవిషయమై కన్సర్వేటివులు చేయుచున్న కోలాహలము బీభత్సముగనున్నది. కార్మికపక్షము యూరపురాజ్యాంగముల విషయమైయెంత యౌదార్యమును చూపినను భారతరాజ్యాంగములవిషయమై నిరసనభావమును జూపిన విధమును గతించిన యారుమాసముల చరిత్రము విశదము చేయుచున్నది.

అలివియరు ప్రభువు సంకల్పమునం దేమి గలిగియున్నను క్రియయందుమాత్రము పీలు వింటరుటను ప్రభువర్గమువారి యామోదమును బడయుచున్నాడు. మంత్రిచర్య యంతయును గోప్యముగనున్నది. ఫలమును నిట్టిదే కలుగుట సహజము. అలివియరు ప్రభువునకును నాయకులకును సంప్రతింపులు జరిగినవి. శ్రీమతి బెజంటమ్మ శ్రీనివాసశాస్త్రి రంగాచార్యులుగారులు ప్రభృతులు స్వదేశమును జేరినారు. వారి యాసలందు పసయున్నటులు గనుపించదు. బెజంటమ్మగారు కార్మికపక్షమున కధికారమున్నను బలములేకుండుటచే నిస్సహాయస్థితియందున్నదని వ్యక్తము చేసినది. గంపెడాశతోబోయిన శ్రీనివాసశాస్త్రిగారు నిరాశను జెంది యేతెంచిరి. వలసదేశముల సమస్యను విచారించుటకు బోయిన

వారును నిరాశను జెంది యేతెంచినటులు రంగాచార్యులుగారి ప్రసంగములు విశదము చేయుచున్నవి. ఏవిధమునను జూచినను భారతసమస్యలకు బ్రిటిషు రాజకీయజీవనమునందు స్థానములేదని విశదమైనది. బ్రిటీషుద్వీపములందు రాజ్యాధికారము నేపక్షమువారు వహించుచున్నను భారత భూమికి సమానఫలమే గలుగుచుండును. బ్రిటీషు రాజ్యాధికారమును శిథిలము చేయుట కేపక్షము వారును సంగీకరింపరు. భారతీయులు రెండు మూడు పురుషాంతరములైనను బ్రిటీషు అధికారులకు శిష్యత్వమును జేయవలయునని కన్సర్వేటివు పక్షాధికారులు పలికెడి ఈ చిలుకపలుకులనే కార్మిక పక్షాధికారులును బలుకుచున్నారు. భారతీయులు పార్లమెంటును బ్రిటీషు ప్రజలను నమ్మునంతవరకును భారతభూమికి తరణోపాయముదుర్లభమని అన్నిపక్షములవారికిని విశదమైనది. సత్వరస్వరాజ్యస్థాపనము దేశక్షేమమున కవసరమని యన్నిపక్షములవారును సంగీకరించుచున్నారు. కార్యవిధానముమాత్ర మేపక్షమువారికిని పరిస్ఫుటము గాకున్నది.

* * *

మోంటుఫర్డుసంస్కరణముల విమర్శనము

మోంటుఫర్డు సంస్కరణముల విమర్శనము వాని నిరుపయోగతను విశదముచేసినది. అన్నిపక్షములవారును ద్వంద్వప్రభుత్వము నేకగ్రీవముగను నిరసించిరి. చింతామణిగారు మొదలగువారి ద్వంద్వప్రభుత్వఖండన మసందిగ్ధముగ నున్నది. చెన్నరాష్ట్ర శాసన సభాదిసభలును — ద్వంద్వప్రభుత్వమును నిరసించుచు. రాష్ట్రీయ స్వాతంత్ర్యమును నేకగ్రీవముగను ప్రతిపాదించినవి. వంగరాష్ట్ర శాసనసభ మంత్రుల వేతనమును నిరాకరించి ద్వంద్వప్రభుత్వమును నిర్మూలము చేసినది. లిట్టను ప్రభువు మంత్రుల రాజీనామా సంగీకరించి ప్రజాయత్తశాఖలనుస్వాయత్తము చేసికొని సంస్కరణముల మాయాస్వరూపమును విశదముచేసెను. స్వరాజ్యసిద్ధికి బ్రిటీషు ద్వీపములందు కన్వెన్షనుపక్షమువారు చేసిన ప్రయత్నములు నిష్ఫలములైనవి. స్వదేశమునందు సహకారపక్షమువారు చేసిన ప్రయత్నములు నిరర్థకములైనవి. స్వరాజ్యపక్షమువారు చేసిన ప్రతిష్ఠంభన ప్రయత్నములు నిరుపయోగములైనవి. కాంగ్రెసుపక్షమునందు గలిగిన యంతర్విభేదములు ప్రజాహృదయమునందును ప్రచారకుల కార్యదీక్షయందును నిశ్చేష్టతను గలుగజేసినవి. కాంగ్రెసు సంఘము లంతఃకలహములకును నిందలకును స్వాభిమానమునకును నిలయములై స్వరాజ్యదీక్షకు నిరుపయోగములుగ నున్నవి. ఈవిభేదములు ప్రతికక్షుల కానందమును బలమును గలుగజేయుచు దేశారాధకజీవనమును నిరర్థకము చేయుచున్నవి. స్వరాజ్యసంపాదనమున కన్నిపక్షముల సంయోగ మవసరమైనను పత్రికలయందును సభలయందును వ్యవహారకాండయందును భేదాభిప్రాయములై ప్రబలుచు కలవరమునకు గారణంబగుచున్నవి. స్వయముగను చేసినను చేయకపోయినను నితరుల నాక్షేపించుట సులభము. దేశమంతయును

దైన్యస్థితియందున్న సమయమునం దీవ్యవహార
క్రమము సులభతమమైనను దేశప్రయోజన
ములకుమాత్రము నిరుపయోగముగ నున్నది.
దేశారాధకులం దారంభమునం దుదయించిన
సేవాదీక్ష త్యాగశీలము ఇపుడు క్షీణించి
అధికారాభిమానము స్వాభిమానము ప్రబ
లినవి. ఇపు డన్ని పక్షములవారును సంరంభ
మునకు వారి వారి బలముల నాయత్తము చేయు
చున్నను నాయకులయందును అనుచరులయం
దును కొంతజ్ఞానోదయము గలుగుచున్న
దని నమ్ముటకుసూచనలు గనుపించుచున్నవి.

గాంధిమహాత్ముడు దేశమునందంతటను
శాంతినం దేశమును ప్రతిధ్వనింప జేయుచున్నా
డు. ఇటీవల బొంబయియందు జేసిన ప్రసంగము
లందంతః కలహములను గర్హించుచు సంయో
గము నభ్యర్థించుచున్నాడు. మహాత్ముడు
స్వీయనాయకత్వమును విసర్జించి దాసాను
దాసుడుగను పాటుపడుటకు సమ్మతించు
చున్నాడు. దేశమునందు ప్రబలిన విభేదముల
వలనను కాంగ్రెసు సభాధిపత్యమును నయి
తము స్వీకరించుటకు సంశయించుచున్నాడు.
దేశమునందు ప్రబలిన భేదాభిప్రాయములను
విసర్జించి అన్నిపక్షములవారును గాంధిమహా
త్ముని నాయకత్వముక్రిందనుగాని ,ఇతరుల
నాయకత్వముక్రిందనుగాని కలిసి స్వరాజ్య
ప్రాప్తికి పనిచేయుట శ్రేయస్కరముగదా! శ్రీ
మతి బెజంటమ్మగారు నయితము పునరాగమ
నానంతరము సంయోగాచరణమును బోధించు
చున్నది. బొంబయి కార్పొరేషను మహాత్ము
నకు సన్మానపత్రము సమర్పించిన సంద
ర్భమునందు బెజంటమ్మగారు నయితము హాజ
రయి సంయోగాభిలాషను విశదముచేసినది.
గతవారమునందు గోకలె మందిరమునందు
గూడిన మహాసభయందును బెజంటమ్మగారీ
భావము నసందిగ్ధముగను విస్పష్టముచేసిరి.
స్వరాజ్యపక్షమువారును మహాత్ముని నాయ
కత్వము నంగీకరించియును ప్రత్యేకమైన కార్య
ప్రణాళికను నిర్ణయించుచున్నారు. స్వరాజ్య
పక్షమువారికి రాటపు సందేశమునందు గాంధి
మహాత్మునకుగల గాఢమైన విశ్వాసములేదని
వారి ప్రసంగములు విశదముచేసినవి. చింతా
మణి కెల్కారుగారి ఖద్దరు నిరసనప్రతిజ్ఞ
సామాన్యులకు నయితము విచిత్రముగను
దోచుట సహజము. ఖద్దరునందు విశ్వాసము
లేకపోయినను ప్రతిషేధ ప్రతిజ్ఞను జేయవల
సిన యవసరము గనుపింపదు. ఇట్టి ప్రతిఘటన
సామర్థ్యమే కదా నాయక లక్షణముగ పొగ
డ్తను బడయుచున్నది! సామాన్య వ్యవహార
క్రమమును నిర్లక్ష్యముచేసి భీభత్సముచేయగల
మహానుభావులేకదా మహానాయక పదమున
కర్హులు. గాంధిమహాత్మునివిషాదమునకుమూల
మైన విభేదముల నాంధ్రప్రపంచము విసర్జించి
పరస్పరదూషణాలనుత్యజించి మహాత్ముడు కోరు
నటులు కలిసి పనిచేయుట కాంధ్రప్రపంచము
పాటుపడి స్వరాజ్యసంపాదనమునందు స్వధర్మ
నిర్వహణమును జేయుగాత! ఇపుడు నాయ
కులను ప్రచారకులను మమకారాహంకార
ములు సంపూర్ణముగ నావహించినవి. ఎవరికి
వారె పెద్దలుగనుండుట యుగధర్మము. దేశ
బంధు చితరంజనుదాసుగా రీరెండేండ్లయం

దును నియోజకవర్గమునకు ప్రబోధమును గలుగజేయవలయునని తెలుపుచున్నారు. నియోజకవర్గమునందు గలిగిన ప్రబోధమునకును దానిఫలమునకును గతించిన మూడేండ్ల యనుభవమును నిదర్శనము గనున్నది. ఉద్రేకము క్రమశిక్షణములేక కార్యసిద్ధికి దోడ్పడజాలదు. సకలజనులకును గల యీ యనుభవమునే గాంధిమహాత్ముడు తిరిగి ప్రతిపాదించుచున్నాడు. ఈ ప్రతిపాదనము నయితము పరిహాసములకు పాత్రమగుచున్నపుడు భావి కర్తవ్యము నెవరు నిర్ణయింపగలరు. గాంధిమహాత్ముడు దూరదృష్టిని గలిగి దేశ దృష్టిని నిర్మాణకార్య విధానమునందు లగ్నము చేయగోరుచున్నాడు. మహాత్ముని యుపదేశములు నిరాదరణమును బడయుచు మహాత్మునకు సంక్షోభమును గలుగజేయుచున్నవి. ఎవరు నిందించినను దూషించినను గాంధిమహాత్ముడు మాత్రము దాసానుదాసుడై దేశసేవకాత్మసమర్పణమును జేయుటకు సంసిద్ధుడుగనున్నవిధమును వారియుపదేశములు తెలుపుచున్నవి. ప్రజలును మహాత్మునిమార్గము నవలంబించుచు సేవాపరాయణులై స్వధర్మనిర్వహణమును జేయుచు మహాత్ముని నాయకత్వమును సార్థకముచేయుదురుగాత!

ముక్తావళి

శతావధాని, వేదుల సత్యనారాయణశాస్త్రి (సాహితీసమితి)

౫

ఘనవేణుదండ మిటు! లేటికి చెక్కుడ వేల చిల్లులై
పో నొగిలించె దం చడలి పోయితి, వ్యర్థపు టూర్పుగాడ్పులన్
గానముగాగ మార్చుటకెగా యని యిప్పుడు నేగ్రహించితిన్
గాని, విశీర్ణ మీ హృదయనాళ మెటుల్ పలికింతువో ప్రభూ!

నీవెడయూర్పుతావ్రల జనించిన కమ్మదనంబు వ్యర్థమై
పోవకమున్నె, యీ సుషిరమున్ గొనిపోయి వియోగరాగపున్
జీవనగీతముల్, విపినసీమలనైన నరే! ధ్వనింపు మీ
శ్రావణ కృష్ణపక్షపు నిశల్ పులకింపులతో విరన్, ప్రభూ!

Edited and Published by K. NAGESWARA RAO, at the Andhra Patrika Press, No. 7 Thumbu Chetty Street, G. T. Madras.

శ్రీ కృష్ణలీల



చిత్రకారుడు:— శ్రీయుత, [illegible] గోపాలంగారు

ముగా రెండురెక్కలపడవలున్నవి. ఇవికాక నీటిపడవలు (Hydroplanes) అని ఉన్నవి; అవిసముద్రములో కూడా ప్రయాణము చేస్తవి. అవి యుద్ధసమయములో చాలా ఉపయోగము. ఇప్పుడిప్పుడు మరొకరకము పడవలు వస్తున్నవి. వాటిపేరు 'గ్లైడర్సు' అంటారు. ఇవి కూడా గాలిపడవలేకాని నీటికియంత్రాలుండవు. రెక్కలమోస్తరుగా ఉండే కొన్నిభాగాలు నీటికి తగిలించగానే ఎగిరిపోతాయి.

గాలిపడవలు - గాలిఓడలు:— ఈరెండింటిలో ఉండే మంచిచెడ్డలు ఆలోచింతము.

పడవఎక్కువవేగముగాపోతుంది. గంటకు రెండు వందలమైళ్లు సులాగ్గా ప్రయాణము చేయగలదు. ఓడ గంటకు ౬౦ మైళ్లకంటె అధికముగా పోలేదు.

పడవలు కట్టడములో ప్రయాస తక్కువ. వ్యయముకూడ తక్కువే. ఓడల కట్టుకాదు. వ్యయప్రయాసలు మెండు. ఇంతవ్యయప్రయాసలకూ ఓర్చి ఓడకట్టితే దానికి అపాయా లెక్కువ.

ఓడలలో సౌఖ్యమెక్కువ. ఆడుకోనేటందుకు స్థలాలుకూడ ఉంటవి. పడవలలో కూర్చుండడమే కష్టము. చెన్నపట్టణము 'మోటారు బస్సు' లలో కూర్చున్నట్లు కూర్చోవాలి.

ఓడలలో ఎక్కువబరువైన సామానులు తీసుకు పోవచ్చును. గాలిఎట్లాఉన్నా ప్రమాదము సంభవించనంతసేపు, అపాయము రానంతసేపు ఓడలలో సుఖముగా ప్రయాణము చేయవచ్చును. యంత్రాలు చెడిపోయినా ఓడకు భంగము రాదు. పడవల కట్లు గాదు. గాలి చలనము లేకుండా ఉండి యంత్రాలు చెడిపోయినట్లయితే అపాయము సంభవించినట్లే.

ఈపైసంగతులనుబట్టి విమానశాస్త్రజ్ఞులేమంటారంటే ఒకదేశమునుంచి ఇంకొకదేశానికి ప్రయాణము చేసేటప్పుడు ఓడలను, దేశములోనివేర్వేరుచోట్లకు వెళ్లేటందుకు పడవలను ఉపయోగించాలంటారు.

విమాన యంత్రములు

పైనివ్రాసినసంగతులనుబట్టి మనము ముఖ్యముగా గ్రహింపవలసిన దేమిటంటే పడవలలోనియంత్రము రెండుపనులు చేస్తుంది. ౧. ఓడలమోస్తరుగ ప్రయాణము చేయడము. ౨. గాలిలో చలనము లేనప్పుడు పైకెగరడమునకు శక్తినికలిగించుకోవడము. ఈరెండు పనులనుబట్టి యంత్రాలు చాలా ముఖ్యమైనవని యెంచి క్లుప్తముగా ఈదిగువవాటినిగురించి చెప్పెదను.

స్థూలదృష్టిని ప్రతియంత్రము రెండుభాగములుగ విభాగింపవచ్చును. అందొకభాగము చలనశక్తి కలిగించేటటువంటిది. రెండవది ఆకలిగినశక్తిని ఉపయోగించేటటువంటిది. యంత్రము నడచుటకు ప్రధానమైన చలనశక్తిని పుట్టించుటకు సాధనములు నాలుగు. వాటిలో మొదటిది నీటి ఆవిరి. క్రింది పటమును చూడుడు. నీరు ఆవిరిగా మారినతరువాత దానిని ఒకపీపా (Cylinder) వంటి పాత్రలోకి వదులుతారు.

నీటిఆవిరి యంత్రము

అక్కడ అది ఒకకాడిమాదిరిగఉన్న 'అ' అనేభాగాన్ని ముందుకు తోస్తుంది. అన్నము ఉడుకుతున్నప్పుడు కొంచెము ఎక్కువగా నీళ్లు పోసిఉన్నట్లయితే ఇత్తడిసిబ్బి మీద రాయిపెట్టిన ఆరాయికూడ పైకెగరడము చూస్తున్నాము. ఇట్లాగే 'అ' అనేకాడిని ముందుకుతోసి దానివల్ల 'ఇ' అనేచక్రాన్ని తిప్పుతుంది. ఈనీటిఆవిరికి బదులుగా కిరసనాయలునో లేక దానికన్న ఎక్కువత్వరగా ఆవిరిగా మారే పెట్రోలునో ఉపయోగింపవచ్చును. ఇదే ఇప్పుడు మోటారుబళ్లలోను, ఇంజనీరుదారలెక్కే పడవలలోను ఉపయోగిస్తున్నారు. దీనివల్ల కలిగే మేలు ఆలోచింతము. నీటిని ఆవిరిగా మార్చడమునకు ఎంతో సామగ్రి కావాలి. మొట్టమొదట ఒకపెద్దకాగు(Boiler) ఉండాలి. పెళ్లిళ్లలో వేణ్ణీళ్లు కావాలంటేనే ఎంతో పెద్దకాగు ఉపయోగించేటప్పుడు యంత్రానికి నీటి ఆవిరి సప్లయి చెయ్యవలెనంటే సాధారణమైనకాగు పనికిరాదని తోచవచ్చును. ఇక ఇంతప్రయాసపడి సంపాదించిన ఆవిరి యంత్రముచేరేలోపలనే చల్లగాలి తగు

లంటవల్ల నీరుగా మారుతుంది. దీనికి ఇన్ని అవస్థ లుండ బట్టి దీనిని మోటారులలో ఉపయోగింపరు. పోనీ నూనె ఉపయోగింతమంటే మనదేశములో నూనెబావులు ఇంకా దొరకలేదు. నూనె అంతా మనకు అమెరికాదేశము నుండి రావాలి. వారి కేమాత్రము కోపమువచ్చినా ఈనూనెయంత్రాలే మన ముపయోగించేటట్లయితే మన కొంప మునిగిందే! ఇట్టిసందిగ్ధ స్థితిలో ఉన్నప్పటికీ మోటారుబళ్లలోను విమానములలోను ఇదే ఉపయోగిస్తున్నారు. ప్రతిరోజు మనము వినేవిద్యుచ్ఛక్తి పనికిరాదా అని కొందరు ప్రశ్నింపవచ్చును. విద్యుచ్ఛక్తి చాలా తమాషాలు తయారుచేస్తుంది. తంతి లేకుండా వార్తలు నలుదెసలకు పంపించడము, వెలుతురివ్వడము—ఇవి, అవి అన్నమాటేమిటి—సృష్టికి ప్రతిసృష్టి చేస్తోంది. ఈవిద్యుచ్ఛక్తి ఏలావస్తుందో మనము తెలుసుకోవాలి. అయ



విద్యుచ్ఛక్తి పుట్టించువిధము

స్కాంతము ముక్కలు రెండు ఉన్నవనుకోండి. వాటి మధ్య ఒక ఇత్తడితీగె త్రిప్పినట్లయితే తీగలో విద్యుచ్ఛక్తి పుట్టుతుంది. ఎట్లన, చలనము + అయస్కాంతము=విద్యుచ్ఛక్తి. ఈతీగను త్రిప్పేటందుకు నూనెయంత్రాలైనాసరే లేదా ఆవిరియంత్రాలైనా సరే. ఇదిగాక చలనము పుట్టించడములో జలపాతము (Waterfalls)ను ముఖ్యముగా ఉపయోగిస్తారు. అనగా, నీరు ఎత్తుప్రదేశము నుంచి క్రిందికిపడేటప్పుడు కొంతఉరవడితో పడుతుంది. దానివల్ల తీగెచుట్టబడినచక్రము గిర్రునతిరుగుతుంది. ఈ విద్యుచ్ఛక్తివిమానాలలో ఉపయోగిస్తే వాటిని నడపడము చాలతేలిక అవుతుంది. కానిఒక్కచిక్కున్నది. విద్యుచ్ఛక్తిని తయారుచెయ్యాలంటే ఎంతోసామగ్రి కావలెను. పోనీ, క్రిందతయారుచేసి తీసుకొని వెళ్లుదామంటే విద్యుచ్ఛక్తిని దాచిఉంచేటందుకు శాస్త్రజ్ఞులు తేలికైనసదుపాయమును ఇంకా కనిపెట్టలేదు. దాచుటకు వీలులేనప్పుడు విద్యుచ్ఛక్తి తయారుచేసి ఏమిప్రయోజనము? కాబట్టి విమానాలలో ఇంతవరకు విద్యుచ్ఛక్తి ఉపయోగానికి రాకుండా ఉంది కాని గాలిబుడలలోమాత్రము కొంచెంమాత్రముగ దీనిని తయారుచేసి దీపాలు పెట్టుట కుపయోగిస్తున్నారు.

ఉపయోగములు

గాలిబుడలు, గాలిపడవలు అంటే వినడమునకు అంత ఇంపుగాలేదు. వాటిని విమానాలుఅంటే చెవికి ఎంతో ఇంపుగాను, మనస్సుకు ఆనందముగాను ఉంటుంది. ఎందుకంటే మనకు విమానాలు పరిచయమైనవి. కథలలో పుష్పకవిమానాలు ఉండేవనిన్నీ, వాటిలో అంతరిక్షమార్గాన్ని ప్రయాణము చేసేవారనిన్నీ, గంధర్వులు విమానాలలో తిరుగుతారనిన్నీ చదివి ఉన్నాము. ప్రస్తుతమందుకూడా విమానాలలో సాయంకాలము విహారముసలుపవచ్చునని ఆనందతరంగ మొకటి మైలుదేరుతుంది. కాని విమానాలు కేవలము అట్టి విహారముకొరకే, వినోదక్రీడకోసమే కట్టబడేటట్లయితే వీటినిగురించి ఇంత వివరముగా వ్రాసి ఉండను.

విమానాల ఉపయోగాలు అనంతములు. వాటినన్నిటిని కొంచెము శ్రద్ధగా ఆలోచింతము.

విమానాలుముఖ్యముగా మొన్నటియుద్ధపుసంగ్రామము లో ఉపయోగించినారనివింటాము. ఇవిశత్రువులశిబిరములకుపోయి అక్కడ వారితంత్రములన్నీ కనిపెట్టుతూఉండేవి. మేఘాలలోదాగి శత్రుస్కంధావారమంతా శాంతముగాఉన్నప్పుడు గల్లంతుపుట్టించేవి. పైనుంచితుపాకిగుళ్ల వర్షము కురిపించేవి. నష్టము కలిగించేఇట్టికార్యాలెన్నో చేసేవి. కాని, అట్టిపనులకవి పనికివస్తవా అని ఒకపెద్ద సంశయము. అమెరికావారు అవి అందుకు పనికి రావంటారు. వారిలెక్కలప్రకారము నూటికి ఏభైచోట్ల అవి గురికి సూటిగా గుళ్లువిడువలేక పోయినట్లు తెలుస్తుంది.